www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సాగర్ దిశగా కృష్ణమ్మ


శ్రీశైలం జలాశయం నుంచి మూడు గేట్ల ద్వారా నీటి విడుదల 12

మంగళవారం | 30-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 105 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, బహుళపక్షం; తిథి: దశమి సా. 4.45 తదుపరి ఏకాదశి; నక్షత్రం: కృత్తిక ఉ. 10.23 తదుపరి రోహిణి; వర్జ్యం: రా. 2.16-3.51; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.22, రా. 10.25-11.08; అమృతఘడియలు: ఉ. 8.02-9.36; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.45 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


పేదలకు డబుల్ బొనాంజా

కొత్త వారికి విశాలమైన స్థలాలు
పాతవారికి బకాయిల చెల్లింపు

గ్రామాల్లో 3 సెంట్లు.. పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలం

జగన్ హయాంలో ఇచ్చిన దానికి ఇది రెట్టింపు

ఇకపై గృహ నిర్మాణానికి రూ. 4 లక్షలు


రాజముద్రతో ఉన్న పాస్‌బుక్‌ను చూపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- కొత్త లబ్ధిదారులందరికీ వర్తింపు
- జగన్ ఇచ్చింది గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో ఒక్కసెంటు స్థలమే
- అది కూడా ఊరికి దూరంగా ఎక్కడో
- సేకరణ, కేటాయింపుల్లో అవకతవకలు
- గృహ నిర్మాణంపై చంద్రబాబు కీలక సమీక్ష
- 2029 నాటికి నిరుపేదలందరికీ ఇళ్లు
- వంద రోజుల్లో 1.25 లక్షల గృహాలు
- ఏడాదిలో 8.25 లక్షలు కట్టడమే లక్ష్యం
- మధ్య తరగతి ప్రజలకు, జర్నలిస్టులకు తక్కువ ధరలకే ఇళ్లు
- పూర్తయిన ఇళ్లకు చెల్లింపులు ఆపేసిన గత ప్రభుత్వం
- ఆ బాధితులందరికీ తక్షణమే చెల్లింపులు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశం

ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారు. పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని నిర్ణయించారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున నిరుపేదలకు కేటాయించాలని నిశ్చయించారు. 2014-19 నడుమ పూర్తయిన ఇళ్లకు జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో చెల్లింపులు చేయలేదు. ఆ ఇళ్ల బాధితులకు వెంటనే చెల్లింపులు చేయాలని చంద్రబాబు ఆదేశించారు.



అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలకు శుభవార్త. వారికి గ్రామాల్లో అయితే 3 సెంట్లు, పట్టణాల్లో అయితే రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలివ్వాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత జగన్ ప్రభుత్వం గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు చొప్పున ఇచ్చి ఊరూవాడా డబ్బా కొట్టుకుంది. ఎన్నికల్లో అయితే భారీ ఎత్తున ప్రచారం చేసుకుంది. ఇప్పుడు చంద్రబాబు సర్కారు దానికి రెట్టింపు ఇవ్వాలని నిశ్చయించడం విశేషం. సోమవారం అమరావతి సచివాలయంలో

మిగతా 11వ పేజీలో...

ఇద్దరు ఆర్డీవోలపై వేటు

- సబ్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్‌పైనా
- మదనపల్లె ఫైళ్ల కాల్చివేత కేసులో చర్యలు
- ద్వారకనాథరెడ్డి, పెద్దిరెడ్డి పీఏ ఇళ్లలో సోదాలు
- మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాపై కేసు
- మాధవరెడ్డి ఇంట్లో 500 పత్రాల స్వాధీనం
- కార్యాలయాన్ని సందర్శించిన కర్నూలు డీఐజీ
- సబ్‌కలెక్టర్‌కు వందల మంది బాధితుల ఫిర్యాదు
- పెద్దిరెడ్డి కుటుంబీకులు 4 కోట్ల స్థలం లాక్కుని కంచె వేశారని వృద్ధురాలి రోదన
- పెద్దిరెడ్డి భార్య పేరిట చెరువు.. ఆపై ఫ్రీహోల్డ్

12

ఫొటోల పిచ్చి ఖరీదు 700 కోట్లు

గ్రానైట్ రాళ్లపై జగన్ ఫొటోల ఖర్చు ఇది

- ఒడిపేయాలంటే మరో రూ.15 కోట్ల ఖర్చు.. పాస్ బుక్‌పై బొమ్మకోసం 15 కోట్లు
- వైసీపీ చేష్టలకు అధికారులూ దాసోహం.. నాడు అడ్డుచెప్పకుండా నిధుల ఖర్చు
- నిగ్గుతేల్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద సమీక్ష
- భూ ఆక్రమణలే పెద్ద సమస్య.. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- వ్యవస్థలపై నమ్మకం కలిగేలా చర్యలుండాలి.. సీఎం దిశానిర్దేశం

రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో పాస్ పుస్తకాలు

కోడ్ స్కాన్ చేస్తే భూ సరిహద్దులు, లోకేషన్

జగన్ ఫొటోలున్న పాసుపుస్తకాల జారీని ఎన్నికల కమిషన్ ఇంతకుముందే నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పుస్తకాలను వెనక్కి తీసుకుంటామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో రైతులకు కొత్తగా రాజముద్రతో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు అందించాలని నిర్ణయించింది. ఈ పాసు పుస్తకాలపై రైతుల సమగ్ర వివరాలు

మిగతా 11వ పేజీలో...

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధినేత జగన్‌కు ఉన్న ప్రచారపిచ్చి రాష్ట్ర ఖజానాను గుల్లచేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. "కోటి రూపాయలో, పది కోట్లో కాదు...700 కోట్ల రూపాయల మేర ప్రజాధనాన్ని జగన్ తన పేరు, ఫొటోల పిచ్చికోసం తగలేశారు. భూముల సమగ్ర సర్వే పేరిట కేంద్ర మార్గదర్శకాలకు విరుద్ధంగా సర్వేకోసం గ్రానైట్ రాళ్లను తీసుకొచ్చి వాటిపై తన తండ్రిపేరు, తనపేరు చెక్కించుకున్నారు. ఈ సరదా తీర్చుకునేందుకు ఆయన ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు" అని నిగ్గు తేల్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూశాఖ కార్యకలాపాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సర్వే రాళ్లు, పాసుపుస్తకాలు తదితర అంశాలపై కీలక చర్చ జరిగింది. ఎలాగైనా రీ సర్వే కొనసాగించాలని కొందరు అధికారులు.. రెవెన్యూశాఖ పెద్దలను భ్రమల్లో పెట్టే ప్రయత్నం చేశారు. అందులోభాగంగా రీ సర్వేను కొనసాగిద్దామనే తరహాలో సీఎం వద్ద ప్రతిపాదనలు ఉంచారు. వాటిని చూసిన ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. "భూములను రీ సర్వే చేయాలని కేంద్రం నిధులు ఇస్తే జగన్

మిగతా 11వ పేజీలో...

నరకప్రాయ జీవితంలో..

పరీక్షలకు సిద్ధమవుతున్నాం.. వర్షాకాలం నీరు నిలిచిపోతుంది

- వాన నీటిలో మురుగు కలుస్తోంది.. మౌలిక సౌకర్యాలు ఉండవు.. ఇది అధికారుల నిర్లక్ష్యమే
- సివిల్స్ అభ్యర్థుల మృతి నేపథ్యంలో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు ఢిల్లీ విద్యార్థి లేఖ
- విచారణ కమిటీ ఏర్పాటు చేసిన కేంద్రం.. 10 లక్షల పరిహారం.. భవన యజమాని, ఐదుగురి అరెస్ట్

గ్యాస్ చాంబర్లలా కోచింగ్ సెంటర్లు: ధన్‌ఖడ్

సివిల్స్ అభ్యర్థుల మృతిపై ఎంపీల ఆందోళన

2

2న కేబినెట్.. 5న కలెక్టర్ల కాన్ఫరెన్స్

ప్రభుత్వ పాలసీలపై కలెక్టర్లకు దిశానిర్దేశం 11

హెచ్ఆర్ఏ 24% మరో ఏడాది కొనసాగింపు

రిజిస్ట్రేషన్ల శాఖ ప్రక్షాళన

- అమరావతి ఐజీ ఆఫీసు నుంచే ప్రారంభం.. రామకృష్ణ పీఏ సంజీవయ్య అవుట్
- ప్రాధాన్యం లేని చోటుకు బదిలీ.. జిల్లాల్లో డిప్యుటేషన్‌పై ఉన్నవారు తిరిగి పాత పోస్టులకే
- విశాఖ జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్ వెంకయ్యనాయుడు విజయవాడకు 3
- 22-ఏ నుంచి తొలగించిన భూములపై ఆరా.. ఫ్రీహోల్డ్ అనుమతులపై నివేదిక కోరిన ఐజీ

అహంకారం వల్లే మీ పతనం



అసెంబ్లీకొచ్చి నిలదీయండంటే.. చంద్రబాబుకు కొమ్ముకాయడమా?

- అద్దంలో కూడా మీకు ఆయనే కనబడుతున్నారు
- మీ మూర్ఖత్వానికి మిమ్మల్ని మ్యూజియంలో పెట్టాలి
- వైఎస్సార్‌సీపీ నుంచి వైఎస్‌ను ఎప్పుడో పంపేశారు
- ఇప్పుడు వైసీపీ అంటే వైవీ, సాయిరెడ్డి, సజ్జలే
- జగన్‌పై వైఎస్ షర్మిల ధ్వజం 11

స్కూళ్లకు 232 పనిదినాలు

- 83 రోజులు సెలవులు.. టోఫెల్ పీరియడ్లు తొలగింపు
- తొలి పీరియడ్‌లో రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్ బోధన 3
- అకడమిక్ క్యాలెండర్ విడుదల.. కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి ఓకే

ఆగస్టులోనూ కందిపప్పు కట్

- 5 జిల్లాలకు పంచదార కూడా.. టెండర్ల ప్రక్రియ జాప్యం వల్లే
- ప్రభుత్వం ఆదేశించినా మారని తీరు 3
- పౌరసరఫరాల సంస్థ పనితీరుపై విమర్శలు

నీళ్లున్నా.. కన్నీళ్లే!

శ్రీశైలం గేట్లెత్తినా సీమకు నీరందని దుస్థితి

హంద్రీ-నీవాకు విడుదల ప్రశ్నార్థకమే!

కర్నూలు-ఆత్మకూరు జాతీయ హైవే నిర్మాణంలో భాగంగా హంద్రీ-నీవా కాలువను పూడ్చేసి నిర్మించిన డైవర్షన్ రోడ్



- కర్నూలు-ఆత్మకూరు హైవే నిర్మాణంలో బ్రిడ్జి కోసం కాలువ పూడ్చివేత వల్లే
- డైవర్షన్ రోడ్డును తొలగించని ఎన్‌హెచ్ఏఐ 12
- నత్తనడకన రహదారి నిర్మాణం
- నోటీసులిచ్చినా చలనం లేని అధికారులు
- సీఎంతో మాట్లాడతామని నిర్లక్ష్యంగా సమాధానం
- దీంతో మల్యాల నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోయలేని దైన్యం

శ్రీశైలం జలాశయం వరద నీటితో కళకళలాడుతోంది. మూడు గేట్లెత్తి నాగార్జున సాగర్‌కు నీరు విడుదల చేస్తున్నారు. కానీ రాయలసీమకు మాత్రం నీరందే పరిస్థితి కనిపించడం లేదు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఓ వంతెన కట్టడానికి హంద్రీ-నీవా కాలువను పూడ్చివేయడమే దీనికి ప్రధాన కారణం. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టు సంస్థ బాధ్యతారాహిత్యం.. రాయలసీమ కరువు రైతులకు శాపంగా మారాయి.

- ద్రోణ, కర్ణాదులు అభిమన్యుడి ప్రాణాలు తీశారు
- 21వ శతాబ్దపు పద్మవ్యూహంలోనూ ఆరుగురే
- వారే మోదీ, షా, ధోబాల్, భగవత్, అదానీ, అంబానీ
- వీరి చేతిలో దేశంలోని అన్ని వర్గాలూ ఇబ్బందుల్లో
- లోటస్‌లానే పద్మవ్యూహం.. మోదీ ఛాతీపైన ఆ గుర్తు
- నేటి యువత అర్జునులు.. వ్యూహాన్ని ఛేదిస్తారు
- కులగణన ద్వారా పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టేస్తాం
- ఆర్థిక, రాజకీయ శక్తులను బలోపేతం చేసేలా బడ్జెట్
- లోక్‌సభలో సుదీర్ఘ ప్రసంగంలో రాహుల్ ధ్వజం

మోదీ పద్మవ్యూహం.. భయోత్పాతం!



న్యూఢిల్లీ, జూలై 29: ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి 'ఆధునిక పద్మవ్యూహాన్ని' నిర్మించి.. అందులో ప్రజలను బందీలను చేసి, దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించారని విపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీలో ఒకే వ్యక్తికి ప్రధాని కావాలనే

మిగతా 2వ పేజీలో...

బిహార్ రిజర్వేషన్ పెంపునకు సుప్రీం నో



- 50 నుంచి 65 శాతానికి పెంపు నిర్ణయాన్ని తిరస్కరించిన పట్నా హైకోర్టు
- ఆ ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరణ

నితీశ్ సర్కారుకు సుప్రీంలోనూ చుక్కెదురు

న్యూఢిల్లీ, జూలై 29: బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. రిజర్వేషన్లపై పాట్నా హైకోర్టు తీర్పును నిలిపివేయడానికి చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం నిరాకరించింది. నితీశ్ సర్కారు బిహార్‌లో దళితులు, ఆదివాసీలు, బీసీల కోటాను 50% నుంచి 65 శాతానికి పెంచుతూ రిజర్వేషన్ చట్టానికి సవరణ తెచ్చింది. దాన్ని పాట్నా హైకోర్టు తిరస్కరించడంతో నితీశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై సోమవారం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పాట్నా హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వడానికి తిరస్కరించిన సుప్రీంకోర్టు, ఈ విషయంలో బిహార్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను మాత్రం విచారణకు స్వీకరించింది. వీటిపై సెప్టెంబరులో విచారణ చేపడతామని తెలిపింది. బిహార్ ప్రభుత్వం తరఫున సీనియర్ అడ్వకేట్ శ్యామ్ దివాన్ వాదనలు వినిపించారు. ఛత్తీస్‌గఢ్‌లో రిజర్వేషన్ పెంపును వ్యతిరేకించిన అక్కడి హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేసిన విషయం ఆయన గుర్తుచేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ పిటిషన్‌ను విచారణకు తీసుకుంటాం కానీ హైకోర్టు తీర్పును నిలుపుదల చేయలేం అని తేల్చిచెప్పింది.

గడువులోగా ఫ్లాట్ అప్పగించనందుకు వడ్డీతో సహా సొమ్ము మొత్తం చెల్లించండి

న్యూఢిల్లీ, జూలై 29: ఫ్లాట్ నిర్మించి అప్పగించడంలో అసాధారణ జాప్యం చేసినందుకు కొనుగోలుదారుకు మొత్తం సొమ్మును వాపసు చేయాలని ఓ డెవలపర్‌ను సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. వారు చెల్లించిన మొత్తంపై 12% వార్షిక వడ్డీ కూడా ఇవ్వాలని సూచించింది. పార్శ్వనాథ్ డెవలపర్స్ అనే సంస్థ ఇక్కడి సుభాష్‌నగర్‌లో పార్శ్వనాథ్ పారామౌంట్ పేరుతో 2008లో గ్రూపు హౌసింగ్ ప్రాజెక్టును ప్రారంభించింది. 3బీహెచ్‌కే ఫ్లాట్ కోసం కొనుగోలుదార్లు తొలుత రూ.16 లక్షలు చెల్లించారు. అనంతరం డెవలపర్ చెప్పిన విధంగా మిగిలిన మొత్తాన్ని కూడా పూర్తిగా చెల్లించారు. 30 నెలల్లోగా ఫ్లాట్‌ను అప్పగించాల్సి ఉండగా, డెవలపర్ విఫలమయ్యారు. దాంతో కొనుగోలుదార్లు జాతీయ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. విచారణ జరిపిన ఫోరం మొత్తం సొమ్మును రిఫండ్ చేయాలని ఆదేశించడంతో పాటు 9 శాతం వడ్డీ ఇవ్వాలని ఆదేశించింది. వడ్డీ రేటుపై సంతృప్తి చెందని కొనుగోలుదార్లు సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం..మొత్తం సొమ్మును రిఫండ్ చేయాలన్న ఫోరం ఆదేశాలతో ఏకీభవిస్తునే 12 శాతం వడ్డీ చెల్లించాలని ఆదేశించింది. 3నెలల్లో చెల్లింపులను పూర్తి చేయాలని సూచించింది.

పరువు నష్టం దావాలో మేధా పాట్కర్‌కు ఊరట

న్యూఢిల్లీ, జూలై 29: పరువు నష్టం దావాలో నర్మదా బచావో ఆందోళన్ ఉద్యమ నాయకురాలు మేధా పాట్కర్‌కు ఊరట లభించింది. ఆమెకు కింది కోర్టు విధించిన అయిదు నెలల సాధారణ జైలు శిక్షను సస్పెండ్ చేస్తూ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు రాఘవ్ శర్మ సోమవారం ఆదేశాలు ఇచ్చారు. రూ.25వేల పూచీకత్తుపై బెయిల్ కూడా మంజూరు చేశారు. సమాధానం చెప్పాలని సక్సేనా తరఫు న్యాయవాదికి నోటీసులు పంపిస్తూ తదుపరి విచారణను సెప్టెంబరు నాలుగో తేదీకి వాయిదా వేశారు. ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా 23 ఏళ్ల క్రితం ఆమెపై పరువు నష్టం దావా వేశారు. నర్మదా బచావో ఆందోళన్‌కు వ్యతిరేకంగా సక్సేనా పత్రికా ప్రకటనలు ఇవ్వడంతో ఆయనకు వ్యతిరేకంగా 2000లో పాట్కర్ కేసు పెట్టారు. అప్పటి నుంచి ఇరువురి మధ్య న్యాయపోరాటం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆమెపై కూడా సక్సేనా పరువు నష్టం దావా వేశారు.

నేహారెడ్డి వ్యాజ్యంలో మధ్యంతర ఉత్తర్వులకు నో

- విజయసాయి కుమార్తె పిటిషన్‌లో ప్రతివాదిగా చేరేందుకు మూర్తియాదవ్‌కు అనుమతి


అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి సముద్రానికి అతిసమీపంలో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసేందుకు జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఈ నెల 18న జారీ చేసిన తుది ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైసీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె పెనకా నేహారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రతివాదిగా చేరేందుకు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్‌కు హైకోర్టు అనుమతించింది. అందుకోసం మెమో దాఖలు చేయాలని మూర్తియాదవ్‌కు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. సీఆర్‌జెడ్ ప్రాంతంలో జరిపిన నిర్మాణాలపై యథాతథస్థితి పాటించేలా ఆదేశాలు ఇవ్వాలన్న నేహారెడ్డి తరఫు న్యాయవాది అభ్యర్థనను తోసిపుచ్చింది. సీజే నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులు మేరకే నిర్మాణాల విషయంలో అధికారులు చర్యలు చేపట్టారని, ఈ నేపథ్యంలో ధర్మాసనం ఉత్తర్వులకు విరుద్ధంగా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ సోమవారం ఆదేశాలిచ్చారు. విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి సముద్రానికి అతిసమీపంలో నిర్మాణాలు చేపడుతున్నారంటూ జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిల్‌పై విచారణ జరిపిన సీజే ధర్మాసనం సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి సముద్ర తీరంలో జరుపుతున్న నిర్మాణాల నిలుపుదల చేయాలని, వాటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో నిర్మాణాలను కూల్చివేసేందుకు జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఈ నెల 18న తుది ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని సవాల్ చేస్తూ విజయసాయిరెడ్డి కుమార్తె పెనకా నేహారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ... ధర్మాసనం ఆదేశాలకు అనుగుణంగానే సీఆర్‌జెడ్ ప్రాంతంలో నిర్మాణాల పై అధికారులు తుది ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ముందస్తు బెయిల్

- షరతులతో హైకోర్టు మంజూరు

అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన ఘర్షణకు సంబంధించి ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు నమోదు చేసిన కేసులో వైసీపీ చంద్రగిరి నియోజకవర్గం నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.20 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. చార్జిషీటు దాఖలు చేసేవరకు ప్రతి 15 రోజులకోసారి దర్యాప్తు అధికారుల ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. మే 14న జరిగిన ఘర్షణపై ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మోహిత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫున న్యాయవాది ఓ. మనోహర్ రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్‌ను ఇటీవల పోలీసులు బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారని, సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులిచ్చి పంపించారని తెలిపారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. పిటిషనర్‌పై హత్యాయత్నం కేసు ఉందని, 41ఏ కింద నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ... చట్టనిబంధనలు అందుకు వెసులుబాటు కల్పిస్తున్నాయని వెల్లడించారు. సాధారణంగా స్ట్రాంగ్‌రూం వద్దకు పార్టీల ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తారని.. అయితే మోహిత్‌రెడ్డి పద్మావతి వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం వద్దకు తన అనుచరులను కూడా అనుమతించాలని గేటు వద్ద ఉన్న భద్రతా సిబ్బందిని ఆదేశించారని.. వారు లోపలకు వెళ్లిన తర్వాతే గొడవలు ప్రారంభమయ్యాయని వివరించారు.

తెలంగాణలో హత్య... బైక్‌పై మృతదేహం తరలింపు



మృతదేహాన్ని బైక్‌పై తీసుకొస్తున్న సోదరులు

సి.బెళగల్, జూలై 29: ఆస్తి తగాదాలతో తెలంగాణలో సొంత అన్నను హతమార్చి సరిహద్దున ఉన్న కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలంలో సోదరులు మృతదేహాన్ని పడేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్దదన్వాడ గ్రామానికి చెందిన గోకారి కుమారుడు శేషిరెడ్డి(55)ను అతడి సోదరులు నాగిరెడ్డి, మహేశ్‌లు హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని బైక్‌పై ఆంధ్ర సరిహద్దులోని సి.బెళగల్ మండలంలోని కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పడేశారు. ఈ విషయం తెలుసుకున్న కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్‌ఐలు తిమ్మారెడ్డి, బాలనరసింహులు, గూడూరు ఎస్‌ఐ హనుమంతయ్య సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నరకప్రాయ జీవితంలో..

- సివిల్స్ అభ్యర్థుల మృతి నేపథ్యంలో సుప్రీం కోర్టు సీజేకు విద్యార్థి లేఖ



రాజేంద్రనగర్‌లోని ఓ కోచింగ్ సెంటర్ దగ్గర సివిల్స్ అభ్యర్థుల నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని రావూస్ సివిల్స్ కోచింగ్ సెంటర్ సెల్లార్‌లోకి వరద నీరు పోటెత్తి ముగ్గురు విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకున్న నేపథ్యంలో.. ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాల లేమిపై అవినాశ్ దూబే అనే విద్యార్థి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాడు. "మేం నరకంలో బతుకుతున్నాం" అంటూ.. రాజేంద్రనగర్, ముఖర్జీనగర్ ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న కష్టాలను తన లేఖలో వివరించాడు. "సర్.. ఏటా రాజేంద్రనగర్, ముఖర్జీనగర్ లాంటి ప్రాంతాల్లో వర్షాలు పడితే ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుంది. మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మేం ఏటా ఈ సమస్యను ఎదుర్కొంటున్నాం. మోకాటిలోతు డ్రెయినేజీ నీటిలో నడవాల్సి వస్తుంది. వాన నీటిలో మురుగు నీరు కలిసిపోతుంది. ఆ నీరు ఒక్కోసారి ఇళ్లల్లోకి కూడా ప్రవేశిస్తుంది. ఈ పరిస్థితుల్లో పరీక్షలకు సిద్ధమవుతున్న మాలాంటి విద్యార్థులందరం నరకప్రాయమైన జీవితం గడుపుతున్నాం. ఇక్కడ విద్యార్థుల ప్రాణాలకు ఎలాంటి భద్రతా లేదని నిన్నటి (శనివారంనాటి) ఘటన నిరూపించింది. ఢిల్లీ ప్రభుత్వం, మునిసిపల్ కార్పొరేషన్ మమ్మల్ని పురుగుల్లా బతికేలా చేస్తున్నాయి. సర్.. ఆరోగ్యకరమైన జీవితం గడుపుతూ చదువుకోవడం మా ప్రాథమిక హక్కు" అని దూబే తన లేఖలో పేర్కొన్నాడు. వరద నీటి సమస్య.. కోచింగ్ సెంటర్లలో చదువుకుంటున్న విద్యార్థుల భద్రతకే ముప్పుగా పరిణమించిందని ఆవేదన వెలిబుచ్చాడు. సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు ఎలాంటి భయమూ లేకుండా చదువుకుని, దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయగలుగుతారని అభిప్రాయపడ్డాడు. రాజేంద్రనగర్, ముఖర్జీనగర్ వంటి ప్రాంతాల్లో వర్షాకాలంలో నీరు నిలిచిపోయి ప్రజల జీవితం నరకప్రాయం అవుతున్న నేపథ్యంలో.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా సమర్థమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించాలని సీజేఐను దూబే కోరాడు.

విద్యార్థుల మృతిపై విచారణ కమిటీ

రాజధాని ఢిల్లీలో ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల ప్రాణాలు జలసమాధి అయిన ఘటనపై విచారణకు కేంద్ర హోం శాఖ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ 30 రోజుల్లోగా దీనిపై ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది. ఇక, ఈ ఘటనలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించనున్నట్టు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రకటించారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే కోచింగ్ సెంటర్ యజమాని, కో-ఆర్డినేటర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు సోమవారం.. ఆ భవన బేస్‌మెంట్ యజమాని సహా మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి కేంద్రమైన రావూస్ కోచింగ్ సెంటర్ ముందు నుంచి శనివారం సాయంత్రం ఓ ఎస్‌యూవీ వేగంగా వెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఆ వాహనం వెళ్లక ముందు రావూస్ స్టడీ సర్కిల్ భవనం గేటు బాగానే ఉందని.. వాహన వేగం ధాటికి నీరు ఉధృతంగా చొచ్చుకురావడంతో అది విరిగిపోయిందని వారు వెల్లడించారు. సోమవారం అరెస్ట్ చేసిన ఐదుగురినీ కోర్టు ఆగస్టు 12 దాకా జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. కాగా.. ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్ ప్రాంతంలో ఉన్న అన్ని కోచింగ్ సెంటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహించి.. నిబంధనలు ఉల్లంఘించిన 20 శిక్షణ కేంద్రాల బేస్‌మెంట్లకు సీల్ వేశారు. మరోవైపు.. డ్రైనేజీలో పూడిక తీయకుండా, నీళ్లు నిలిచిపోవడానికి కారణమైన జూనియర్ ఇంజనీర్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. మరో ఏఈని సస్పెండ్ చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తానియా సోని, శ్రేయ యాదవ్, నెవిన్ డెల్విన్ మృతదేహాలను వారి కుటుంబసభ్యులు స్వస్థలాలకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. తమకు పరిహారం అక్కర్లేదని.. ఈ విషాదానికి బాధ్యులైనవారిని కఠినంగా శిక్షించాలని నెవిన్ డెల్విన్ తండ్రి విజ్ఞప్తి చేశారు.

సభలో ఎంపీల ఆగ్రహం..





ముగ్గురు విద్యార్థుల మరణంపై పార్లమెంటు ఉభయసభల్లోనూ ఎంపీలు ఆందోళన చేశారు. రాజ్యసభలో ఈ అంశంపై స్వల్పకాల వ్యవధి చర్చకు అనుమతించిన ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్.. దేశంలో సివిల్ సర్వీస్, ఇంజనీరింగ్, వైద్య పరీక్షలకు శిక్షణనిచ్చే కేంద్రాలు లాభాలు దండుకునే పరిశ్రమలుగా.. గ్యాస్‌చాంబర్లుగా మారిపోయాయని విమర్శించారు. ఆయా సంస్థలు ప్రకటనలకు చేసే ఖర్చుపైనా విచారణ జరిపించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై చర్చించేందుకు అన్ని పార్టీల నాయకులనూ కలుసుకుంటానని ధన్‌ఖడ్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నేత వద్దిరాజు రవిచంద్ర అన్నారు. రావూస్ స్టడీ సర్కిల్‌లో ముగ్గురు విద్యార్థుల మరణానికి కారణం కేజ్రీవాల్ ప్రభుత్వమేనని ఆమ్ ఆద్మీ పార్టీ తిరుగుబాటు ఎంపీ స్వాతి మలివాల్ ధ్వజమెత్తారు. ఆమె వాదనను ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ తోసిపుచ్చారు. ఢిల్లీలో ఆ కోచింగ్ సెంటర్లు పాతికేళ్లుగా ఉన్నాయని.. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడే వాటికి అనుమతినిచ్చిందని గుర్తుచేశారు. ఢిల్లీలో అధికారాలన్నీ లెఫ్టినెంట్ గవర్నర్ చేతుల్లో ఉన్నాయని.. అధికారులెవరూ తమ మాట వినట్లేదని సంజయ్‌సింగ్ తెలిపారు. ఇక లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశాన్ని లేవనెత్తిన కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్.. కోచింగ్ సెంటర్లు మాఫియాగా మారాయని ఆరోపించారు. ప్రమాదం జరిగిన భవనానికి అగ్నిమాపక శాఖ ఈ నెలలోనే నిరభ్యంతర పత్రం ఇచ్చిన నేపథ్యంలో.. ఆ సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులను ఈ ఘటనకు బాధ్యులుగా చేయాలని సమాజ్‌వాదీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇప్పించాలని స్పీకర్‌కు లేఖ రాశారు. ఈ విషాదానికి ఎవరు బాధ్యత వహించాలనే అంశంపై బీజేపీ, ఆప్ నేతల మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరుగుతోంది. సోమవారం కొందరు బీజేపీ నేతలు ఢిల్లీలోని ఆప్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆప్ నేతలేమో.. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు.

లోకం తీరు



ఫిర్యాదు చేసినా..

నిబంధనల ఉల్లంఘనపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని విద్యార్థులు మండిపడుతున్నారు. రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌తోపాటు మరికొన్ని కోచింగ్ సెంటర్లలో బేస్‌మెంట్లలో గ్రంథాలయాలు, తరగతిగదులను ఏర్పాటు చేయడంపై జూన్ 26నే తాను అధికారులకు ఫిర్యాదు చేశానని, కానీ ఎవరూ పట్టించుకోలేదని కిశోర్ సింగ్ కుశ్వాహా అనే సివిల్స్ ఆశావహుడు తెలిపారు. ఇక.. ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల మృతికి నిరసనగా సోమవారం వందలాది మంది విద్యార్థులు రావూస్ స్టడీ సర్కిల్ వద్ద ఆందోళనకు దిగారు. "ఇప్పుడు ఎలాంటి చర్యలూ తీసుకోకపోతే ఇలాంటి ఘటనలు మళ్లీ జరుగుతాయి. మరింత మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతారు. మమ్మల్ని మేమే కాపాడుకోలేకపోతే భవిష్యత్తులో దేశానికి ఎలా సేవ చేయగలం? ఇతరుల ప్రాణాలను ఎలా కాపాడగలం" అని రాహుల్ శర్మ అనే విద్యార్థి ఆగ్రహంగా ప్రశ్నించారు. విద్యార్థుల నిరసన నేపథ్యంలో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. విద్యార్థుల మృతికి బాధ్యులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని వారికి హామీ ఇచ్చారు. కానీ.. విద్యార్థులు శాంతించలేదు. "మాకు న్యాయం కావాలి" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. "పోలీసు బారికేడ్ల వెనకాల నిలబడడం కాదు.. మీరు కూడా ఇటువైపు వచ్చి మాతో కలిసి నిరసన తెలపండి" అని సక్సేనాను ఆహ్వానించారు.



ఢిల్లీలో ఓ కోచింగ్ సెంటర్‌కు సీల్ వేస్తున్న అధికారులు

ముస్లింలు అంటరానివారా?

- 17 కోట్ల మంది జనాభాకు ఏదీ ప్రాధాన్యం?
- బడ్జెట్‌పై చర్చలో హైదరాబాద్ ఎంపీ ఒవైసీ

న్యూఢిల్లీ, జూలై 29: కేంద్ర బడ్జెట్‌లో ముస్లింలకు తగిన ప్రాధాన్యం దక్కలేదని హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలోని 17 కోట్ల మంది ముస్లింలను అంటరానివారుగా చూస్తూ.. వికసిత భారత్ లక్ష్యాలను ఎలా సాధిస్తారంటూ ప్రశ్నించారు. మైనారిటీ వ్యవహారాల శాఖకు కేటాయింపులను రూ.5 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్లకు తగ్గించడాన్ని తప్పుబట్టారు. హజ్ కమిటీలు అవినీతి కేంద్రాలుగా మారాయని.. వాటిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 2007-08 నుంచి మైనారిటీ ఉపకార వేతనాలను పెంచకపోవడాన్ని ప్రస్తావించారు. సోమవారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఒవైసీ మాట్లాడారు. దేశంలో ముస్లింలు మరీ ముఖ్యంగా ముస్లిం మహిళలు అత్యంత పేదరికంలో ఉన్నారని పేర్కొన్నారు. 15 నుంచి 24 ఏళ్ల వయసున్న ముస్లిం యువతలో 29 శాతం మందికి మాత్రమే చదువుకునే అవకాశం ఉంటోందని చెప్పారు. ఉన్నత విద్య చదువుతున్న ముస్లింలు 5 శాతమేనన్నారు.

జమ్ముకశ్మీర్‌లో పేలుడు.. నలుగురి మృతి

శ్రీనగర్, జూలై 29 : జమ్ముకశ్మీర్‌లోని సోపోర్‌లో సోమవారం జరిగిన ఒక పేలుడు ఘటనలో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. బారాముల్లా జిల్లాలోని సోపోర్ పట్టణంలో ఒక తుక్కు డీలర్ దుకాణంలో ఈ పేలుడు చోటు చేసుకుంది. ఒక ట్రక్కు నుంచి కొంతమంది తుక్కును దింపుతుండగా ఈ ఘటన చోటు చేసుకుందని అధికారులు చెప్పారు. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా.. మరో ఇద్దరు గాయాలతో కొద్దిసేపటికి చనిపోయారు. వారిని నజీర్ అహ్మద్ నద్రూ(40), ఆజిమ్ అశ్రఫ్ మిర్(20), ఆదిల్ రషీద్ భట్(23), మహమ్మద్ అజహర్(25)గా గుర్తించారు.

మోదీ పద్మవ్యూహం.. భయోత్పాతం!



కిరణ్ రిజిజు



రాహుల్

(మొదటి పేజీ తరువాయి)

ఆకాంక్ష ఉంటుందని.. ఒకవేళ రక్షణమంత్రి తాను ప్రధాని కావాలని అనుకుంటే అది సాధ్యపడదని, దాని వెనుక కూడా భయమే కారణం అని.. ఈ విధంగా భయోత్పాతం అనేది దేశంలోని ప్రతి రంగానికి వ్యాపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం లోక్‌సభలో బడ్జెట్‌పై రాహుల్ గాంధీ 46 నిమిషాల పాటు ప్రసంగించారు. మహాభారత కాలంలో చక్రవ్యూహం (పద్మవ్యూహం) కమలం పువ్వు మాదిరిగానే ఉండేదని, అందులోకి ప్రవేశించిన అభిమన్యుడి చుట్టూ ద్రోణాచార్యుడు, కర్ణుడు, కృపాచార్యుడు, కృతవర్మ, అశ్వత్థామ, శకుని అనే అరుగురు కలిసి ఉచ్చు బిగించి చంపేసినట్లే.. ప్రధాని మోదీ సారథ్యంలో ఆరుగురు కలిసి చక్రవ్యూహానికి రూపకల్పన చేశారని విమర్శించారు. 21వ శతాబ్దపు ఈ పద్మవ్యూహం కూడా కమలం పువ్వు మాదిరిగానే ఉందని, ఆ చిహ్నాన్ని మోదీ తన ఛాతీ మీద పెట్టుకుంటారని పేర్కొన్నారు. అప్పట్లో అభిమన్యుడి పట్ల జరిగిన పరిణామాలే ఇప్పుడు దేశంలోని యువత, రైతులు మహిళలు, శ్రామికులు, చిన్న వ్యాపారుల పట్ల జరుగుతున్నాయని మండిపడ్డారు. నాడు అభిమన్యుడిని ఆరుగురు కలిసి చంపినట్లే.. ఈనాటి చక్రవ్యూహం కేంద్రంగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సంఘ్ చీఫ్ మోహన్ భగవత్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, పారిశ్రామికవేత్తలు అంబానీ, అదానీ అనే ఆరుగురు ఉన్నారని తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. ఇద్దరు పారిశ్రామికవేత్తల చేతుల్లో సంపద నియంత్రణ.. ఈడీ, ఐటీ, సీబీఐ.. రాజకీయ కార్యనిర్వాహక వర్గం అనేవి దేశాన్ని గుప్పిట్లో పెట్టుకున్న 'చక్రవ్యూహానికి' గుండెకాయ వంటివని.. ఇవి దేశాన్ని నాశనం చేశాయని వ్యాఖ్యానించారు. అగ్నివీర్ అనే చక్రవ్యూహంలో యువతను లక్ష్యంగా చేసుకున్నారని.. అగ్నివీరులకు పెన్షన్ కోసం బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు పెట్టలేదన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో చిరు వ్యాపారులకు శరాఘాతంగా పరిణమించిన పన్నుల వాత సమస్యను ప్రస్తావించనేలేదని విమర్శించారు. 'చక్రవ్యూహం' శక్తిని బలహీనపరిచేలా యువత, రైతులు, శ్రామికులు, చిరు వ్యాపారులకు దోహదకారిగా ఉంటుందని తాను ఆశించానని, అవేవీ లేకపోగా ఆర్థిక, రాజకీయ శక్తులను మరింత బలోపేతం చేసేలా ఉందని అభివర్ణించారు. ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో పేపర్ లీక్ అంశాన్నే ప్రస్తావించలేదని పేర్కొన్నారు. కోట్లాదిమందికి నష్టపరిచేందుకు పన్నిన చక్రవ్యూహాన్ని తాము కులగణన చేయడం ద్వారా బద్దలు కొడతామని, భయానక వాతావరణాన్ని పారదోలేదాకా తమ పోరాటం కొనసాగుతుందని ఉద్ఘాటించారు. దేశంలోని యువత అర్జున సమానులని, పద్మవ్యూహాన్ని బద్దలు కొడతారని బీజేపీని హెచ్చరించారు. అనంతరం.. రాహుల్ ఎక్స్‌లోనూ ట్వీట్ చేశారు. 'ఆధునిక చక్రవ్యూహం'లో నిరుద్యోగం, పేపర్ లీక్ ద్వారా యువత.. అప్పుల ద్వారా రైతులు, పన్నుల వాత ద్వారా సామాన్య ప్రజలు, అగ్నిపథ్ ద్వారా జవాన్లు తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారని.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలు అన్యాయానికి గురయ్యారని ఎక్స్‌లో రాశారు.

ఏ-1, ఏ-2 అంటే ఓకేనా?

సభలో రాహుల్ గాంధీ తన ప్రసంగంలో భాగంగా ఆధునిక చక్రవ్యూహం వెనుక ఆరుగురు ఉన్నారంటూ మోదీ, షా, భగవత్, దోభాల్, అంబానీ, అదానీ పేర్లను పేర్కొన్నారు. దీనిపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. జోక్యం చేస్తున్న స్పీకర్ ఓం బిర్లా సభలో లేని వారి పేర్లను ప్రస్తావించడం సరికాదని రాహుల్‌కు సూచించారు. స్పందించిన రాహుల్.. "మీరు కోరుకుంటే దోభాల్, అంబానీ, అదానీ పేర్లను నేను ఉపసంహరించుకుంటాను" అని వ్యాఖ్యానించారు. అయితే గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీలను వారి పేర్లతో కాకుండా ఏ-1, ఏ-2గా పేర్కొన్నారు. "దేశ సంపదపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్న ఆ ఇద్దరి పేర్లను నేను సభలో ప్రస్తావించొద్దంటున్నారు. అప్పుడు నేను అదానీ, అంబానీలను ఏ-1, ఏ-2 అని మాత్రమే చెబుతాను. ఇది ఆమోదయోగ్యమే కదా"? అని రాహుల్ వ్యాఖ్యానించడం గమనార్హం. దీనిపై పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి రిజిజు జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించగా.. రాహుల్, "ఏ-1, ఏ-2లను రిజిజు వెనకేసుకొస్తున్నారు. ఇది ఆయనకు తప్పదు. ఇలా చేయాలని ఆయనకు పెద్దలు నిర్దేశించారు అని ఎద్దేవా చేశారు.



వైరల్ అయిన ఫొటో ఇదే..

మహిళా అధికారికి బొట్టు పెట్టిన ఎంపీ

- సామాజిక మాధ్యమాల్లో వైరల్

బెంగళూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం చామరాజనగర కాంగ్రెస్ ఎంపీ సునిల్ బోస్..పర్యాటకశాఖ డైరెక్టర్ సవితకు మైసూరులోని చాముండేశ్వరి సన్నిధిలో బొట్టు పెట్టిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ విషయమై మీడియా అడిగిన ప్రశ్నకు సునిల్‌బోస్ తండ్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప సోమవారం స్పందించారు. ఇందులో వివాదం ఏముంది..? (వాట్ ఈజ్ ది ప్రాబ్లెం) అని ప్రశ్నించారు. హిందూ సంప్రదాయంలో అందరూ సమానమని, లింగభేదాలకు, తారతమ్యానికి అవకాశం లేదని అన్నారు. ఎవరు ఎవరికైనా కుంకుమ పెట్టవచ్చునని అన్నారు. కేఏఎస్ అధికారి, పర్యాటకశాఖ జాయింట్ డైరెక్టర్ సవితకు సునిల్‌బోస్ బొట్టు పెట్టడంలో తప్పేమీ లేదన్నారు.

ఎస్‌ఆర్‌సీ నివేదికను సవాలు చేసుకోండి

- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): భద్రత విషయంలో సెక్యూరిటీ రివ్యూ కమిటీ(ఎస్‌ఆర్‌సీ) కమిటీ ఇచ్చిన నివేదిక పై ఓ నిర్ణయం తీసుకొని కోర్టు ముందు ఉంచాలని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హైకోర్టు ఆదేశించింది. అభ్యంతరం ఉంటే నివేదికను సవాల్ చేస్తూ వ్యాజ్యం వేసుకోవాలని సూచించింది. విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. మంత్రిగా ఉండగా తనకు ఇచ్చిన 5 ప్లస్ 5 సెక్యూరిటీని కొనసాగించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం పై విచారణ జరిపిన న్యాయమూర్తి పిటిషనర్‌కు 2ప్లస్2 సెక్యూరిటీని కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... పెద్దిరెడ్డికి ఎలాంటి ప్రాణహాని లేదని ఎస్‌ఆర్‌సీ నివేదిక ఇచ్చిందని తెలిపారు. ఎమ్మెల్యేగా ఆయనకు 1 ప్లస్ 1 భద్రత కల్పిస్తున్నామన్నారు.

కిలిమంజారోపై టీడీపీ జెండా!

- టీడీపీ గెలుపుతో తాడిగడప నాయకుల సాహసయాత్ర
- టాంజానియాలోని కిలిమంజారో పర్వతారోహణం

పెనమలూరు (కృష్ణా జిల్లా), జూలై 29: రాష్ట్రంలో టీడీపీ గెలిచి చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావడంతో.. తెలుగుదేశం పార్టీ వీరాభిమాని సాహసయాత్ర చేశారు. ఆఫ్రికాలోని టాంజానియాలో ఉన్న కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి అక్కడ జాతీయ జెండాతోపాటు టీడీపీ జెండాను కూడా ఎగురవేశారు. తాడిగడప మునిసిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి గెలవాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారు. ఆయన కోరిక నెరవేరడంతో తోటి టీడీపీ అభిమానులు బొబ్బా గోపాలకృష్ణ, మరికొంతమందితో కలిసి ఆయన రెండు వారాల క్రితం టాంజానియా వెళ్లి కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. ఈ యాత్ర విజయవంతంగా ముగియడంతో వారు మంగళవారం స్వదేశానికి తిరిగి రానున్నారు. కాగా, గతంలో చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు కూడా.. ఆ అక్రమాన్ని ప్రపంచమంతా చాటి చెప్పాలనే ఉద్దేశంతో ప్రభాకరరావు సహా ఇతర టీడీపీ నాయకులు ఎవరెస్ట్ బేస్‌మెంటు వరకు సాహసయాత్ర చేసిన విషయం తెలిసిందే.



కిలిమంజారో పర్వతంపై జాతీయ జెండా, టీడీపీ జెండా ఎగురవేస్తున్న టీడీపీ నాయకుల బృందం

స్కూళ్లకు 232 పనిదినాలు

- 83 రోజులు సెలవులు
- టోఫెల్ పీరియడ్లు తొలగింపు
- తొలి పీరియడ్‌లో రీడింగ్ రైటింగ్, అర్థమెటిక్ బోధన
- అకడమిక్ క్యాలెండర్ విడుదల
- కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- మంత్రి నారా లోకేశ్ వెల్లడి


విద్యా శాఖ సమీక్షలో అకడమిక్ క్యాలెండర్‌ను పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్, ఉన్నతాధికారులు

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ 2024-25 విద్యా సంవత్సరానికి అకడమిక్ క్యాలెండర్‌ను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో విడుదల చేశారు. ఈ ఏడాది పాఠశాలలు 232 పని దినాలు ఉండేలా అకడమిక్ క్యాలెండర్ రూపొందించారు. ఈ క్యాలెండర్ ప్రకారం బడులకు 83 రోజులు సెలవులు ఉంటాయి. గతేడాదితో పోలిస్తే 3 పని దినాలు పెరిగాయి. ఆరు రోజుల సెలవులు తగ్గాయి. అలాగే గత ప్రభుత్వంలో టోఫెల్ బోధనకు ప్రత్యేకంగా పెట్టిన పీరియడ్లను తొలగించారు. 3 నుంచి 7 తరగతుల వరకు మొదటి పీరియడ్‌ను ఇకపై సాధారణ బోధనకు కాకుండా రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్ బోధనకు కేటాయించాలని నిర్ణయించారు. వారంలో చివరి పీరియడ్‌ను ఏదైనా ఒక సబ్జెక్టుపై రెమిడియల్ టీచింగ్‌కు కేటాయించారు. దసరాకు పది రోజులు, క్రిస్మస్‌కు ఎనిమిది రోజులు, సంక్రాంతికి ఐదు రోజులపాటు సెలవులు ప్రకటించారు.

పరీక్షల తేదీలు

ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్‌ఏ)-1 పరీక్షలు ఆగస్టు 27 నుంచి 31 వరకు, ఎఫ్‌ఏ-2 పరీక్షలు అక్టోబరు 21 నుంచి 25 వరకు, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నవంబరు 25 నుంచి డిసెంబరు 4 వరకు, ఎఫ్‌ఏ-3 పరీక్షలు జనవరి 27 నుంచి 31 వరకు జరుగుతాయి. ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు పదో తరగతికి ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఎఫ్‌ఏ-4 పరీక్షలు మార్చి 3 నుంచి 7 వరకు, సమ్మేటివ్-2 పరీక్షలు ఏప్రిల్ 7 నుంచి 17 వరకు నిర్వహిస్తారు.

రాజకీయాలకు అతీతం

విద్యాలయాలు రాజకీయాలకు అతీతంగా ఉండాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని, ఎలాంటి రాజకీయ జోక్యాన్ని అనుమతించబోమని మంత్రి లోకేశ్ స్పష్టంచేశారు. అందుకే సీఎం, మంత్రి ఫొటోలు, పార్టీల రంగులు లేకుండా క్యాలెండర్ రూపొందించామన్నారు. టీచర్లు, విద్యార్థులకు ఇచ్చే శిక్షణ పత్రాల్లోనూ మంత్రి సందేశం, ఫొటోలు, పార్టీల రంగులు ఉండకూడదని ఆదేశించారు. పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు ఆగస్టులో పూర్తిచేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, మౌలిక సదుపాయాల మెరుగుదల పర్యవేక్షణ బాధ్యతలను తల్లిదండ్రుల కమిటీలకు అప్పగించాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన కెమికల్స్ ఇతర ఉపకరణాల కొనుగోలుకు వెంటనే టెండర్లు పిలవాలన్నారు. సీబీఎస్ఈ పాఠశాలల పనితీరుపై త్వరలో కొత్త రూట్ మ్యాప్ విడుదల చేస్తామని తెలిపారు. కేజీబీవీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, అందుకు విధివిధానాలు ఖరారు చేయాలని ఆదేశించారు.

తిరుమల శ్రీవారి పుష్కరిణి నెలరోజుల పాటు మూతపడనుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్లకు మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు ఆగస్టు నెలంతా మూసివేస్తారు. ఈ కారణంగా నెల రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదు.

వైసీపీ హయాంలో వైద్యశాఖ నాశనం

- వందల కోట్లను పక్కదారి పట్టించారు: మంత్రి సత్యకుమార్



అనంతపురం టౌన్, జూలై 29: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో వైద్య వ్యవస్థ నాశనమైందని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. అనంతపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్‌తో కలిసి సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలు, రక్తనిధిని మంత్రి పరిశీలించారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య కళాశాలకు చేరుకుని లెక్చరర్స్ హాల్‌లో వైద్యాధికారులు, హెచ్‌ఓడీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో వైద్యశాఖ అభివృద్ధికోసం కేంద్రం అనేక పథకాల ద్వారా పెద్ద ఎత్తున నిధులు ఇచ్చిందని అన్నారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ.వందల కోట్లు మంజూరు చేసినా ఎక్కడా నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టలేదని అన్నారు. మూడు కాలేజీలలో అడ్మిషన్‌లు చేయాలని చూసినా.. నిబంధనల మేరకు వసతులు లేవని ఎన్ఎంసీ పరిశీలించి తిరస్కరించిందని అన్నారు. మరో ఐదు మెడికల్ కళాశాలలలో ఆస్పత్రులు కట్టారు, వైద్య కళాశాలలు నిర్మించలేదని అన్నారు. కానీ కేంద్రం నుంచి నిధులు తీసుకున్నారని, రాష్ట్ర వాటా నిధులు ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులు ఇంకా రూ.6,500 కోట్లు ఉన్నాయని అన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి చెందిన రూ.400 కోట్లు, ఏపీ మెడికల్ బోర్డుకు చెందిన రూ.200 కోట్లను వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కృషి చేస్తారని అన్నారు.

ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేస్తాం: మంత్రి కొండపల్లి

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆఫీస్‌కు వెళ్తే మంత్రులు, పార్టీ నేతలు తమ బాధలు వింటారు.. సమస్యలు పరిష్కారమౌతాయనే నమ్మకం ప్రజలకు కలిగేలా పని చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పనబాక లక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 12 జిల్లాలకు నుంచి 110 వినతులు రాగా, అందులో ఎక్కువగా గత ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలపైనే ఫిర్యాదులు వచ్చాయి.

రిజిస్ట్రేషన్ల శాఖ ప్రక్షాళన

అమరావతి ఐజీ ఆఫీసు నుంచే ప్రారంభం.., రామకృష్ణ పీఏ సంజీవయ్య అవుట్

- ప్రాధాన్యం లేని చోటుకు బదిలీ
- జిల్లాల్లో డిప్యుటేషన్‌పై ఉన్నవారు తిరిగి పాత పోస్టులకే
- విశాఖ జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్ వెంకయ్యనాయుడు విజయవాడకు
- ఫ్రీహోల్డ్ అనుమతులపై నివేదిక కోరిన ఐజీ

జిల్లాలో 22-ఏ నుంచి తొలగించిన భూములపై ఆరా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు రిజిస్ట్రేషన్ల శాఖ ప్రక్షాళన ప్రారంభించింది. దీనికి అమరావతిలోని ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) కార్యాలయం నుంచే శ్రీకారం చుట్టింది. గత సర్కారు హయాంలో కేంద్ర సర్వీసుల నుంచి వచ్చిన రామకృష్ణ ఐజీగా చేరి వైసీపీ పెద్దలు చెప్పిన పనులన్నీ చేశారు. సాఫ్ట్‌వేర్ మార్పు దగ్గర నుంచి కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ డీడ్‌ల జెరాక్సులు ఇవ్వడం వరకూ రకరకాల ప్రయోగాలు చేశారు. అయితే కొత్త సాఫ్ట్‌వేర్‌కు రూ.35 కోట్ల వరకు వెచ్చించినా ఇంతకు ముందులాగే సర్వర్ ఆగిపోవడం, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోవడం వంటి సమస్యలు అలాగే ఉండిపోయాయి. ఇక పరిపాలన విషయానికి వస్తే నాటి ఐజీ రామకృష్ణకు పీఏగా వ్యవహరించిన సబ్ రిజిస్ట్రార్ (గ్రేడ్-1) సంజీవయ్య అమరావతిలో కూర్చుని చక్రం తిప్పారు. విశాఖ జిల్లాలో మధురవాడ, భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేసిన ఆయనపై ఏసీబీ కేసు కూడా ఉంది. అలాంటి అధికారిని ఐజీ ఆఫీసులో ఉంచుకోవడం తగదని తెలిసినా.. రామకృష్ణ ఏరికోరి తెచ్చుకున్నారు. ఐజీ కార్యాలయంలో ఫర్నిచర్ నుంచి రామకృష్ణ ఇంటికి అవసరమైన సామగ్రి కోసం సంజీవయ్య జిల్లాల అధికారుల నుంచే వసూలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ సబ్ రిజిస్ట్రార్ పోస్టు ఖాళీ అయినా దానిని ఐజీ కార్యాలయం ఆదేశం మేరకే భర్తీ చేసేలా మార్పులు తెచ్చారు. ఎవరు ఎక్కువ సమర్పించుకుంటే వారికే ఆ సీట్లు దక్కేవి. చివరకు ఖాళీగా ఉన్న పోస్టుల్లో డిప్యుటేషన్ నియామకాల అవకాశం కూడా జిల్లా డీఐజీకి ఇవ్వకుండా సంజీవయ్యే చక్కబెట్టేవారు. కొత్తగా వచ్చిన ఐజీ ఎంవీ శేషగిరిబాబు.. కార్యాలయంలో ఏం జరుగుతోందో మొత్తం ఆరా తీశారు. పీఏ పోస్టు నుంచి సంజీవయ్యను తప్పించేశారు. ప్రాధాన్యం లేని పోస్టుకు పంపారు. అలాగే వివిధ జిల్లాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న వారిని పాత పోస్టులకు పంపించివేశారు. విశాఖ సూపర్ బజారు రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వెంకయ్య నాయుడిని తిరిగి విజయవాడకు పంపించారు.

అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై ఆరా

విశాఖ జిల్లాలో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు పెద్దఎత్తున అన్యాక్రాంతమయ్యాయని విమర్శలు ఉన్నాయి. వైసీపీ నేతలు చెప్పిన భూములను అధికారులు 22-ఏ జాబితా నుంచి తప్పించి, రిజిస్ట్రేషన్ చేసేశారు. అలాంటి వాటిలో దసపల్లా భూములు కూడా ఉన్నాయి. ఇలాంటివి లోపాయకారీగా చాలా జరిగాయి. అసైన్డ్ భూములను 20 ఏళ్లు దాటితే విక్రయించుకోవచ్చునని, వాటిని ఫ్రీ హోల్డ్ చేస్తున్నామని జగన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ముసుగులో వైసీపీ నాయకులు ముందుగానే రైతులతో ఒప్పందాలు చేసుకుని ఆనందపురం, భీమిలి, పద్మనాభం తదితర మండలాల్లో విలువైన భూములను తమ పేరిట మార్పించుకున్నారు. ఈ విషయంలో వైసీపీ నేతలు చెప్పిన భూములనే ఫ్రీ హోల్డ్ చేసి, రైతులు దరఖాస్తు చేసిన వాటిని పక్కన పెట్టారు. వీటన్నిటిపైనా ఐజీ నివేదిక కోరడంతో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు ఇప్పుడీ వివరాల సేకరణతో నిమగ్నమై ఉన్నారు.

ఎకరాలు, గజాల లెక్కన వసూళ్లు..!

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అనగానే లంచం ఇవ్వనిదే పని జరగదనే అభిప్రాయం ప్రజల్లో బాగా నాటుకుపోయింది. కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఆస్తి రిజిస్ట్రేషన్ విలువలో పర్సంటేజీలు కోరుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో 0.5 శాతం లెక్కగట్టి సబ్ రిజిస్ట్రార్ పేరుతో దళారులు, డాక్యుమెంట్లు రైటర్లు తీసుకునేవారు. ఇప్పుడు ఎకరాలు, గజాల లెక్కన వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. అక్కడా ఇక్కడా అని లేకుండా ప్రతి కార్యాలయంలోనూ ఈ తంతు నడుస్తోందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై కూడా దృష్టి సారించాల్సి ఉంది.

సూపర్ సిక్స్‌ను అమలు చేయాల్సిందే

- రామకృష్ణ

అనంతపురం విద్య, జూలై 29: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అనంతపురం జిల్లాకు సోమవారం వచ్చిన ఆయన మాట్లాడుతూ.. 'విద్యా మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వ పథకాలకు అబ్దుల్ కలాం, సర్వేపల్లి రాధాకృష్ణ పేర్లు పెట్టడం అభినందనీయం. అధికార దాహంతో ఉన్న జగన్, గతంలో అన్ని పథకాలకూ తన పేర్లు పెట్టుకున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజల్లో గందరగోళం నెలకొంది. జగన్ అసెంబ్లీకి కూడా వెళ్లకుండా ఏపీ అప్పులు రూ. 7.45 లక్షల కోట్లు అంటుంటే.. బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చాలా తక్కువ చేశామని చెబుతున్నారు. మరో వైపు సీఎం చంద్రబాబు రూ. 9.74 లక్షల కోట్లు అప్పులు చేశారని చెబుతున్నారు. ఏపీ ప్రజలు ఏదీ నమ్మాలో తెలియక ఆందోళనలో ఉన్నారు' అని రామకృష్ణ అన్నారు.

టీటీడీ 'ట్రాన్స్‌పోర్టు'లో భారీ కుంభకోణం

- ఆ విభాగంలో వైఎస్ఆర్ జమానా నుంచీ ఓ రెడ్డిదే హవా
- ట్రావెల్స్‌కూ వాహనాలు..! : కిరణ్ రాయల్



తిరుపతి (జీవకోన), జూలై 29: టీటీడీ ట్రాన్స్‌పోర్టు విభాగంలో దాదాపు రూ.100 నుంచి రూ.150 కోట్ల వరకు స్కామ్ జరిగిందని తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్ రాయల్ ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వం నడిచిన ఐదేళ్ల కాలంలో టీటీడీ ట్రాన్స్‌పోర్టు విభాగంలో పుష్కలంగా దోచేసింది. ఈవోలు, జేఈవోలు, చైర్మన్లు, బోర్డు మెంబర్లు ఎంతమంది మారినా ట్రాన్స్‌పోర్టు విభాగంలో జనరల్ మేనేజర్‌గా వున్న ఓ రెడ్డి హవానే నడుస్తోంది. వైఎస్ సీఎంగా వున్నప్పటినుంచీ ఆ పదవిలో ఆయన కొనసాగుతుండడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. వాహనాలను ఇష్టానుసారం వాడుతూ నిధులను నీళ్లలా ఖర్చు పెడుతున్నారు. దీనిపై మావద్ద పూర్తి సమాచారం ఉంది. వాహనాలను ట్రావెల్స్‌కు ఏమైనా తిప్పుతున్నారా అన్న సందేహాలు కూడా ఉన్నాయి. అలాగే కొంతమంది అధికారులు వారి జిల్లాలకు ఇష్టానుసారంగా వాహనాలను వాడుకుంటున్నారు. అదే విధంగా టీటీడీ తిరుమల రెవెన్యూ విభాగంలో ఓ అధికారే పెత్తనాన్ని చెలాయిస్తున్నారు. ఏ చైర్మన్ వచ్చినా ఆయనే సూపరింటెండెంట్‌గా ఉంటారు. దీని వెనుక మతలబు అర్థం కావడంలేదు' అని కిరణ్ అన్నారు.

సరదాగా గడిపేందుకు వచ్చి... తిరిగిరాని లోకాలకు

- తెలుగుగంగ రిజర్వాయర్‌లో ముగ్గురు యువకులు గల్లంతు: మృతదేహాలు వెలికితీత


గల్లంతుకు ముందు స్నేహితుల సెల్ఫీ

ప్రొద్దుటూరు, జూలై 29 : సెలవు రోజు సరదాగా గడిపేందుకు వెళ్లిన ముగ్గురు స్నేహితులను నీటి ప్రమాద రూపంలో మృత్యువు కాటేసింది. కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పఠాన్ రహమతుల్లా(21), ఎస్కే ముదాషీర్(21), వేంపల్లె షాహిద్ మోహిద్దీన్ (22) స్నేహితులు. ఆదివారం సెలవురోజు కావడంతో సరదాగా గడపడానికి ముగ్గురూ బైక్‌పై దువ్వూరు మండలంలోని చల్లబసాయపల్లె సమీపంలోని తెలుగుగంగ రిజార్వాయర్-1 వద్దకు వెళ్లారు. ఇక్కడ సరదాగా సెల్ఫీలు తీసుకున్నారు. ఆ తరువాత గట్టుమీద సెల్‌ఫోన్‌లు, దుస్తులు పెట్టి రిజర్వాయర్‌లోకి దిగారు. లోతుపై అవగాహనలేక, ఈత రాక గల్లంతయ్యారు. సోమవారం ఉదయం రిజర్వాయర్ దగ్గరకు వెళ్లిన స్థానికులు గట్టుపైన ఉన్న సెల్‌ఫోన్‌లు దుస్తులు చూసి యువకులు గల్లంతైనట్లు అనుమానించి దువ్వూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీసారు.

ఆగస్టులోనూ కందిపప్పు కట్

- ఐదు జిల్లాలకు పంచదార కూడా
- టెండర్ల ప్రక్రియ జాప్యమే కారణం
- ప్రభుత్వం ఆదేశించినా మారని తీరు
- పౌరసరఫరాల సంస్థ పనితీరుపై విమర్శలు

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆగస్టు నుంచి రేషన్‌లో ఉచిత బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార సరఫరా చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కందిపప్పు, పంచదార ధరలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో పేదలకు ఉపశమనం కలిగించేలా వచ్చే నెల నుంచి రాయితీ ధరలపై రూ.67కే కిలో కందిపప్పు, రూ.17కే అరకిలో పంచదార చొప్పున పంపిణీ చేయాలని పౌరసరఫరాలశాఖను ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వం రేషన్ సరుకుల్లో కందిపప్పును పూర్తిగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. కనీసం పండగ నెలల్లో కూడా పేదలకు కందిపప్పు ఇవ్వలేక పోయింది. పంచదారను కూడా అరకొరగా సరఫరా చేసింది. మొత్తంగా ప్రజాపంపిణీ వ్యవస్థను కేవలం బియ్యం పంపిణీకే పరిమితం చేసింది. ఇటీవలే అధికారాన్ని చేపట్టిన కొత్త ప్రభుత్వం ఇక నుంచి రేషన్ సరుకుల్లో కందిపప్పు, పంచదార సరఫరాను పునరుద్ధరించి.. కార్డుదారులకు అందించాలని భావించింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు అవసరమైన కందిపప్పు, పంచదార కోసం ఈ-ప్రొక్యూర్‌మెంట్ వేదికగా టెండర్లు ఆహ్వానించింది. అయితే, సకాలంలో ఆ ప్రక్రియను పూర్తి చేయడంలో విఫలమైంది. ఫలితంగా ఆగస్టు కోటాలో కందిపప్పు సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడింది. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధికారులు సకాలంలో టెండర్లను ఖరారు చేయలేకపోవడంతోనే ఇలా జరిగినట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వం మారినా అధికారుల పనితీరు మారలేదన్న విమర్శలు వస్తున్నాయి.

మితిమీరిన జాప్యం

ఆగస్టు నుంచి అక్టోబరు వరకు 3 నెలలకు సరిపోయేలా మొత్తం 22,500 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 17,538 మెట్రిక్ టన్నుల పంచదార సేకరణ కోసం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నెల రోజుల క్రితమే టెండర్లు ఆహ్వానించింది. 26 జిల్లాల్లో రేషన్‌కార్డుదారులు, ఐసీడీఎస్ లబ్ధిదారులకు ప్యాకెట్లలో సరఫరా చేసే కందిపప్పు విలువ సుమారు రూ.394 కోట్లు. అయితే టెండరు విలువ కోటి రూపాయలు దాటితే చట్ట ప్రకారం న్యాయ సమీక్షకు వెళ్లాల్సి రావడంతో పౌరసరఫరాలశాఖ ఈ టెండరు వివరాలను జ్యుడీషియల్ ప్రివ్యూకు పంపించారు. దీనిపై నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రావడంతో వాటిపై న్యాయమూర్తి వివరణలు కోరారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సమాధానాలు పంపించేసరికి పుణ్యకాలం కాస్తా ముగిసిపోయింది. ఇప్పటికిప్పుడు జ్యుడీషియల్ ప్రివ్యూ నుంచి అనుమతులు లభించినా కూడా టెండర్లు ఖరారు చేసి రేషన్ కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేసే పరిస్థితులు లేవు. పంచదార టెండర్లు జ్యుడీషియల్ ప్రివ్యూకు వెళ్లకపోయినా.. ఈ టెండరులో పాల్గొన్న చక్కెర సరఫరాదారులు ఎక్కువ ధరలు కోట్ చేయడంతో అధికారులు వాటిని రద్దు చేశారు. ఆ వెంటనే రెండోసారి టెండర్లు ఆహ్వానించారు. దీంతో జాప్యం జరిగింది. ఈ టెండరులో జోన్ల వారీగా మొత్తం ఆరుగురు కాంట్రాక్టర్లు పాల్గొనగా.. మొదటి జోన్(శ్రీకాకుళం, విజయనగరం, ఏఎస్ఆర్ మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి) టెండర్ల ప్రక్రియ ఇంతవరకు పూర్తికాలేదు. దీంతో ఆ 5 జిల్లాలకు వచ్చే నెల కోటాలో కందిపప్పుతోపాటు చెక్కర సరఫరా నిలిచిపోనుంది.

బ్లాక్‌లిస్టులో ఫ్లోర్‌మిల్స్

గోధుమపిండి టెండర్లలో పాల్గొన్న విజయనగరం జిల్లాకు చెందిన ఆంజనేయరోలర్ ఫ్లోర్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ బ్లాక్ లిస్టులో పెట్టింది. టెండరు షరతుల ప్రకారం చక్కీ ఆటా మిల్స్ లేకుండా తప్పుడు అఫిడవిట్లు సమర్పించి సంస్థను మోసం చేసేందుకు ప్రయత్నించారని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈ సంస్థను రెండేళ్లపాటు బ్లాక్‌లిస్టులో పెట్టారు.



నేలతల్లి ఒడిలో ఒరిగిపోయాడు!

బండి శ్రీను... ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం గుల్లపూడి గ్రామానికి చెందిన ఇతను ఓ సాధారణ రైతు...ఉన్న కొద్దిపాటి భూమిని రెక్కల కష్టంతో సాగుచేస్తున్నాడు. వ్యవసాయ పనులు లేనప్పుడు భార్యతో కూలీకి వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం బండి శ్రీను (48) పొలంలో వరి గింజలు వెదజల్లుతుండగా గుండెపోటుకు గురయ్యాడు. అక్కడే కుప్పకూలి ప్రాణం విడిచాడు. పొలం పనులు చేస్తూ శ్రీను పొలంలోనే తనువు చాలించిన వైనం పలువురి కంట తడిపెట్టించింది. -గంపలగూడెం

సర్పంచుల సమస్యలు పరిష్కరిస్తాం

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్

అమరావతి(ఆంధ్రజ్యోతి), గుంటూరు సిటీ, జూలై 29: రాష్ట్రంలోని సర్పంచులకు విధులు, నిధులు దక్కే విధంగా కృషి చేస్తానని పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ హామీ ఇచ్చారు. సర్పంచుల ప్రతినిధులతో తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో ఆయన సోమవారం సమావేశమై వారి సమస్యలపై చర్చించారు. పంచాయతీల్లో సమస్యలపై వినతిపత్రాలు తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'కోచింగ్' విషాదం

ఢిల్లీలో సివిల్స్ శిక్షణపొందుతున్న ముగ్గురు విద్యార్థులు దుర్మరణం పాలైన ఘటన అత్యంత విషాదకరమైనది. భారీ వర్షం కారణంగా వరదనీరు సదరు కోచింగ్ సెంటర్ సెల్లార్‌ను ముంచెత్తడంతో, ఈ ముగ్గురు అక్కడి లైబ్రరీలో చిక్కుబడిపోయి ప్రాణాలు కోల్పోయారు. నీరు చేరడమే తప్ప బయటకు పోయే దారి లేని సెల్లార్‌లో విద్యార్థులకు అత్యంత అవశ్యకమైన లైబ్రరీ నిర్వహించడం ఆ సంస్థ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ప్రమాద సమయంలో అక్కడ ముప్పైమంది విద్యార్థులున్నారు. కొంతమంది తమకు తాముగా బయటపడ్డారు, మిగతావారిని తోటివారు కష్టపడి కాపాడారు. కానీ, ఈ ముగ్గురూ ఆదుకొనే నాథుడు లేక నాలుగుగంటలపాటు అక్కడే చిక్కుబడిపోయి చివరకు ప్రాణాలు వదిలేశారు. ఆ ప్రాంతంలో డ్రైనేజ్ వ్యవస్థ ఘోరంగా ఉన్నదని పదిరోజులక్రితమే అధికారులకు, స్థానిక కౌన్సిలర్‌కు స్వయంగా ఫిర్యాదు చేసినట్టు విద్యార్థులు చెబుతున్నారు. ఆ ప్రాంతంలో మురుగునీరు వెళ్ళే కాలువలు ఆక్రమణలకు గురై పూడుకుపోయాయని అధికారులు అంటున్నారు. నీటిధాటికి పైప్‌లైన్లు పగిలిపోయి నీరు భారీగా సెల్లార్ లోకి చేరడంతో ఈ ఘోరం జరిగింది. కోచింగ్ సెంటర్‌ల ధనాపేక్ష, అధికార యంత్రాంగాల నేరపూరితమైన నిర్లక్ష్యం ఈ ముగ్గురి కలెక్టర్ కలను చిదిమేశాయి.

ఈ మహావిషాదాన్ని అన్ని పార్టీలూ ముక్తకంఠంతో ఖండించాయి, ఆవేదన వెలిబుచ్చాయి. ఎంతమాత్రం రాజకీయం తగదని ఏక మాటగా అంటూనే అంతిమంగా అదేపనిచేశాయి. పాపం మీదంటే మీదని పరస్పరం విమర్శించుకుంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ, భారతీయ జనతాపార్టీ పక్షాన లోక్‌సభ, రాజ్యసభల్లో మోహరింపులు జరిగాయి. ఆ స్వల్పకాలిక చర్చలో కూడా ఎదుటివారిని తప్పుబట్టడమో, నేరం నెట్టివేయడమో ప్రధానమైపోయింది. 'ఢిల్లీ మునిసిపాలిటీ ఏకంగా పదిహేనేళ్ళుగా మీ చేతుల్లో ఉన్న ఫలితంగా వ్యవస్థలన్నీ నాశనమైనాయి, ఇప్పుడేమో డ్రైనేజ్ రిపేర్ చేయమని పదిహేనురోజులుగా పోరుతున్నా అధికారులు మా మాట వినడం లేదు' అని బీజేపీని ఆప్ విమర్శిస్తే, బీజేపీ తరపున మాట్లాడినవారంతా ఆప్ అసమర్థతను తప్పుబట్టారు. ఢిల్లీలో ఈ రెండుపార్టీల మధ్యా ఉచ్చస్థితికి చేరిన రాజకీయవైరం ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా పరిణమించిందని ఈ ఘటన తెలియచేస్తోంది. మంత్రుల ఆదేశాలను అమలుచేసిన అధికారులను లెఫ్టినెంట్ గవర్నర్ వేధిస్తున్నారని ఆప్ విమర్శిస్తోంది. ఏతావాతా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం, అమలుచేయనిపక్షంలో అడగడం వంటివి ఎవరికీ పట్టని వ్యవహారంగా మారిపోయింది. ఇప్పుడు ముఖ్యమంత్రి జైల్లో ఉండటంతో కుంటుతున్న వ్యవస్థకూడా కుప్పకూలింది. ఆప్ ముక్కలు చెక్కలైపోయి, ఏడు ఎంపీస్థానాలు గెలుచుకున్న బీజేపీ అసెంబ్లీని కూడా వశపరచుకొనేవరకూ ఈ ఘర్షణ తప్పదేమో! కోచింగ్ సెంటర్‌ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సహా, బీజేపీ, ఆప్‌లకు చెందిన పలువురు నాయకులను తీవ్ర నిరసనలతో వెనక్కు పంపేయడం గమనించాల్సిన అంశం.

ఈ ఘటన తరువాత బుల్‌డోజర్లు వచ్చాయి, ఫుట్‌పాత్‌లను, నాలాలను దురాక్రమించిన మిగతా కోచింగ్ సెంటర్లను పాక్షికంగా కూలగొట్టాయి. ఒకరిద్దరు అధికారులు కూడా సస్పెండ్ అయ్యారు. మూడుప్రాణాలు పోయిన తరువాత ఏకంగా ఒకరోజులోనే పదిహేను కోచింగ్ సెంటర్‌ల అతిక్రమణలను, అక్రమాలను గుర్తించి, శిక్షించిన ఈ అధికారులకు ఇంతకాలమూ సదరు కోచింగ్ సెంటర్ పార్కింగ్‌కో సమో, స్టోర్‌రూముగానో వాడాల్సిన సెల్లార్‌ను లైబ్రరీగా మార్చిందని తెలియరాలేదనుకోలేం. ఆ సెంటర్‌లో చదువుతున్న ఓ విద్యార్థి, పక్కనే నివాసం ఉంటున్న ఓ పెద్దమనిషి సహా పలువురు ఫిర్యాదు చేసినా వారు బేఖాతరుచేశారు. నిబంధనలు, ప్రమాణాలకు అనుగుణంగా సదరు సంస్థ నడుస్తున్నదని వివిధ విభాగాలు కనీసం తనిఖీ కూడా చేయకుండా సర్టిఫికేట్లు ఇచ్చేయడం ఆశ్చర్యం. ఇప్పుడు ఉన్నతస్థాయి కమిటీ స్వల్పకాలంలో వేగవంతమైన విచారణతో ఏ కొత్తనిజాలు వెలుగులోకి తెస్తుందో తెలియదు

కానీ, లక్షలాది రూపాయలు వసూలుచేస్తూ, విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న కోచింగ్ సెంటర్‌ల ఇష్టారాజ్యానికి సమస్త వ్యవస్థలు కలసికట్టుగా సహకరిస్తున్నాయన్నది వాస్తవం.

వికసించని మన పారిశ్రామిక భారతం!

వికసిత భారత్! దీని గురించి జరిగే ప్రచారం అంతా ఇంతా కాదు. సమావేశాలు, గోష్ఠులు, లక్ష్య ప్రకటనలు, విధానాల రూపకల్పనలు.. ఎటుచూసినా వికసిత భారత్ వైపే దేశం కదులుతున్నట్లుగా ప్రచారం హోరెత్తుతోంది. రాజకీయ దృష్టితో దీన్ని ప్రచారపటాటోపంగా కొట్టివేయటం తేలిక. భిన్న రాజకీయ దృక్పథంతో పెదవి విరవటమూ కష్టం కాదు. వీటికి మించి వికసిత భారత్ భావన సాధ్యాసాధ్యాలను అర్థం చేసుకోవాలంటే చాలా విషయాలను స్పృశించాలి. అందుకు మన ఆర్థికాభివృద్ధి చరిత్రలోకి వెళ్లాలి. అదెంత వేగంతో నడిచిందో చూడాలి. ఆ వేగం ఆశించిన రీతిలో కాకుండా అరకొరగా ఉంటే కారణాలను వెతకాలి. ఆర్థిక వికాసానికి, మేధో వికాసానికి సంబంధాలను చూడాలి. అసలు ఈ రెండిటికీ బంధనాల్లాంటివి ఉంటే అవెందుకు ఏర్పడ్డాయో విశ్లేషించాలి. మూడు రోజుల క్రితం ఢిల్లీలో నీతిఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రధాన మంత్రితో పాటు సీఎంలూ పాల్గొన్నారు. 2047 నాటికి మన ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలనే లక్ష్యానికి అనుగుణంగా విధానాలను రూపొందించుకుని, అడ్డంకులను తొలగించుకోవాలని సమావేశం అభిప్రాయపడింది. స్వాతంత్ర్యం పొందిన వందేళ్ల నాటికి (2047) మూడు అగ్ర శ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండాలన్నదే వికసిత భారత లక్ష్యం. లక్ష్యం ఘనంగా పెట్టుకోవటంలో తప్పులేదు.

1950 నాటికి ఆర్థికంగా భారత్‌తో సమానస్థాయిలో ఉన్న కొన్ని దేశాలు చాలా ముందుకు వెళ్లాయి. ఆగ్నేయాసియా, చైనాల ఆర్థిక చరిత్ర చూస్తే ఇదే అర్థం అవుతుంది. బంగ్లాదేశ్‌ను పరిశీలించినా కొన్ని రంగాల్లో ఆ దేశం ముందుకు వెళ్లింది. మానవాభివృద్ధికి సంబంధించిన అంశాల్లో ఇది స్పష్టంగా కనపడుతుంది. 2024లో బంగ్లాదేశ్ తలసరి జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) 2,529 డాలర్లు. దారిద్ర్యరేఖ (రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయం) దిగువన అయిదు శాతం ప్రజలే ఉన్నారు. సగటు ఆయుర్దాయం 74 ఏళ్లు. శ్రామికశక్తిలో బంగ్లా మహిళల వాటా 43 శాతం ఉంది. ఆ దేశంతో పోల్చితే భౌగోళికంగా భారత్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. అయినా కొన్ని విషయాల్లో వెనుకబడే ఉంది. భారత్‌లో తలసరి జీడీపీ 2484.8 డాలర్లు ఉంటే, దారిద్ర్య రేఖకు దిగువున 12.9 శాతం (2021 నాటికి) ప్రజలు ఇప్పటికీ జీవిస్తున్నారు. మన సగటు ఆయుర్దాయం 68 ఏళ్లే. ఇక శ్రామికశక్తిలో మహిళల వాటా (37శాతం) బంగ్లాతో పోల్చితే తక్కువ. తాజా మానవాభివృద్ధి సూచికలో సైతం బంగ్లాదేశ్ కంటే (129) అయిదు పాయింట్లు (134) దిగువనే ఉన్నాం.

ఇప్పుడు మరికొన్ని దేశాలను చూద్దాం. 1970ల నాటికి సింగపూర్ పరిస్థితి దయనీయంగా ఉండేది. ప్రస్తుతం ఆ దేశ వార్షిక తలసరి జీడీపీ 88450 డాలర్లు. మలేసియా కూడా మంచి స్థితిలోనే (13310) ఉంది. థాయిలాండ్ (7810), చైనా (13140), దక్షిణ కొరియా (34165), భూటాన్ (4010), ఐర్లండ్ (106,060), డొమినికన్ రిపబ్లిక్ (11170).. ఇట్లా ప్రత్యక్ష, పరోక్ష వలస పాలన నేపథ్యం ఉన్న దేశాలను తీసుకున్నా ఎంతో ముందుకు వెళ్లిన పరిస్థితి కనపడుతుంది. ఐర్లండ్‌కు 1922లో బ్రిటన్ నుంచి స్వేచ్ఛ లభించినా 1970ల వరకూ పేద దేశంగానే ఉండేది. ఆ తర్వాత బ్రిటన్‌ను అధిగమించింది. ప్రస్తుత ఐర్లండ్ తలసరి జీడీపీతో పోల్చితే బ్రిటన్ తలసరి జీడీపీ సగం కంటే తక్కువగానే ఉంది.

అశించిన స్థాయిలో భారత్ గణనీయంగా ఆర్థికాభివృద్ధిని సాధించలేక పోవటానికి చాలా కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక అభివృద్ధిలో మనం పెట్టుకున్న లక్ష్యాలను సాధించలేదు. 1950ల నుంచి ఇప్పటి వరకూ



స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యంలో కొంత మెరుగుదల కనిపించింది. ఆ తర్వాత 1960ల నుంచి 1980ల చివరి వరకూ ఆశించిన స్థాయిలో అది పెరగలేదు. ఆర్థిక సంస్కరణల తర్వాత కొంత ఎదుగుదల కనపడినా లక్ష్యాలకు చాలా దూరంలోనే ఉండిపోయింది. క్యాపిటలిజం అంటేనే పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచటం. ఇందులో వెనుకబడిన చోట పారిశ్రామిక పురోగతి సాధ్యం కాదు. ఈ పరిస్థితిలో గణనీయ మార్పు లేకుండా వికసిత భారత్ లక్ష్యాలు నెరవేరుతాయా? అన్నది పెద్ద ప్రశ్నార్థకమే!

జీడీపీలో పారిశ్రామిక రంగం వాటా 20 శాతానికి దాటిన సందర్భాలు అరుదనే చెప్పాలి. వాటా పెరగటం కంటే తరిగిన సంవత్సరాలు కూడా ఉన్నాయి. ఇప్పుడూ ఒకప్పుడూ అగ్ర రాజ్యాలుగా ఉన్న దేశాలన్నీ పారిశ్రామిక రంగంలో గణనీయ అభివృద్ధిని సాధించిన తర్వాతే ఆ స్థాయికి చేరుకున్నాయి. 1950ల నుంచి పారిశ్రామికాభివృద్ధి పరంగా మనం సరైన గాడిలో నడిచిన సందర్భాలు చాలా తక్కువ. దీని మీద ప్రముఖ ఆర్థికవేత్త సుమిత్ కె.మజుందార్ తన 'లాస్ట్ గ్లోరీ–ఇండియాస్ క్యాపిటలిజం స్టోరీ' అన్న పుస్తకంలో మంచి విశ్లేషణే చేశారు. 2013–2014 వరకూ సుమిత్ చేసిన పరిశీలనలో ఒకటి మాత్రం స్పష్టంగా వెల్లడైంది. 1950ల నుంచి 2013–14 వరకూ అంటే 63 ఏళ్ల కాలంలో సేవల రంగమే ప్రధాన పాత్ర వహించింది. ఆ కాలం నాటి సేవల రంగం వార్షిక సగటు వాటా 48 శాతం ఉంది. ఆర్థిక సంస్కరణలతో (1991) సేవలరంగం మరింత ఊపందుకున్న మాట నిజమే. అంతకు ముందు కూడా దాని ప్రాధాన్యం తక్కువ కాదు. ఇక ఇదే కాలంలో పారిశ్రామికరంగం వార్షిక సగటు వాటా 18 శాతానికి మించలేదు. వ్యవసాయం వాటా 34 శాతం వరకూ ఉంది. 63 ఏళ్ల సగటును కాకుండా 2010 తర్వాత పరిస్థితినే తీసుకుంటే వ్యవసాయ రంగం వాటా (14శాతం) బాగా తగ్గిపోయింది. అదింకా క్షీణిస్తూనే ఉంది. దీనికి బదులు పారిశ్రామిక రంగం వాటా పెరిగిందా? అంటే అదీ లేదు. యథాప్రకారం సేవల రంగం (66శాతం) వాటానే విపరీతంగా పెరిగింది. స్పష్టంగా చెప్పుకోవాలంటే వ్యవసాయ రంగ ఆధిక్యత నుంచి సేవలరంగం ప్రాబల్యంలోకి మన ఆర్థిక వ్యవస్థ అడుగుపెట్టింది. దీర్ఘ దృష్టితో చూస్తే దేశంలో పారిశ్రామిక రంగం ఎప్పుడూ ఆధిక్యతను ప్రదర్శించ లేదు. అందుకే పారిశ్రామికాభివృద్ధికి చేదోడువాదోడుగా నిలిచే మేధోవికాసమూ మనకు అరకొరగానే జరిగింది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనదంటూ చెప్పుకోదగిన ప్రభావిత ఆవిష్కరణలూ కనపడలేదు. ఆ ఆవిష్కరణలతో సమాంతరంగా పెంపొందే శాస్త్రీయ ఆలోచనా విధానమూ సమగ్రంగా బలపడలేదు. వ్యవస్థీకృత రంగంలో కార్మికవర్గం గణనీయ శక్తిగా ఎదగలేదు. అభివృద్ధి చెందిన దేశాలన్నీ పారిశ్రామిక రంగాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచుకుని ఆర్థికంగా సుసంపన్నం అయిన తర్వాతే సేవల రంగాన్ని విస్తరించుకున్నాయి. బలమైన పారిశ్రామిక రంగం లేకుండా కేవలం సేవల రంగం ఆధిక్యతతో సుసంపన్నం అవుతామని అనుకోవటం ఇప్పటికీ ప్రశ్నార్థకమేనన్నది సుమిత్ మజుందార్ అభిప్రాయం. ఆదాయంలో భారత్ కంటే ముందున్న ఆసియా దేశాల్లో పారిశ్రామిక రంగం వాటా 40 శాతం దాకా ఉంది. ఉత్పాదక సామర్థ్యం కూడా చాలా మెరుగ్గా నమోదైంది. సాధించాలనుకున్న పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యంలో అయిదో వంతుకు కూడా భారత్ చేరుకోలేదు. అలా చేరుకుని ఉంటే మన జాతీయాదాయం ఎన్నో రెట్లు పెరిగేది. ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక రంగం వాటా అయిదింట రెండు వంతులకు చేరుకుంటే మన పరిస్థితి భిన్నంగా ఉండేది. 11.5 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థకు ఎప్పుడో చేరుకుని ఉండేవారం. చైనాకు దరిదాపుల్లో నిలిచేవాళ్లం. సామర్థ్యం లోపించిన పారిశ్రామిక రంగంతో మనం ఆర్థికంగా చేరుకోగలిగిన స్థాయిలో 20 శాతం మాత్రమే సాధించగలిగాం. అనేక అభివృద్ధి కొలమానాల్లో భారత్ పేద దేశంగా ఉండటానికి ఇదే ప్రధాన కారణం. వివిధ పార్టీలకు చెందిన ప్రభుత్వాలు పారిశ్రామికాభివృద్ధి ప్రాధాన్యత గురించి చాలానే చెప్పాయి. పంచవర్ష ప్రణాళికల లక్ష్యాల్లోనూ ఇదే కనపడింది. చివరికి 1991 నాటి ఆర్థిక సంస్కరణల ప్రధాన లక్ష్యమూ ఘనమైన పారిశ్రామికాభివృద్ధిని సాధించటమే. ఆత్మనిర్భర్–మేకిన్ ఇండియా ప్రకటనల పరమార్థమూ అదే! ఇక ఉద్యోగ కల్పనలో వ్యవస్థీకృత పారిశ్రామిక రంగం వాటా చాలా తక్కువ. 2015 నాటికి ఒక శాతం జనాభానే ఈ రంగంలో ఉపాధిని పొందుతున్నారు. చిన్నాపెద్దా అన్నీ కలిపి మొత్తంగా తయారీ రంగాన్ని తీసుకున్నా 13 మిలియన్ల మంది మాత్రమే అందులో ఉన్నారు.



■ రాహుల్ కుమార్

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యంలో కొంత మెరుగుదల కనిపించింది. కానీ ఆ తర్వాత 1960ల నుంచి 1980ల చివరి వరకూ ఆశించిన స్థాయిలో అది పెరగలేదు. ఆర్థిక సంస్కరణల తర్వాత కొంత ఎదుగుదల కనపడినా లక్ష్యాలకు చాలా దూరంలోనే ఉండిపోయింది. క్యాపిటలిజం అంటేనే పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచటం. ఇందులో వెనుకబడిన చోట పారిశ్రామిక పురోగతి సాధ్యం కాదు. ఈ పరిస్థితిలో గణనీయ మార్పు లేకుండా వికసిత భారత్ లక్ష్యాలు నెరవేరుతాయా? అన్నది పెద్ద ప్రశ్నార్థకమే!

గరిష్ఠ లాభాల కోసమే వెంపర్లాడే ప్రైవేటు రంగం విశాల దృష్టితో జాతీయ అభివృద్ధికి తోడ్పడే రీతిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం, కుల–మత రాగద్వేషాలకు అతీతంగా సమర్థతకు పెద్దపీట వేస్తూ సంస్థల నిర్వహణకు పూనుకుంటూనే 'మేక్ ఇన్ ఇండియా' అనేది ఎంతో కొంత వాస్తవరూపం దాల్చుతుంది. గత అనుభవాలనూ, మన ప్రైవేటు రంగం స్వభావాన్నీ దృష్టిలో ఉంచుకుని ఇదంత తేలికగా సాకారమయ్యే పరిస్థితి లేదని సుమిత్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యానంతో ఏకీభవించకపోయినా ఆయన వ్యక్తంచేసిన సందేహాన్ని తేలికగా కొట్టిపారేయలేం. సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, నూతన ఆవిష్కరణల జోలికి వెళ్లకుండా, అమ్మకాలు–కొనుగోలు లావాదేవీలతో లాభాలు గడించాలన్న లక్షణం భారత వ్యాపారవర్గానికి వారసత్వంగా రావటం వల్ల కూడా పారిశ్రామిక రంగంలో పురోగతి సాధించలేకపోయామని సుమిత్ పేర్కొన్నారు. ఇక రాజకీయ వర్గంతో పాటు అధికారవర్గమూ ఆశ్రిత పెట్టుబడిదారులకు అండదండలు అందించింది. దీంతో పోటీ తత్వం దెబ్బతిని పారిశ్రామిక ఉత్పాదక సామర్థ్యాన్ని పెరగనీయకుండా చేసింది. పరిశ్రమల ప్రారంభానికి కఠినమైన రీతిలో లైసెన్స్, పర్మిట్ వ్యవస్థను అమలుపరచటం, ఉత్పత్తులకు కోటాలను ప్రభుత్వమే కఠోరంగా నిర్ణయించటంతో 1991కు ముందు పారిశ్రామిక రంగంలో నిజమైన పోటీలేకుండా చేసింది. ఆర్థిక సంస్కరణల అనంతరం ఆ పరిస్థితిలో కొంత మార్పు వచ్చినా ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి అనుచిత లబ్ధిని పొందటం ఇంకా సాగుతూనే ఉంది.

75 ఏళ్ల చరిత్రను చూస్తే వికసిత భారత్ సాకారం కావటం అనేక సవాళ్లతో కూడినదిగా స్పష్టమవుతుంది. ఉత్పాదక సామర్థ్యానికి అడ్డుగా నిలుస్తున్న ఎన్నో జాడ్యాలను వదిలించుకోవాలి. పారిశ్రామిక, సమాచార సాంకేతిక విజ్ఞానంలో సొంతముద్రను వేయగలగాలి. గతమంతా ఘనమనుకునే సంకుచిత ధోరణికి స్వస్తిపలకాలి. బహుళ సంస్కృతుల సమాజాన్ని నిత్యం భయపెట్టే ఉన్మాద రాజకీయాలకు వీడ్కోలు చెప్పాలి.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

ఒక శాంతిదూత కరువైనప్పుడు...

పాలస్తీనా అనగానే ఒకప్పుడు యాసర్ అరాఫత్ గుర్తుకు వచ్చేవారు. బహుశా ప్రపంచ రాజకీయాల స్థితిగతులేం పట్టని ఇప్పటి తరానికి మాత్రం ఆయనెవరో ప్రత్యేకంగా చెప్పాల్సి ఉంటుంది. ఆయన డెబ్బై, ఎనభై దశకాలలో ఐక్యరాజ్యసమితి వేదికలపై తరచు కనపడేవారు. ప్రపంచ రాజకీయాలను శాసిస్తున్న అమెరికా, నాటి సోవియట్ యూనియన్‌లతోపాటు ఏ సైనిక కూటమికీ చెందక 'అలీన దేశాల ఉద్యమా'నికి నాయకత్వం వహించిన ఇండియాకూ తరచు పర్యటనలు చేసేవారు. పాలస్తీనా దేశం పట్ల, పాలస్తీనీయుల పట్ల గౌరవం, గుర్తింపు, ఆర్థిక తోడ్పాటు కోసం విజ్ఞప్తి చేసేవారు. తమ భూభాగంలో భాగం పంచుకుని తమపై ఆధిపత్యం చేస్తున్న ఇజ్రాయెల్ నాయకత్వం చూపుతున్న జాతి వైరం, వివక్షలు, దాడులను వివరిస్తూ ప్రపంచ దేశాల నాయకులను సందర్శించేవారు. నాటి పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎస్ఓ) నాయకుడి పేరు నేడు అరవై ఏళ్లు దాటిన వారికి సుపరిచితమే. ఆ కాలంలో పాలస్తీనా ఇప్పటి నరమేధంతో గాక కాస్తో కూస్తో ప్రశాంతంగా ఉండింది. కాని నేడు అమెరికా నాటో సైనిక కూటమి ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో అందరూ యాసర్ అరాఫత్ నాయకత్వాన్ని, అతను పాలస్తీనా ప్రజలకు సాధించిన శాంతిని మర్చిపోయారు.

వందల ఏళ్ళుగా పాలస్తీనీయుల దేశంగా పరిగణన పొందిన భూభాగంలోనే ఇజ్రాయెల్‌కు భాగం పంచి ఇచ్చిన అగ్ర రాజ్యాలు నేడు పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ ఏదో కారణంతో హింసాత్మకంగా జియోనిస్టు జాతి వైరాన్ని రుద్దుతుంటే నోరు మెదపక ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయి. వెస్ట్ బాంక్ నుంచి పడమరకు మధ్యధరా సముద్రం మధ్య ఒకప్పటి పాలస్తీనా భూభాగం ఇపుడు ఇజ్రాయెల్ అధీనంలో ఉన్నది. మధ్యధరా సముద్రపు తూర్పు తీరంలో సుమారు 60కిమీ పొడవున, 10కిమీ వెడల్పుతో ఉండే పట్టీ వంటి ప్రాంతంలో 25 లక్షల మంది పాలస్తీనీయులు నివసిస్తున్నారు. ఈ గాజా పట్టీలో మొత్తం పాలన ఇజ్రాయెల్‌దే. ఇక్కడ ఇజ్రాయెల్ సైనికులు అత్యాధునిక ఆయుధాలతో నిత్యం పాలస్తీనీయులపై ఆధిపత్య హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. ఈ పట్టీలో ఇజ్రాయెల్ సైనికుల దాడులకు అంతర్జాతీయ జర్నలిస్టులు కూడా బలయ్యారు.



నేడు అమెరికా నాటో సైనిక కూటమి ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో అందరూ యాసర్ అరాఫత్ నాయకత్వాన్ని, అతను పాలస్తీనా ప్రజలకు సాధించిన శాంతిని మర్చిపోయారు. పాలస్తీనీయుల కోసం అంతర్జాతీయ దౌత్యపరమైన మద్దతు సమీకరించగలిగే అరాఫత్ వంటి నాయకుడి అవసరాన్ని హమాస్ గుర్తించలేకపోవడమే నేడు పాలస్తీనీయులకు శాపమైంది.

పీఎల్ఓ నాయకుడు యాసర్ అరాఫత్ నాయకత్వం తొంభైల దశకంలో ముగిసిన తర్వాత పాలస్తీనా యువ తరం నుంచి హమాస్ అనే సాయుధ దళాల పోరాట సంస్థ పాలస్తీనీయుల రక్షణ బాధ్యతను తీసుకున్నది. ఇజ్రాయెల్‌పై సంఘర్షణలో హమాస్‌కు దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా తీవ్రవాదులు సహకారం అందిస్తున్నారు. తమ దక్షిణ లెబనాన్ స్థావరాల నుండి వారూ, గాజా పట్టీలోని తమ స్థావరాల నుండి హమాస్ దళాలూ కలిసి ఇజ్రాయెల్ ప్రజలు అధికంగా ఉన్న భూభాగం పైకి అప్పుడప్పుడు క్షిపణులు ప్రయోగిస్తూంటారు. ఈ సంస్థలు క్షిపణులు ప్రయోగించినపుడల్లా ఇజ్రాయెల్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గాజా పట్టీ నివాసాలపై బాంబుల వర్షం కురిపించి పదుల సంఖ్యలో పాలస్తీనీయులను హత్య చేయడం గత పదేళ్ల కాలంలో జరుగుతూనే ఉంది. ఇజ్రాయెల్ సైనిక దళాలు గాజాలో నిత్యం సృష్టిస్తున్న రక్తపాతానికి, నిత్య ఆంక్షల వేధింపులకు విసిగిన గాజా పట్టీ యువకులు హమాస్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ గాజా దక్షిణ హద్దులో ఇజ్రాయెల్ సైనికుల రక్షణను దాటుకుని ఒక గ్రామం చేసిన దాడిలో కొందరిని చంపి మరికొందరు ఇజ్రాయెలీ పౌరులను ఎత్తుకుపోయారు. దీంతో ఇజ్రాయెల్ తమ పౌరుల విడుదల పేరుతోనూ, హమాస్‌ను నిర్మూలించే పేరుతోనూ గాజా పట్టీలో నరమేధం మొదలుపెట్టింది. దాదాపు యాభై వేల మంది అమాయక పాలస్తీనీయుల ప్రాణాలను బలిగొన్నది.

పాలస్తీనీయులపై తొమ్మిది నెలలగా సాగుతున్న ఏకపక్ష మారణకాండపై అంతర్జాతీయ శాంతి సంఘాలు, శాంతి కాముక దేశాల వైఖరి కూడా ప్రశ్నార్థకంగానే ఉన్నది. అంతర్జాతీయ శాంతి, సహకారం, సహజీవన సూత్రాలను ప్రచారం చేయడంలో ఐక్యరాజ్యసమితి పూర్తిగా వెనకబడింది. భద్రతా సమితి తీర్మానాలను అమెరికా వీటోతో అడ్డుకుంటున్న పరిస్థితులలో ఐక్యరాజ్యసమితి నాయకత్వం ప్రపంచ దేశాలలో ఏ కూటమికీ చెందని అంతర్జాతీయ నాయకులను రంగంలోకి దించక తప్పదు. పాలస్తీనీయుల శాంతి, సౌభాగ్యాల కోసం యాసర్ అరాఫత్ చేసిన కృషిని నేటి ఐక్యరాజ్యసమితి వేదికలు మరొక్కసారి ప్రపంచానికి గుర్తు చేయాలి.

యాసర్ అరాఫత్ పాలస్తీనీయుల ప్రశాంత జీవనం కోసం చేసిన కృషిని గాజా పట్టీ హమాస్ తరఫున పనిచేస్తున్న సాయుధ దళాల నాయకులు పరిగణనలోకి తీసుకోవాలి. అంతర్జాతీయ స్థాయి శాంతిదూతలు కరువైపోయిన నేటి ప్రపంచంలో, ఒకపక్క పాలస్తీనీయుల రక్తపుటేరులను చూస్తూ కూడా మరోపక్క యుద్ధ పిపాసులూ ఆయుధ బేహారులైన అగ్ర రాజ్యాలతో సొంత ప్రయోజన ఒప్పందాలు చేసుకుంటున్న అరేబియా దేశాలు, ఇతర ప్రపంచ దేశాల నిర్లిప్తత నైతికంగా నేరపూరితం! అగ్ర దేశాల ఆయుధ కంపెనీల ఆయుధ ఉత్పత్తి, వ్యాపారం, లాభార్జన నిరాటంకంగా సాగడానికి ఈ దేశాలు ఇజ్రాయెల్ మారణకాండకు పరోక్ష మద్దతు ఇస్తున్నాయి. ఇండియాతో సహా అన్ని అగ్రదేశాలూ ఇజ్రాయెల్‌కు సైనిక, ఆర్థిక సహాయాలు అందిస్తున్నాయి. పరోక్షంగా నరమేధంతో పాలుపంచుకుంటూ రక్తపు కూడు తింటున్నాయి.

హమాస్ అనే సాయుధ సంస్థ తన కీలక దాడి ఫలితంగా లక్షలమంది పాలస్తీనీయులు బలవుతారని ఊహించిందా? ఇజ్రాయెల్‌కు లభిస్తున్న అమెరికా, నాటో కూటమి దేశాల మద్దతు గురించి ఆలోచన చేసిందా? కనీసం ఇజ్రాయెల్ అంటే నలభై ఏళ్ల క్రితం మండిపడిన అరేబియా దేశాల నాయకులు కొందరు నేడు నేరుగా ఇజ్రాయెల్‌తోనే ఒప్పందం చేసుకుంటున్న పరిస్థితిని హమాస్ పరిగణనలోకి తీసుకుందా? ఈ ప్రశ్నలకు జవాబులు ఏమైనా గానీ– పాలస్తీనీయుల కోసం అంతర్జాతీయ దౌత్యపరమైన మద్దతు సమీకరించగలిగే యాసర్ అరాఫత్ వంటి నాయకుడి అవసరాన్ని హమాస్ గుర్తించలేకపోవడమే నేడు పాలస్తీనీయులకు శాపమైంది.

● కిన్నెర

ప్రభుత్వ పాఠశాలల్లో టాబ్‌ల పంపిణీ నిలిపివేయాలి

డిజిటల్ విద్యను మెరుగుపరచడానికి, డిజిటల్ అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి గత ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు టాబ్‌ల పంపిణీని ప్రారంభించింది. ఈ నిర్ణయం విపరీత ధోరణులకు దారి తీసింది. ఈ పరికరాల దుర్వినియోగానికి సంబంధించి తల్లిదండ్రులలో ఆందోళనలు పెరిగాయి. చాలా మంది విద్యార్థులు వాటిలో గేమ్‌లు, ఇతర నాన్–ఎడ్యుకేషనల్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ఇది విద్యార్థులను వారి చదువుల నుంచి దృష్టి మరల్చడంతో పాటు, ఉపాధ్యాయులకు కూడా సమస్యలను తెచ్చిపెడుతోంది. సాంప్రదాయ పాఠ్యపుస్తక పఠనం పాఠశాల పిల్లలకు ప్రాథమిక భావనలను గ్రహించడానికి అత్యంత ప్రభావవంతమైన పద్ధతుల్లో ఒకటి. ఇంటర్నెట్ విలువైన సూచన సాధనంగా ఉపయోగపడుతుంది, అయితే టాబ్‌ల అనియంత్రిత ఉపయోగం విద్యాపరమైన పురోగతికి సహాయపడకుండా అడ్డుకోవచ్చు. కొవిడ్ మహమ్మారి సమయంలో, విద్యార్థులు ఆన్‌లైన్ తరగతుల కోసం మొబైల్ పరికరాలపై ఎక్కువగా ఆధారపడ్డారు, దీని వల్ల స్క్రీన్ సమయం పెరిగింది, దాంతో వారికి ఈ పరికరం ఒక వ్యసనంగా మారింది. టాబ్‌ల మితిమీరిన వినియోగంతో కంటిపై ఒత్తిడి, నిద్రకు అంతరాయంతో పాటు శారీరక శ్రమను తగ్గించడంతో వివిధ ఆరోగ్య, మానసిక సమస్యలకు దారి తీస్తోంది. స్క్రీన్‌లకు అతుక్కుపోవడం వల్ల విద్యార్థుల దృష్టి మళ్లి వారి అభ్యాస ప్రక్రియ మరింత క్లిష్టతరం అయిందని పలు రిపోర్టులు చెబుతున్నాయి. ఈ ఆందోళనల దృష్ట్యా, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు టాబ్‌ల పంపిణీని పునః పరిశీలించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభ్యర్థిస్తున్నారు. బదులుగా, వివిధ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉన్న ఉచిత విద్యా వనరులను ప్రచారం చేయడంపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

– బి.సురేష్, అరసవల్లి, శ్రీకాకుళం జిల్లా

నవజీవన ప్రతిభామూర్తి రాంషా

రాంషా! ఈ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది 'అభిసారిక' పత్రిక. దాని ప్రచురణకర్తగా, సంపాదకునిగా, పాఠకుల సెక్సు సమస్యలకు, సందేహాలకు ఆత్మీయ పరిష్కారాలు, సలహాలు సూచించే ఒక పెద్ద దిక్కు జ్ఞప్తికొస్తుంది. ఇంకా ముందు తరం వారిలో ఒక వర్గానికి కమ్యూనిస్టు, కమ్యూనిస్టు రచయిత కనిపిస్తాడు. మరో వర్గానికి అభ్యుదయ కవి, నాటకకర్త, సాహితీ విమర్శకుడు కనిపిస్తే, కొందరికి ప్రతిభావంతుడైన కథా, నవలా రచయిత గోచరమవుతాడు. మరికొందరికి ముద్రాపకుడు! ఇవన్నీ కలగలసిన విశేష వ్యక్తిత్వమే రాంషా!


'రాంషా' అసలు పేరు దర్భా వేంకటరామశాస్త్రి. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట సమీపంలోని వేట్లపాలెంలో 1924 జూలై 30న జన్మించారు. తండ్రి వేంకటరమణయ్య ఇంజనీరు. తల్లి వెంకటలక్ష్మి. కాకినాడ పిఠాపురం రాజా వారి కాలేజీలో ఎఫ్.ఎ. (నేటి ఇంటర్మీడియెట్) చదివే రోజుల్లోనే తొలి రచన 'శిలాప్రతిమ' నాటికతో పేరు తెచ్చుకుని, 1948లో చోడవరం అఖిలాంధ్ర కవిపండిత పరిషత్తు నుంచి తొలి సన్మానం పొందారు. వేంకటరామశాస్త్రికి 'రాంషా' అనే లేఖినీ నామం ప్రదానం చేసినది ఆ కళాశాల అధ్యాపకులైన సాహితీమూర్తి 'కళాప్రపూర్ణ' నిడదవోలు వెంకటరావు.

రాంషా విద్యార్థి జీవితంలోనే ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య గ్రంథాలెన్నో విస్తృతంగా చదివారు. ప్రముఖ ఇంగ్లీషు నాటకకర్త బెర్నార్డ్ షా సాహిత్యంతో పాటు, షేక్స్పియర్, వర్డ్స్‌వర్త్, మిల్టన్, కీట్స్, షెల్లీ, ఫ్రాస్ట్ తదితర మహాకవుల కవిత్వం ఆకళింపు చేసుకున్నారు. ఇటు కార్ల్ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ వంటి వారి సోషలిస్టు సైద్ధాంతిక సాహిత్యంతో పాటు టాల్‌స్టాయ్, గోర్కీ, తుర్గనెవ్, చెహోవ్ వంటి రష్యన్ మహారచయితల అజరామర సాహిత్యాన్ని విస్తృతంగా చదివారు.

ప్రముఖ భావకవితా ప్రసారకులైన దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి, 'గౌతమీకోకిల' వేదుల సత్యనారాయణశాస్త్రి వంటి కవిదిగ్గజాల సాంగత్య, ప్రోద్బలాలతో రాంషా తన సృజనాత్మక కృషికి వన్నెలు దిద్దుకుంటూ బహుముఖ ప్రతిభావంతుడైన సాహిత్యవేత్తగా ఎదిగారు.

తుర్గనేవ్ రాసిన చిన్న కథను ఆధారం చేసుకుని అల్లిన నవల – 'కామేశ్వరి కథ' 1948లో ప్రచురితమై ఎన్నో ప్రశంసలనందుకుంది. లక్ష కాపీల వరకు ముద్రితమయింది. చరిత్రహీనుల, బాధోపహతుల జీవితాల్ని చిత్రించిన రాంషా కథలెన్నో ఆనందవాణి, అభ్యుదయ, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, జ్యోతి, అభిసారిక పత్రికలలో ప్రచురితమైనాయి. గాంధీజీ పెట్టిన భిక్ష, ఎర్రజెండా, మత్తానయ్య మరణం, ఆడవాళ్ళ సంత, కిర్రు చెప్పులు, కారుణ్యం మొదలైన కథలు రాంషా మార్కు కథాకథన శిల్పానికి, వస్తు వైవిధ్యానికి, శైలీ విన్యాసానికి నిదర్శనాలుగా నిలుస్తాయి. అవి అభ్యుదయ భావ ప్రేరితాలై, సామాజిక స్పృహ గల ఇతివృత్తాలు గలవి. పాఠకుల హృదయాలలో సుస్థిరంగా నిలిచిపోతాయి. తదుపరి కాలంలో అవి 'మనస్తత్వాలు', 'పెళ్ళి తిరకాసు', 'మీనాక్షి ముద్దు', 'ప్రియురాలు' అనే కథాసంపుటాలలో చేరినై. 'లక్ష్మీంపతిగారమ్మాయిలు' అనే నాటకం కన్యాశుల్కం తరువాత చెప్పుకోదగ్గ నాటకంగా నాటి సమీక్షకులు పేర్కొన్నారు. కథారచనా లక్షణాన్ని నిర్దేశిస్తూ, 'కళలు–కథలు' అనే విమర్శ వ్యాసాలు; అలాగే నవల, నాటకం, కావ్యం, విమర్శ మొదలైన సాహిత్య ప్రక్రియల మీద కూడా ప్రామాణిక వ్యాసాలు రచించారు రాంషా. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పరిస్థితులకు రాంషా కలం రుళిపించారు. సోమసుందర్, శశాంక మొదలైన కవి మిత్రులతో చేయి చేయి కలిపి, కమ్యూనిస్టు కార్యకర్తగా శంఖం పూరించారు (1944–1955).

పత్రిక ద్వారానూ, ప్రత్యక్షంగానూ ఎన్నో లైంగిక, వ్యక్తిగత, సాంసారిక సమస్యలు పరిష్కరించి, ఎందరి జీవితాలకో వెలుగు నిచ్చి, ఎన్ని కుటుంబాలనో నిలబెట్టి, ఎంతో విజ్ఞానం వెదజల్లిన రాంషా ఒక వ్యక్తి కాదు, ఒక మహా వ్యవస్థ. ఎందరికో నూతన శక్తినీ, దుఃఖ విముక్తినీ ప్రసాదించిన గొప్ప వ్యక్తి. ఫ్రాయిడ్, ఆడ్లర్, జంగ్, హేవలాక్ ఎల్లిస్ మొదలైన మహామహుల విజ్ఞానాన్ని తెలుగు పాఠక ప్రపంచానికి విస్తృతంగా పంచిపెట్టిన విజ్ఞానఖని రాంషా (1924–1990). ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన 'ఆంధ్రా హేవలాక్ ఎల్లిస్'!



ప్రజాచైతన్యం ప్రజ్వలింపజేయడానికి 'కళాకేళి – ధర్మ సంగ్రామ కేళి' నినాదంతో "కళాకేళి ప్రచురణలు" నెలకొల్పారు. సామ్యవాద ఉద్యమ ప్రతిధ్వనులైన ఆరుద్ర 'త్వమేవాహం', సోమసుందర్ 'వజ్రాయుధం' అగ్రశ్రేణి అభ్యుదయ కావ్యాలకి రాంషా సముచిత ప్రకాశికలు రాసి ప్రచురించి, వాటికి అద్వితీయ ప్రాచుర్యం కల్పించారు. మంచీ–మనిషి, బానిసల దేశం, రోదసి వంటి గ్రంథాలకు అమూల్యమైన పీఠికలు రాశారు.

కళాకేళి ద్వారా శశాంక 'నయాజమానా'; తన 'అనంతం', కామేశ్వరి కథ, దయ్యం పట్టిన మనిషి, మనస్తత్వాలు, కళలు–కథలు; సోమసుందర్ 'కాహళి', 'గోదావరి జలప్రళయం', 'రక్తాక్షి'; పూభా 'సంజదీపం', చిన్నా 'కుళ్ళుసరుకు', 'శిథిలాలయం'; జోగిరాజు 'అనామకులు'; ఈరంకి 'అప్పగింత' – మొదలైన అనేక సంపుటాలు ప్రకటించి, అభ్యుదయ సాహిత్య చరిత్రలోనే ఒక ఉజ్వల ఘట్టానికి నాందీవాచకం పలికారు రాంషా. మిత్రుడు సోమసుందర్‌తో కలిసి 'దండోరా' సాంస్కృతిక పక్షపత్రికను నడిపారు.

ఉద్యమకాలంలో ప్రభుత్వం 'వజ్రాయుధం' కావ్యాన్ని నిషేధించి, పుస్తకాల్ని జప్తుచేసి, ప్రచురణకర్త రాంషా మీద, ముద్రాపకుల మీద కేసులు పెట్టింది.

తీవ్ర నిర్బంధ విధానంలో అభ్యుదయవాదులైన సాహిత్యకారులు, కళాకారులు చెల్లాచెదరైనారు. ఆ దుర్భర పరిస్థితులలో రాంషా కూడా నిలదొక్కుకోడానికి అనేక కష్టనష్టాల నెదుర్కొన్నారు. అలాంటి సమయంలో ఆప్తమిత్రుడు ధనికొండ హనుమంతరావు కొంతకాలం నడిపి ఆపివేసిన తన 'అభిసారిక' పత్రికను రాంషాకి అందించారు. ఆ విధంగా అభిసారిక పత్రికను స్వీకరించి మరో కొత్త జీవిత అధ్యాయానికి తెరతీసారు రాంషా (1960).

రాంషా నేతృత్వంలో 'అభిసారిక' లైంగిక విజ్ఞాన మాసపత్రిక అచిరకాలంలోనే అసంఖ్యాక పాఠకుల మన్ననలు పొంది, బహుళ ప్రచారంలోకి వచ్చింది. మూఢవిశ్వాసాలు, ఛాందస భావాలతో, అజ్ఞానంలో, అంధకారంలో అల్లాడుతున్న అనేక మంది తెలుగు పాఠకులకు అది వేగుచుక్కగా రూపొందింది. అభిసారిక పత్రిక ద్వారా శాస్త్రీయంగా 'సెక్సు విజ్ఞానాన్ని' పాఠకుల కందజేస్తూ, ఆత్మవిశ్వాసం కోల్పోయి, అనేక మానసిక రుగ్మతలకు లోనై, అశాంతితో, అపోహలతో, సమస్యలతో, సంతాపాలతో సతమతమవుతున్న అసంఖ్యాక వ్యక్తులకు ఆశనీ, ఆత్మస్థైర్యాన్నీ కల్పించి, ఓదార్పునీ, నైతిక బలాన్నీ, నవజీవనాన్నీ ప్రోదిచేసి, వారిని తీర్చిదిద్దే మహోద్యమంలో రాంషా అమోఘ కృషి చేసి, విజయం సాధించారు.

అభిసారిక సంపాదకుడిగా కూడా రాంషా సాహిత్యాన్ని విడనాడలేదు. వారం వారం కవి సమ్మేళనాలు నిర్వహించడం, నాటక వార్షికోత్సవాలలో న్యాయనిర్ణేతగా పాల్గొనడం, కళాకారులను సత్కరించడం వంటివి కొనసాగించడంతో పాటు, అభిసారికలో చా.సో., సోమసుందర్, ధనికొండ హనుమంతరావు, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, మాల్యశ్రీ, ఇచ్ఛాపురపు రామచంద్రం, ఉషశ్రీ, మిరియాల రామకృష్ణ, కర్రా చంద్రశేఖర శాస్త్రి, నాగభైరవ కోటేశ్వరరావు, కొండపల్లి కోటేశ్వరమ్మ, అడవికొలను పార్వతి, డా. రాజారాం, బి.యస్. చౌదరి, యస్. హనుమంతరెడ్డి, బి.పి. కరుణాకర్, దేవీరమ, యామిని తదితరుల కథలు, కవితలు; అలాగే జె.యస్. రాజు, వీరిశెట్టి అచ్యుతరావు, జెట్టి కిరీటి, ఎ. శంకరరావు, బి. శశి, వై. బాలయ్య గోలి నాగేశ్వరరావు వంటి చిత్రకారుల రేఖా, వర్ణ చిత్రాలనూ ప్రచురించారు.

నూతన సాంకేతికత పట్ల కూడా రాంషాకు మక్కువ. అధునాతన బ్లాక్ మేకింగ్ యంత్రాలు, చెకోస్లోవేకియా నుంచి దిగుమతి చేసుకున్న ప్రింటింగ్ ప్రెస్సు, తదుపరి కాలంలో తొలి తరం పెర్సనల్ కంప్యూటరు, గోదావరి జిల్లాల తొలి డి.టి.పి., వెబ్ ఆఫ్‌సెట్ యంత్రాలు మొదలైనవి మారుమూల సామర్లకోటలో నెలకొల్పటం రాంషా సాంకేతిక కాలజ్ఞతకు ఉదాహరణలు.

రాంషా జీవితంలోనే కాక, పత్రికావ్యాసంగంలోనూ విడదీయరాని భాగస్వామి ఆయన భార్య శిరీష. ఈమె అభిసారిక నిర్వహణలోనే కాక స్వయంగా కొంతకాలం పాటు 'జీవితం' పత్రిక నిర్వహించారు. వీరికి ఇద్దరు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు, 9 మంది మనుమలు, 8 మంది మునిమనుమలు. పెద్ద కుమారుడు డా. పూషా సెక్సాలజిస్టుగా స్థిరపడి, అభిసారికను మరొక 30 సంవత్సరాల పాటు నిర్వహించారు; చిన్న కుమారుడు అప్పాజీ అంబరీష యూనీకోడ్ తెలుగు ఫాంట్సు రూపకర్తగా, సినీ నటుడుగా పేరు తెచ్చుకున్నారు. కుమార్తెలు విద్యారంగంలో ఉన్నత స్థానాలలో ఉన్నారు.

పత్రిక ద్వారానూ, ప్రత్యక్షంగానూ ఎన్నో లైంగిక, వ్యక్తిగత, సాంసారిక సమస్యలు పరిష్కరించి, ఎందరి జీవితాలకో వెలుగు నిచ్చి, ఎన్ని కుటుంబాలనో నిలబెట్టి, ఎంతో విజ్ఞానం వెదజల్లిన రాంషా ఒక వ్యక్తి కాదు, ఒక మహా వ్యవస్థ! ఎందరికో నూతన శక్తినీ, దుఃఖ విముక్తినీ ప్రసాదించిన గొప్ప వ్యక్తి! ఫ్రాయిడ్, ఆడ్లర్, జంగ్, హేవలాక్ ఎల్లిస్ మొదలైన మహామహుల విజ్ఞానాన్ని తెలుగు పాఠక ప్రపంచానికి విస్తృతంగా పంచిపెట్టిన ప్రతిభామూర్తి రాంషా. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన 'ఆంధ్రా హేవలాక్ ఎల్లిస్'!

రాంషా శతజయంతిని పురస్కరించుకుని కాకినాడ ఎస్ఎంఎస్ రోటరీ సర్వీస్ సెంటరులో 30 జూలై 2024 సాయంత్రం 4.00 నుంచి 7.30 వరకు శతజయంతి సభ జరుగుతుంది. ఈ సందర్భంగా సాహిత్యరంగం నుంచి బహుముఖ ప్రజ్ఞాశీలి మాకినీడి సూర్యభాస్కర్ (కాకినాడ)ను, సెక్సు విజ్ఞాన రంగం నుంచి 'కౌన్సిల్ ఆఫ్ సెక్స్ ఎడ్యుకేషన్' జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ జి. వెంకటరమణ (హైదరాబాద్)ను రాంషా స్మృతిలో సత్కరిస్తున్నాం. రాంషా సాహిత్యంలోని కావ్య, కథా, నాటక, విమర్శ, వైజ్ఞానిక కోణాలను ప్రతిబింబించే 5 సంపుటాల ఆవిష్కరణ జరుగుతుంది.

■ డా. పూషా దర్భా
■ అప్పాజీ అంబరీష దర్భా

(నేడు రాంషా శతజయంతి)

ముగ్గురు మాయగాళ్లు!



రైల్వేలో అక్రమ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఏడాదిన్నరగా బెజవాడ రైల్వేస్టేషన్‌ను ఆసరాగా చేసుకుని మాఫియా రెచ్చిపోతోంది. రైల్వే ఆదాయానికి గండి కొడుతోంది. తమకు లైసెన్స్ ఉందని నమ్మించి రైళ్లలో ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్ - యాక్సెసరీస్ అమ్ముకునే వారి నుంచి ఓ ప్రైవేటు బ్యాచ్ లక్షలు ఆర్జిస్తోంది. ఇలా ఏడాదికి రూ.కోటికిపైగానే రైల్వేకు కుచ్చుటోపీ పెడుతోంది. ఈ వ్యవహారంలో రైల్వే అధికారుల హస్తం కూడా ఉంది. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీలలో కూడా కొందరు ఈ మాఫియాకు సహకరించటంతో ఏడాదిన్నరగా ఈ అక్రమం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

రైల్వే ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులు

- లైసెన్స్ లేకుండా వసూళ్లు
- స్టేషన్‌లో ఆగి ఉన్న రైళ్లలో గాడ్జెట్స్ అమ్ముకునే వారి నుంచి పిండేస్తున్న వైనం
- ఏడాదికి రూ.2 కోట్లకుపైనే దోపిడీ
- టెండర్లు పిలవకుండా దందా
- రైల్వే అధికారుల హస్తం లేకుండా అసాధ్యం

పేర్లతో సహా వెల్లడించిన గాడ్జెట్స్ సేల్స్ బాయ్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వేస్టేషన్ కేంద్రంగా ఆగి ఉన్న రైళ్లలో ప్రయాణికులకు ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్ - యాక్సెసరీస్ అమ్ముకోవటానికి పూర్వం పనిచేసిన కమర్షియల్ బాస్ ఒకరు అనుమతి ఇచ్చారు. అప్పట్లో అధికారికంగానే ఇచ్చారు. ఏడాదిన్నర కిందటే దాని గడువు అయిపోయింది. రైల్వే అధికారులు ఎలాంటి టెండర్లూ పిలవలేదు. కానీ, తమకు లైసెన్స్ ఉందన్న పేరుతో ఓ ప్రైవేటు మాఫియా తమ గుప్పెట్లోకి తీసుకుంది. గతంలో అనుమతులు పొందిన సంస్థ పరిధిలో గ్యాడ్జెట్స్, యాక్సెసరీస్ అమ్ముకునేవారికి తాము లైసెన్స్ తెచ్చుకున్నామని చెప్పి వారి నుంచి గతంలో కట్టించుకున్న విధంగా అనధికారికంగా డబ్బులు వసూలు చేయటం ప్రారంభించారు. ఈ తంతు ఏడాదిన్నరగా సాగుతోంది. దీనిపై ఆంధ్రజ్యోతి బృందం పరిశీలనలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.



ఏడాదికి రూ.2కోట్ల దోపిడీ

రైల్వేస్టేషన్ కేంద్రంగా 150 మందికిపైగా గ్యాడ్జెట్స్ - యాక్సెసరీస్ విక్రయించేవారు ఉన్నారు. వీరంతా ప్రైవేటు వ్యక్తులకు రోజు వారీగా డబ్బులు చెల్లిస్తున్నారు. కొంతమంది నెలవారీగా కూడా డబ్బులు చెల్లిస్తున్నారు. రోజుకు కనిష్ఠంగా రూ.250 చొప్పున ప్రైవేటు మాఫియాకు కట్టాలి. ఇంకా ఎక్కువ మొత్తంలో కట్టే వారు కూడా ఉన్నారు. రోజుకు 150 మంది చెల్లించే మొత్తం రూ.37,500. అంటే నెలకు రూ.11,25,000. అదే ఏడాదికి మొత్తం రూ.1.35 కోట్లు. ఏడాదిన్నగా సాగిస్తుండటం వల్ల దాదాపుగా ఇప్పటి వరకు రూ.2 కోట్ల పైమాటే ప్రైవేటు మాఫియా పిండేసింది.

విచారణ చేపడితేనే అక్రమాలు వెలుగులోకి..

రైల్వేను అడ్డం పెట్టుకుని ప్రైవేటు మాఫియా సంస్థ ఆదాయాన్ని కొల్లగొడుతుంటే.. రైల్వే అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ వ్యవహారంపై గతంలో కూడా రైల్వేస్టేషన్ అధికారులకు ఫిర్యాదులు వచ్చినా.. పై అధికారుల దృష్టికి వెళ్లకుండా జాగ్రత్త పడ్డారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణం రంగంలోకి దిగి సమగ్ర విచారణ చేపడితే అక్రమార్కులు బయటికొస్తారు.

● ముగ్గురు కలిసి మాఫియా

రైల్వేలో గ్యాడ్జెట్స్ - యాక్సెసరీస్ విక్రయించేవారితో లైసెన్స్ పేరుతో డబ్బులు కట్టించుకుంటున్నారు. చాలా మందికి లైసెన్స్ ఉన్న విషయం తెలియదు. రైళ్లలో అవి మ్మినా, అమ్ముకోకపోయినా మాఫియాకు డబ్బులు కట్టాల్సిందే. జ్వరం వచ్చి రాలేకపోయినా వారికి సంబంధం ఉండదు. ఒక్కసారి వారి దగ్గర పేరు రిజిస్టర్ అయితే డబ్బులు చెల్లించాల్సిందే. డబ్బులు ఎవరికి కడుతున్నారని సమాధానం రాబట్టే ప్రయత్నం చేయగా ముగ్గురి పేర్లు ప్రస్తావించారు. వీరంతా శివ అనే వ్యక్తికి డబ్బులు చెల్లిస్తారు. శివ పైన బాలబొమ్మ శ్రీను ఆజమాయిషీ చేస్తుంటాడు. అలా చివరికి వారి మేనేజర్‌గా శేషయ్య పేరు బయటకొస్తోంది. ఈ ముగ్గురు ఎవరన్నది పరిశీలిస్తే శివ.. జక్కంపూడిలోని వైఎస్‌ఆర్ కాలనీలో ఉంటాడని తెలుస్తోంది. రైల్వేస్టేషన్‌లో తక్కువగా కనపడే ఈ వ్యక్తి ఠంచనుగా డబ్బులు కట్టించుకుంటాడు. బాలబొమ్మ శ్రీనివాసరావు రైల్వేస్టేషన్ కేంద్రంగా సబ్‌లీజు చేస్తుంటాడు. శేషయ్య పాత కాంట్రాక్టర్ అని తెలిసింది.

వైసీపీకి అంటకాగినా..

వివాదాస్పద తహసీల్దార్లకు ప్రాధాన్యం

- విజయవాడలో పనిచేసి నేరుగా సీఎంఓ ప్రద్యుమ్న పేషీకి వెళ్లిన తహసీల్దార్
- పూర్వ సబ్ కలెక్టర్ సిఫార్సులతో ప్రద్యుమ్న పేషీలో స్థానం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ హయాంలో అంటకాగి పనిచేసిన వివాదాస్పద తహసీల్దార్లకు ప్రాధాన్యత ఇవ్వడం రెవెన్యూ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విజయవాడలోని కీలక స్థానంలో పనిచేసిన తహసీల్దార్ ఒకరు ఏకంగా సీఎంఓ పేషీలోనే చోటు దక్కించుకున్నారు. సీఎంఓలో ప్రద్యుమ్న పేషీలో ఆయన చేరిపోయారు. ఈ తహసీల్దార్‌కు విజయవాడలో గతంలో పనిచేసిన సబ్ కలెక్టర్ ఒకరు సహాయ సహకారాలు అందించినట్టుగా తెలుస్తోంది. తహసీల్దార్ వివాదాస్పదుడైనప్పటికీ.. అతడిని రికమండ్ చేసిన ఆ సబ్ కలెక్టర్ మంచి వ్యక్తి కావటంతో సీఎంఓలోని ప్రద్యుమ్న పేషీకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వానికి తెలియకుండా ఉన్నతాధికారులు జరుపుతున్న అడ్డగోలు నియామకాలపై దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి తప్పుల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకు వచ్చేవిధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని అంటున్నారు.

ఇతర విభాగాల నుంచి వచ్చి రెవెన్యూలో తిష్టవేసి..

ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి రెవెన్యూకు వచ్చినవారు ఇక్కడి నుంచి వెళ్లిపోవాల్సి ఉండగా.. కదలటానికి ఇష్టపడటం లేదు. ఇటీవల సుప్రీంకోర్టు సీరియస్‌గా ఉత్తర్వులు ఇచ్చినా వీరిలో చలనం రావటం లేదు. పైగా ఇక్కడే పాతుకుపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి వచ్చినవారు కొందరు ఆర్డీవోలుగా కూడా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీవోల బదిలీలను కూడా చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమౌతోంది. దీంతో ఎవరైనా ఇక్కడికి వస్తారేమోనన్న భయంతో కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. తమ స్థానాల్లోకి ఎవరైనా వస్తారన్న ఉద్దేశంతో అనుమానం ఉన్న వారిపై ప్రైవేటు వ్యక్తుల ద్వారా కొన్ని అంశాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తులు కూడా చేయిస్తున్నారు. వీటిలో ఏవైనా విషయాలు తెలిస్తే వాటిని వివాదాస్పదం చేసి తాము లబ్ధి పొందాలన్న ఆలోచన కూడా చేస్తున్నారు. 2018-19లో గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా జరిగిన రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విచిత్రమేమిటంటే ఆ నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్‌మెంట్ అయిన వారికి ఆర్డీవోలుగా పదోన్నతులు వస్తున్నాయి. రాయలసీమలోని ఓ ప్రాంతానికి 2018 - 19 గ్రూప్ - 1 ద్వారా రిక్రూట్‌మెంట్ అయిన తహసీల్దార్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఏ జిల్లాల నుంచి వచ్చినవారు ఆ జిల్లాలకు వెళ్లిపోవాలని ఇచ్చిన ఆదేశాలను కొందరు తహసీల్దార్లు పాటించటం లేదు. కృష్ణా జిల్లాలో కొంతమంది తమ సొంత జిల్లాలకు వెళ్లకుండా ఇక్కడే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనివల్ల స్థానికంగా ఉండే తహసీల్దార్లు ఇబ్బంది పడే ప్రమాదం ఉంది. ఇక్కడి నుంచి కదలకుండా ఉండటానికి ఎమ్మెల్యేల ఆశీస్సులు కూడా పొందినట్టు తెలుస్తోంది.

కాచవరం.. సాగుకు దూరం!

పాలేటికి చేరని వరద నీరు.. పదివేల ఎకరాల్లో పంట ప్రశ్నార్థకం

» సాగర్ జలాల కోసం రైతన్నల ఎదురుచూపు

6లో..

ఇసుక కోసం వైసీపీ నేతల అరాచకం

» కీసర స్టాక్ పాయింట్ వద్ద లారీ డ్రైవర్‌పై కర్రలతో దాడి

» పోలీసుల సమక్షంలోనే దారుణం... అయినా కేసు లేదు

కంచికచర్ల రూరల్, జూలై 29 : కంచికచర్ల మండలం కీసర ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లోడింగ్ విషయంలో స్థానిక వైసీపీ జడ్పీటీసీ భర్త వేల్పుల రమేష్, ఆయన సోదరుడితో కలిసి లారీ డ్రైవర్‌పై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం ఉదయం జరిగింది. ఇసుక లోడింగ్ కోసం ఆదివారం రాత్రి వచ్చిన లారీలకు సీరియల్‌గా లోడింగ్ కోసం అధికారులు టోకెన్లు జారీ చేశారు. సోమవారం లోడింగ్ జరుగుతుండగా కీసరకు చెందిన వేల్పుల వెంకట్రావ్‌తోపాటు పలువురు ట్రాక్టర్ డ్రైవర్లు ముందుగా తమ ట్రాక్టర్లకు లోడ్ చేయాలని లారీలకు అడ్డు పెట్టారు. దీంతో డ్రైవర్ల మధ్య వివాదం పెరిగింది. మాటామాట పెరిగి జడ్పీటీసీ భర్త వేల్పుల రమేష్ అతని సోదరుడు వేల్పుల వెంకట్రావ్ మరికొంత మందితో కలిసి లారీ డ్రైవర్‌ను చితకబాదారు. ఎస్సై హైమావతి, డిప్యూటీ తహసీల్దార్ నాగుల్ మీరా సమక్షంలో లారీ డ్రైవర్‌పై కర్రలతో దాడి చేయడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయంపై కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేయకపోవడం శోచనీయం.



లారీడ్రైవర్‌పై దాడి చేస్తున్న వేల్పుల వెంకట్రావు, రెచ్చగొడుతున్న జడ్పీటీసీ భర్త వేల్పుల రమేష్

ఈ కాప్స్

పోలీసింగ్‌కు టెక్నాలజీ జోడింపు



ఈ పహారా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ రాజశేఖరబాబు, డీసీపీలు

కొత్తగా ఈ పహారా అమలు

- బీట్ కానిస్టేబుళ్ల ఫోన్లలో పోలీసు సేవా యాప్
- రౌడీషీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ నిందితుల ఇళ్లకు జియో ఫెన్సింగ్
- ప్రతి స్టేషన్ పరిధిలో పీవోఐ గుర్తింపు
- ఎస్‌హెచ్‌వోలకు పీవోఐలను ఎంచుకునే ఆప్షన్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పగలు, రాత్రి పహారా చేస్తారు. నిర్దేశించిన ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన పుస్తకాల్లో సంతకాలు చేస్తారు. ఈ బీట్ సమయంలో ఏ పనులు చక్కబెడుతున్నారో పర్యవేక్షణ ఉండదు. ఆ ప్రదేశాలకు వెళ్లినట్టు మాత్రం పుస్తకాల్లో సంతకాలు ఉంటాయి. అసలు వారు బీట్‌కు వెళ్లారో లేదో తెలియదు. ఈ విధానానికి విజయవాడ పోలీసు కమిషనరేట్ అధికారులు చెక్ పెట్టారు. పోలీసులు చేసే బీట్ విధానానికి టెక్నాలజీని జోడించారు. దీనికి 'ఈ' పహారా అని నామకరణం చేశారు. దీన్ని కమిషనరేట్ పరిధిలో అమలు చేస్తున్నారు. ఆ వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు టి.హరికృష్ణ, గౌతమీశాలి, మురళీకృష్ణ నాయుడు, ఏసీపీ తేజేశ్వరరావు, స్రవంత్‌రాయ్‌తో కలిసి సోమవారం వెల్లడించారు. ఈ పహారా పోస్టర్‌ను కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో ఆవిష్కరించారు.

అన్నింటికి పీవోఐలు

ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో భౌగోళిక స్వరూపం ఒక్కోలా ఉంటుంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో తరహా నేరాలు జరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో నేరగాళ్లు ఉంటాయి. ఇలా అన్ని అంశాలను క్రోడీకరించి జియో ఫెన్సింగ్ చేశారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, బ్లేడ్‌బ్యాచ్, గంజాయి బ్యాచ్, ఈవ్‌టీజర్ల ఇళ్లకు జియో ఫెన్సింగ్ చేశారు. వాటితోపాటు చోరీలు, స్నాచింగ్, రాత్రిపూట చోరీలు జరిగే ప్రాంతాలు, ఆలయాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఈ జియో ఫెన్సింగ్‌లోకి తీసుకొచ్చారు. వాటిని పీఓఐ (పాయింట్ ఆఫ్ ఇంట్రెస్ట్)గా వ్యవహరిస్తున్నారు. ఈ పీఓఐలను ఎంచుకునే అవకాశం స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఇచ్చారు. బీట్‌లో ఒక హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డు లేక ఒక కానిస్టేబుల్, హోంగార్డు ఉంటారు. బీట్‌కు వెళ్లే పోలీసులు ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకునే యాప్‌లోకి వెళ్లి మొదటి పీఓఐ నుంచి లోకేషన్ ఆన్ చేయాలి. వారికి కేటాయించిన పీఓఐలను కవర్ చేయాలి. ఈ బీట్ కానిస్టేబుళ్లు వెళ్తున్నారా లేదా అన్న విషయం పోలీసు డాష్ బోర్డులో తెలిసిపోతుంది. వారు ఆయా పీఓఐల వద్దకు వెళ్లారా లేదా అన్నది గూగుల్ మ్యాప్ ద్వారా తెలుస్తుంది. ఈ పీఓఐలు పగలు ఒక విధంగా, రాత్రి ఒక విధంగా ఉంటాయి. పగటి పూట కళాశాలలు, పాఠశాలలు, గంజాయి బ్యాచ్‌ల ఇళ్లను పీఓఐలోకి తీసుకువస్తారు. ఒక్కో బీట్‌లో 20 మీటర్ల దూరంలో పీఓఐలను జియో ఫెన్సింగ్ చేశారు. ఇప్పుడే 'ఈ' విధానాన్ని అమలు చేస్తున్నందున రాబోయే రోజుల్లో పీఓఐలను పెంచుతారు.

'జలగ' ఆక్రమణలపై కొరడా

● 1400 గజాల ప్రభుత్వ భూమి స్వాధీనం.. బోర్డుల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అజిత్‌సింగ్‌నగర్, జూలై 29 : అధికారాన్ని అడ్డంపెట్టుకొని వైసీపీ నాయకుడు కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బోర్డులు ఏర్పాటు చేశారు. విద్యాధరపురం కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 69లో గల ఇరిగేషన్ స్థలాన్ని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అనుచరుడు ఆక్రమించుకొని మట్టితో చదును చేశాడు. ఈ ఉదంతాన్ని 'బుడమేరును మింగేసిన జలగ' శీర్షికతో ఆంధ్రజ్యోతి సోమవారం వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం వైవీరావు ఎస్టేట్ సమీపంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి వద్దకు చేరుకొని పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ, కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగ అధికారులు రికార్డులు పరిశీలించి వాటి ప్రకారం కొలతలు వేసి ఆక్రమణకు గురైన సుమారు 1400 గజాల ఇరిగేషన్ భూమిని గుర్తించి స్వాధీనం చేసుకొని బోర్డులను ఏర్పాటు చేశారు.



ఆక్రమిత ఇరిగేషన్ స్థలంలో హెచ్చరిక బోర్డులు

నివ్వెరపోయిన అధికారులు

పాలఫ్యాక్టరీ వంతెన దిగి జక్కంపూడికి వచ్చే మెయిన్ రోడ్డు వెంబడి వైవీ రావు ఎస్టేట్ ప్రధాన గేటు వద్ద ఉన్న ఇరిగేషన్ భూమిని చూసి అన్ని విభాగాల అధికారులు నివ్వెరపోయారు. ఇంత కమర్షియల్ భూములు ప్రభుత్వానివా అంటూ నోరెళ్లబెట్టారు. ఇందులో గొల్లపూడి గ్రామ పంచాయతీకి సంబంధించిన కొంత భూమి ఉందని దాని సర్వే నెంబర్లను కూడా పరిశీలించిన తరువాత అసలు ఇక్కడ ఇరిగేషన్ భూమి మొత్తం ఎంత ఉందనేది తెలుస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వ భూమిలో బోర్డులు ఏర్పాటు చేసిన వారిలో ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్, ఆర్ఐ శివప్రసాద్, సర్వేయర్ నాయక్ సిబ్బంది ఉన్నారు.

లీజుకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం

ప్రధాన రహదారి వెంబడి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఏవైనా కంపెనీలకు, చిరు వ్యాపారులకు లీజుకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేస్తే బాగుంటుందని స్థానిక పెద్దలు చెబుతున్నారు. ఇలా వదిలేస్తే మళ్లీ ఈ భూములను కొత్త వ్యక్తులు ఆక్రమించుకునే ప్రమాదం ఉందని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గ్రూపు కట్టి.. రూ. కోట్లు పట్టి..!

వైసీపీ ప్రభుత్వంలో స్వయం సహాయక సంఘాలను భ్రష్టు పట్టించారు. గుడివాడలో ఫేక్ గ్రూపులను సృష్టించి క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారు. అక్రమంగా రుణాలను పొందారు. రెండేళ్లుగా ఈ తతంగం సాగుతున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకుండా కొందరు ఆర్పీలు, సీవోలు జాగ్రత్తపడ్డారు. కొన్ని బ్యాంకుల మేనేజర్లు కూడా ఈ అక్రమంలో పాత్రధారులుగా ఉన్నట్టు చర్చ నడుస్తోంది. అందరూ కలిసి రూ.10 కోట్లకుపైనే దోచేసినట్టు తెలుస్తోంది.



గుడివాడ పురపాలక సంఘం కార్యాలయం (ఫైల్)

గుడివాడలో పాత సభ్యులతోనే కొత్త గ్రూపుల ఏర్పాటు

- సీఎంఎంకు తెలియకుండా రుణాలు
- కొందరు ఆర్పీలు, సీవోల మిలాఖత్
- బ్యాంకుల మేనేజర్లూ పాత్రధారులే
- రూ.10కోట్లు పొందినట్టు ప్రచారం
- అక్రమంలో నాని అనుచరుడి పాత్ర

గుడివాడ : డ్వాక్రా రిసోర్స్ పర్సన్‌ల ద్వారా ప్రతి స్వయం సహాయక గ్రూపునకు రుణ దరఖాస్తులు సీవోలకు ఇవ్వాలి. ఆజమాయిషీ అంతా సీవోల చేతుల్లో ఉంటుంది. రుణం పొందే ప్రతి డ్వాక్రా మహిళ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. సీవోల ద్వారా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) వద్దకు దరఖాస్తు చేరుతుంది. పూర్తిస్థాయి పరిశీలన జరిగిన తరువాతే సీఎంఎం అనుమతితో బ్యాంకుకు దరఖాస్తు చేరుతుంది. బ్యాంకర్లు రుణాలను అందజేస్తారు. ఇది స్వతహాగా జరుగుతూ ఉండే ప్రక్రియ. అయితే ఆర్పీలు, సీవోలు కుమ్మక్కై దోపిడీకి తెరలేపారు. సీఎంఎంతో ప్రమేయం లేకుండానే బ్యాంకర్లతో కుమ్మక్కై రుణాలు ఇప్పించేశారు. కొత్త గ్రూపుల పేరుతో భారీస్థాయిలో రుణాలు పక్కదారి పట్టించారని కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఫేక్ డ్వాక్రా సంఘాల పేరుతో మాయ

● ఫేక్ గ్రూపులు సృష్టించి అక్రమం

పట్టణంలో గతంలో ఉన్న గ్రూపు సభ్యులతోనే కొత్త ఫేక్ గ్రూపులను సృష్టించారు. కొత్త గ్రూపుల్లోని సభ్యుల వివరాలను ఆన్‌లైన్ చేయలేదు. ఆర్పీలు, సీవోలు కుమ్మక్కై బ్యాంకు మేనేజర్‌లతో మిలాఖత్ అయి రుణాలు విడుదల చేయించారు. చాకచక్యంగా రుణాలను కొట్టేశారు. ఆర్పీలు, సీవోలు, బ్యాంకు మేనేజర్‌లతో సహా ఎవరి వాటాలు వారికి అందాయి. పట్టణ వ్యాప్తంగా సుమారు 50 ఫేక్ గ్రూపులను సృష్టించి, రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల మేర బ్యాంకుల నుంచి రుణాలను పక్కదారి పట్టించి ఉంటారని స్వయం సహాయక సభ్యులు తెలుపుతున్నారు. ఇంతపెద్ద స్కాం వెనుక కొందరు వైసీపీ నాయకులు ఉన్నారని గుసగుసలు వినవస్తున్నాయి.

● ఎవరి పాత్ర ఎంత?

డ్వాక్రాలో భారీస్థాయిలో స్కాం చేయడానికి అప్పటి వైసీపీ నాయకులు హస్తంతోనే ఆర్పీలు, సీవోలు పెట్రేగిపోయారని వినికిడి. ముఖ్యంగా మున్సిపాలిటీని ఐదేళ్లపాటు తన గుప్పెట్లో పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్య అనుచరుడు ఒకరు, కొందరు వైసీపీ మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జుల పాత్ర ఉన్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది. పట్టణ సమాఖ్యకు స్కాం విషయం పూర్తిగా తెలుసని, సమాఖ్యలోని కొందరికి ఈ స్కాంలో పాత్ర ఉందని స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ స్కాంలో ఆర్పీలు, సీవోలు, బ్యాంకర్‌ల పాత్ర ఉన్నట్టు స్పష్టమైంది. ఎవరు ఎంత మేర దోచేశారో తెలియాలంటే పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది.

రెండేళ్లుగా సాగుతున్న అక్రమం

రెండేళ్లుగా సీఎంఎంకు తెలియకుండా కొత్త గ్రూపులకు భారీ మొత్తంలో రుణాలిచ్చినట్టు సమాచారం. వేరే గ్రూపుల్లోని సభ్యులను పెట్టి కొత్త గ్రూపుగా చూపించి అక్రమంగా రుణానికి దరఖాస్తు చేసుకున్నట్టు సీఎంఎంకు అజ్ఞాత వ్యక్తి సమాచారం అందించారు. తనకు తెలియకుండానే కొత్త గ్రూపు ఎప్పుడు పెట్టారని, తాను సంతకాలు చేయకుండానే రుణానికి ఎలా దరఖాస్తు చేశారు? అని ఆమె అవాక్కయ్యారు. దీంతో స్థానిక ఇండియన్ బ్యాంకులో పరిశీలించగా, కొత్త గ్రూపు రుణానికి దరఖాస్తు వచ్చినట్టు గుర్తించారు. పరిశీలించి చూడగా గ్రూపుల్లో ఉన్న సభ్యులు కొందరు గతంలోనే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో డ్వాక్రా రుణాలు పొందినట్టు గ్రహించారు. వెంటనే రుణాన్ని నిలపుదల చేసి విచారణ చేపట్టారు. మరో బ్యాంకులో కూడా ఇదే తరహాలో రుణాలకు దరఖాస్తు చేసినట్టు గమనించి నిలుపుదల చేశారు. సదరు విషయాన్ని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తన ప్రమేయం లేకుండానే కొందరు ఆర్పీలు, కొందరు సీవోలతో కలిసి ఈ తరహా మోసానికి పాల్పడుతున్నట్టు గ్రహించారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి నిజాలను నిగ్గు తేలుస్తానని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపడతామని సీఎంఎం సుజాత తెలిపారు.

విజయవాడ నుంచి మరిన్ని విమాన సర్వీసులు నడపాలి

▸ కేంద్ర మంత్రికి ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి


రామ్మోహన్ నాయుడితో కేశినేని చిన్ని

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దేశంలోని ముఖ్య పట్టణాలకు విజయవాడ విమానాశ్రయం నుంచి మరిన్ని విమాన సర్వీసులు నడిపేలా కృషి చేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ సోమవారం ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడును కలిసి విజ్ఞప్తి చేశారు. విమాన సర్వీసులకు సంబంధించిన ప్రతిపాదనలతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని ఆయనకు అందజేశారు. విజయవాడ నుంచి వారణాసి, కోల్‌కతా, కొచ్చిన్, అహ్మదాబాద్, పూణేలకు సర్వీసులు నడపాల్సిందిగా కోరారు. వారణాసికి విజయవాడ నుంచి నేరుగా విమానానికి ఎంతో డిమాండ్ ఉంటుందని చెప్పారు. కోల్‌కతాకు విజయవాడ నుంచి ప్రారంభించి విశాఖపట్నంను కూడా టచ్ చేసి వెళ్లేలా సర్వీసు నడపాలని కోరారు. విజయవాడ నుంచి కొచ్చిన్‌కు నడిపే విమాన సర్వీసును వయా హైదరాబాద్ మీదుగా కానీ, బెంగళూరుల మీదుగా కానీ నడపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అమరావతి రాజధానికి తలమానికమైన విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈ సర్వీసులు ప్రారంభించటం వల్ల ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగం ఉంటుందని చెప్పారు. ఇండిగో సర్వే చేసిన ఈ మార్గాల్లో విమాన సర్వీసులు తక్షణం ప్రారంభించేలా చూడాలని శివనాథ్ కోరారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

గిరిజన యువతకు జాబ్‌మేళా రేపు

విజయవాడ లీగల్, జూలై 29 : గిరిజన యువతకు ఉపాధి లక్ష్యంతో జాబ్ మేళాలను నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జి.సృజన తెలిపారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులై ఇంగ్లీషు చదవడం, రాయడంలో నైపుణ్యం గల గిరిజన యువతీ యువకులకు సికింద్రాబాద్‌కు చెందిన ఎస్‌కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కెఎల్ గ్రూప్ సౌజన్యంతో జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్టు ఆమె తెలిపారు. జూలై 31వ తేదీన గొల్లపూడిలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలో అర్హత కలిగిన గిరిజన యువతకు పికింగ్, ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్ అన్‌లోడింగ్ వంటి ఉద్యోగాలలో అవకాశం కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. వారానికి ఐదు రోజులు షిఫ్టుల వారీగా పనిచేయవలసి వుంటుందని, నెలకు రూ.17000 జీతం, పీఎఫ్, ఈఎస్ఐ, మెడికల్ ఇన్సూరెన్సు సౌకర్యంతో పాటు అదనపు పనికి కూడా వేతనం కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల గిరిజన యువత బయోడేటాతో పాటు 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో 31వ తేదీ ఉదయం 10 గంటలకు డీఆర్‌డీఏ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. జాబ్‌మేళా కార్యక్రమాన్ని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి జె.సునీత పర్యవేక్షిస్తారని, ఇతర వివరాలకు 7893751698లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

కైలే అనిల్ పాస్‌పోర్టు స్వాధీనం చేసుకోవాలి

▸ ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



పామర్రు, జూలై 29 : తీగ లాగితే డొంక కదిలిందన్న సామెత పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు బాగా వర్తిస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లిసబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల జరిగిన దస్త్రాల దహనం సంఘటన మూలాలు పామర్రు నియోజకవర్గంలో కదలడమే దీనికి ప్రధాన కారణమన్నారు. హైదరాబాద్‌లోనిఅయ్యప్ప సొసైటీలోగల ఆర్‌ఆర్ రెసిడెన్సీలోని 'అనిల్' అపార్టమెంట్‌లో మదనపల్లి రెవెన్యూ ఫైల్స్ దహనంలో ప్రధాన నిందితుడు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి పీఏ శశిధర్ కలిసి ఉండేవారని ఆరోపించారు. శశిధర్‌తో కైలే అనిల్‌కు గల సంబంధాలతో పాటు ఆయన బినామీలపై సమగ్ర దర్యాప్తు జరపాలని సంబంధిత అధికారులను కోరుతున్నట్టు చెప్పారు. హైదరాబాద్, పామర్రు, విజయవాడలోగల మినీలోటస్ పాండ్‌లు, ఇతర కబ్జాల పట్ల సమగ్ర దర్యాప్తు జరిపి, అనిల్ పాస్‌పోర్టును తక్షణం స్వాధీనం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

చైతన్యవంత వీడియోలకు ఆహ్వానం

▸ సైబర్ నేరాలు, మహిళా భద్రతపై వీడియోల పోటీలు

▸ ఉత్తమ వీడియోలకు నగదు బహుమతి : సీపీ వెల్లడి


విజయవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలకు లెక్కే లేదు. టెక్నాలజీ అవసరాలు పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులతో ఖాతాదారుల సొమ్ములను కొల్లగొట్టేస్తున్నారు. మైనారిటీ తీరకుండా విద్యాసంస్థల్లో ప్రేమాయణం నడుపుతున్నారు. మైనారిటీ తీరని అమ్మాయి అంగీకరించిందని తీసుకెళ్లి లైంగికదాడి కేసుల్లో యువకులు ఇరుక్కుంటున్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా, మహిళలు, అమ్మాయిల భద్రతకు సంబంధించి అవగాహన కల్పించే విధంగా వీడియోల రూపకల్పన పోటీలను నిర్వహించాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సీపీ రాజశేఖరబాబు, డీసీపీలు గౌతమీశాలి, టి.హరికృష్ణ, మురళీకృష్ణనాయుడు, ఏసీపీ స్రవంతిరాయ్, తేజేశ్వరరావులు సోమవారం ఆవిష్కరించారు. ఇందుకోసం రెండు క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. యూట్యూబర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులు ఇలా ఎవరైనా ఈ క్యూఆర్ కోడ్లను స్కాన్ చేసుకుని వాటి వివరాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ముందుగా పేరు, వివరాలు రిజిస్టర్ చేసుకుని ఏ అంశంపై వీడియోను రూపొందిస్తారో స్పష్టం చేయాలి. ఇలా చేసిన వీడియోలను క్యూఆర్ కోడ్ చూపించిన లింక్‌ల్లో అప్‌లోడ్ చేయాలి. ఇలా వచ్చిన వీడియోలను అధికారులు ఎంపిక చేస్తారు. ఇందులో మొదటి బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు అందజేస్తారు.

అర్జీల పరిష్కారంలో స్పష్టత ఉండాలి

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



విజయవాడ లీగల్, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్దిష్టమైన స్పష్టతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సృజన, డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజనీకుమారి తదితరులతో కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా పారదర్శకంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అనుమతుల కోసం సమర్పించే దస్త్రాలు (ఫైల్స్) స్పష్టత వుండాలన్నారు. సమీక్షా సమావేశాలకు పూర్తిస్థాయి సమాచారంతో నోట్‌ఫైల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సిద్ధం చేసుకొని హాజరుకావాలని కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు.



లైంగిక నేరాల అదుపు.. ప్రతి ఒక్కరి బాధ్యత

కృష్ణలంక, జూలై 29 : లైంగిక వేధింపులను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై అత్యంత కఠినంగా చర్యలు తీసుకొనేందుకు వెనుకాడవద్దని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. లైంగిక వేధింపుల నివారణపై జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధ్వర్యంలో 'అరవండి' 'పరిగెత్తండి' 'చెప్పండి' నినాదంతో రూపొందించిన గోడ పత్రికలను సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం సృజన మాట్లాడుతూ, బాలికల రక్షణకు హక్కులు, చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుందన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నప్పటికీ కొన్నిచోట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్న సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. లైంగిక నేరాల నుంచి రక్షణకు పోక్సో చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. బాలికల రహస్య భాగాలను తాకిన, అసౌకర్యాన్ని, భయాన్ని కలిగించినా 'అరవండి' 'పరిగెత్తండి' 'చెప్పండి' వంటి చర్యల ద్వారా చైతన్యవంతులను చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులు కట్టడి చేస్తాం

▸ 31 నుంచి ఆగస్టు 9 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

▸ వ్యాధుల అదుపునకు ప్రత్యేక కార్యాచరణ

▸ పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపైనా అవగాహన కల్పించండి

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, పాల్గొన్న అధికారులు



విజయవాడ లీగల్, జూలై 29 : ఈనెల 31వ తేదీ నుంచి ఆగస్టు 9 వరకు 10 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించాలని, సీజనల్ వ్యాధుల కట్టడికి రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ అమలుకు జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ జి.సృజన అన్నారు. సోమవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, డీఆర్‌ఓ వి.శ్రీనివాసరావులతో కలిసి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) తదితరాలపై వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి డివిజన్, మండలస్థాయి అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. పట్టణ పారిశుధ్యంపై విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంపై డీపీవో ఎస్‌వీ శివప్రసాద్ యాదవ్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సన్నద్ధతపై డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పిల్లల లైంగిక వేధింపులను అరికట్టేందుకు తీసుకొంటున్న చర్యలపై ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాస్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులతో పాటు ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రాంతాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ఓహెచ్‌ఎస్ఆర్‌ల క్లీనింగ్, కచ్చా, పక్కా డ్రైన్‌ల క్లీనింగ్, ఫాగింగ్, లైమ్, బ్లీచ్ స్ప్రేయింగ్, మలాథియాన్, బైటెక్స్ ఆయిల్ బాల్స్ స్ప్రేయింగ్, ఘన వ్యర్థాల నిర్వహణ, పైపులైన్ల మరమ్మతులు తదితర కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లోను రోజువారీ పారిశుధ్య కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల అమలుతీరు పర్యవేక్షణకు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ వర్కర్, ఏఎన్‌ఎంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రజలు డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల బారినపడకుండా దోమల వ్యాప్తికి మూలకారకాలను నాశనం చేయాలని, ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీరు తాగేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేటు తాగునీటి ప్లాంట్లను కూడా తనిఖీలు చేయాలని ఆదేశించారు.

పెన్షన్ల పంపిణీకి పూర్తి సన్నద్ధత

జూలైలో మాదిరిగానే ఆగస్టులో కూడా ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీని విజయవంతం చేయాలని, తొలిరోజే పూర్తిస్థాయిలో పంపిణీ పూర్తిచేసేలా సన్నద్ధంగా వుండాలన్నారు. మొత్తం 2,34,143 పెన్షన్లకు సంబంధించి రూ.98.80 కోట్ల మేర మొత్తాన్ని ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా లబ్ధిదారులకు ఇంటివద్దే పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చే అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.బాల్యం-అమూల్యం, పిల్లల రక్షణ మనందరి బాధ్యత, ఈ నేపథ్యంలో పిల్లలపై లైంగిక దాడుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సృజన సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, డీఈవో ఎస్‌వీ సుబ్బారావు, కెఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ జె.సుమన్, జీఎం-డీఐసీ ఎ.సుధాకర్, జిల్లా ఉద్యానవన అధికారి పి.బాలాజీ కుమార్, ఏపీఎంఐపీ పీడీ ఎం.సుభానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

మచిలీపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం)కార్యక్రమంలో వచ్చే అర్జీలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి పరిష్కరించాలని డీఆర్వో కే చంద్రశేఖరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రజనుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 130అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించిన బ్యాంకుఖాతాలను సక్రమంగా నిర్వహించకపోవడంతో సదరు ఖాతాలను రిజర్వు బ్యాంకు లాక్‌చేసిందని, ఈ ఖాతాలను పునరుద్ధరించేందుకు అధికారులు తగుచర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు సంబంధించి రెండవ విడత గ్రీవెన్స్‌లో 33అర్జీలు రాగా, వాటిలో 21అర్జీలకు పరిష్కారం చూపామని, 12అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖలకు సంబంధించిన నివేదికలను ఆగస్టు 3వతేదీలోగా సమాచారశాఖ అధికారికి పంపాలన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సూచనల మేరకు ప్రతి ఆదివారం మంగినపూడిబీచ్‌లో ఉదయం 6గంటలనుంచి 7గంటలవరకు యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, అందుకు తగిన విధంగా వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనంద్‌కుమార్, డీఈవో తాహెరాసుల్తానా, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో నాగేశ్వరనాయక్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాభాయి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ జయవర్ధన్, వివిధ శాఖల అధికారులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీ సక్రమంగా చేయాలి

▸ కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ


పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జెడ్పీ కన్వెన్షన్‌హాలులో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై అధికారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత నెలలో కొన్నిమండలాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీలో అలసత్వం ప్రదర్శించారని అన్నారు. ఈసారి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. పింఛన్ల పంపిణీకి ముందురోజే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రూట్‌మ్యాప్‌ను రూపొందించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తే సర్వర్‌పై ఒత్తిడి ఉండదని, యాప్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడవన్నారు. గన్నవరం మండలం కొత్తగూడెం సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి కె.పావని ఎనిమిదినెలల గర్భిణి అయినప్పటికీ గతనెలలో ఉదయం 4గంటలకే పింఛన్లు పంపిణీ చేయడం ప్రారంభించి 99శాతం మేర సకాలంలో పూర్తి చేశారని అన్నారు. ఇందుకు సహకరించిన ఎంపీడీవో సత్యకుమార్‌ను, పావనిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో జెడ్పీసీఈవో ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వర నాయక్, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చేనేత, సహకార సంఘాలకు రూ.11.17 కోట్ల రుణానికి ప్రతిపాదనలు

జిల్లాలోని 25చేనేత సహకారసంఘాలకు కేడీసీసీ బ్యాంకు ద్వారా 2024-25ఆర్థికసంవత్సరంలో రూ.11.17కోట్లను రుణంగా అందజేయాలని కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగిన జిల్లాస్థాయి కమిటీలో తీర్మానం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ పుహాలులో చేనేత,జౌళిశాఖ జిల్లాకమిటీ సమావేశం జరిగింది. గూడూరు మండలంలోని పోలవరం, కప్పలదొడ్డి, రాయవరం, మల్లవోలు, ఐదుగుళ్లపల్లితోపాటు పెడన టౌన్, చల్లపల్లి, గన్నవరంలోని ముస్తాబాద తదితర 25చేనేత సంఘాలకు ఈ రుణాన్ని మంజూరుచేయాలని ప్రతిపాదన చేశారు. ఈ సమావేశంలో చేనేత జౌళిశాఖ ఏడీలు ధనుంజయరావు, రఘునందనరావు, డీసీవో భాస్కరరావు, ఆప్కో విజయవాడ యూనిట్ మార్కెటింగ్ అధికారి ఈఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సహకారంతో విజయ పథాన..

▸ ప్రభుత్వ ప్రోత్సాహంతో సేవలు విస్తృతం

▸ 2024-25 ముందస్తు బోనస్ ప్రకటన

▸ చైర్మన్ చలసాని ఆంజనేయులు


పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 29 : పాడిరైతుల సహకారంతోనే కృష్ణా మిల్క్ యూనియన్ విజయపథంలో ముందుకు సాగుతున్నదని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లిలోని కామధేను(విజయ) మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సర తొలి ముందస్తు బోనస్ రూ.13కోట్లకు పైగా విడుదల చేసి పాడిరైతులకు అందజేయనున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో ఎన్నో ఆటుపోట్లు వచ్చినా పాడిరైతుల అండగా వారి సహకారంతోనే దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధర, ముందస్తు బోనస్‌లతో పాటు కళ్యాణమస్తు సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని చైర్మన్ చలసాని తెలిపారు. కూటమి ప్రభుత్వం పాడిరైతులను ప్రోత్సహించేందుకు షెడ్ల నిర్మాణానికి, పచ్చగడ్డి అందుబాటులోకి తెచ్చేందుకు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. నాలుగు నెలలుగా వర్షాభావ పరిస్థితుల కారణంగా పాల సేకరణ తగ్గినా దాని ప్రభావం రైతుపై పడకుండా పాలకవర్గ సభ్యులు కృషి చేశారని తెలిపారు. క్షీరబంధు పథకాలకు తోడుగా సబ్సిడీపై దాణా అందజేయడంతో పాటు 24గంటలు వెటర్నరీ సర్వీస్(పశువుల వద్దకే వైద్యులు) కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. భవిష్యత్తులో పాలసేకరణ పెరిగేలా ప్రతి సంవత్సరం రూ.3కోట్లకు పైగా వెచ్చించి హైఈల్డింగ్ సెమన్‌ను సబ్సిడీ ధరతో అందజేస్తున్నామని, త్వరలోనే పాలసేకరణలో మంచి ఫలితాలు సాధిస్తామని చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని పాల సొసైటీల ద్వారా సహకార వ్యవస్థను బలోపేతం చేసేలా కీలక నిర్ణయాలు చేయడం, దాని ద్వారా పాడిరైతులకు నేరుగా సంక్షేమపథకాలు అందేలా చర్యలు తీసుకోవడం పట్ల పాలకవర్గ సభ్యులు, చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. కామధేను ఫ్యాక్టరీ స్థాపించినప్పుడే నందమూరి తారక రామారావు ప్రాంగణంగా నామకరణం చేయడం జరిగిందని, అలాగే అన్నదాతల అభివృద్ధికి కృషి చేసిన వర్గీస్ కురియన్ పేరును పాలసేకరణ ట్యాంక్‌బే ప్రాంగణానికి, చెరుకూరి రామోజీరావు పేరును యుటిలిటీస్ ప్రాంగణం నామకరణం చేయడం జరిగిందన్నారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించి ఆయా ప్రాంగణాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాచవరం.. సాగుకు దూరం!

▸ పాలేటికి చేరని వరద నీరు.. పదివేల ఎకరాల్లో పంట ప్రశ్నార్థకం

▸ సాగర్ జలాల కోసం రైతన్నల ఎదురుచూపు



జగ్గయ్యపేట రూరల్, జూలై 29 : కాచవరం సప్లై ఛానల్ కింద 10 వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బ్రిటీష్ కాలంలో గట్టు కాచవరం గ్రామంలో పాలేటిపై ఆనకట్ట నిర్మించారు. ఆనకట్ట నీరుతో మండలంలోని తక్కెళ్లపాడు, గరికపాడు, బలుసుపాడు, త్రిపురవరం, అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట, జగ్గయ్యపేట, కె.అగ్రహారం గ్రామాల పరిధిలోని 10 వేలఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందటంతో పాటు ఆయా ప్రాంతాలలోని చెరువులను నింపేవారు. ప్రతీఏటా ఆయకట్టు పరిధిలో జూలై మధ్యలో సాగు ప్రారంభమై ఆగస్టు మొదటి వారంతో పూర్తవుతుంది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసినా పాలేటికి వరద రాలేదు. దీంతో రైతులు పొలాల్లో దుక్కులు దున్నటం కాదు కదా కనీసం నారుమడులు కూడా పోయలేదు. బావులు, బోర్లు కింద అవకాశం ఉన్నవారు నారుమడులు సిద్ధం చేసుకుని నీటికోసం ఎదురు చూస్తున్నారు. మునేరు కింద జోరుగా నారుమడులు, నాట్లు సాగుతున్నా కిందకు నీరు రావటం ఆలస్యమవుతోంది. సాగర్ జలాలు వస్తేనే తమకు నీటి సమస్య తీరుతుందని రైతులు అంటున్నారు.

సాగర్ జలాలు వస్తేనే సాగు..

- కె.శ్రీనివాసరావు, తక్కెళ్లపాడు సర్పంచ్, రైతు



పాలేటిలో నీటి ప్రవాహం సక్రమంగా ఉంటేనే ఈ ప్రాంతంలో సాగు జరుగుతుంది. సాగర్ జలాలు వస్తేనే నీటి సమస్య తీరుతుంది. సాగర్ జలాలు రాకుంటే మెజార్టీ శాతం పంట పొలాలు బీడు భూములుగా మారుతాయి.

రెండో పంటపై ప్రభావం

- యానాల గోపి, కాచవరం సప్లై ఛానల్ మాజీ చైర్మన్, అనుమంచిపల్లి



మొదటి పంట ఆలస్యమైతే ఆ ప్రభావం రెండో పంటపై ఉంటుంది. దీంతో దిగుబడులు తగ్గటంతో పాటు సాగు ఖర్చులు కూడా పెరుగుతాయి. వ్యవసాయ సీజన్‌కు సిద్ధంగా ఉన్న కూలీలు పనులు లేక పక్క మండలాలతో పాటు సరిహద్దులోని తెలంగాణాకు కూలీ పనులకు వెళ్తున్నారు. ఆలస్యంగా నీరు వస్తే రైతులు మూకుమ్మడి పనులు మొదలు పెడతారు. దీని వల్ల కూలీలు, ట్రాక్టర్ల లభ్యత ఇబ్బంది ఉండటంతో సాగు ఖర్చులు పెరుగుతాయి.

పద్య కవయిత్రి ముదిగొండ సీతారావమ్మ కన్నుమూత


సీతారావమ్మ (ఫైల్)

మచిలీపట్నం టౌన్, జూలై 29 : మచిలీపట్నానికి చెందిన ప్రముఖ పద్య కవయిత్రి ముదిగొండ సీతారావమ్మ (76) సోమవారం కన్నుమూశారు. సీతారావమ్మ తన భర్త దివంగత ముదిగొండ నాగమల్లికార్జునరావు నుంచి కవిత్వం రాయడం నేర్చుకున్నారు. పద్య కవితలు రాయడంలో ఎంతో ప్రతిభ ప్రదర్శించేవారు. పరమశివుడిపై ఎన్నో గ్రంథాలు రాశారు. గేయాలు, మినీ కవితలు కూడా రాశారు. అష్టావధానాలు, శతావధానాల్లో పృచ్ఛకులుగా ఉండి దత్తపదులు, నిషిద్ధాక్షరిలో అవధానిని ఉక్కిరిబిక్కిరి చేసేవారు. ఉగాది కవి సమ్మేళనాల్లో పాల్గొని అందరి ప్రశంసలు అందుకునేవారు. కడప జిల్లా ప్రొద్దటూరులో సోమవారం ఆమె 'శతకసాహితీ ప్రదీప్తి' ఉత్తమ కవయిత్రి పురస్కారం అందుకోవాల్సి ఉంది. ఈలోగానే సోమవారం మధ్యాహ్నం ఆమె పరమపదించారు. సీతారావమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మృతికి సాహితీ మిత్రులు రావి రంగారావు, లంకిశెట్టి బాలాజీ, భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్‌లు

ఇసుక టిప్పర్లు స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, జూలై 29 : గండ్రాయి సమీపంలో తెలంగాణాకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని ఓల్టా కేసు నమోదు చేసినట్టు చిల్లకల్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలోని ఇసుక యార్డు నుంచి వేదాద్రి గ్రామానికి రెండు టిప్పర్‌లు, అన్నవరానికి ఒక టిప్పర్ వే బిల్లుతో వస్తున్నాయని చెప్పారు. కానీ టిప్పర్‌లు వెళ్లాల్సిన మార్గంలో కాకుండా తిరుమలగిరి మంగొల్లు, గండ్రాయి మీదుగా తెలంగాణ వైపు వెళ్తున్నాయనే సమాచారంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

హెచ్‌ఆర్‌ఏ కొనసాగింపుపై హర్షం

కృష్ణలంక, జూలై 29 : రాష్ట్ర విభజన అనంతరం అమరావతి రాజధాని ప్రాంతంలో సెక్రటేరియట్, శాఖాధిపతి కార్యాలయాల్లో (హెచ్‌ఓడీ) పనిచేస్తున్న సిబ్బందికి ఇంటి అద్దె అలవెన్సు (హెచ్‌ఆర్ఏ) కింద మొదటి ఐదు సంవత్సరాలు 30 శాతం, తర్వాత 24 శాతం బేసిక్ పే గరిష్టంగా 25 వేల లోపు ఇచ్చేలా గత పదవ పీఆర్సీ నుంచి ఉత్తర్వులు జూన్ 2025 వరకు అమలులో వుండేలా ఆదేశాలివ్వడంపై జేఏసీ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టిలు దామోదర్‌రావులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల కోరిక మేరకు 2024 జూలై 1 నుంచి 30 జూన్ 2025 వరకు ప్రస్తుతం వున్న 24 శాతం బేసిక్ పే గరిష్టంగా రూ.25 వేల లోపు ఇచ్చేలా కొనసాగింపు ఉత్తర్వులు జారీ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఏపీ జేఏసీ అమరావతి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


రేపు కాళీమాతకు శాకంబరీ అలంకారం

కృష్ణలంక, జూలై 29: త్రిశక్తి పీఠంలోని కాళీమాత అమ్మవారు బుధవారం శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్టు ఈవో కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల వెంకటేశ్వర్లు తెలిపారు. భక్తులంతా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను మంగళవారం ఉదయం 10 గంటల లోపు సమర్పించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సేకరించిన కూరగాయలు, పండ్లతో బుధవారం అమ్మవారిని అలంకరిస్తామని, కావున భక్తులు విరివిగా పాల్గొని శాకాంబరీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవాలన్నారు.

బడుగుల ఆశాజ్యోతి వీఎం రంగా

ఆయన స్ఫూర్తితో సెంట్రల్‌ను అభివృద్ధి పథంలో నడుపుతా: బొండా ఉమా

పాయకాపురం, జూలై 29: పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్‌నగర్‌లోని కాపు కల్యాణ మండపం ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తొలుత రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి రంగా చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాల స్ఫూర్తితోనే సెంట్రల్‌ను అభివృద్ధి పథంలో ఉంచుతానన్నారు. అప్పటికీ ఎప్పటికీ వీఎం రంగా ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు చెన్నుపాటి శ్రీను, పైడి తులసి, బత్తుల కొండ, పైడి శ్రీను, దాసరి కనకారావు పాల్గొన్నారు.



ఎల్‌బీఎస్ నగర్‌లో కాపు కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

అన్ని నియోజకవర్గాల్లో స్వయం ఉపాధి కేంద్రాలు

సత్యనారాయణపురం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 31వ డివిజన్ ముత్యాలంపాడులో అప్పన్న వెంకట కృష్ణయ్య కామేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఉచిత కుట్టుమిషన్ ఉపాధి శిక్షణా కేంద్రాన్ని బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ స్వయం ఉపాధి పథకం ద్వారా ఆర్థికంగా ఎదగాలనుకునే మహిళలకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఉచిత కుట్టుమిషన్ శిక్షణను రాష్ట్రంలో చాలాచోట్ల ఏర్పాటు చేసిందన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో స్వయం ఉపాధి కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళలకు తోడుగా ఉంటుందన్నారు. టీడీపీ 31వ డివిజన్ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



పసుమర్తి కామేశ్వర శర్మ అంత్యేష్టి నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

పసుమర్తి కామేశ్వర శర్మకు వీడ్కోలు

విజయవాడ కల్చరల్, జూలై 29: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త, జ్యోతిష్యశాస్త్ర పండితుడు బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వరశర్మ అంత్యేష్టి కర్మలు కుటుంబసభ్యులు అయోధ్యనగర్‌లోని స్వగృహం వద్ద సోమవారం నిర్వహించారు. అమెరికా నుంచి వచ్చిన ఆయన కుమారుడు కర్మకాండలు నిర్వహించారు. వైదిక ఆచారం ప్రకారం అంత్యేష్టి కర్మలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సుమధుర కళానికేతన్ వ్యవస్థాపకులు హెచ్‌వీఆర్‌ఎస్ ప్రసాద్, పసుమర్తి భాస్కర శర్మ, హైకోర్టు న్యాయవాది విష్ణుభొట్ల జయప్రకాష్, విశ్రాంత అధ్యాపకుడు ఎంసీ దాస్, మాజీ జర్నలిస్టు కృష్ణాజీ, వివిధ కళాసంస్థలు యజమానులు, అభిమానులు, కళాకారులు పెద్దసంఖ్యలో పాల్గొని కామేశ్వర శర్మ పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కృష్ణలంకలోని స్వర్గపురిలో అగ్ని సంస్కారాలు నిర్వహించారు.

వెంకటేశ్వరనగర్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె పర్యటన

భారతీనగర్, జూలై 29: నియోజకవర్గ పర్యటనలో భాగంగా 4వ డివిజన్‌లోని గురునానక్ నగర్, వెంకటేశ్వరనగర్ పార్కు రోడ్లో, కనకదుర్గ ఆఫీసర్స్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, పెద్దలు, కార్పొరేషన్ అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని డ్రైనేజీలను పరిశీలించి వాటి సమస్యలను స్థానికులు నుంచి అడిగి తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, రావి కృష్ణారావు, వెలగా భాస్కరరావు, బాపినేని సింహాద్రి, సాంబశివరావు, జాస్తి కృష్ణారావు, ఘట్టమనేని నాని, చలసాని రమణ, విద్యుత్ శాఖ ఏ.ఈ మురళీ కృష్ణ పాల్గొన్నారు. అలాగే 3వ డివిజన్ కరెన్సీనగర్‌లో టీడీపీ యువ నేత గద్దె కాంత్రికుమార్ స్థానిక పెద్దలతో కలిసి సోమవారం పర్యటించారు. ఆయనతోపాటు కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు తాడి బాబురావు, గద్దె రమేష్, గుత్తి కొండ కృష్ణమోహన్ పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు



ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధులు

ఆర్టీసీ గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

విజయవాడ, బస్టేషన్, జూలై 29: ఆర్టీసీ గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆర్టీసీ ఎండీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు లేఖలు అందించామని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ స్టేట్ మెయింటెనెన్స్ కమిటీ సమావేశంలో చర్చించిన దరిమిలా గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను గుర్తించామన్నారు. ఆ మేరకు ఉన్నతాధికారులకు లేఖలిచ్చామని, రాష్ట్రంలోని 129 డిపోల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంతోపాటు ఖాళీలను భర్తీ చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే గ్యారేజీ సిబ్బందికి ఆధునిక సాంకేతికతతో కూడిన పరికరాలను అందజేయాలని, విడిభాగాలు సమకూర్చాలని కోరినట్లు తెలిపారు.

ఊర్మిళానగర్‌లో సమస్యలను పరిష్కరిస్తాం

భవానీపురం, జూలై 29: 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్‌లోని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి పి.శ్రీధర్ అన్నారు. డివిజన్‌లో పలు ప్రాంతాల్లోని సమస్యలను జోనల్ కమిషనర్ రమ్యతో కలిసి సోమవారం పరిశీలించారు. సైడ్ కాల్వలు పూడికలు తీయాలని, రోడ్లు, డ్రెయిన్లు పూర్తి చేయాలని, తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను పరిష్కరించాలని పలువురు కోరగా, వీటిని పరిష్కరించాలని అధికారులను కోరారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు కొనికి కొండయ్య, బీజేపీ అధ్యక్షుడు పగడాల కృష్ణ పాల్గొన్నారు.

మేజిక్ మిశ్రమం ఓఆర్ఎస్



మాట్లాడుతున్న రైల్వే ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ శౌరిబాల

వన్‌టౌన్, జూలై 29: మేజిక్ మిశ్రమం ఓఆర్ఎస్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శౌరిబాల అన్నారు. ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవం సందర్భంగా స్థానిక రైల్వే ఆసుపత్రిలో జరిగిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. ఓరల్ రీ హైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) ప్రయోజనాలను గురించి ఆమె వివరించారు. ఈ ఏడాది ఇచ్చిన మేజిక్ మిశ్రమం థీమ్ గురించి అవగాహన కల్పించారు. అసిస్టెంట్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డీ సీతారాం పిల్లల్లో అతిసారం గురించి వివరించారు. కుటుంబ సంక్షేమం ఆరోగ్య విభాగం అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఎం జైదీప్ అతిసారం కారణాలు, నివారణ విధానాలను వివరించారు. రోగులు, రోగి సహాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీ పాఠశాలలో తిథి భోజనం

భారతీనగర్, జూలై 29: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనంలో ప్రజల్ని భాగస్వామ్యుల్ని చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో తిథి భోజనం(శుభదిన్ భోజనం) ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా సోమవారం గుణదల ఈఎస్ఐ రోడ్డులోని డీవీజీకేఎంసీ నగర పాలక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి ఆధ్వర్యంలో తిథిభోజనం (శుభదిన్ భోజనం) జరిగింది. దాతలు దాసరి హరికృష్ణ మిల్లెట్స్ లడ్లు, డి.అరుణ అరటి పండ్లు, లయన్స్ క్లబ్ ఈస్ట్ సభ్యులు జెమ్స్ పెరుగును అందించారు.



డీవీజీకేవీఎంసీ నగర పాలక పాఠశాలలో తిథి భోజనం చేస్తున్న విద్యార్థులు

విజయదుర్గ అమ్మవారికి సారె సమర్పణ

చిట్టినగర్, జూలై 29: పాలఫ్యాక్టరీ సమీపంలో విజయదుర్గ, రామలింగేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలోని విజయదుర్గ, పేరంటాల అమ్మకు గణపతి సేవాసమితి కోటా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం మహిళా భక్తులు సారెను సమర్పించారు. మహిళలు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి సారెను సమర్పించారు. అనంతరం మహిళలు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు.



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

టీడీపీ కార్యకర్త సింహాచలం కుటుంబానికి ఆర్థిక సాయం

వన్‌టౌన్, జూలై 29: స్థానిక 52వ డివిజన్‌లో మృతి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త సక్కుర్తి సింహాచలం మనవరాళ్లకు ఎమ్మెల్యే సుజనా చౌదరి రూ.10వేలు, కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. సింహాచలం కుమార్తె, అల్లుడు ఇద్దరూ మరణించడంతో మనవరాళ్లు సింహాచలం వద్దే ఉంటున్నారు. ఇప్పుడు అతను కూడా మరణించిడంతో మనవరాళ్లకు దిక్కులేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి చంటి తీసుకు వెళ్లగా ఆయన వెంటనే స్పందించి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. చంటి కూడా మరో రూ.10వేలు ఇచ్చారు. మొత్తం రూ.20 వేలను సోమవారం సింహాచలం ఇంటికి వెళ్లి అందించి బ్యాంక్‌లో పిల్లల పేరిట డిపాజిట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చంటి, ఎమ్మెల్యే కార్యాలయం నుంచి తరుణ్, బాబీ, దేవర కల్యాణ్, సక్కుర్తి దుర్గారావు, గుర్రం వెంకటేశ్వరరావు, శంకర్ నరేంద్ర పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కృష్ణలంక, జూలై 29: కృష్ణలంకలోని 16, 17 డివిజన్లలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజా పరిష్కార వేదిక జరిగే నగర పాలకసంస్థలో కమిషనర్ ధ్యానచంద్రకు సీపీఎం రాష్ట్ర నేత దోనేపూడి కాశీనాథ్ స్థానికులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. భూపేష్‌గుప్తా నగర్ కచ్చా డ్రైన్ స్థానంలో కొత్త డ్రైనేజీని నిర్మించి చెత్త, వ్యర్థాలు కాలువలో వేయకుండా ఏర్పాటు చేయాలని, తారకరామనగర్‌లో ఇళ్లల్లోకి వస్తున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు కాశీనాథ్ విన్నవించారు. డ్రైనేజీ నీటితో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో భూపేష్‌గుప్తానగర్, తారకారామా నగర్ ప్రాంతాలు కృష్ణానది వరద ముంపుకు గురయ్యేవని, స్థానికులు 40 ఏళ్ల పోరాట ఫలితంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయి వరద ముంపునకు గురవకుండా ఉన్నారన్నారు. కృష్ణానదికి రిటైనింగ్ వాల్ కట్టిన తర్వాత తారకరామానగర్, భూపేష్‌గుప్తానగర్ డ్రైనేజీ నీరు వెళ్లేందుకు ఓపెన్ డ్రైనేజీ నిర్మించాల్సి ఉందని, దీన్ని కట్టకపోవడంతో ఇళ్లల్లో వాడే మురుగునీరు, వర్షపునీరు కలిసి వెనక్కి తన్నడం వలన ఇళ్లల్లోకి మురుగునీరు వస్తోందని కాశీనాథ్, కమిషనర్‌కు విన్నవించారు. దీంతో స్థానికులు వర్షాకాలం కావడం, మురుగునీటి వలన దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో ఈ ప్రాంతవాసులు విషజ్వరాలు బారిన పడుతున్నారన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సీపీఎం నేతలు పుప్పాల కృష్ణ, కోటిరెడ్డి, కోటేశ్వరరావు, తమ్మిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కృష్ణలంకలో 16,17 డివిజన్ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దోనేపూడి కాశీనాథ్

మొక్కలు నాటండి

ఇబ్రహీంపట్నం, జూలై 29: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ విధిగా మొక్కనాటి దాన్ని కాపాడాలని అప్మెల్ సంస్థ ఎండీ వై.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం జన్మదినం సందర్భంగా అప్మెల్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఉద్యోగులు, కార్మిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, స్వీట్లు పంపిణీ

పటమట, జూలై 29: శిక్ష సప్తాహ్‌లో భాగంగా హ్యాపీ ఫీట్ ఆర్గనైజేషన్ సభ్యులు సోమవారం కృష్ణలంక గోశాల, పటమట ఎలక్ట్రిసిటీ కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాత పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేపట్టారు. ఆర్గనైజేషన్ సభ్యులు గుడిసేవా శ్రావణ్, హరీష్ మాట్లాడుతూ ఏటా తమ సంస్థ తరపున విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, ఎవరైనా కళాశాల ఫీజు చెల్లించలేక ఇబ్బందులు పడుతుంటే తమ దృష్టికి తీసుకువస్తే తగిన సాయం చేస్తామన్నారు. ప్రసాద్, ముఖేష్, రాజా, నాగేంద్ర, షఫీ, విజయ్, వంశీ పాల్గొన్నారు.



ఎలక్ట్రిసిటీ కాలనీ పాఠశాలలో విద్యార్థులకు రాత పుస్తకాలను పంపిణీ చేస్తున్న హ్యాపీ ఫీట్ ఆర్గనైజేషన్ సభ్యులు

రిఫరెన్స్ పుస్తకాలు అందజేత

గవర్నర్‌పేట, జూలై 29: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న రిఫరెన్స్ విద్యార్థుల కోసం నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పడమట రాఘవేంద్రరావు రూ.3వేలు విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. గ్రంథాలయ అధికారిణి విజ్ఞప్తి మేరకు స్పందించిన ఆయన సోమవారం ఈ పుస్తకాలను రిఫరెన్స్ విభాగానికి విరాళంగా అందించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావును, గ్రంథాలయాధికారిణి, విద్యార్థులు అభినందించి ధన్యవాదాలు తెలిపారు. పుస్తకాలను విద్యార్థులకు పరిచయం చేసిన రమాదేవి, వీటిని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులను కోరారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

31 సాయంత్రం పలుచోట్ల నీటి సరఫరా బంద్

వన్‌టౌన్, జూలై 29: కొత్తపేట చేపలమార్కెట్ 5ఎంజీడీ ప్లాంట్ అవుట్‌లెట్ పైపునకు ఇంటర్ కనెక్షన్ పనులు నిమిత్తం ఈనెల 31న 53, 17, 50, 51 డివిజన్లకు సంబంధించి పాలు ప్రాంతాల్లో నీటి సరఫరాను బంద్ చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల మార్కెట్ ప్రాంతం, కొత్తపేట, ఇస్లాంపేట, మహంతిపురం, కుమ్మరి వీధి, పొట్టి శ్రీరాములు కాలేజీ పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం నుంచి నీటి సరఫరా ఉండదని తిరిగి ఆగస్టు 1న ఉదయం నీటి సరఫరా జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గవర్నర్‌పేట, జూలై 29: జమ్మిచెట్టు ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం ఈనెల 30న ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాడవపేట, జాన్ వీధి, జక్రయ్య వీధి, ఎల్లాటి ఆంజనేయులు వీధి, కార్వే ఆఫీసు రోడ్డు, స్టేడియం వాటర్ ట్యాంక్ రోడ్డు, వీఎంసీ వాటర్ వర్క్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సత్యనారాయణపురం: ముత్యాలంపాడు సబ్ స్టేషన్ పరిధిలోనూ మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చల్లపల్లి వారి వీధి, జీఎస్‌రాజు రోడ్డు, రాణాప్రతాప్‌వీధి, కొమ్మువారి వీధి, బ్రహ్మయ్య పంతులు రోడ్డు, సుమాణం వారి వీధీ, అమలిస్కూల్, మారుతీ వ్యాయామశాల రోడ్డు, భగత్‌సింగ్ రోడ్డు, జనార్ధనరావు వీధి, వందనపు వారి వీధి, పాపరాజు వీధి, కనకరాజు వీధి, కాపూరివారి వీధి, నర్రావారి వీధుల్లో పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలన్నారు.

ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైం ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ

ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,50,000

ఎంసీఏ

ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50% మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.1,25,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 14
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగరం ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017
- **వెబ్‌సైట్:** https://audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yArgvZGలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు.



● డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండో తరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులూ దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూమీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

● డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

● పీజీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ (మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

● సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

● ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

నవ్య | చిత్రజ్యోతి

పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?

తమిళ చిత్ర పరిశ్రమ సోమవారం సమావేశమై కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. వీటిల్లో ప్రధానమైంది, తెలుగు నిర్మాతలు సాహసించి తీసుకోలేనిది ఏమిటంటే .. ఇకపై హీరోలు, హీరోయిన్లకు ముందుగా అడ్వాన్సులు ఇవ్వకూడదన్నది. కొంతమంది నటీనటులు, టెక్నీషియన్లు నిర్మాతల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుని సినిమాలకు డేట్స్ ఇవ్వకుండా ఆ తర్వాత ఒప్పుకొన్న చిత్రాలకు వర్క్ చేస్తున్నారు. ఇకపై అలా కాకుండా మొదట ఎవరివద్ద అడ్వాన్స్‌లు తీసుకున్నారో వారి షూటింగ్ పూర్తి చేసిన తర్వాతే కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొనాలి. తమిళంలో ఈ నిర్ణయాన్ని అమలు చేయగలరేమో కానీ తెలుగులో సాధ్యమయ్యే పనేనా అనే చర్చ తెలుగు చిత్ర పరిశ్రమలో మొదలైంది. ఎందుకంటే ప్రముఖ సంస్థలు పెద్ద హీరోలకు అడ్వాన్సులు ఇవ్వడం, వారు తీసుకోవడం సహజంగా జరిగేదే. ఇలా అడ్వాన్స్ ఇచ్చిన వెంటనే ఆ సినిమా మొదలవుతోందా అంటే చాలా సందర్భాల్లో లేదనే చెప్పాల్సి ఉంటుంది. కథ కుదరకో, కాంబినేషన్ సెట్ అవకో సినిమాలు ప్రారంభం కావడానికి లేట్ కావచ్చు. ఆ లేట్ అనేది నెలలు కావచ్చు, సంవత్సరాలు కావచ్చు. ఏళ్ల తరబడి వెయిట్ చేసినా చివరకు జరగని సందర్భాలు ఉన్నాయి కూడా. ఈ లోపు అన్నీ సెట్ అయిన వేరే సినిమా మొదలుపెట్టేస్తుంటారు హీరోలు. హీరోలకు ఇచ్చిన అడ్వాన్సులకు వడ్డీలు కడుతూ లోలోపల బాధ పడుతుంటారు తప్ప బయటకు వ్యక్తం వ్యక్తం చేయలేని పరిస్థితి. ఎందుకంటే ఎప్పటికైనా హీరోగారు కరుణించి డేట్స్ ఇవ్వవచ్చనే ఓ ఆశ వారిని సంవత్సరాల తరబడి వెయిట్ చేసేలా చేస్తుంటుంది. అలాగే ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ఓ వారం రోజుల పాటు షూటింగ్ చేసో, లేక కొంత భాగం షూట్ చేసిన తర్వాత ఆ సినిమాను అలా పక్కన పెట్టేసి మరో కొత్త చిత్రం చేసే హీరోలు తెలుగు చిత్రపరిశ్రమలోనూ ఉన్నారు. ఇలాంటి విషయాలపై తెలుగు చిత్ర పరిశ్రమ కూడా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడిస్తుంటుంది కానీ అవి ఆచరణకు దూరంగానే ఉంటున్నాయి. ఇటువంటి నేపథ్యంలో తమిళ నిర్మాతలమండలి తీసుకున్న నిర్ణయాలు రేకెత్తిస్తున్నాయి. తెలుగులో కూడా ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని నిర్మాతల మనసులో ఉంది కానీ పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?

తమిళ నిర్మాతల మండలి నిర్ణయాలు ఇవే

అధ్యక్షుడు ఎన్.మురళి నేతృత్వంలో సభ్యులు సోమవారం వివిధ సంఘాలకు చెందిన నిర్వాహకులు, ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఇందులో పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. అవేవిటో ఇప్పుడు చూద్దాం.

- ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ మొదలు పెట్టకూడదు. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న సినిమాలన్నీ అక్టోబరు 31 లోపు పూర్తి చేయాలని ఆయా చిత్ర బృందాలకు సూచించింది.
- పెండింగ్‌లో ఉన్న చిత్రాలు, ఇచ్చిన అడ్వాన్స్‌లపై నివేదిక అడిగిన నిర్మాతల మండలి.
- నవంబరు ఒకటినుంచి ఎలాంటి సినిమాల చిత్రీకరణ చేపట్టకూడదు.
- ఇప్పటికే చిత్రీకరణ పూర్తయి విడుదలకు నోచుకోని చిత్రాల పరిస్థితి ఒక కొలిక్కి వచ్చేంత వరకు ఆగస్టు 16 నుంచి కొత్త సినిమాలేవీ చిత్రీకరణ మొదలుపెట్టకూడదు.
- నటీనటులు, సాంకేతిక నిపుణులు జీతభత్యాలు పెంచుకుంటూ పోతున్నారని, ఖర్చులకు ఒక విధానమంటూ లేకపోయిందని, ఈ అంశాలపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిర్మాతలమండలి అభిప్రాయపడింది. వీటిని క్రమబద్ధీకరించడంతో పాటు సరైన ప్రణాళికతో ముందుకుసాగాలని, అందువల్ల నవంబరు ఒకటో తేదీ నుంచి ఏ ఒక్క సినిమా షూటింగ్ జరగరాదని తీర్మానించింది.
- అగ్రనటులు నటించే కొత్త చిత్రాలను ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలకు ఇవ్వాలని తీర్మానించింది.


-ఆంధ్రజ్యోతి, చెన్నై



ధనుష్ పై ఆగ్రహం

హీరో ధనుష్‌పై తమిళ నిర్మాతల మండలి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈయన ఆరు చిత్ర నిర్మాణ సంస్థల నుంచి అడ్వాన్స్‌లు తీసుకున్నారని, ఇలా అడ్వాన్సులు చెల్లించిన మిగిలిన నిర్మాతలు కూడా అసోసియేషన్‌తో మాట్లాడి తమ పనులు మొదలు పెట్టాలని సూచన చేసింది. ఇకపై నిర్మాతల మండలి అనుమతి ఉంటేనే ధనుష్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తుంది. అయితే ధనుష్ ఇప్పుడు తెలుగులో రెండు చిత్రాల్లో నటిస్తున్నారు కనుక ఈ నిర్ణయాల ప్రభావం ఆయన మీద అంతగా ఉండక పోవచ్చు.

కంటి చికిత్స కోసం అమెరికాకు?



బాలీవుడ్ నటుడు షారూఖ్‌ఖాన్ అత్యవసర కంటి చికిత్స కోసం అమెరికా వెళ్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన కంటి సమస్యతో సోమవారం ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు అమెరికా వెళ్లాలని సూచించినట్లు సమాచారం. దీంతో నేడు షారూఖ్ అమెరికా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై షారూఖ్ పీఆర్ బృందం ఇంతవరకూ స్పందించలేదు. 2014లో షారూఖ్ కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఆయన ప్రస్తుతం కింగ్ చిత్రంలో నటిస్తున్నారు.

మూర్ఖులను గెలవలేము



ఆరోగ్యానికి సంబంధించిన చిట్కాలను అభిమానులతో పంచుకున్న సమంత వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. తాజాగా నయనతారకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. తనకు ఆసక్తిగా అనిపించిన పలు విషయాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమె మందార పువ్వులతో చేసిన టీ అంటే తనకు ఎంతో ఇష్టమని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తెలిపారు. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు పలు దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి ఉపశమనం దొరుకుతుందని నయనతార పేర్కొన్నారు. ఫాలోవర్స్‌ను నయనతార తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆమె చెప్పినదాంట్లో నిజం లేదని కొంతమంది వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె తన పోస్ట్‌ను తొలగించారు. 'మూర్ఖులతో వాదనకు దిగొద్దు. మీరు గెలవలేరు. మిమ్మల్ని కూడా వారి స్థాయికి దిగజార్చి ఓడిస్తారు' అనే మార్క్ ట్వైన్ సూక్తిని షేర్ చేశారు. తనను విమర్శించిన వారిని ఉద్దేశించి ఆమె ఈ పోస్ట్ పెట్టారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

కొత్తగా..



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రం నుంచి సోమవారం అప్డేట్ వచ్చింది. ప్యాన్ ఇండియా గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ప్రభాస్ వింటేజ్ లుక్‌లో చార్మింగ్‌గా కనిపించారు. రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే 40 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఆగస్టు 2 నుంచి మరో భారీ షెడ్యూల్ ప్రారంభించనున్నారు.

చిత్రం: రాజాసాబ్
ప్రొడ్యూసర్: టీజీ విశ్వ ప్రసాద్
డైరెక్టర్: మారుతి
బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ
నటీనటులు: నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్, యోగిబాబు తదితరులు

ఆగస్టులో భవనమ్



కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందిన హారర్ కామెడీ 'భవనమ్'. ఆగస్టు 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. నటుడు సప్తగిరి మాట్లాడుతూ 'సూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్‌లో ఓ సినిమా చేయాలనే కల 'భవనమ్'తో నెరవేరింది' అన్నారు. ఇందులో కామెడీ యాక్షన్ సాంగ్స్ ప్రేక్షకులను అలరిస్తాయని షకలకశంకర్ చెప్పారు. సినిమాను చాలా గ్రిప్పింగ్‌గా తెరకెక్కించాం, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు బాలాచారి తెలిపారు.

చిత్రం: భవనమ్
ప్రొడ్యూసర్: ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి
డైరెక్టర్: బాలాచారి కూరెళ్ల
బ్యానర్: సూపర్‌గుడ్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్
నటీనటులు: సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, తాగుబోతు రమేశ్, మాళవిక సతీషన్ తదితరులు

ఉషా పరిణయ గాథ



ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సాయిదుర్గ తేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త నటీనటులతో రూపొందుతున్న ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, ఈ తరహా చిత్రాలు మరిన్ని వస్తాయి అని సాయిదుర్గతేజ్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా కుటుంబం మద్దతుతో ఈ చిత్రాన్ని నిర్మించాను. ధ్రువన్ మంచి సంగీతం అందించాడు' అన్నారు. అందరి సహకారంతో ఓ మంచి సినిమాను అందిస్తున్నాం, సినిమా చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు అని హీరో చెప్పారు. ఈ సినిమాతో నటిగా నాకు మంచి పేరు వస్తుందని హీరోయిన్ చెప్పారు.

చిత్రం: ఉషా పరిణయం
ప్రొడ్యూసర్: కె. విజయ్ భాస్కర్
డైరెక్టర్: కె. విజయ్ భాస్కర్
బ్యానర్: విజయ్ భాస్కర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్
నటీనటులు: శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య


బడ్డీ టికెట్ ధరల తగ్గింపు



అడ్వంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'బడ్డీ'. ఆగస్టు 2న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో బడ్డీ సినిమా రేట్లను తగ్గిస్తున్నట్లు మేకర్స్ సోమవారం ప్రకటించారు. సింగిల్ స్క్రీన్లలో రూ. 99, మల్టీప్లెక్స్‌లో రూ. 125గా టికెట్ ధరలు నిర్ణయించారు. భారతీయ వెండితెరపైన ఒక సరికొత్త ప్రయోగంగా 'బడ్డీ' సినిమా నిలుస్తుందని ఈ సందర్భంగా మేకర్స్ తెలిపారు.

చిత్రం: బడ్డీ
ప్రొడ్యూసర్: కేఈ జ్ఞానవేల్ రాజా, అధన్ జ్ఞానవేల్ రాజా
డైరెక్టర్: శామ్ ఆంటోన్
బ్యానర్: స్టూడియో గ్రీన్ ఫిలింస్
కాస్టింగ్: అల్లు శిరీష్, గాయత్రి భరద్వాజ్, అజ్మల్ అమీర్, అలీ, ముఖేశ్ కుమార్ తదితరులు

సీనియర్ సినీ నిర్మాత సూర్యనారాయణబాబు కన్నుమూత



సీనియర్ నిర్మాత, మహేశ్‌బాబు మేనమామ ఉప్పలపాటి సూర్యనారాయణ బాబు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. సూపర్‌స్టార్ కృష్ణకు బావ అయిన సూర్యనారాయణ బాబు 'మనుషులు చేసిన దొంగలు', రామ్ రాబర్ట్ రహీమ్', 'సంధ్య', 'బెజవాడ రౌడీ' తదితర చిత్రాలు నిర్మించారు. రాజకీయాల్లోకి ప్రవేశించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుడివాడ నియోజక వర్గం నుంచి ఎన్టీఆర్ పై పోటీ చేసి ఓడిపోయారు. నటుడు విజయ్‌చందర్‌తో కలిసి ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా 'కలియుగ విశ్వామిత్ర' చిత్రాన్ని కూడా నిర్మించారు. సూర్యనారాయణ బాబు పార్థివ దేహాన్ని మంగళవారం ఉదయం కోకాపేటలోని మూవీ టవర్స్‌లో ఉంచి, ఆ తర్వాత మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు.



తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ తమ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దర్శక సంజీవని పేరుతో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఉపాధ్యక్షుడు సాయి రాజేశ్, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిస్ ఒలింపిక్స్ (జూలై 26 - ఆగస్టు 11)

ఆఖరి మ్యాచ్ ఆడేశా

రిటైర్మెంట్ ప్రకటించిన రోహన్ బోపన్న



న్యూఢిల్లీ: ఆటగాడిగా భారత టెన్నిస్‌తో రోహన్ బోపన్న ప్రస్థానం ముగిసింది. ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌తో 22 ఏళ్ల తన టెన్నిస్ కెరీర్‌కు అతడు ఘనంగా ముగింపు పలికాడు. శ్రీరామ్ బాలాజీ జతగా పారిస్ ఒలింపిక్స్ పురుషుల డబుల్స్ బరిలో దిగిన బోపన్న.. తొలి రౌండ్‌లో పరాజయం చవిచూశాడు. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్ పురుషుల సింగిల్స్‌లో కాంస్యం గెలిచిన తర్వాత విశ్వక్రీడల టెన్నిస్‌లో భారత్‌కు మరో పతకం లభించలేదు. అయితే 2016 రియో గేమ్స్‌లో సానియా మీర్జాతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ పతకాన్ని రోహన్ త్రుటిలో మిస్సయ్యాడు. ఆ క్రీడల్లో బోపన్న, సానియా జోడీ నాలుగో స్థానంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ ఆరంభ రౌండ్‌లోనే వెనుదిరిగినా..రెండు దశాబ్దాల తన టెన్నిస్ కెరీర్‌పట్ల బోపన్న సంతృప్తి ప్రకటించాడు. 'దేశం తరపున ఇదే నా ఆఖరి మ్యాచ్. టెన్నిస్ క్రీడలో ప్రస్తుతం నేను ఏ స్థాయిలో ఉన్నానో అర్థమైంది. ఇకపై సాధ్యమైనంత కాలం టెన్నిస్ సర్క్యూట్‌ను ఎంజాయ్ చేస్తా' అని బోపన్న అన్నాడు. తద్వారా 2026 జపాన్ ఆసియా క్రీడల్లో పాల్గొనే అవకాశాలు ఏమాత్రం లేవని అతడు స్పష్టంజేసినట్టయింది. డేవిస్ కప్ నుంచి రోహన్ ఇప్పటికే రిటైరైన సంగతి తెలిసిందే.

ఇదీ కెరీర్ ఘనత

కెరీర్‌లో మొత్తం 26 డబుల్స్ టైటిల్స్ సొంతం చేసుకున్న బోపన్న..ఈ ఏడాది మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్ అందుకున్నాడు. ఆపై డబుల్స్‌లో నెం.1 ర్యాంక్‌నూ దక్కించుకున్నాడు. 2017లో ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌గా నిలిచాడు. 2010, 2023లో యూఎస్ ఓపెన్‌లో డబుల్స్ ఫైనల్‌కు చేరాడు. వింబుల్డన్‌లో మూడు సార్లు (2013, 2015, 2023), ఫ్రెంచ్ ఓపెన్ (2022, 2024) రెండుసార్లు డబుల్స్ సెమీస్ వరకు వచ్చాడు. 2012, 2016 ఒలింపిక్స్ లోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

బోపన్న జోడీ అవుట్

టెన్నిస్‌లో భారత పోరాటం ముగిసింది. డబుల్స్‌లో బోపన్న జంట తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. రోహన్ బోపన్న-శ్రీరామ్ బాలాజీ జంట 5-7, 2-6తో ఫ్రాన్స్‌కు చెందిన ఎడ్వర్డ్ రోజర్-గేల్ మోన్‌ఫిల్స్ ద్వయం చేతిలో పోరాడి ఓడింది. సింగిల్స్‌లో సుమిత్ నగాల్ కూడా మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

హర్మన్ మళ్లీ ఆదుకున్నాడు

అర్జెంటీనాతో భారత్ మ్యాచ్ డ్రా



పారిస్: కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి ఆదుకున్నాడు. ఒలింపిక్స్ హాకీ పోటీల్లో భాగంగా మాజీ చాంపియన్ అర్జెంటీనాతో సోమవారం జరిగిన పూల్ 'బి' మ్యాచ్‌ను భారత్ 1-1తో డ్రా చేసుకుంది. చివరి నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్ గోల్‌గా మలచడంతో మ్యాచ్‌ను మనోళ్లు డ్రా చేయగలిగారు. అయితే ఈ మ్యాచ్‌లో దీనికంటే ముందు లభించిన తొమ్మిది పెనాల్టీ కార్నర్లను జట్టు వృథా చేసుకోవడం గమనార్హం. ఇక..సారథి హర్మన్ జట్టును ఇలా గట్టెక్కించడం వరుసగా రెండోసారి. న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లోనూ ఆఖరి క్షణాల్లో లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను హర్మన్ గోల్‌గా మల్చడంతో జట్టు విజయం అందుకున్న విషయం విదితమే. ఈ పోరులో 22వ నిమిషంలో లుకాస్ మార్టినేజ్ ఫీల్డ్ గోల్ చేసి అర్జెంటీనాను ఆధిక్యంలో నిలిపాడు. 36వ నిమిషంలో మరో గోల్ చేసే మహత్తర అవకాశం అర్జెంటీనాకు దక్కింది. పెనాల్టీ స్ట్రోక్‌ను మైకో కసేలా గోల్ పోస్ట్‌లోకి పంపలేకపోవడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో చిత్తయిన రియో విశ్వక్రీడల స్వర్ణ పతక విజేత అర్జెంటీనా..భారత్‌తో పోరులో విజయం సాధించడం అనివార్యమైంది. అందుకోసం శతధా యత్నించినా డ్రాతో సరిపెట్టుకోక తప్పలేదు. 10వ నిమిషంలో హర్మన్ సేనకు మొదటి పెనాల్టీ కార్నర్ దక్కింది. కానీ సంజయ్ కొట్టిన షాట్‌ను అర్జెంటీనా విజయవంతంగా అడ్డుకుంది. ఆ వెంటనే గోల్ కొట్టే సువర్ణావకాశం భారత్‌కు లభించింది. అభిషేక్ కొట్టిన షాట్ 'క్రాస్ బార్'ను తాకుతూ బయటకు వెళ్లిపోయింది. కానీ మ్యాచ్ మరి కొద్ది క్షణాల్లో ముగుస్తుందనగా లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ గోల్‌గా కొట్టి జట్టును రక్షించాడు. ఆరు జట్ల పూల్ 'బి'లో నాలుగు పాయింట్లతో భారత్ మూడో స్థానంలో కొనసాగుతోంది. మంగళవారం జరిగే మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో మనోళ్లు తలపడనున్నారు.

మరొకటి ఊరిస్తోంది





రెండో మెడల్‌కు చేరువలో మను భాకర్

సరబ్‌తో కలిసి మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్య పోరుకు అర్హత

నేడే పతక పోరు మ.1 గం. నుంచి

మను జోడీ మెరుగైన ప్రదర్శన మినహా.. మిగతా షూటర్లు గురి తప్పడంతో.. ఒలింపిక్స్‌లో మూడోరోజు భారత్ పతకంతో మురిపించలేక పోయింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మను-సరబ్‌జోత్ జంట కాంస్య పోరుకు చేరుకోగా.. రైఫిల్ షూటర్ అర్జున్ బబుతా త్రుటిలో పతకం కోల్పోయాడు. రమితా జిందాల్ పేలవ ప్రదర్శనతో మెడల్‌కు దూరమైంది. పురుషుల ఆర్చరీ టీమ్ కూడా క్వార్టర్స్‌లో ఓడి నిరాశపర్చింది. అయితే, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సాత్విక్ జోడీ క్వార్టర్స్ బెర్త్‌ను ఖరారు చేసుకోవడం ఊరటనిచ్చే విషయం.

పారిస్: భారత్‌కు చారిత్రక పతకం అందించిన ఆత్మవిశ్వాసంతో ఉన్న మను భాకర్ మరో మెడల్‌పై గురి పెట్టింది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్ జోడీగా మను కాంస్య పోరుకు చేరుకొంది. సోమవారం జరిగిన 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మను భాకర్-సరబ్‌జోత్ సింగ్ జోడీ పాయింట్ తేడాతో గోల్డ్ కొల్లగొట్టే గొప్ప అవకాశాన్ని కోల్పోయింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో మను-సరబ్‌జోత్ మొత్తం 580 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచారు. 579 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచిన కొరియా జోడీతో మను ద్వయం మంగళవారం జరిగే కాంస్య పోరు ప్లేఆఫ్స్‌లో తలపడనుంది. తొలి రెండు సిరీస్‌ల్లో భాకర్ 98 పాయింట్లతో అదరగొట్టినా.. మూడో సెట్‌లో 95 పాయింట్లు మాత్రమే స్కోరు చేసింది. అయితే, సింగ్ 95, 97, 97 పాయింట్లు సాధించాడు. తొలి సెట్‌లో సరబ్‌జోత్ తక్కువ పాయింట్లు స్కోరు చేయడంతో గోల్డ్ మెడల్ పోరుకు చేరుకొని.. కనీసం రజతం ఖరారు చేసుకొనే అవకాశాన్ని భారత్ చేజార్చుకొంది. టర్కీ జంట 582 పాయింట్లతో టాప్‌లో నిలవగా.. సెర్బియా ద్వయం 581 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి స్వర్ణ పోరు ప్లేఆఫ్స్‌కు చేరుకొన్నాయి. కాగా, ఇదే ఈవెంట్‌లోకి మరో భారత జంట రిథమ్ సంగ్వాన్-అర్జున్ సింగ్ చీమా 576 పాయింట్లతో పదో స్థానంలో నిలిచి పతక రౌండ్‌కు అర్హత సాధించలేక పోయింది.

అయ్యో.. అర్జున్



అద్భుతంగా ఆరంభించినా.. చివర్లో ఒత్తిడికిలోనైన అర్జున్ బబుతా త్రుటిలో పతకం చేజార్చుకొన్నాడు. పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో బబుతా 208.4 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గే అవకాశాన్ని కోల్పోయాడు. చివరి షాట్‌లో మూడో స్థానంలో నిలిచిన క్రొయేషియా షూటర్ మిరాన్ మరికిక్ 10.7 స్కోరు చేస్తే.. అర్జున్ 9.5 పాయింట్లు మాత్రమే సాధించాడు. లిహవ్ షెంగ్ (చైనా) స్వర్ణం గెలవగా.. విక్టర్ లిండ్ గ్రెన్ (స్వీడన్) రజతం, మిరాన్ కాంస్యం దక్కించుకొన్నారు. మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో రమితా జిందాల్ 143.5 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచింది. పురుషుల ట్రాప్‌లో తొలి మూడు క్వాలిఫికేషన్ రౌండ్లు పూర్తయ్యే సరికి పృథ్వీరాజ్ తొండైమాన్ 30వ ర్యాంక్‌లో నిలిచాడు. మంగళవారం జరిగే మరో రెండు 'క్వాలిఫికేషన్స్' పూర్తయిన తర్వాత ఫైనల్ చేరే ఆరుగురిని నిర్ణయిస్తారు.

క్వార్టర్స్‌కు సాత్విక్ జోడీ

బ్యాడ్మింటన్ డబుల్స్‌లో టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-సిలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి ఆడాల్సిన రెండో మ్యాచ్ రద్దయింది. జర్మనీ జంట లమ్స్‌ఫస్-మార్విన్ సీడెల్‌తో సాత్విక్ తలపడాల్సి ఉంది. అయితే, లమ్స్‌ఫస్ గాయపడడంతో జర్మనీ జంట ఒలింపిక్స్‌నుంచి వైదొలిగింది. దీంతో పోటీలో



మూడు జంటలు మాత్రమే నిలిచాయి. కానీ, ఫ్రాన్స్‌కు చెందిన లుకాస్ కోర్వీ-రోనన్ లబార్ జోడీ తామాడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఈ నేపథ్యంలో ఒక్కో మ్యాచ్ నెగ్గిన సాత్విక్ జోడీ, ఇండోనేసియాకు చెందిన అర్దియాంటో-అల్ఫియాన్ జంటలు టాప్-2లో నిలిచి నాకౌట్ బెర్త్‌లను ఖరారు చేసుకొన్నాయి. మంగళవారం ఈ రెండు జోడీల మధ్య జరిగే మ్యాచ్‌తో గ్రూప్ విన్నర్ ఎవరనేది తేలుతుంది.

లక్ష్యసేన్ తొలి మ్యాచ్ రద్దయినా..

తొలి మ్యాచ్ విజయాన్ని రద్దు చేసినా.. లక్ష్య సేన్ జోరు మాత్రం తగ్గలేదు. పురుషుల సింగిల్స్ గ్రూప్-ఎల్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో లక్ష్య సేన్ 21-19, 21-14తో జూలియన్ (బెల్జియం)పై నెగ్గాడు. మంగళవారం జరిగే ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో మూడో సీడ్ జొనాథన్ (ఇండోనేసియా)తో సేన్ తలపడనున్నాడు. ఈ మ్యాచ్‌తో టోర్నీలో ఎవరు ముందంజ వేస్తారో తేలిపోతుంది. 16 గ్రూప్‌ల నుంచి టాప్‌లో నిలిచిన ఆటగాడు మాత్రమే నాకౌట్‌కు అర్హత సాధిస్తారు. కాగా కెవిన్ కార్డన్‌తో లక్ష్య సేన్ తలపడి గెలిచిన తొలి మ్యాచ్ ఫలితం రద్దయింది. ఇందుకు కెవిన్ గాయంతో పోటీల నుంచి వైదొలగడమే కారణం. నిబంధనల ప్రకారం గ్రూప్ దశలో ఏ ఆటగాడైనా గాయాలతో టోర్నీ నుంచి వైదొలిగితే అతడు ముందుగా ఆడిన మ్యాచ్‌లు, ఆడాల్సిన మ్యాచ్‌లను పరిగణనలోకి తీసుకోరు. ఆడిన మ్యాచ్‌లు ఏవైనా ఉంటే ఆ ఫలితాన్ని రద్దు చేస్తారు. ఇక, మహిళల డబుల్స్‌లో వరుసగా రెండో ఓటమితో అశ్విని జోడీ కథ దాదాపుగా ముగిసింది.

ఒలింపిక్ రికార్డు సాధించినా..





చైనా టీనేజ్ షూటర్ హువాంగ్ యూటింగ్ ఒలింపిక్ రికార్డు సాధించినప్పటికీ స్వర్ణం చేజారడం ఆశ్చర్యానికి గురిచేసింది. మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో చైనాకు చెందిన 17 ఏళ్ల హువాంగ్, 16 ఏళ్ల బాన్ హ్యోజిన్ (కొరియా) ఇద్దరూ 251.8 పాయింట్లతో ఒలింపిక్ రికార్డు సృష్టించి తొలి స్థానంలో నిలిచారు. అయితే విజేతను తేల్చేందుకు నిర్వహించిన షూటాఫ్‌లో బాన్ 10.4 స్కోరు చేయగా.. అటు హువాంగ్ 10.3తో నిలిచింది. దీంతో కేవలం 0.1 తేడాతో హ్యోజిన్ స్వర్ణం ఎగరేసుకుపోవడంతో, హువాంగ్ రజతంతో సంతృప్తి పడాల్సి వచ్చింది.

బస్ ఆగిపోతేనేం..

ఒక్కోసారి తాము నేర్చుకున్న క్రీడ కష్టకాలంలో ఎలా ఆదుకుంటుందో ఈ సరదా సంఘటన చూస్తే తెలుస్తుంది. సోమవారం జరిగే ఈవెంట్ కోసం కెనడా, యూఎస్ఏకు చెందిన స్కేట్‌బోర్డ్ క్రీడాకారులను తీసుకుని ఓ బస్ వారి బస నుంచి బయలుదేరింది. అయితే వేదికకు రెండు కి.మీ దూరంలోనే ఓ ఇరుకైన మలుపు దగ్గర ఇరుక్కుపోయింది. పది నిమిషాలు వేచిచూసినా ఫలితం లేకపోవడంతో అంతా కిందికి దిగాల్సివచ్చింది. కానీ ఇక్కడే వారు తమ టాలెంట్‌ను ప్రదర్శించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తమ బ్యాగుల్లోంచి స్కేట్‌బోర్డులను బయటికి తీసి పారిస్ వీధుల గుండా ఎంచక్కా స్కేటింగ్ చేసుకుంటూ వేదికవద్దకు వెళ్లారు. ఇదంతా కెనడా అథ్లెట్ మ్యాట్ బెర్గర్ వీడియో తీయడంతో వైరల్‌గా మారింది.

కొడుకు కోరాడు.. పతకం పట్టేశాడు



బ్రిటన్‌కు చెందిన 30 ఏళ్ల డైవర్ టామ్ డేలీ టోక్యో గేమ్స్‌లో స్వర్ణం సాధించాక ఆటకు వీడ్కోలు పలికాడు. కానీ పారిస్‌లోనూ బరిలోకి దిగి రజతంతో మెరిశాడు. డేలీ రీఎంట్రీకి కారణం.. అతడి ఐదేళ్ల కుమారుడు రాబీ కావడం విశేషం. 'టోక్యో గేమ్స్ తర్వాత కొలరాడో స్ప్రింగ్స్‌లోని ఒలింపిక్ మ్యూజియానికి రాబీతో వెళ్లా. అక్కడి చిత్రాలను చూశాక పాత జ్ఞాపకాలతో కన్నీళ్లు ఆగలేదు. ఐదు ఒలింపిక్ గేమ్స్ ఆడాలన్నది నా స్వప్నం. దీంతో రాబీ.. నేను పారిస్‌లో పాల్గొంటే చూడాలని ఉందన్నాడు. అందుకే ఈసారి వచ్చా' అని నోహ విలియమ్స్‌తో కలిసి సింక్రనైస్డ్ 10మీ. ప్లాట్‌ఫామ్ డైవింగ్‌లో రజతం అందుకున్న డేలీ తెలిపాడు. 2008 నుంచి డేలీకిది ఐదో ఒలింపిక్ పతకం కావడం విశేషం.

అన్నకు మోదం చెల్లికి ఖేదం



జపాన్‌కు చెందిన ఉటా అబె, హఫుమి అబె అన్నాచెల్లెళ్లు.. అలాగే జూడో ప్రపంచ చాంపియన్లు కూడా.. గత టోక్యో ఒలింపిక్స్‌లో ఒకేరోజు స్వర్ణాలతో మెరిసి పారిస్ క్రీడల్లో ఫేవరెట్లుగా బరిలో దిగారు. కానీ ఈసారి నాటి సీన్ రిపీట్ కాలేదు. సోమవారం జరిగిన మహిళల అండర్-52 కిలోల విభాగంలో పాల్గొన్న ఉటా అబే రెండో రౌండ్‌లో డియోరా కల్డి (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడింది. దీంతో ఈ ఓటమిని భరించలేని ఆమె మ్యాట్‌పైనే కుప్పకూలి రోదించింది. కోచ్ ఎంత ఓదార్చినా ఫలితం లేకపోయింది. ఇక, స్టేడియంలోని ప్రేక్షకులు నిల్చొని చప్పట్లతో ఆమెకు మద్దతు ప్రకటించారు. మరోవైపు సోమవారమే జరిగిన పురుషుల అండర్- 66 కిలోల విభాగంలో విలియమ్ లిమా(బ్రెజిల్)ను ఓడించి ఉటా సోదరుడు హఫుమి స్వర్ణం గెలవడం విశేషం. ఇలా.. ఈ క్రీడలు అన్నకు సంతోషాన్ని అందిస్తే.. చెల్లికి బాధను కలిగించాయి.

దండాన్ని నేలపై కొట్టి..



రమితా జిందాల్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్ ఆరంభానికి ముందు మాజీ షూటర్ అభినవ్ బింద్రా.. ఎర్రటి దండంతో నేలపై మూడుసార్లు కొట్టడం అందరి దృష్టినీ ఆకర్షించింది. చూసే వారికి ఇది కొత్తగా అనిపించినా.. పారిస్ క్రీడల్లో కొత్త సంప్రదాయాన్ని ప్రవేశపెట్టినట్టు నిర్వాహకులు వివరించారు. ఎర్రటి దండాన్ని 'బ్రిగేడియర్'గా సంబోధిస్తున్నారు. ఈవెంట్ ఆరంభానికి ముందు ప్రేక్షకులను నిశ్శబ్దంగా ఉండాలని చెప్పడంతోపాటు వారి దృష్టి మొత్తం పోటీలపైనే కేంద్రీకరించే ఉద్దేశంతోనే ఆ దండాన్ని నేలపై కొట్టే ఆనవాయితీని తీసుకొచ్చినట్టు చెబుతున్నారు. 17వ శతాబ్దంలో నాటకం ఆరంభమయ్యే ముందు ఇలా దండాన్ని.. నేలపై కొట్టే సంప్రదాయం ఉండేదని ఒలింపిక్ వెబ్‌సైట్ పేర్కొంది.

ఆర్చరీలో అబ్బాయిలు కూడా..

రికర్వ్ ఆర్చరీలో భారత పురుషుల జట్టు కూడా తీవ్రంగా నిరాశపర్చింది. నేరుగా క్వార్టర్స్ చేరిన ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్ త్రయం కీలక మ్యాచ్‌లో ఘోరంగా తడబడింది. రౌండ్-8 పోరులో భారత్ 2-6తో టర్కీ చేతిలో ఓటమి పాలైంది. క్వాలిఫికేషన్ ఈవెంట్‌లో అద్భుతంగా రాణించిన తెలుగు కుర్రాడు ధీరజ్.. క్వార్టర్స్‌లో ఒక్కసారి మాత్రమే 10 పాయింట్లు సాధించాడు. తొలి రెండు సెట్లలో 53-57తో ఓడిన భారత్.. మూడో సెట్‌లో 55-54తో గెలిచి ఫలితాన్ని మరోసెట్‌కు తీసుకెళ్లింది. అయితే, నాలుగో సెట్‌లో చివరగా బాణం సంధించిన ధీరజ్ గురితప్పి 7 పాయింట్లే స్కోరు చేయగా.. టర్కీ ప్లేయర్ 10 సాధించాడు. దీంతో టర్కీ 58-54తో సెట్‌తోపాటు మ్యాచ్‌ను గెలిచి సెమీస్ చేరుకొంది.

నడాల్‌పై అవలీలగా..

జొకోవిచ్ ఘనవిజయం
మూడో రౌండ్‌లో ప్రవేశం



పారిస్: కెరీర్‌లో తొలి ఒలింపిక్ స్వర్ణం కోసం ఎదురుచూస్తున్న సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ బదులు తీర్చుకున్నాడు. 2008 ఒలింపిక్స్ సెమీస్‌లో తనపై గెలిచి స్వర్ణం సాధించిన నడాల్‌ను ఈసారి రెండో రౌండ్‌లోనే అడ్డుకున్నాడు. టెన్నిస్ దిగ్గజాలుగా పేరు తెచ్చుకున్న ఈ ఇద్దరి మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతుందనుకున్నా, జొకో దూకుడుకు పోరు ఏకపక్షంగా ముగిసింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో జొకో 6-1, 6-4తో నడాల్‌ను చిత్తుచేసి మూడో రౌండ్ చేరుకున్నాడు.

పారిస్‌లో నేటి భారతం



షూటింగ్: పురుషుల ట్రాప్ క్వాలిఫికేషన్ - పృథ్వీరాజ్ తొండైమాన్ (మ. 12.30), మహిళల ట్రాప్ క్వాలిఫికేషన్ - శ్రేయాసి సింగ్, రాజేశ్వరి కుమారి (మ. 12.30), **మిక్స్‌డ్ 10 మీ. ఎయిర్‌పిస్టల్ కాంస్య పతక పోరు** - భారత్ (మను భాకర్/సరబ్‌జోత్ సింగ్) x దక్షిణ కొరియా (మ. 1);

హాకీ: భారత్ x ఐర్లాండ్ (సా. 4.45)

ఆర్చరీ: మహిళల వ్యక్తిగత విభాగం ఎలిమినేషన్ రౌండ్ - అంకిత (సా. 5.15), భజన్ కౌర్ (సా.5.30), పురుషుల వ్యక్తిగత విభాగం ఎలిమినేషన్ రౌండ్ - ధీరజ్ (రా. 10.45);

బ్యాడ్మింటన్: పురుషుల డబుల్స్ : సాత్విక్/చిరాగ్ x అర్దియాంటో/అల్ఫియాన్ (ఇండోనేసియా) (సా. 5.30), మహిళల డబుల్స్ : అశ్విని/తనీషా x మపాసా/యూ (సా. 6.20);

బాక్సింగ్: పురుషుల 51 కిలోల ప్రీక్వార్టర్స్ - అమిత్ పంఘల్ x పాట్రిక్ (జాంబియా) (రా. 7.15), మహిళల 57 కిలోల రౌండ్ ఆఫ్ 32-జాస్మిన్ లంబోరియా x నెస్తీ పెటెసియో (ఫిలిప్పీన్స్) (రా. 9.25), 54 కిలోల ప్రీక్వార్టర్స్ - ప్రీతి పవార్ x యెని మార్సెలా (కొలంబియా) (రా. 1.20).

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

నేడు లంకతో భారత్ మూడో టీ20



రాత్రి 7 గం. నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

పల్లెకెలె: కొత్త నాయకత్వంలో టీమిండియా ఆశించిన రీతిలోనే సాగుతోంది. శ్రీలంకతో వరుసగా రెండు టీ20లను ఖాతాలో వేసుకున్న భారత్ నేడు ఆఖరిదైన మూడో మ్యాచ్ కోసం బరిలోకి దిగబోతోంది. 2-0తో ఇప్పటికే సిరీస్ వశమైనప్పటికీ లంకను క్లీన్‌స్వీప్ చేయాలన్న లక్ష్యంతో ఉంది. చివరి మ్యాచ్‌లోనూ పైచేయి సాధించి సూర్యకుమార్ తన ఫుల్ టైమ్ కెప్టెన్సీ అరంగేట్రాన్ని చిరస్మరణీయం చేసుకోవాలనుకుంటున్నాడు. ఇక ఈ మ్యాచ్ నామమాత్రమే కావడంతో శాంసన్, పరాగ్, రింకూ సింగ్‌లకు మరింత ప్రాక్టీస్ ఇవ్వాలనుకుంటోంది. అలాగే అర్ష్‌దీప్‌నకు విశ్రాంతినిచ్చి ఖలీల్‌ను ఆడించే చాన్స్ ఉంది. మరోవైపు శ్రీలంక బ్యాటింగ్‌లో టాపార్డర్ మినహా అంతా విఫలమవుతున్నారు. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా ఆ జట్టు తమ లోపాలను సరిచేసుకుంటే ఓదార్పు విజయం దక్కుతుంది.

శ్రీలంక చేరిన రోహిత్, విరాట్ : భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ శ్రీలంక చేరుకున్నారు. వచ్చేనెల రెండు నుంచి శ్రీలంకతో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో పాల్గొనేందుకు వారిద్దరు ఇక్కడకు విచ్చేశారు. రోహిత్, కోహ్లీతోపాటు వచ్చిన వన్డే జట్టు సభ్యులు శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా సోమవారం ఇక్కడ ప్రాక్టీస్ కూడా ప్రారంభించారు. కాగా..ఇటీవల జరిగిన టీ20 వరల్డ్ కప్ అనంతరం రోహిత్, విరాట్ పొట్టి ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పిన విషయం విదితమే.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
జపాన్	6	2	4	12
చైనా	5	3	2	10
కొరియా	5	3	1	9
ఫ్రాన్స్	4	7	3	14
ఆస్ట్రేలియా	4	3	0	7
అమెరికా	3	8	7	18
బ్రిటన్	2	5	3	10
కెనడా	2	1	2	5
జర్మనీ	2	0	0	2
ఇటలీ	1	2	3	6
భారత్	0	0	1	1

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

పారిస్‌లో 'టెలికాం'ల ధ్వంసం

పారిస్: ఒలింపిక్స్‌కు ఆటంకం కలిగించే విధ్వంసక చర్యలు కొనసాగుతున్నాయని ఫ్రాన్స్ ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. పారిస్ చుట్టుపక్కల నగరాల్లో దుండగులు టెలికమ్యూనికేషన్ వ్యవస్థలను ధ్వంసం చేశారని తెలిపింది. దాంతో ఫైబర్, ల్యాండ్ లైన్ సేవలకు అంతరాయాలు ఏర్పడ్డాయని పేర్కొంది. అయితే పారిస్‌పై ఈ ప్రభావం పడలేదని వివరించింది. పలుచోట్ల ఫైబర్ కేబుళ్లను కత్తిరించడంతోపాటు ఎలక్ట్రానిక్ పరికరాలను ధ్వంసం చేశారని తెలిపింది. ఇవన్నీ రాత్రి వేళ్లలో జరిగాయని వెల్లడించింది.

భారత్‌లో 2025 ఆసియా కప్

న్యూఢిల్లీ: పురుషుల ఆసియా కప్ 2025 క్రికెట్ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వనుంది. అయితే ఈ టోర్నమెంట్ టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. ఆ తదుపరి అంటే..2027లో జరిగే 50 ఓవర్ల ఫార్మాట్ టోర్నీని బంగ్లాదేశ్ నిర్వహించనుంది. 2023లో పాకిస్థాన్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఆసియా కప్ 50 ఓవర్ల ఫార్మాట్‌లో హైబ్రిడ్ విధానంలో జరిగిన విషయం విదితమే. గతంలో.. 1990-91లో ఒక్కసారే ఆసియాకప్‌నకు భారత్ ఆతిథ్యమిచ్చింది.

పెయిన్ రిలీఫ్

వేడి వర్సెస్ చల్లదనం

నొప్పులను తగ్గించుకోవడం కోసం కొందరు వేడి కాపడం సూచిస్తారు, ఇంకొందరు ఐస్ ప్యాక్ సూచిస్తారు. ఈ రెండింటిలో ఏది ఎక్కువ ఫలితాన్నిస్తుంది. తెలుసుకుందాం!

వేడి, చల్లదనం... ఈ రెండూ సహజసిద్ధ నొప్పినివారిణి చిట్కాలు. అయితే వేడి కాపడం ఎటువంటి నొప్పులను తగ్గిస్తుందో, చల్లని పట్టు ఏ బాధను దూరం చేస్తుందో తెలుసుకోవడం అవసరం. కొన్ని నొప్పులు చల్లదనంతో తగ్గితే, మరికొన్ని వేడితో ఉపశమనాన్ని అందిస్తాయి. సమస్య ఆధారంగా పరిష్కారాన్ని ఎంచుకోవాలి.

ఆర్థ్రయిటిస్: మోకాళ్లు, భుజాలు, మేచేతులు, వేళ్ల కీళ్లలో మృదులాస్థి అరిగిపోవడం మూలంగా తలెత్తే నొప్పులు వేడి కాపడంతో తగ్గుముఖం పడతాయి. బిగుసుకుపోయిన కీళ్లు, కండరాలు వేడి కాపడంతో వదులై, నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

గౌట్: కాలి బొటనవేలు, చీలమండలం, మడమ, మోకాలు, మణికట్టు, వేళ్లు, మోచేతుల్లోని తీవ్రమైన ఇన్‌ఫ్లమేటరీ ఆర్థ్రయిటిస్‌కు కోల్డ్ కంప్రెషన్ చక్కని పరిష్కారం.

తలనొప్పి: తలలోని నాడులు, రక్తనాళాల వల్ల తలెత్తే తలనొప్పులు లేదంటే మెడలోని కండరాల నొప్పులకు రెండు రకాల కాపడాలు అవసరమవుతాయి. కత్తితో పొడుతున్నట్టు బాధించే పోటులను ఐస్‌తో, మెడ నొప్పులను వేడి కాపడంతో తగ్గించుకోవచ్చు.

బెణుకులు: తొడ, వెన్ను, పిక్కల్లోని కండరాలు పట్టేసినా, టెండాన్లు గాయపడినా, లక్షణాల ఆధారంగా వేడి, చల్లదనాల పట్టులను ఎంచుకోవాలి. వాచి, నొప్పితో బాధించే ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించుకోవడం కోసం ఐస్‌ను ఉపయోగించాలి. ఇన్‌ఫ్లమేషన్ తగ్గిన తర్వాత బిగుతును సడలించడం కోసం వేడి కాపడం ఉపయోగపడుతుంది.

గాయాలు: మోకాలు, మోచేతులు, యాంకిల్, పాదాల్లో లిగమెంట్లు దెబ్బతిన్నప్పుడు ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, నొప్పి అదుపులోకి రావడం కోసం ఐస్‌తో పట్టు వేయాలి. ఇన్‌ఫ్లమేషన్ తగ్గిన తర్వాత బిగుతును సడలించడం కోసం వేడి కాపడం పెట్టుకోవాలి.



టెండనైటిస్: భుజాలు, మోచేతులు, మోకాళ్లు, మణికట్టు మడమల్లోని కీళ్లతో అనుసంధానమై ఉండే టెండాన్లు ఎక్కువగా శ్రమకు గురవడం వల్ల తలెత్తే నొప్పులకు ఐస్‌తో పట్టు వేయాలి.

టెండినోసిస్: కీళ్లతో అనుసంధానమై ఉండే టెండాన్లు ఇరిటేట్ అయి, బిగుసుకుపోయినప్పుడు కలిగే అసౌకర్యాన్ని తొలగించుకోవడం కోసం, వేడి కాపడం పెట్టుకోవాలి.

ఏం జరుగుతుంది?

మంచుతో రక్తనాళాలు కుంచించుకుపోయి గాయాలు, దెబ్బల నొప్పి తగ్గుతుంది. ఇన్‌ఫ్లమేషన్ అదుపులోకొచ్చి గాయం తీవ్రత తగ్గుతుంది. ఆర్థ్రయిటిస్‌కూ వేడికాపడం పెట్టడానికి కారణం వేడితో రక్తప్రవాహం పెరిగి, బిగుసుకున్న కండరాలు, కీళ్లు వదులవుతాయి. దాంతో ఉపశమనం దక్కుతుంది. తీవ్రమైన గాయాలు, ఎముకలు చిట్లిన, విరిగిన సందర్భాల్లో నొప్పిని తగ్గించుకోవడం కోసం ఎలాంటి కాపడాలు ఉపయోగించకూడదు. ఇలా చేయడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ పెరిగి, గాయం తగ్గే వేగం నెమ్మదిస్తుంది.



పెయిన్స్

మెడనొప్పి, నడుము నొప్పి, తల నొప్పి... అందర్నీ ఏదో ఒక సందర్భంలో వేధించే నొప్పులే ఇవన్నీ! అయితే ఇవే నొప్పులు సర్జరీ వరకూ దారి తీయకుండా ఉండాలంటే వైద్యులను కలిసి మూల కారణాన్ని కనిపెట్టాలి.

అలవాట్లతోనే అగచాట్లు

ప్రతి నొప్పికీ సర్జరీ అవసరం ఉండదు. సర్జరీకి దారి తీసేటంత రుగ్మతలు ఏ కొద్ది మందికో ఉంటాయి. ఎముకలు, కండరాల నొప్పులను నాడీసంబంధ నొప్పులుగా పొరపాడు పడుతూ ఉంటాం. కానీ నిజానికి ఆ నొప్పుల కారణాలు మన అలవాట్లలోనే దాగి ఉంటాయి. కాబట్టి నొప్పి, అసౌకర్యాలకు మూల కారణాల కోసం మనల్ని మనం ఒకసారి తరచి చూసుకోవాలి. గంటల తరబడి కంప్యూటర్లకు అతుక్కుపోవడం, కూర్చున్నప్పుడు శరీర భంగిమ కుదురుగా లేకపోవడం లాంటి వాటి వల్ల మెడ నొప్పి, చేతుల్లో తిమ్మిర్లు సహజం. ఇదే పరిస్థితి తీవ్రమైతే, స్పర్శ కోల్పోవడం, చేతులు బలహీనమై వస్తువులను బలంగా పట్టుకోలేకపోవడం, కండరాలు క్షీణతకు గురవడం జరుగుతుంది. కొందరికి నడకలో కూడా ఇబ్బంది తలెత్తుతుంది. మూత్ర విసర్జన కూడా కష్టం కావచ్చు.

మెడనొప్పి ఎందుకు?

కంప్యూటర్లతో పాటు, తల వంచి ఫోన్లకు అతుక్కుపోయి కూర్చునేవాళ్లు, దూర ప్రయాణాలు చేసేవాళ్లు, మెడ ఆధారంగా బరువులు లేపేవాళ్లను మెడనొప్పి వేధిస్తుంది. నిజానికి 70% మందిలో చిన్నపాటి మార్పులతో ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు. కూర్చునే భంగిమ సరిదిద్దుకోవడం, ప్రయాణాల్లో నెక్ సపోర్ట్ పిల్లోలు వాడుకోవడం, కంప్యూటర్ల ముందు పనిచేసేవాళ్లు తరచూ లేచి నడుస్తూ ఉండడం, మెడ కండరాలను బలపరిచే వ్యాయామాలు చేయడం ద్వారా మెడ నొప్పిని పూర్తిగా తగ్గించుకోవచ్చు. అయితే ఫిజియోథెరపీ, మందులతో పాటు, ఇతరత్రా జీవనశైలి మార్పులు చేసుకున్నప్పటికీ సమస్య తగ్గకపోతే, దాన్ని నాడీ సంబంధ సమస్యగా అనుమానించాలి. ఈ సమస్యను కూడా మందులతో, విశ్రాంతితో చాలా మేరకు తగ్గించుకోవచ్చు. అప్పటికీ తగ్గనప్పుడు మాత్రమే సర్జరీ అవసరమవుతుంది. వెన్నులో డిస్క్ ప్రొలాప్స్, ఇన్‌ఫెక్షన్లు, ట్యూమర్ల వల్ల కూడా ఇవే లక్షణాలు బయల్పడతాయి. కాబట్టి తేలికపాటి చికిత్సతో లక్షణాలు తగ్గుముఖం పట్టనప్పుడు వైద్యులను కలవాలి.

ఈ తలనొప్పులు భిన్నం



తలనొప్పులన్నీ బ్రెయిన్ ట్యూమర్‌కు సంబంధించినవి కావు. కేవలం ఒక శాతం కంటే తక్కువ మందిలోనే బ్రెయిన్ ట్యూమర్స్ ఉంటూ ఉంటాయి. ఎలాంటి ట్యూమర్లు, ఇన్‌ఫెక్షన్లు లేకపోయినా తలెత్తే తలనొప్పులు ప్రైమరీ హెడేక్స్. వీటిలో అత్యంత సాధారణమైనది మైగ్రేన్. చాలా మందిలో మైగ్రేన్ జీవనశైలి మార్పులతో ముడిపడి ఉంటుంది. ఎక్కువసేపు మొబైల్ చూడడం, రాత్రుళ్లు ఎక్కువ సమయాలు మేల్కొని ఉండడం, జంక్ ఫుడ్, ధూమపానం, ఆల్కహాల్, ఒత్తిడి, ఆందోళన, కెఫీన్ ఉన్న పానీయాలు ఎక్కువగా తాగడం, ఊబకాయం... ఇవన్నీ మైగ్రేన్‌కు దారితీసే కారణాలే! కొందరికి తలనొప్పి ఒకవైపే వేధిస్తుంది. వాంతులు కూడా వేధిస్తూ ఉంటాయి. కొందరు శబ్దాలను వినలేరు. ఇంకొందరు వెలుగును భరించలేరు. ఇలాంటివాళ్లు మైగ్రేన్‌ను ట్రిగ్గర్ చేసే కారణాలను వాళ్లంతట వాళ్లే కనిపెట్టి వాటికి దూరంగా ఉండాలి. అయినా తగ్గకపోతే తలనొప్పి ఎపిసోడ్స్ రాకుండా ఆపే మందులతో పాటు, తలనొప్పి వచ్చినప్పుడు తగ్గించే మందులు కూడా వాడుకుంటూ ఉండాలి.

నడుము నొప్పి అందుకే

నడుము నొప్పికి ఎన్నో కారణాలుంటాయి. శరీర భంగిమ లోపాలతో పాటు, పుట్టుకతో వెన్నులో సమస్య ఉండవచ్చు. వెన్నుపూసలు బలహీనపడి ఉండొచ్చు. ఫ్రాక్చర్స్ ఉండొచ్చు. ఇలా లంబార్ స్పాండిలోసిస్‌లో సమస్యలు, సయాటికా లాంటివి తగ్గకుండా పెరుగుతున్నప్పుడు, ఎమ్మారై, ఎక్స్‌రేలతో కారణాన్ని కనిపెట్టి సరిదిద్దుకోవాలి. ఒకవేళ నడుము నొప్పికి కారణం డిస్క్ ప్రొలాప్స్ అయితే, ఎండోస్కోపిక్ సర్జరీతో, చిన్నపాటి కోతతో, సమస్యను సరిదిద్దుకుని, సర్జరీ జరిగిన మరుసటి రోజే ఇంటికెళ్లిపోయే వెసులుబాట్లు అందుబాటులోకొచ్చాయి. ఫ్రాక్చర్ ఉంటే, మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీతో సరిదిద్దుకోవచ్చు.

వెన్ను సర్జరీ 5% మందికే!

సాధారణంగా వెన్ను సర్జరీ అందరికీ అవసరం పడదు. సర్జరీతోనే సమస్యను సరిదిద్దే పరిస్థితి ఉన్నప్పుడు మాత్రమే, అంతిమ ప్రత్యామ్నాయంగా వైద్యులు సర్జరీని ఎంచుకుంటూ ఉంటారు. వీపు నొప్పి, నడుము నొప్పి, సయాటికాలతో బాధపడేవాళ్లు డాక్టరు దగ్గరకు వెళ్తే ఆపరేషన్ చేయించుకోవలసివస్తుందనే భయంతో గృహవైద్యాలను అనుసరిస్తూ, సర్జరీ వరకూ తెచ్చుకుంటూ ఉంటారు. ప్రారంభంలోనే వైద్యులను కలిస్తే తేలికపాటి చికిత్సతోనే సమస్యను పరిష్కరించుకోవచ్చు. వెన్నుపూసలో నుంచి కాళ్లలోకి దారితీసే సయాటికా నాడి ఒత్తిడికి లోనైనప్పుడు సయాటికా నొప్పి వేధిస్తుంది. దీనికి కూడా డిస్క్ ప్రొలాప్స్, ఇన్‌ఫెక్షన్లే కారణం. కారణం తీవ్రత మీదే చికిత్స ఆధారపడి ఉంటుంది. ఫిజియోథెరపీ, మందులతోనే సమస్యను అదుపు చేయగలిగే వీలుంటుంది. కాళ్లలో బలహీనత, స్పర్శ కోల్పోవడం, మూత్రవిసర్జన మీద నియంత్రణ కోల్పోవడం లాంటి తీవ్ర లక్షణాలు బయల్పడినప్పుడు మాత్రమే సర్జరీ అవసరమవుతుంది.

డాక్టర్ బాల రాజశేఖర్
సీనియర్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్



ఆయుర్వేదం

వంద అడుగుల నడక

ఆరోగ్యంగా, చురుగ్గా, దృఢంగా ఉండాలంటే తినే ఆహారంతో పాటు, ఆహారం తిన్న తర్వాత చేసే పనుల మీద కూడా దృష్టి పెట్టాలి. మరీ ముఖ్యంగా భోజనం చేసిన తర్వాత వంద అడుగులు నడవాలని ఆయుర్వేదం సూచిస్తోంది.

షట్‌పావ్లీ మరాఠీ పదం. షట్ అంటే వంద అనీ, పావ్లీ అంటే అడుగులు అని అర్థం. వంద అడుగుల నడక జీర్ణక్రియను ప్రభావితం చేస్తుంది కాబట్టి ప్రాచీన కాలంలో ఈ అలవాటును అనుసరించేవారు. భోజనం తర్వాత వంద అడుగులు నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడడంతో పాటు, క్యాలరీలు కూడా కరు



గుతాయి. రక్తంలోని చక్కెరలు అదుపులో ఉండి, తిన్న ఆహారం జీర్ణమై, పోషకాలు శోషణ చెందుతాయి. భోజనం తదనంతర నడకతో రక్తంలోని చక్కెర మోతాదులు తగ్గుతాయనీ, తద్వారా టైప్2 మధుమేహ ప్రభావం శరీరం మీద పడకుండా ఉంటుందని జోర్నల్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ఒక అధ్యయనం ప్రచురితమైంది. అయితే కొందరికి భోజనం తర్వాత కునుకు తీసే అలవాటు ఉంటుంది. ఇలా కునుకు తీయడం వల్ల శరీరంలో కఫం, మేదం (కొవ్వు) పేరుకుని, మెటబాలిజం నెమ్మదిస్తుందని, తద్వారా తిన్న ఆహారం పూర్తిగా జీర్ణం కాదనీ ఆయుర్వేదం చెప్తోంది.

భోజనం తర్వాత ఈత, దూరాలు నడవడం, ప్రయాణం, వ్యాయామం చేయడం వల్ల వాతం పెరిగి, జీర్ణప్రక్రియకు అవరోధం ఏర్పడుతుంది. దాంతో కడుపుబ్బరం, శోషణ అసంపూర్తిగా జరగడం, పొట్టలో అసౌకర్యం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. కాబట్టి ఈ అలవాట్లకు స్వస్తి చెప్పాలి.

బిజినెస్

బ్లాక్‌స్టోన్ చేతికి హల్దీరామ్ స్నాక్స్?

» 51% వాటా రూ.40 వేల కోట్లకు కొనుగోలు

న్యూఢిల్లీ: భారత కార్పొరేట్ రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. ప్రముఖ స్నాక్స్ కంపెనీ హల్దీరామ్ ఈక్విటీలో 51 శాతం వాటా కోసం ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ బ్లాక్‌స్టోన్ జరుపుతున్న చర్చలు కొలిక్కి వచ్చినట్టు సమాచారం. ఇందుకోసం హల్దీరామ్ ప్రమోటర్లకు రూ.40,000 కోట్లు చెల్లించేందుకు బ్లాక్‌స్టోన్ సంస్థ సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే రెండు కంపెనీలు దీనిపై అధికారికంగా నోరు మెదపడం లేదు. ఈ లెక్కన హల్దీరామ్ మార్కెట్ విలువను రూ.78,000 కోట్లుగా నిర్ధారించినట్టు భావిస్తున్నారు. ఈ కొనుగోలు తర్వాత కూడా హల్దీరామ్ బ్రాండ్ మీదే కంపెనీ ఉత్పత్తులు కొనసాగుతాయి. అందుకు హల్దీరామ్ ప్రమోటర్లకు బ్లాక్‌స్టోన్ ఏటా కొంత రాయల్టీ చెల్లించేందుకూ అంగీకరించినట్టు సమాచారం.

రూ.40,000 కోట్ల పెట్టుబడులు

» హైదరాబాద్‌లో డేటా సెంటర్: పవర్‌గ్రిడ్

ముంబై: ప్రభుత్వ రంగంలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ భారీ పెట్టుబడులకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా భారత్-పశ్చిమాసియా దేశాల మధ్య విద్యుత్ సరఫరా కోసం సముద్ర గర్భ ఉపరితలం మీదుగా హై ఓల్టేజీ డైరెక్ట్ కరెంట్ కేబుల్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం ఒమన్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాలకు చెందిన కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్టు పవర్‌గ్రిడ్ సీఎండీ ఆర్‌కే త్యాగి చెప్పారు. వచ్చే ఆరేళ్లలో ఈ కేబుల్ ఏర్పాటు కోసం రూ.35,000 కోట్ల నుంచి రూ.40,000 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. దీనికి తోడు ప్రస్తుతం మనేసర్‌లో ఉన్న డేటా కేంద్రానికి తోడు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాల్లోనూ డేటా కేంద్రాలు ఏర్పాటు చేసే యోచన ఉందని త్యాగి చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,160 ▼	63,400 ▼	89,500 ▲
ముంబై	68,800 ▲	63,021 ▲	82,192 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	513	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	94	విజయవాడ	97
వరంగల్	94	గుంటూరు	103
కరీంనగర్	94	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	106
కర్నూలు	94	నెల్లూరు	106
విశాఖపట్నం	86	అనంతపురం	97
గోదావరి	97		

2026 నాటికి జీడీపీలో 20%

భారత డిజిటల్ ఎకానమీపై ఆర్‌బీఐ నివేదిక

ముంబై: ప్రస్తుతం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో పదో వంతుగా (10 శాతం) ఉన్న డిజిటల్ ఎకానమీ వాటా.. 2026 నాటికి రెట్టింపై ఐదో వంతుకు (20 శాతానికి) చేరుకోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచ డిజిటల్ విప్లవంలో భారత్ అందరి కంటే ముందుందని రిపోర్టు పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కరెన్సీ అండ్ ఫైనాన్స్‌పై రిపోర్టును ఆర్‌బీఐ సోమవారం విడుదల చేసింది. అందులోని మరిన్ని ముఖ్యాంశాలు..



- భారత్ డిజిటల్ చెల్లింపులను వేగవంతం చేసేందుకు ఫైనాన్షియల్ టెక్నాలజీ (ఫిన్‌టెక్)ని విరివిగా వినియోగించుకోవడమే కాకుండా బయోమెట్రిక్ ధ్రువీకరణతో కూడిన ఇండియా స్టాక్, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), మొబైల్ కనెక్టివిటీ, డిజిటల్ లాకర్స్, కంటెంట్ బేస్డ్ డేటా షేరింగ్ వంటి విజయోత్సవాలనూ జరుపుకుంటోంది.
- డిజిటల్ విప్లవం బ్యాంకింగ్ మౌలిక వసతులు, ప్రత్యక్ష నగదు బదిలీ, పన్ను వసూళ్లకు అవసరమైన పబ్లిక్ ఫైనాన్స్ నిర్వహణ వ్యవస్థ సామర్థ్యాన్ని భారీగా పెంచింది.
- చురుకైన ఈ-మార్కెట్లు వికసిస్తుండటంతో పాటు వాటి పరిధిని వేగంగా విస్తరించుకుంటున్నాయి. గడిచిన దశాబ్ద కాల వృద్ధి రేటును బట్టి చూస్తే, రెండేళ్లలో జీడీపీలో డిజిటల్ ఎకానమీ వాటా రెట్టింపు కానుంది.
- దేశంలో డిజిటల్ విప్లవానికి చాలా అంశాలు తోడయ్యాయి. గత ఏడాది దేశంలో ఇంటర్నెట్ వ్యాప్తి 55 శాతంగా ఉన్నప్పటికీ, ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య గడిచిన మూడేళ్లలో 19.9 కోట్ల మేర పెరిగింది. ఒక జీబీ డేటా వినియోగ ధర రూ.13.32 (0.16 డాలర్లు)గా ఉంది. ప్రపంచంలో ఇదే అతి తక్కువ ధర. ప్రపంచంలో అత్యధికంగా మొబైల్ డేటా వినియోగమవుతున్న దేశాల్లో భారత్ ఒకటి. గత ఏడాదికి గాను ఒక్కో వినియోగదారు నెలలో వినియోగించే మొబైల్ డేటా సగటు 24.1 జీబీగా నమోదైంది.
- ప్రస్తుతం దేశంలో 75 కోట్ల మంది స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తుండగా.. 2026 నాటికి ఈ సంఖ్య 100 కోట్లకు చేరుకోవచ్చని అంచనా. వచ్చే ఐదేళ్లలో భారత్ రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ల తయారీదారుగా అవతరించే అవకాశం ఉంది.
- ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్‌ల వ్యవస్థగా భారత్ ఎదిగింది. ప్రస్తుతం దేశంలో 1.4 లక్షలకు పైగా స్టార్టప్‌లుండగా.. అందులో 100 కోట్ల డాలర్లకు పైగా మార్కెట్ విలువతో యూనికార్న్ హోదా సాధించిన స్టార్టప్‌లు 100 దాటాయి.

త్వరలో ఆర్‌బీఐ వెబ్ సిరీస్

ఆర్‌బీఐ తన విధులతో పాటు 90 ఏళ్ల ప్రయాణాన్ని ప్రజలకు తెలియజేసేందుకు 5 ఎపిసోడ్లతో కూడిన ఓ వెబ్ సిరీస్‌ను విడుదల చేసే ఆలోచనలో ఉంది. దాదాపు 3 గంటల నిడివితో కూడిన ఈ వెబ్ సిరీస్ ఒక్కో ఎపిసోడ్ 25-30 నిమిషాలు ఉంటుందని తెలిపింది. ఈ వెబ్ సిరీస్‌ను జాతీయ టీవీ చానెళ్లతో పాటు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో ప్రసారం చేయనుంది. 1935లో ఏర్పాటైన ఆర్‌బీఐ ఈ ఏడాది ఏప్రిల్‌తో 90 ఏళ్లు పూర్తి చేసుకుంది.

సిల్వర్ ధమాల్

» ఒక్కరోజే రూ.4,500 తగ్గిన ధర

» రూ.84,500కు జారిన కిలో వెండి

న్యూఢిల్లీ: దేశీయంగా బులియన్ ధరలు భారీగా తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి(24 క్యారెట్లు) ధర సోమవారం రూ.950 తగ్గి రూ.71,050కు జారుకుంది. ఆభరణ వర్తకుల నుంచి డిమాండ్ భారీగా తగ్గడం ఇందుకు కారణమైంది. కాగా, కిలో వెండి ఏకంగా రూ.4,500 తగ్గుదలతో రూ.84,500 స్థాయికి దిగివచ్చింది. ఈ ఏడాదిలో సిల్వర్‌కు ఇదే అతిపెద్ద ధర పతనం. నాణేల తయారీదారులు, పరిశ్రమల నుంచి డిమాండ్ కొరవడటం ఇందుకు కారణం. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్ విషయానికొస్తే, ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2,388.80 డాలర్లు, సిల్వర్ 28.02 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

బోయింగ్‌తో సైయెంట్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమాన తయారీ సంస్థ బోయింగ్‌తో ప్రొడక్షన్ కాంట్రాక్ట్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సైయెంట్ డీఎల్ఎం ప్రకటించింది. ఈ కాంట్రాక్ట్‌లో భాగంగా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ కోసం బ్యాటరీ డియోడ్ మాడ్యుల్ (బీడీఎం) తయారు చేయాల్సి ఉంటుందని తెలిపింది. వాణిజ్య విమానాలకు సంబంధించి పవర్ ఎలక్ట్రానిక్స్ డిజైన్/సర్టిఫికెట్ సపోర్ట్ కోసం బోయింగ్ నుంచి అందుకున్న మొదటి ప్రాజెక్ట్ ఇదని పేర్కొంది. బోయింగ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకోవటంతో భారత్‌లో అడ్వాన్స్‌డ్ ఏవియేషన్ టెక్నాలజీని మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం లభించిందని సంస్థ సీఈఓ ఆంటోనీ మోంటాల్‌బానో తెలిపారు.

నిఫ్టీ 25,000కు చేరువై.. వెనక్కి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరుకున్నప్పటికీ ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా అతి స్వల్ప లాభంతో ముగింపు పలికాయి. ఈ వారంలో యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్త ధోరణిని కనబరిచారని ఈక్విటీ నిపుణులు పేర్కొన్నారు. మొస్తరు లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్. ఒక దశలో 575.71 పాయింట్ల వరకు ఎగబాకి 81,908.43 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. రికార్డు స్థాయిలో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీ చివరికి 23.12 పాయింట్ల లాభంతో 82,355.84 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 164.9 పాయింట్ల వృద్ధితో 24,999.75 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 1.25 పాయింట్ల లాభంతో 24,836.10 వద్ద కొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 16 లాభపడ్డాయి.

ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ ధరల శ్రేణి రూ.72-76

వచ్చే నెల 2 నుంచి 6 వరకు ఆఫర్

ఆన్‌లైన్ క్యాబ్ అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్ ఓలాకు చెందిన విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) రిటైల్ మదుపరుల కోసం వచ్చే నెల 2న ప్రారంభమై 6న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.72-76గా నిర్ణయించింది. గరిష్ఠ ధర ప్రకారం సంస్థ ఈ ఇష్యూ ద్వారా రూ.6,146 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. అందులో రూ.5,500 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 8.49 కోట్లకు పైగా షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. తద్వారా మరో రూ.646 కోట్ల వరకు సమకూరవచ్చు. గరిష్ఠ ధర ప్రకారం.. కంపెనీ మార్కెట్ విలువ రూ.33,522 కోట్ల స్థాయిలో నమోదు కానుంది. ఓలా ఎలక్ట్రిక్ ఈ ఏడాది అతిపెద్ద ఐపీఓల్లో ఒకటి. ఈ ఇష్యూలో పెట్టుబడి పెట్టాలనుకునే మదుపరులు కనీసం 195 షేర్ల కోసం బిడ్ వేయాల్సి ఉంటుంది. ఆపై బిడ్ సైజును 195 షేర్ల చొప్పున పెంచుకుంటూ పోవచ్చు.

1 నుంచి సీగల్ ఇండియా ఐపీఓ: మౌలిక రంగ కంపెనీ సీగల్ ఇండియా లిమిటెడ్ ఐపీఓ వచ్చే నెల 1న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.1,253 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న కంపెనీ.. ఇష్యూ ధరల శ్రేణిని రూ.380-401గా నిర్ణయించింది.

ధరల పోటీ తట్టుకోలేక పోతున్నాం

అందుకే ఇండియా సిమెంట్స్‌ను అమ్మేశా: ఎన్.శ్రీనివాసన్



చెన్నై: ఇండియా సిమెంట్స్ (ఐసీఎల్) అమ్మకానికి దారితీసిన పరిస్థితులను ఆ సంస్థ అధినేత ఎన్ శ్రీనివాసన్ తనకు సన్నిహితులైన 300 మంది ఉద్యోగులతో పంచుకున్నారు. ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయి ధరల విషయంలో పోటీ సంస్థలతో పోటీపడలేకే కంపెనీని అమ్మాల్సి వచ్చిందని వారితో భావోద్వేగంతో చెప్పారు. కంపెనీ యాజమాన్యం చేతులు మారినా ఐసీఎల్ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ఎలాంటి ఢోకా ఉండదని హామీ ఇచ్చారు. కంపెనీ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేందుకు, భూములు అమ్మేందుకు చేసిన ప్రయత్నాలూ ఫలించలేదన్నారు. కంపెనీ అమ్మకానికి ఇది కూడా ఒక కారణమన్నారు. 'ధరలు తగ్గించి మన పోటీ సంస్థలు మనల్ని తొక్కేయగలవు. వారితో పోలిస్తే మన ఉత్పత్తి వ్యయం కొద్దిగా ఎక్కువ. దాన్ని తగ్గించేందుకు చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. అందుకే ఇండియా సిమెంట్స్‌ను అమ్మేయాల్సి వస్తోంది' అని శ్రీనివాసన్ తనను కలిసిన ఉద్యోగులతో భావోద్వేగంతో చెప్పారు. దీంతో గత 55 సంవత్సరాలుగా సిమెంట్ పరిశ్రమతో ఆయనకు ఉన్న అనుబంధం ముగియబోతోంది.

లిస్టెడ్ కంపెనీగానే ఐసీఎల్: ఇండియా సిమెంట్స్ (ఐసీఎల్) షేర్లను డీలిస్ట్ చేసే ఆలోచన లేదని అల్ట్రాటెక్ సిమెంట్ ప్రకటించింది. కంపెనీ ఈక్విటీలో మెజారిటీ వాటా తమ హస్తగతమైనా.. ఐసీఎల్ ప్రత్యేక లిస్టెడ్ కంపెనీగానే కొనసాగుతుందని రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఐసీఎల్ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్, ఆయన కుటుంబసభ్యుల నిర్వహణలోని ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) యాజమాన్యంలోనూ ఎలాంటి మార్పు ఉండదని ప్రకటించింది. ఐసీఎల్ ఈక్విటీలో మరో 26 శాతం వాటా కోసం తాము చేసే ఓపెన్ ఆఫర్‌ను యాక్సిస్ క్యాపిటల్ నిర్వహిస్తుందని తెలిపింది.

తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి యూనిటీ బ్యాంక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (యూనిటీ బ్యాంక్).. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మార్కెట్లోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా తొలుత హైదరాబాద్‌లో ఐదు శాఖలను ప్రారంభించింది. ఈ శాఖలను దిల్‌సుఖ్‌నగర్, ఎస్ఆర్ నగర్, మౌలాలి, సుచిత్ర క్రాస్‌రోడ్స్, కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసినట్లు యూనిటీ బ్యాంక్ ఎండీ, సీఈఓ ఇంద్రజిత్ కమోత్రా వెల్లడించారు. రానున్న కొద్ది రోజుల్లో హైదరాబాద్‌లో మరో మూడు శాఖలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడల్లో శాఖలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందించే ఉద్దేశంతో ఈ దీపావళి నాటికి క్రెడిట్ కార్డ్ విభాగంలోకి ప్రవేశించటంతో పాటు వ్యక్తిగత రుణాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఇంద్రజిత్ తెలిపారు.

మ్యూచువల్ ఫండ్స్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు చెక్

» నవంబరు 1 నుంచి కొత్త నిబంధనలు : సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పైనా మార్కెట్ నియంత్రణ మండలి సెబీ దృష్టి పెట్టింది. ఈ జాడ్యానికి చెక్ పెట్టేందుకు కొత్త నిబంధనలు జారీ చేసింది. ఈ ఏడాది నవంబరు 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయి. ఇందులో భాగంగా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) తమ పథకాల యూనిట్ల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి ప్రచురితం కాని సమాచారం ఏఏ ఉద్యోగులు, వ్యక్తులకు అందుబాటులో ఉంటుందో ఒక జాబితా తయారు చేసి.. వారి నుంచి ఆ సమాచారం బయటికి పొక్కకుండా జాగ్రత్త పడాలని కోరింది. ఈ సమాచారం రహస్యంగా ఉంచుతామని వారి నుంచి సంతకాలతో కూడిన ఒప్పంద పత్రాలు కూడా తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం ఉన్న ఉద్యోగులు, వ్యక్తులు ఆయా పథకాల యూనిట్లలో ట్రేడింగ్ చేయడాన్నీ అనుమతించరు.



కుటుంబ సభ్యులతో వీరేంద్ర కుమార్

మంత్రి లోకేశ్‌కు రుణపడి ఉంటాం

▸ స్వగ్రామానికి చేరుకున్న గల్ఫ్‌బాధితుడు వీరేంద్ర

అంబాజీపేట, జూలై 29: ఏజెంటు మోసంతో సౌదీ అరేబియా ఎడారిలో నరకయాతన అనుభవించానని, రక్తపు వాంతులు, నీరుడు కూడా రాని పరిస్థితుల్లో ప్రాణాలతో ఇంటికి వస్తానో లేదో అనిపించిందని గల్ఫ్ బాధితుడు సరెళ్ల వీరేంద్రకుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి వీరేంద్రకుమార్ సోమవారం స్వగ్రామం చేరుకున్నాడు. ఈనెల10న హైదరాబాద్‌కు చెందిన ఏజెంట్ హర్షద్ ద్వారా ఖత్తర్‌లో వంట చేసేందుకు ఒప్పందంతో రూ.1.70లక్షలు కట్టి ఖత్తర్ వెళ్లానన్నాడు. అయితే ఏజెంటు మోసానికి గురైన నన్ను సౌదీ అరేబియా ఎడారిలో ఒంటెల కాపరిగా నియమించినట్లు చెప్పాడు. అక్కడ తరువాత రోజు నుంచి రక్తపు వాంతులు కావడంతో పాటు ఆరోగ్యం బాగా క్షీణించిందని చెప్పాడు. దాంతో కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేశానని, దీనికి వెంటనే మంత్రి నారా లోకేశ్ స్పందించారన్నారు. మంత్రి నారా లోకేశ్, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులకు, కూటమి ప్రభుత్వానికి వీరేంద్ర తండ్రి సత్తిరాజు, తల్లి మరియమ్మ, సోదరుడు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఆర్ఏ 24% మరో ఏడాది కొనసాగింపు

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయం, హెచ్‌వోడీ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులకు 24 శాతం ఇంటి అద్దె భత్యాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మూలవేతనంపై 24 శాతం హెచ్ఆర్ఏ అమలుకు ఆదేశాలు ఇచ్చింది. రూ.25 వేలకు మించకుండా హెచ్ఆర్ఏ వర్తింపు చేయనున్నట్లు తెలిపింది. దీన్ని 2025 జూన్ వరకు వర్తింపజేస్తూ ఆర్థికశాఖ కార్యదర్శి జానకి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి రామకృష్ణ, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.

2న మంత్రివర్గ సమావేశం

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ సమావేశాన్ని ప్రభుత్వం ఆగస్టు 2వ తేదీన నిర్వహించనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 11 గంటలకు సచివాలయ ఒకటవ బ్లాక్‌లో ఈ సమావేశం జరగనుంది. ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు ఆయా విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని 1వ తేదీనే పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

5న కలెక్టర్ల కాన్ఫరెన్స్

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 5వ తేదీన 26 జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఆయన సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేవలం కార్యదర్శులు, హెచ్‌వోడీలతోనే సమావేశమయ్యారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని పరిస్థితులపై సమీక్షించనున్నారు. జిల్లాల్లో పరిస్థితి ఎలా ఉంది? ప్రభుత్వ పాలసీలు ఏమిటి? ఎలా అమలు చేయాలన్న దానిపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. గత ఐదేళ్లలో ఒకటి, రెండు సార్లు మినహా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లు జరిగిన దాఖలాలు లేవు. కానీ రెండు, మూడు నెలలకోసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించాలనే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది.

రాష్ట్ర పునర్నిర్మాణానికి కేంద్రం చేయూత అవసరం!

▸ లోక్‌సభకు తెలిపిన టీడీపీపీ నేత శ్రీకృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఏపీ పునర్నిర్మాణానికి కేంద్రం చేయూత తప్పనిసరని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశారని, రూ.3.75 లక్షల కోట్ల అప్పును రూ.9.74 లక్షల కోట్లకు పెంచారన్నారు. సోమవారం లోక్ సభలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన విధ్వంసాన్ని వివరించారు. రాష్ట్ర విభజన నాటికి ఏపీ రూ.24వేల కోట్ల లోటు బడ్జెట్‌లో ఉందని, 2014 నుంచి 2019 వరకు అప్పులను కట్టడి చేస్తూ, అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. ఆ తర్వాత 2019 నుంచి 2024 వరకు అప్పులను సుమారుగా మూడురెట్లు పెంచేశారని వివరించారు. మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారని, ప్రజల ఆశీస్సులు ఆయనకు పుష్కలంగా ఉన్నాయని, ఎన్డీఏ ప్రభుత్వానికి వచ్చిన ఢోకా ఏమీ లేదని లావు శ్రీకృష్ణ దేవరాయలు చెప్పారు. ఏపీ విభజన చట్టంలోని హామీల ప్రకారమే నిర్మలా సీతారామన్ అమరావతి, పోలవరానికి కేటాయింపులు చేశారన్నారు. సమాఖ్య స్ఫూర్తితోనే ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో నిధులను కేటాయించారని వివరించారు.

ఎమ్మెల్యే బాలరాజు కారుపై రాళ్ల దాడి

జీలుగుమిల్లి, జూలై 29: ఏలూరు జిల్లా పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కారుపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటన జిల్లాలో కలకలం రేపింది. దీనిపై ఎమ్మెల్యే స్వయంగా ఓ ప్రకటన చేశారు.



ధ్వంసమైన ఎమ్మెల్యే కారు అద్దాలు

'బర్రింకలపాడు నుంచి సోమవారం రాత్రి జీలుగుమిల్లి బయలుదేరిన నా వాహనంపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. కారు వెనుక అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దాడి జరిగిన సమయంలో కారులో నేను లేను. నేను సేఫ్‌గా ఉన్నా నియోజకవర్గంలోని కార్యకర్తలు, అభిమానులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. ఘటనపై విచారించి దాడి చేసినవారిపై చర్యలు తీసుకుంటాం' అని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సంఘటనపై పోలీసు నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి.

జల్‌జీవన్ పనులపై పల్స్ సర్వే: పవన్

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ పనులకు సంబంధించిన పరిస్థితిని తెలుసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడేయడం, క్షేత్రస్థాయిలో ఎంత మేర పనులు జరిగాయో తెలియకపోవడంతో ప్రజల నుంచి సమాచార సేకరణ చేయాలని భావించారు. దాని కోసం ప్రజల పల్స్ తెలుసుకునేందుకు పల్స్ సర్వే నిర్వహించాలని సూచించినట్లు సమాచారం. దాని కోసం ప్రత్యేకంగా యాప్ రూపొందించి, ఆ యాప్ ద్వారా జనాల అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని రకాలుగా వెసులుబాటు కల్పించినా వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. పథకం అమలు విషయంలో గత ప్రభుత్వంపై అనేక ఫిర్యాదులు రావడంతో పల్స్ సర్వేకు నిర్ణయించారు.

ఉపాధి నిధులు వాడుకోండి: కృష్ణతేజ

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ పనులు చేపట్టేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ కృష్ణతేజ ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు విరివిగా చేపట్టినందున అందుకు అనుగుణంగా మెటీరియల్ నిధులు ఖర్చు చేసేందుకు వెసులుబాటు ఉంది. గ్రామాల్లో కొత్తగా మెటీరియల్ పనులు చేపట్టేందుకు ఆయా పనులు మంజూరు చేయాలని కలెక్టర్లకు సూచించారు.

మహిళా సంఘాలతో జీవనోపాధి కార్యక్రమాలు

▸ సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జీవనోపాధి కల్పనకు మహిళా సంఘాలను అనుసంధానం చేయాలని సెర్ప్, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను మిలియనీర్లుగా తీర్చిదిద్దాలని, ఆ మేరకు రాబోయే ఆర్నెల్లకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాధిపై దృష్టిపెట్టి వ్యవసాయ, వ్యవసాయేతర జీవనోపాదుల ద్వారా, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. ప్రతి సంఘానికి సకాలంలో బ్యాంకు లింకేజీ రుణాలు అందే ఏర్పాటు చేయాలని, సంఘ సభ్యులు ఏదో ఒక సుస్థిరమైన జీవనోపాధి ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఆదేశించారు.

పులులను కాపాడితే... అవే అడవులను రక్షిస్తాయి

▸ అడవుల విధ్వంసం ఆగాలి: పవన్

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): 'పులులను కాపాడితే.. అడవులను అవే రక్షిస్తాయి. తద్వారా పచ్చదనం పెరిగి, పర్యావరణ సమతౌల్యం చేకూరుతుంది' అని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. సోమవారం మంగళగిరిలోని అరణ్యభవన్‌లో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేసిన పవన్ మాట్లాడుతూ... 'అటవీశాఖ మంత్రిగా వన్యప్రాణుల సంరక్షణకు పూర్తిగా కట్టుబడి ఉన్నా. ప్రకృతిలో భాగమైన అడవులను వివిధ రూపాల్లో నాశనం చేస్తూ, మనిషి జీవితాన్ని గడుపుతున్నాడు. దీనికి ఫుల్‌స్టాప్ పడాలి. అడవుల విధ్వంసం ఆగాలి. అరణ్యాల్లో బతికే వన్యప్రాణుల రక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. పులుల్ని వేటాడినా, అక్రమంగా స్మగ్లింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. 'మన్‌కీ బాత్'లో నల్లమలలో టైగర్ ట్రాకర్స్‌గా చెంచుల గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు. టైగర్ రిజర్వ్‌లో శ్రీశైలం నుంచి శేషాచలం వరకు అటవీ కారిడార్‌లో పులుల సంరక్షణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. శ్రీశైలం పరిసరాల్లో ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, పర్యావరణ హితంగా ఆధ్యాత్మిక యాత్రలు చేసేలా భక్తులకు, అధికారులు అవగాహన కల్పించాలి. అటవీశాఖలో ఉద్యోగుల కొరత, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని పవన్ కల్యాణ్ చెప్పారు.



గ్లోబల్ టైగర్ డే సందర్భంగా అరణ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పులి బొమ్మతో డిప్యూటీ సీఎం

ఫొటోల పిచ్చి ఖరీదు 700 కోట్లు



జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకాన్ని, ప్రభుత్వ లోగోతో ఉన్న పాసు పుస్తకాన్ని చూపిస్తున్న మంత్రి అనగాని

(మొదటి పేజీ తరువాయి)

ఏం చేశారు? సరిహద్దులను నిర్దేశించేందుకు సాధారణ రాళ్లను వాడతారు. కానీ జగన్ కేంద్ర మార్గదర్శకాలకు విరుద్ధంగా 77 లక్షల ఖరీదైన గ్రానైట్ రాళ్లను కొన్నారు. వాటిపై తన పేరును ముద్రించుకున్నారు. పాసుపుస్తకాలపై తనపేరు, ఫొటోలు అచ్చు వేయించుకున్నారు. కేంద్రం చెప్పినదానికి భిన్నంగా రీ సర్వేను తన ప్రచార పిచ్చికోసం వాడుకున్నారు. ఆయన పిచ్చి పనులకు రూ. 700 కోట్ల ప్రజాధనం వృథా అయింది. పాసుపుస్తకాలపై జగన్ ఫొటోల ముద్రణ కోసం 15 కోట్లపైనే ఖర్చుపెట్టారు. ఆయన ఫొటోలున్న భూమి పత్రాలను రైతులు చించివేస్తున్నారు. జగన్ పేరున్న గ్రానైట్ రాళ్లను తమ గ్రామానికి తీసుకురావొద్దని ప్రజలు తిరస్కరిస్తున్నారు. ఇప్పుడు వాటిని ఏం చేయాలి? రాళ్లపై జగన్ పేరు తొలగించాలంటే మరో 15 కోట్లు ఖర్చుపెట్టాలి. ఇంతాచేసి రైతులకు వివాదాలతో కూడిన సర్వే ఫలితాలు ఇచ్చారు" అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జగన్ ప్రచారపిచ్చికి అధికారులు సహకరించారని, నిధుల ఖర్చు విషయంలో ఏమాత్రం అడ్డుచెప్పలేకపోయారని ఆయన తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. కేంద్ర మార్గదర్శకాలను ఆచరించాల్సిన వారే, ఫొటోల పిచ్చికి సహకరిస్తే ఎలా? వృథా అయిన ప్రజాధనానికి ఎవరిని బాధ్యులను చేయాలని ప్రశ్నించినట్లు తెలిసింది. "సరిహద్దులను నిర్దేశించేందుకు ఎవరైనా ఖరీదైన గ్రానైట్ రాళ్లు వినియోగిస్తారా? దీన్ని ఎలా అనుమతించారు? ఎలా సమర్థించారు? ఆ రాళ్లను ఎలా ఉపయోగించుకోవచ్చు...వాటిని ఏం చేయవచ్చో ప్రత్యామ్నాయాలు ఆలోచించాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వైసీపీ భూ దందాలపై విచారణ

దళితులు, బీసీలు, పేద వర్గాల నుంచి వైసీపీ నేతలు పెద్ద ఎత్తున భూములు లాక్కున్నారని మదనపల్లె ఉదంతం నిరూపిస్తోందని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ, విజయవాడ, గుంటూరుతో పాటు ఉమ్మడి జిల్లాల ప్రధాన కేంద్రాల్లో బాధిత ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించి విచారణ చేయాలని ఆదేశించారు. అయితే, కమిటీల పేరిట కాలయాపన చేస్తున్నారన్న సంకేతాలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, సీసీఎల్ఏ జయలక్ష్మి తదితర అధికారులు జిల్లాల్లో పర్యటించి ప్రజల విన్నపాలు స్వీకరించాలని సీఎం ఆదేశించారు.

భరోసా కల్పించాలి

భూములు కోల్పోయిన ప్రజల నుంచి విజ్ఞాపనలు తీసుకోవడమే కాదు, ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందన్న భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. "ప్రభుత్వం....ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని హడావుడి చేసి, ఆ తర్వాత చేతులెత్తేస్తుందన్న అపనమ్మకం కలిగించొద్దు. ప్రజలు ఇచ్చే ప్రతీ ఫిర్యాదును నిశిత పరిశీలన చేసి న్యాయం చేయాలి. అక్రమార్కులకు శిక్ష పడటం ఎంత ముఖ్యమో, బాధితులకు న్యాయం చేయడం అంతే ముఖ్యం. ప్రభుత్వం ఒక టాస్క్ తీసుకుందంటే దాన్ని విజయవంతం చేస్తుందన్న భరోసా ఇవ్వాలి. మీ నుంచి నేను కోరుకునేది అదే" అని అధికారులకు నిర్దేశించారు. "జగన్ పాలనలో అసైన్డ్ విధానంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారు. భూములను సులభంగా 22(ఏ)లో పెట్టడం, తొలగించడం, సులభంగా సర్వే నంబర్లు మార్చడంతో లెక్కలేనన్ని అక్రమాలు చేశారు. తహసీల్దార్ పాస్‌వర్డ్ అనేది ఎవరు పడితే వారు వాడారు. అసైన్డ్ భూములు నేతలు చేజిక్కించుకున్నారు. ఆ భూములు ఎవరి నుంచి ఎవరికి వెళ్లాయి? ఆ ప్రాంతంలో భూముల రేట్లు ఎలా ఉన్నాయి? ప్రభుత్వానికి భూములు అమ్మడానికి ముందు అక్కడ ఎంత ధర ఉంది? ఆ తర్వాత ఏ ధరకు ప్రభుత్వానికి అమ్మారు? అన్న వివరాలు సేకరించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి. " అని ఆదేశించారు. కాగా, సొంత బొమ్మలు వేసుకొని అహంకారపూరితంగా వ్యవహరించిన గత పాలకుల తప్పులను సరిదిద్దుతున్నామని 'ఎక్స్'లో ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వబోతున్నాం. ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడి వారి ఆస్తులకు రక్షణ కల్పించే బాధ్యత తీసుకుంటాం అని వివరించారు.

క్యూఆర్ కోడ్‌తో పాసుపుస్తకాలు

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేసే క్యూఆర్ కోడ్‌ను ముద్రించాలని చంద్రబాబు సూచన చేశారు. రైతులు ఆ కోడ్‌ను స్కాన్‌చేస్తే తమ భూమి వివరాలు, సరిహద్దులు, లోకేషన్, ఇతర వివరాలు తెలుసుకోగలుగుతారు. ఈ మేరకు కొన్ని పాసుపుస్తకాలను సీసీఎల్ఏ తయారు చేయించారు. వాటిని చంద్రబాబు పరిశీలనకు ఇచ్చారు. జగన్ బొమ్మలున్న పుస్తకాలను రీకాల్ చేయాలని ఆయన ఆదేశించారు.

తప్పుచేస్తే జగన్‌పైనా చర్యలు: మంత్రులు

భూముల విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు తేలితే చట్టప్రకారం మాజీ సీఎం జగన్‌పై నయినా చర్యలు తప్పవని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. మదనపల్లె ఫైల్స్ విషయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి పాత్రపై స్పష్టమైన ఆధారాలు లభిస్తున్నాయని, ఆయన తప్పులు నిర్ధారణ అయితే జైలుకు పోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మదనపల్లె ఘటన కుట్రే: సిసోడియా

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి నిప్పుపెట్టడం ముమ్మాటికి కుట్రేనని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా స్పష్టం చేశారు. అది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన కాదని, భూ అక్రమాలు బయటకు రాకుండా చేసిన కుట్రలో భాగమేనని ఆయన ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

బాధితుల సమస్యలు విన్న పవన్

జనసేన కార్యాలయానికి పోటెత్తిన వైసీపీ బాధితులు

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): సమస్యలు తెలుసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మరోసారి ప్రజల మధ్యకు వచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి తమ సమస్యలు చెప్పుకొనేందుకు మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయం వద్దకు సోమవారం భారీగా బాధితులు తరలి వచ్చారు. దీంతో డిప్యూటీ సీఎం నేరుగా వారి వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ నాయకుల కబ్జాలు, గత ప్రభుత్వంలో అన్యాయానికి గురైన ఒప్పంద ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు తమకు న్యాయం చేయాలంటూ వినతిపత్రాలు సమర్పించారు. సత్వర పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులతో మాట్లాడతానని పవన్ హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలని, కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులకు బీమా సదుపాయం కల్పించడంతో పాటు పరస్పర అంగీకార బదిలీలు అమలు చేయాలని పలువురు కోరారు. వైసీపీ నాయకులు తమ ఎకరన్నర భూమిని కబ్జా చేసి సగానికిపైగా అమ్మేసి సొమ్ము చేసుకున్నారని శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బావరాజుపాలెంకు చెందిన కృష్ణవేణి తెలిపారు. తమ కుమారుడిని స్నేహితులే హత్య చేసి రోడ్డు మీద పడేయగా, పోలీసులు అనుమానస్పద మృతిగా నమోదు చేసి, కేసు క్లోజ్ చేశారని చోడవరానికి చెందిన సోమాదుల కృప డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. తమకు సొంత ఇళ్లు లేదని, రేషన్ కార్డు లేదని, ఒంటరి మహిళ పెన్షన్ రావడం లేదని, వెంటనే ఇప్పించాలని పలువురు మహిళలు విజ్ఞప్తి చేశారు.

జనసేన సభ్యత్వ నమోదు 5 వరకూ పొడిగింపు

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీల సభ్యత్వ నమోదు గడువును మరో వారం పొడిగిస్తున్నట్లు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం ఉదయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబుతో కలిసిపార్టీ నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పవన్ కల్యాణ్ ఆమోదం మేరకు ఆగస్టు 5 వరకూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 10 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఐదు వేల సభ్యత్వాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కె.నాగబాబు తెలిపారు. గత ఏడాదితో పోల్చితే రెట్టింపు సభ్యత్వాలు నమోదు అయ్యాయని ఎమ్మెల్సీ హరిప్రసాద్ చెప్పారు. టెలికాన్ఫరెన్స్‌లో పార్టీ కోశాధికారి ఎ.వి.రత్నం, ఐటీ సెల్ చైర్మన్ మిరియాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అహంకారం వల్లే మీ పతనం!

అసెంబ్లీకొచ్చి నిలదీయండంటే.. చంద్రబాబుకు కొమ్ముకాయడమా?

▸ మీ మూర్ఖత్వానికి మిమ్మల్ని మ్యూజియంలో పెట్టాలి

▸ ఇప్పుడు వైసీపీ అంటే వైవీ, సాయిరెడ్డి, సజ్జలే

▸ జగన్‌పై వైఎస్ షర్మిల ధ్వజం



అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అహంకారమే వైఎస్ జగన్ పతనానికి కారణమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి తేల్చి చెప్పారు. అసెంబ్లీకొచ్చి ప్రజాసమస్యలపై నిలదీయాలంటే.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొమ్ముకాయడమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ మూర్ఖత్వానికి ఆయన్ను మ్యూజియంలో పెట్టాలని ఎద్దేవాచేశారు. ఆయనకు చంద్రబాబు పిచ్చి పట్టుకుందన్నారు. గతంలో అద్దంలో చూసుకోమని చెప్పానని, ఇప్పుడు కూడా అద్దంలో ఆయనకు చంద్రబాబే కనబడుతున్నాడని అన్నారు. మాజీ సీఎంను తాను విమర్శించినందుకు వైసీపీ సోషల్ మీడియాలో తనను కించపరుస్తూ ట్వీట్లు పెట్టడంపై ఆమె సోమవారం 'ఎక్స్'లో ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో తనను కించపరిచేంత ద్వేషం జగన్‌కు ఉందని విమర్శించారు. కానీ ఆయనపై తమకు ద్వేషం లేదని షర్మిల స్పష్టం చేశారు. తప్పును తప్పు అనే చెప్పే ధైర్యం తమకుందన్నారు. ఒక ప్రతిపక్షం మరో ప్రతిపక్షాన్ని ప్రశ్నించకూడదని ఎక్కడైనా ఉందా అని జగన్‌ను నిలదీశారు. తప్పు చేస్తే ఏ పార్టీనైనా నిలదీసే అధికారం తమకుందని, అది అధికారపక్షమా.. ప్రతిపక్షమా అన్నది ముఖ్యం కాదన్నారు. 'అసెంబ్లీకి వెళ్లకపోవడం తప్పు కాబట్టే తప్పన్నాం. చట్ట సభను గౌరవించకపోవడం తప్పు కాబట్టే రాజీనామా చేయమన్నాం' అని తెలిపారు. వైఎస్ఆర్ విగ్రహాలు కూల్చేస్తే స్వయంగా నేనే అక్కడకు వచ్చి ధర్నా చేస్తానని అధికారపక్షానికి హెచ్చరికలు తానే చేశానని చెప్పారు. 'అసలు మీరు అధికారంలో ఉండగా ఎన్టీఆర్ విగ్రహాలను కూల్చకుండా ఉండి ఉంటే.. ఈరోజు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ వర్సిటీ పేరు మార్చకపోయి ఉంటే.. ఈ రోజున వైఎస్ఆర్‌కు ఇంతటి అవమానం జరిగి ఉండేది కాదు. అసలు వైఎస్‌ను, విజయమ్మను అవమానించినవారే వైసీపీలో పెద్దవాళ్లు' అని విరుచుకుపడ్డారు. వైఎస్ఆర్‌సీపీలో వైఎస్ఆర్‌ను ఎప్పుడో వెళ్లగొట్టారని అన్నారు. ఇప్పుడు వైసీపీలో ఉన్నది.. వై అంటే వైవీ సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే రామకృష్ణారెడ్డి (సజ్జల) అని వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్‌లా పోరాటాలు చేయడం జగన్‌కు చేతకాదని, ఆయనకు మీడియా పాయింటే ఎక్కువని ఎద్దేవా చేశారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసినందుకు గర్వపడుతున్నామని అన్నారు. వైసీపీ హయాంలో జగన్ రైతులను నిలువునా మోసం చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. రూ.3 వేల కోట్లతో ప్రతి ఏటా ధరల స్థిరీకరణ నిధి అన్నారని.. 4 వేల కోట్లతో పంటనష్ట పరిహారమన్నారని.. జలయజ్ఞానికి తూట్లు పొడిచారని.. జగన్ కంటే మోసగాళ్లు, విశ్వసనీయత కోల్పోయిన వారెవరైనా ఉంటారా అని మండిపడ్డారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం శరీరంలో అణువణువునా పిరికితనం పెట్టుకున్న జగన్ బీజేపీతో అక్రమ సంబంధం పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను.. వైఎస్ వ్యతిరేకించిన బీజేపీకి జగన్ తాకట్టు పెట్టారని షర్మిల విమర్శించారు.

పేదలకు డబుల్ బొనాంజా

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష జరిపారు. రాష్ట్రంలోని గృహ నిర్మాణ స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా పలు నిర్ణయాలు తీసుకున్నారు. అర్హులైన నిరుపేదలందరికీ 2029 కల్లా శాశ్వత గృహ వసతి కల్పించాలని లక్ష్యం విధించారు. రానున్న వంద రోజుల్లో 1.25 లక్షల గృహాలు, ఏడాదిలో 8.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే హైదరాబాద్‌లోని సంజీవరెడ్డి నగర్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు తరహాల్లో కేంద్ర పథకాల ఆసరాతో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు, జర్నలిస్టులకు సరసమైన ధరలకే ఇళ్లు నిర్మించాలని నిర్దేశించారు. దీనికి తగినట్లుగా త్వరలోనే సర్వే నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. సీఎం సమీక్ష తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఇకపై కొత్త లబ్ధిదారులకు గ్రామాల్లో 3 సెంట్లు స్థలం ఇవ్వాలని, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత సర్కారు ఇళ్ల పట్టాల కోసం భూసేకరణ జరిపి లే అవుట్లు వేయని భూముల్లో ఇళ్లస్థలాలు పొందని పేదలకు కూడా 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని నిశ్చయించాం. జగన్ ప్రభుత్వం ఎన్టీఆర్ ఇళ్ల లబ్ధిదారుల విషయంలో పక్షపాతంతో వ్యవహరించి పూర్తయిన ఇళ్లకు కూడా చెల్లింపులు చేయలేదు. ఇటువంటి బాధిత లబ్ధిదారులకు వెంటనే చెల్లింపులు జరపాలని సీఎం ఆదేశించారు' అని చెప్పారు.

పోలవరం పునరావాస ఇళ్లు గృహనిర్మాణ శాఖకు!

పోలవరం ఆర్ అండ్ ఆర్ కింద ఇళ్ల నిర్మాణాన్ని గృహ నిర్మాణ శాఖకు అప్పగింతపై చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు పార్థసారధి తెలిపారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలిచ్చి, మౌలిక సదుపాయాలను కల్పించలేదని.. అటువంటి లేఅవుట్లలో కూడా మౌలిక వసతులు కల్పించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. మంత్రి ఇంకా ఏం చెప్పారంటే..

- 2014-19 కాలాన్ని 2019-24 హయాంతో పోల్చితే.. గత ప్రభుత్వంలో పేదలకు రూ.9 వేల నుంచి 10 వేల కోట్ల వరకూ అన్యాయం జరిగింది. వైసీపీ ప్రభుత్వం ఆర్థిక లాభాన్ని పేదలకు అందకుండా చేసింది.
- నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అని తెగ చెప్పుకొన్న గత ముఖ్యమంత్రి.. వారికి ఎలాంటి అదనపు లబ్ధీ చేకూర్చలేదు. 2014-19 మధ్య కాలంలో యూనిట్ ఖరీదు రెండున్నర లక్షలతోపాటు ఎస్సీ, ఎస్టీలకు అదనంగా రూ.50 వేల నుంచి లక్ష వరకు లబ్ధి చేకూరింది.
- కేంద్రం బడ్జెట్‌లో రూ.4 లక్షల యూనిట్ వ్యయంతో ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నుంచి మంజూరు చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారిని గుర్తించి లబ్ధి చేకూర్చేందుకు త్వరలో సర్వే చేపడతాం. కొత్తగా ఎంపిక చేసే లబ్ధిదారులకు ఇది వర్తిస్తుంది.
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) ఆసరాతో చేపట్టిన గృహాల్లో ఇంకా 8 లక్షల గృహాల నిర్మాణం పురోగతిలో ఉంది. వాటిని కూడా పూర్తి చేస్తాం. పీఎంఏవై 2.0 ప్రకారం కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేస్తాం.
- అమరావతి, తదితర ప్రాంతాల్లో ఇళ్లు మంజూరై.. కోర్టు కేసుల్లో ఉండి ఇళ్లు నిర్మించుకోవడానికి అవకాశం లేని చోట సంబంధిత లబ్ధిదారులకు కొత్త పథకంలో ఇవ్వాలని నిర్ణయించాం.

ఇళ్లు కాదు.. ఊళ్లన్నారు!

▸ భూ కొనుగోలు, మెరకకు 88 వేల కోట్ల ఖర్చు

▸ చాలా లేఅవుట్లు ముంపు ప్రాంతాల్లోనే

'ఇళ్లు లేని పేదలందరికీ పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు చూడకుండా పక్కా ఇళ్లు కట్టిస్తాం. ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లు కట్టిస్తాం. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలిస్తాం. ఇళ్లు కూడా కట్టిస్తాం' అంటూ జగన్ గత ఐదేళ్లూ ఊదరగొట్టారు. జగనన్న కాలనీల పేరుతో ఇళ్లు కాదు.. ఏకంగా ఊళ్లే నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని లే-అవుట్లలో లబ్ధిదారులకు సెంటున్నర చొప్పున, పట్టణ ప్రాంతాల లబ్ధిదారులకు సెంటు చొప్పున కేటాయించారు. ఆయన హయాంలో పేదలకు ఇళ్లస్థలాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములతోపాటు మరో 25,360 ఎకరాల ప్రైవేటు భూములను కొనుగోలు చేశారు. వాటిలో దాదాపు 15 వేల లే-అవుట్లు ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.55 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు గత ప్రభుత్వమే చెప్పింది. తర్వాత ఆ భూములను మెరక చేసి (లెవెలింగ్) జగనన్న కాలనీలుగా అభివృద్ధి చేసే పనులకు ప్రభుత్వం మరో రూ.33 వేల కోట్లు ఖర్చు చేసింది. మొత్తంగా పేదల ఇళ్ల స్థలాల కొనుగోలు, వాటిని మెరక చేసేందుకు మొత్తం రూ.88 వేల కోట్లకు పైగా వ్యయం చేసినట్లు తెలిపింది.

- ఊరికి దూరంగా లోతట్టు ప్రాంతాల్లో పనికిరాని పోరంబోకు భూములను ప్రైవేటు వ్యక్తుల నుంచి అతితక్కువ ధరలకు కొనుగోలు చేసి.. వాటినే ప్రభుత్వానికి నాలుగైదు రెట్లు ఎక్కువ ధరకు అంటగట్టిన వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలు రూ. కోట్లకు పడగలెత్తారు.
- రాష్ట్రంలో చాలాచోట్ల ఇళ్ల స్థలాల లే-అవుట్లు శ్మశానాలకు అతి దగ్గరగాను, లేదంటే ఊరికి కొన్ని కిలోమీటర్ల దూరంగా నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఉన్నాయి. వాటిలో ఎక్కువ లే-అవుట్లు లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే అవి చెరువులుగా మారుతున్నాయి. అనువైన పరిస్థితులు లేకపోవడంతో ఇళ్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు విముఖత చూపుతున్నారు. జనావాసాలకు దగ్గరగా నివాసయోగ్యంగా ఉండే ప్రదేశాల్లో తమకు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించాలని కోరుతున్నారు. అలా సాధ్యం కాదంటే 'మీ ఇళ్లూ వద్దు.. స్థలాలూ వద్దు' అంటూ ఇప్పటికి దాదాపు లక్ష మందికి పైగా లబ్ధిదారులు తమకు ఇచ్చిన ఇళ్లస్థలాల పట్టాలను తిరిగి ప్రభుత్వానికే ఇచ్చేశారు. దీంతో జగనన్న లే-అవుట్ల కోసం ప్రభుత్వం ఖర్చు చేసిన రూ. వేల కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు కాగా.. వైసీపీ నేతలపై మాత్రం కాసుల వర్షం కురిసింది.
- ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లు కట్టిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 5 లక్షల ఇళ్లు మాత్రమే కట్టింది. సకాలంలో నిర్మించనందుకు.. రాష్ట్రానికి మంజూరు చేసిన దాదాపు 5.30 లక్షల ఇళ్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. మిగిలినవన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. వీటిలో ఆప్షన్-3 (ప్రభుత్వం కట్టించి ఇస్తామన్నవి) కింద 3.5 లక్షలు ఉన్నాయి. వీటిని వైసీపీ అస్మదీయులైన కాంట్రాక్టర్లకు అప్పగించారు. వారికి ఒక్కో ఇంటికి బేస్‌మెంట్ నిర్మాణానికే రూ.70 వేల చొప్పున అడ్వాన్సుతోపాటు సిమెంటు, స్టీలు, ఇసుకను కూడా ముందుగానే ఇచ్చేశారు. లబ్ధిదారుల పేరుతో రూ.35 వేల చొప్పున రుణాలు మంజూరు చేయించి ఆ సొమ్మును కూడా కాంట్రాక్టర్లకే చెల్లించారు. కానీ కాంట్రాక్టర్లు ఎక్కడివక్కడే వదిలేసి వెళ్లిపోయారు. మొత్తంగా గృహనిర్మాణ రంగ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో అవినీతి చోటుచేసుకుంది.

అనపర్తి రెడ్డిపై అంతప్రేమ ఎందుకో..!?

ఆర్టీసీలో చర్చనీయాంశమైన సలహాదారు పొడిగింపు

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితమే పదవీ విరమణ చేయాల్సిన ఆ అధికారి.. రాష్ట్ర ప్రభుత్వం పదవీ విరమణ వయసు పెంచడంతో 62 ఏళ్ల వయసు వరకూ కొనసాగారు. మరో రెండేళ్లు పొడిగింపు కావాలంటున్నారు. ఇంకేముంది ఆయన లాంటి సమర్థుడు ఆర్టీసీలో లేరన్నట్టు.. ప్రభుత్వానికి కొనసాగింపు ప్రతిపాదన పంపారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సిఫారసును రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్థిక శాఖకు ప్రతిపాదించారు. నేడో రేపో ఆర్థిక శాఖ నుంచి ఆమోదం లభిస్తే మరో రెండేళ్లు ఆ అధికారి ఉద్యోగం పదిలం! ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కన్నా వైసీపీ ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలే ముఖ్యమంటూ ఏకపక్షంగా వ్యవహరించిన రెడ్డి గారిపై ఇంత ప్రేమ ఎందుకో..? అంటూ సిబ్బంది పెదవి విరుస్తున్నారు. అనపర్తి రెడ్డి అని ఆర్టీసీలో పిలుచుకునే ఆర్థిక సలహాదారు రాఘవరెడ్డి బుధవారం పదవీ విరమణ చేయనున్నారు. ఇప్పటికే ఆర్టీసీలో గత మూడు నెలల్లో ఇద్దరు ఈడీలు కోటేశ్వరరావు, క్రిష్ణమోహన్ పదవీ విరమణ చేశారు. వారి స్థానంలో ఎవరికీ పదోన్నతులు కల్పించకుండా సీనియర్ ఆర్ఎంలుగా ఉన్న చంద్రశేఖర్(ఆపరేషన్స్), జీవీ రవివర్మ(ఇంజనీరింగ్)కు ఇంచార్జి ఈడీలుగా యాజమాన్యం బాధ్యత అప్పగించింది. మరోవైపు ఆగస్టులో నెల్లూరు ఈడీ ఆదామ్ సాహెబ్, విజయనగరం ఈడీ రవికుమార్ రిటైర్ కాబోతున్నారు. నవంబరులో విజయవాడ ఈడీ గోపీనాథ్ రెడ్డి కూడా రిటైరవుతారు. ఈ ముగ్గురిలో ఆదామ్ సాహెబ్, గోపీనాథ్ రెడ్డికి సమర్థులుగా, రాజకీయ పార్టీలకు దూరంగా ఉండే అధికారులుగా పేరుంది. కానీ, అలాంటి అధికారుల గురించి ఆర్టీసీ యాజమాన్యం కనీసం పట్టించుకోకుండా... వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన అధికారి కొనసాగింపునకు ప్రయత్నించడం ఏమిటన్న ప్రశ్న వినిపిస్తోంది.

నీతిలేని రాతలు



- మదనపల్లె ఘటనపై రోతపత్రిక ఏడుపు
- నిజాలు దాచి విషం చిమ్మడమే పని
- వాస్తవాలు రాస్తున్న 'ఆంధ్రజ్యోతి'పై అక్కసు
- సమాచారం ఎలా తెలిసిందంటూ అభాండాలు
- 'ఆంధ్రజ్యోతి' డైరెక్షన్‌లో విచారణ అంటూ నిందలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నిజాలు దాచి నీచరాతలు రాయడం, ప్రత్యర్థులపై విషం చిమ్మడం జగన్ రోత పత్రికకు అలవాటుగా మారిపోయింది. ఆయన అధికారంలో ఉన్నప్పుడు ప్రజల్ని మభ్యపెట్టేందుకు అబద్ధాలు అచ్చేసింది. జగన్ చిత్తుచిత్తుగా ఓడిపోయినా తీరు మారలేదు. ఇప్పుడూ అవే ఏడుపుగొట్టు వార్తలు. ఒక సబ్‌కలెక్టర్ కార్యాలయం తగలబడిపోవడం ఏమాత్రం జర్నలిజం విలువల్లేని రోతపత్రికకు కనపడకపోవడంలో ఆశ్చర్యం లేదు. కానీ, ఆ ఘటన తర్వాత ప్రభుత్వం, బాధ్యత గల మీడియా స్పందిస్తున్న తీరును జీర్ణించుకోలేకపోతోంది. మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల కాల్చివేత ఘటనపై 'ఆంధ్రజ్యోతి' డైరెక్షన్‌లో ప్రభుత్వ విచారణ సాగుతోందంటూ రోతపత్రిక నీచపు రాతలు రాస్తోంది. పాలనా వ్యవస్థలో ఏం జరుగుతుందో ముందుగా తెలుసుకుని జనాలకు చేరవేయడం మీడియా కర్తవ్యం. ఆ పని చేతగాని రోత పత్రిక... సమర్థవంతంగా వార్తలను జనాలకు అందిస్తున్న 'ఆంధ్రజ్యోతి'పై ఏడుపుగొట్టు వార్తలు రాసి తన చేతగాని తనాన్ని బయట పెట్టుకుంటోంది. మదనపల్లె ఘటనలో ఒక మాజీ ఎమ్మెల్యే పోలీసుల విచారణకు హాజరయ్యే అవకాశాలున్నాయంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తపై వికృత పైత్యం ప్రదర్శించింది. పోలీసులు ఎవరినైనా విచారణకు పిలవాలంటే కనీసం ఒక్కరోజు ముందైనా వారికి సమాచారం ఇస్తారు. ఆ విషయాన్నే 'ఆంధ్రజ్యోతి' రాసింది. వాస్తవానికి ఈ కేసులో మాజీ ఎమ్మెల్యేపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. కానీ జగన్ రోత పత్రిక వాస్తవాలను వక్రీకరించడమే గాక వార్తలు రాస్తున్నందుకు 'ఆంధ్రజ్యోతి'పై విషం కక్కుతోంది.

కళ్లకు కనిపించడం లేదా?

మదనపల్లెలో సబ్‌కలెక్టర్ ఆఫీసు తగలబడిపోవడంతో రాష్ట్రమంతా నివ్వెరపోయింది. యంత్రాంగం అక్కడ జరిగిన అరాచకంపై దృష్టి కేంద్రీకరించింది. కానీ అక్కడేదో జరిగిపోయినట్టు రాష్ట్ర అధికారులు హెలికాప్టర్లో అక్కడికి వెళ్లారంటూ రోతపత్రిక తప్పుబడుతోంది. గత ప్రభుత్వంలో చేసిన అక్రమాలు బయటకు రాకుండా బూడిద చేసే కుట్ర చేయడం రోతపత్రికకు కనబడకపోవడం విడ్డూరం. అసలు హెలికాప్టర్ల గురించి మాట్లాడే నైతిక హక్కు రోతపత్రికకు గానీ, వైసీపీకి గానీ లేదు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు 7 కిలోమీటర్ల దూరానికి కూడా హెలికాప్టర్లో వెళ్లిన ఘనుడు ఆయన. ఆనాడు తప్పు కనిపించని రోతపత్రికకు ఇప్పుడు తప్పుగా ఎందుకు కనిపిస్తోందో? ఎన్నికల ప్రచారం కోసమంటూ జగన్‌కు ఫిబ్రవరిలో రెండు హెలికాప్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో హెలికాప్టర్ ఖర్చు రూ.1.91 కోట్లు. ఇంధన రవాణా ఖర్చును రాష్ట్ర ఖజానా నుంచే వాడారు. వైసీపీ భరించాల్సిన ఖర్చును రాష్ట్ర ఖజానా నుంచి దోచేశారు.

ఘోరం జరిగినా...

మదనపల్లె ఘటనలో 2200కుపైగా ఫైళ్లు, 14,000 ఎకరాలకు సంబంధించిన ఫైళ్లు, 22ఏ జాబితాలోని భూముల వివరాలు తగలబడిపోయాయి. ఎంతోమంది రైతులు, పేద ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలు కూడా ఈ ఘటనతో ముడిపడి ఉన్నాయి. జరిగిన నేరం తీవ్రమైంది. ఆలస్యమైతే వాస్తవాలు తారుమారు కాగలవు. అందుకే ఉన్నతాధికారులు హెలికాప్టర్లో వెళ్లారు. ఇవన్నీ రోతపత్రికకు కనిపించలేదా? రాష్ట్ర పాలన సచివాలయం నుంచి జరుగుతుందన్న వాస్తవాన్ని రోతపత్రిక గ్రహించాలనుకోవడం అత్యాశే. గత ఐదేళ్ల రాష్ట్ర పాలన నీలి, కూలి మీడియా కార్యాలయాల నుంచి జరిపించడం వారికి అలవాటే. ఘటన జరిగి 8 రోజులవుతోంది. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, డీజీపీ ద్వారకా తిరుమలరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇతర ఉన్నతాధికారులు అక్కడే మకాం వేసి విచారణ చేస్తున్నారు. కేసు ఒక కొలిక్కి రాలేదు. దీనిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సింది పోయి ఘటనకు సంబంధించిన వార్తలు కవర్ చేస్తున్న 'ఆంధ్రజ్యోతి'పై అక్కసు ఎందుకో?

'ఆంధ్రజ్యోతి'పై అక్కసు

ఒక్క రోతపత్రిక తప్ప మిగతా మీడియా మదనపల్లె ఘటనను సీరియస్‌గా తీసుకుని ప్రజలకు వివరాలు అందజేస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరులో పోలీసు వ్యవస్థ ఇప్పటికీ వైసీపీ కంట్రోల్‌లోనే ఉందని టీడీపీ వాళ్లు ఫిర్యాదులు చేస్తున్నారు. అది నిజం కాకపోతే పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు విదేశాలకు పారిపోయి ఉండేవారా? వైసీపీ అనుకూల పోలీసులు లీకులివ్వడం వల్లే ఆ వ్యక్తి తప్పించుకున్నారు. విచారణను ఎవరు ప్రభావితం చేస్తున్నారో అర్థం చేసుకోవడానికి ఆ ఘటన చాలు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల కాల్చివేత ఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో వార్తలు రావడమే రోతపత్రికను కలవరపెడుతున్నట్టుంది. విచారణకు మాజీ ఎమ్మెల్యే అంటూ మీడియాకు లీకులిచ్చిందెవరంటూ ఇంకో మీడియా అడగడం చూస్తుంటే జర్నలిజం విలువలు కోల్పోయిందనుకోవాలి. లేదా అసలు జర్నలిజం అంటే ఏంటో కూడా తెలీదనుకోవాలి. 'ఆంధ్రజ్యోతి'తో విచారణాధికారులు చర్చలు జరిపినట్టు తెలిసిందంటూ ఆ ఏడుపుగొట్టు వార్తలో రాశారు. మీకెలా తెలిసిందని 'ఆంధ్రజ్యోతి' అడగదు. కానీ, ఆ అసత్యాన్ని మీరు నిరూపించగలరా?

ఇద్దరు ఆర్డీవోలపై వేటు

- సబ్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్‌పైనా మదనపల్లె ఫైళ్ల కాల్చివేత కేసులో చర్యలు
- సబ్‌కలెక్టర్‌కు వందలమంది బాధితుల ఫిర్యాదు
- పెద్దిరెడ్డి కుటుంబీకులు 4 కోట్ల స్థలం లాక్కుని కంచె వేశారని వృద్ధురాలి రోదన
- పెద్దిరెడ్డి భార్య పేరిట చెరువు.. ఆపై ఫ్రీహోల్డ్


మురళి


హరిప్రసాద్


గౌతంతేజ్

రాయచోటి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల కాల్చివేత కేసులో ఇద్దరు ఆర్డీవోలను, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా నివేదికల ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో మదనపల్లె ఆర్డీవోగా పనిచేసిన మురళి, ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్‌తో పాటు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గౌతంతేజ్‌లను సస్పెండు చేసింది. ఇదే కేసులో ఇటీవల మదనపల్లె వన్‌టౌన్ సీఐ వలీబషను వీఆర్‌కు పంపి, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండు చేశారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం తమ అదుపులో అనుమానితులు ఎవరూ లేరన్నారు. ఎఫ్ఎస్ఎల్ (ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్) నివేదిక రాగానే 15 రోజుల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామన్నారు. మాధవరెడ్డి ఇంట్లో 500 వరకు ఇళ్ల స్థలాలు, భూముల డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో శశికాంత్ ఇంట్లో మదనపల్లెకు చెందిన భూముల రికార్డులు దొరికాయన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి పీఏ తుకారం ఇంట్లోనూ, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఇంట్లోనూ సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఫైళ్ల కాల్చివేత కేసును అన్ని కోణాల్లో సాంకేతిక సహకారంతో పరిశోధిస్తున్నట్లు వివరించారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించినట్లు తెలిపారు. సెల్ టవర్ డంప్స్ తీశామని, 2000కు పైగా ఫోన్ కాల్‌డేటాను పరిశీలించినట్లు తెలిపారు. వాట్సాప్‌లకు సంబంధించి ఐపీడీఆర్‌ను కూడా పరిశీలించినట్లు చెప్పారు. ఇప్పటికే అనుమానితుల ఇళ్లను సోదా చేసి విలువైన ఆధారాలు సేకరించినట్లు ప్రకటించారు. పరిశోధనకు ఉపయోగపడే డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కొత్తగా 8 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో సీఐడీ అధికారుల సహకారంతో 15 బృందాలు విచారణ చేసినట్లు తెలిపారు.

బాధితుల వెల్లువ

సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ప్రజలు పోటెత్తారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకుల వేధింపులకు గురైన బాధితులు వెల్లువలా వచ్చారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు సుమారు 150 మంది బాధితులు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. వైసీపీ నాయకులు తమ భూములు ఆక్రమించారని, దౌర్జన్యంగా లాక్కున్నారని, విలువైన భూములను అతి తక్కువ ధరకే కాజేశారని.. చాలా వరకు ఇలాంటి ఫిర్యాదులే ఉన్నాయి.

సబ్ కలెక్టరేట్‌ను పరిశీలించిన సీపీఐ నారాయణ

మదనపల్లె సబ్ డివిజన్‌లోని భూబాధితులు ఆగస్టు 4వ తేదీ మదనపల్లె సబ్ కలెక్టరేట్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని, తమ పార్టీ అండగా ఉంటుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఫైళ్లు దహనమైన గదిని, కాలిన కాగితాలను, పరిసరాలను ఆయన పరిశీలించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోకి పోలీసులు అనుమతించకుండా ఆయనను అడ్డుకోవడంతో సీపీఐ నాయకులు పోలీసులను తోసుకుని వెళ్లి కార్యాలయంలో జరిగిన సంఘటనను పరిశీలించారు. అనంతరం ఆయన పోలీసుల తీరుపై మండిపడ్డారు. అంత జాగ్రత్తగా పోలీసులు ఉంటే ఇప్పటికే నిందితులను పట్టుకోవచ్చు కదా అని ప్రశ్నించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కొందరు ఉద్దేశపూర్వకంగానే స్వార్థ ప్రయోజనాల కోసం ఫైళ్లు కాల్చినట్లు సంఘటనను చూస్తే అర్థం అవుతుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ప్రజలను అన్నివిధాలా దోచుకున్నారని ఆరోపించారు. నిరుపేదల భూములను ఆక్రమించి వారిపైనే దౌర్జన్యం చేసి కేసులు కట్టిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు.

పెద్దిరెడ్డి కుటుంబీకుల కబ్జా



పట్టణంలోని కదిరి రోడ్డులో సర్వే నంబరు 145/6లో 22 సెంట్ల భూమిని నా భర్త మల్లికార్జున కొనుగోలు చేశారు. ఈ స్థలంపై కన్నేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య స్వర్ణలత, పెద్దిరెడ్డి తమ్ముడు ద్వారకానాథరెడ్డి మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో మా స్థలం సబ్ డివిజన్ ఫైలు మాయం చేశారు. ఈ స్థలంపై హక్కులేని వారి వద్ద కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని, మా స్థలాన్ని కబ్జా చేశారు.

\- గిరిజ, వృద్ధురాలు

వెలుగులోకి పెద్దిరెడ్డి అక్రమాలు

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య స్వర్ణలతకు అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం వీరబల్లి గ్రామంలో ఐదెకరాల విస్తీర్ణం ఉన్న చెరువును రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఆపై ఆ చెరువును 2023లో ఫ్రీహోల్డ్‌గా చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అత్తగారి ఊరు వీరబల్లి. ఈ గ్రామ పరిధిలోని సుగాలితాండా సమీపంలో ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్రదిబ్బ చెరువును పెద్దిరెడ్డి భార్య పేరుతో కేటాయించారు.


శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు వెళ్తున్న వరద

శ్రీశైలం దాటిన కృష్ణమ్మ

- జలాశయం 3 గేట్లు ఎత్తి నీరు విడుదల

అమరావతి (ఆంధ్రజ్యోతి), శ్రీశైలం, జులై 29: ఎగువన కురుస్తున్న వర్షాలకు వడివడిగా పరుగులు పెడుతున్న కృష్ణమ్మ శ్రీశైలం జలాశయాన్ని దాటి కిందకు దూకింది. శ్రీశైలానికి వరద పోటెత్తడంతో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు మూడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. జూరాల, సుంకేశుల నుంచి వరద ప్రవాహం పెరగడంతో మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 3,03,984 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 1,48,599 క్యూసెక్కులు మొత్తం 4,52,583 క్యూసెక్కుల మేర వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 4,51,080 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 879.20 అడుగులుగా నమోదైంది. కాగా, వాస్తవానికి.. మంత్రి నిమ్మల రామానాయుడు సహా మరికొందరు మంత్రుల సమక్షంలో శ్రీశైలం గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేయాలని భావించినా.. గోదావరి జిల్లాల్లో బాధితులకు సహాయ పునరావాస కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అట్టహాసం లేకుండా అధికారులే శ్రీశైలం జలాశయం మూడు గేట్లను ఎత్తి నీటిని కిందకు వదిలారు.

నీళ్లున్నా.. కన్నీళ్లే?!

- శ్రీశైలం గేట్లెత్తినా సీమకు నీరందని దుస్థితి
- హంద్రీ-నీవాకు విడుదల ప్రశ్నార్థకమే!!

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

రాయలసీమలో కరువు, దుర్భిక్షం నివారణ లక్ష్యంగా హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం చేపట్టారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలన్నది ప్రధాన ఆశయం. ఇందులో భాగంగా శ్రీశైలం జలాశయం ఎగువన కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలం మాల్యాల నుంచి 40 టీఎంసీల కృష్ణా వరద జలాలు ఎత్తిపోయాలి. ఫేజ్-1 కింద మల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కిలోమీటర్ల ప్రధాన కాలువ, 3,850 క్యూసెక్కులు ఎత్తిపోసేందుకు 8 పంపింగ్ స్టేషన్లు, ప్రతి పంపింగ్ స్టేషన్ వద్ద 12 విద్యుత్ పంపులను ఏర్పాటు చేశారు. కృష్ణా జలాలు కర్నూలు జిల్లా దాటి అనంతపురం జిల్లాకు చేరాలంటే కర్నూలు-గుంటూరు వయా నందికొట్కూరు-ఆత్మకూరు జాతీయ రహదారి (340సీ), హైదరాబాద్-బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారిని దాటాల్సి ఉంది. కర్నూలు నగర శివారున బి.తాండ్రపాడు సర్కిల్ నుంచి ఆత్మకూరు వరకు 65 కిలోమీటర్ల మేర 340సీ నేషనల్ హైవే నిర్మాణం పనులను దాదాపు రూ.1,200 కోట్లతో చేపట్టారు. ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షణలో పీఎస్‌కే కన్‌స్ట్రక్షన్ ఈ పనులు చేస్తోంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా బ్రాహ్మణకొట్కూరు సమీపంలో హంద్రీ-నీవా కాలువపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. అందులో భాగంగా కాలువపై ఉన్న పాత వంతెనను ధ్వంసం చేసి అక్కడికి పది మీటర్ల దూరంలో కొత్త వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. కర్నూలు నుంచి నందికొట్కూరు, ఆత్మకూరు మీదుగా శ్రీశైలం, గుంటూరు, ప్రకాశం జిల్లా ప్రాంతాలకు వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా హంద్రీ-నీవా కాలువను ఎర్రగరుసుతో పూడ్చేసి డైవర్షన్ క్రాస్‌రోడ్డు నిర్మించారు. జూన్ తర్వాత ఏ క్షణమైనా కృష్ణా నదికి వరద వచ్చే అవకాశం ఉందని, వరదొస్తే నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా జూన్ ఆఖరులోగా హైవే బిడ్జి నిర్మాణం పూర్తి చేయడంతో పాటు కాలువకు అడ్డుగా నిర్మించిన డైవర్షన్ క్రాస్ రోడ్డు తొలగించాలని హంద్రీ-నీవా ఇంజనీర్లు స్పష్టమైన నిబంధనతో అనుమతి ఇచ్చారు. ఇప్పుడు కృష్ణాకు వరదొచ్చి శ్రీశైలం గేట్లెత్తినా.. డైవర్షన్ రోడ్డును తొలగించలేదు. ఇంజనీర్లు కాంట్రాక్టు సంస్థ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా లాభం లేకపోయింది. 'మీరెందుకు తొందర చేస్తారు..? అవసరమైతే సీఎం చంద్రబాబు, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడతాం..' అని ఆ సంస్థ ప్రతినిధులు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

అంగట్లో అన్నీ ఉన్నా..

శ్రీశైలం జలాశయం 834 అడుగుల మట్టం దాటగానే మల్యాల నుంచి హంద్రీ-నీవా కాలువకు కృష్ణా జలాలు ఎత్తిపోసే అవకాశం ఉంది. ఈదఫా డ్యాంకు ముందుగానే వరద పోటెత్తింది. ఈ నెల 23నే 837.80 అడుగులు దాటింది. 1,73,504 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ఆ రోజు నుంచే హంద్రీ-నీవా కాలువకు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. అక్కడ కాలువను పూడ్చేసి తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ క్రాస్ రోడ్డును ఎన్‌హెచ్‌ఏఐ తొలగించలేదు. ఎందుకంటే బ్రిడ్జి పనులు ఇంకా పూర్తికాలేదు. దీనివల్లే మల్యాల లిఫ్ట్ పంపులు ఆన్ చేయలేదని ఇంజనీర్లు అంటున్నారు. సోమవారం జలాశయం 878.90 అడుగుల మట్టం దాటేసింది. 4,74,227 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వరద ఉధృతి దృష్ట్యా గేట్లెత్తి దిగువన నాగార్జున సాగర్ డ్యాంకు వరద నీటిని విడుదల చేస్తున్నారు. ఇటు వైపు మాత్రం డైవర్షన్ క్రాస్ రోడ్డు కారణంగా హంద్రీ-నీవాకు నీటిని ఎత్తిపోయలేని దుస్థితి. కాంట్రాక్టు సంస్థ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సకాలంలో బ్రిడ్జి పనులు పూర్తి చేసి.. కాలువకు అడ్డంగా నిర్మించి డైవర్షన్ రోడ్డును తొలగించి ఉంటే వారం రోజుల నుంచే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉండేది. అదే జరిగి ఉంటే కృష్ణా జలాలు కర్నూలు జిల్లా దాటి అనంతపురం జిల్లాకు చేరి ఉండేవి. ఆగస్టు 1న సీఎం చంద్రబాబు శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించి జలహారతి ఇవ్వనున్నారు. దీంతో మంగళవారం హంద్రీ-నీవా కాలువకు నీటిని ఎత్తిపోయాలని ఇంజనీర్లు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఈ అంశాన్ని హంద్రీ-నీవా ప్రాజెక్టు ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. శ్రీశైలంలో వరద 834 అడుగులు దాటగానే వరద జలాలను హంద్రీ-నీవా కాలువకు ఎత్తిపోయాల్సి ఉందని.. అయితే నేషనల్ హైవే అధికారులు కాలువను పూడ్చి డైవర్షన్ క్రాస్ రోడ్డు నిర్మించడం వల్ల సాధ్యం కాలేదన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. దీనిని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టరు (పీడీ) గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఇంజనీర్లు లేఖ రాసిన మాట నిజమేనని.. కాలువకు అడ్డంగా నిర్మించిన డైవర్షన్ క్రాస్ రోడ్డును 2-3 రోజుల్లో తొలగిస్తామని, వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తామన్నారు.

అర్ధరాత్రి నిండు గర్భిణి అష్టకష్టాలు

- నడి గోదావరిలో 4 కిలోమీటర్లు పడవ ప్రయాణం
- కలెక్టర్ చొరవతో కదిలిన యంత్రాంగం
- చింతూరు ఆసుపత్రిలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం


గర్భిణిని కూనవరం నుంచి చింతూరు రెస్క్యూ బోటులో తరలిస్తున్న దృశ్యం

చింతూరు, జూలై 29: అర్ధరాత్రి ఆ నిండు గర్భిణి పడ్డ కష్టాలు అన్ని ఇన్నీ కావు. ఓవైపు తీవ్ర రక్తస్రావం.... మరోవైపు నిండు గోదావరి.. ఎటు చూసినా కానరాని రోడ్డు మార్గం.. ఎలాగైనా పూర్తి వసతులున్న ఆసుపత్రికే చేర్చాలి. లేదంటే తల్లీ బిడ్డ ప్రాణాలకే ముప్పు. దీంతో అర్ధరాత్రి దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర నడి గోదావరిలో బోటుపై తరలించాల్సి వచ్చింది. వివరాలివీ.. అల్లూరి సీతారామరాజు జిల్లా వరరామచంద్రపురానికి చెందిన ముంజారపు దుర్గాభవాని ఎనిమిది నెలల గర్భిణి. సోమవారం రాత్రి ఆమెకు తీవ్ర రక్తస్రావం అవడంతో కుటుంబీకులు మండలంలోని రేఖపల్లి ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితిని అంచనా వేసిన వైద్యులు అనిల్‌కుమార్, లక్ష్మీప్రశాంతి.. కాన్పు చేయాలంటే విధిగా గైనకాలజిస్టు, మత్తుమందు వైద్యుడి ఆవశ్యకతను గుర్తించారు. అయితే, ఆ తరహా నిపుణులు అక్కడ లేకపోవడంతో ఆ దిశగా సాహసం చేయలేకపోయారు. గత్యంతరం లేని పరిస్థితిలో కూనవరం ఆసుపత్రికి చెందిన గైనకాలజిస్టు శ్వేత సలహాలను మొబైల్ ద్వారా తీసుకుంటూ చికిత్స మొదలుపెట్టినా ఆశించిన ఫలితం రాలేదు. చేసేదేమీలేక రేఖపల్లి వైద్యులు పరిస్థితిని వర రామచంద్రపురం తహసీల్దారు సయ్యద్ మౌలానా ఫాజిల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సమాచారమందించారు. తక్షణం రంగంలోకి దిగిన కలెక్టర్ ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని అలెర్ట్ చేశారు. వెనువెంటనే ఎన్డీఆర్ఎఫ్ బృందం రెస్క్యూ బోటుతో రేఖపల్లి ఆసుపత్రికి చేరుకుంది. అక్కడి నుంచి గర్భిణిని బోటులో ధర్మతాళ్లగూడెం చేర్చారు. అప్పటికే కూనవరం-వర రామచంద్రపురం మండలాల నడుమ బ్రిడ్జి మునిగి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వర రామచంద్రపురం మండలం వడ్డిగూడేనికి చెందిన బోటు యజమానులను సంప్రదించి, నాలుగు కిలోమీటర్లు ఫైబరు బోటులో గర్భిణిని కూనవరం గోదావరి ఒడ్డుకు చేర్చారు. కలెక్టర్ సూచనలతో అప్పటికే సిద్ధంగా ఉన్న కూనవరం సీఐ రామారావు స్వయంగా వాహనం నడిపి కూనవరం ఆసపత్రికి తీసుకెళ్లారు. అక్కడ కూడా పూర్తిస్థాయి వసతులు లేకపోవడంతో సోమవారం ఉదయం కూనవరం నుంచి 30 కిలోమీటర్ల మేర కొద్దిదూరం బోటులో, మరికొద్ది దూరం అంబులెన్సులో చింతూరు ఏరియా ఆసుపత్రికి చేర్చారు. అక్కడి వైద్యులు ప్రసవం చేశారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ పదోన్నతుల్లో ఒకే విధానం

- కోర్టును ఆశ్రయించనున్న అధికారులు, ఉద్యోగులు

విజయవాడ, జూలై 29(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు అవలంభించిన విధానాన్ని ప్రభుత్వ శాఖల్లో కూడా వర్తింపజేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ మేరకు అధికారులు, ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కాగా, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ రామకృష్ణారెడ్డి పదవీ విరమణ నేపథ్యంలో కాబోయే ఈఎన్‌సీ ఎవరన్నది వివాదాస్పదమవుతోంది. కొంతమంది తీవ్రస్థాయిలో పైరవీలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పదోన్నతులు అందుకున్న వారు మళ్లీ అత్యున్నత పదవి అందుకోవటానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఒక్క ఆర్‌డబ్ల్యూఎస్‌లో మాత్రమే కాకుండా ఇలాంటి పంచాయితీలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ వంటి శాఖల్లో కూడా కనిపిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని హైకోర్టే అమలు చేసినప్పుడు ప్రభుత్వ శాఖల్లో ఎందుకు అమలు చేయకూడదని ఉద్యోగులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టులోనే ఈ విషయాన్ని తేల్చుకునేందుకు ఆయా శాఖల అధికారులు సన్నద్ధమవుతున్నారు. అయితే, న్యాయస్థానాల వరకు వెళ్లకుండా ప్రభుత్వమే ఈ దిశగా నిర్ణయం తీసుకుంటే అందరికీ న్యాయం చేసినట్టు అవుతుందన్న వాదన కూడా ఉద్యోగుల నుంచి వ్యక్తమవుతోంది.

శాంతించిన గోదావరి

- భద్రాచలం వద్ద తగ్గిన నీటిమట్టం
- మొదటి హెచ్చరిక ఉపసంహరణ
- ధవళేశ్వరం వద్ద తగ్గుతున్న వరద
- రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే అవకాశం


పోలవరం ప్రాజెక్టు వద్ద వరద జలాల ఉధృతి

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), చింతూరు, పోలవరం, జూలై 29: సుమారు 12 రోజులుగా వణికించిన ఉగ్ర గోదావరి ఎట్టకేలకు శాంతించింది. గోదావరి నదిలో వరద బాగా తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద సోమవారం రాత్రి 8 గంటలకు నీటి మట్టం 42.90 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. ఒక దశలో మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి వెళ్లిన వరద నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. మంగళవారం నాటికి ఇది మరింత తగ్గే అవకాశం ఉంది. ఎగువ భాగంలో అన్ని ఉపనదులు తగ్గుముఖంలో ఉన్నట్టు వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. భద్రాచలం నుంచి వరద తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం చేరుకునేసరికి 18 గంటలు పడుతుంది. ధవళేశ్వరం వద్ద కూడా వరద నెమ్మదిగా తగ్గుతోంది. మంగళవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. సోమవారం రాత్రి 8 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 14.60 అడుగులుగా నమోదైంది. బ్యారేజి నుంచి దిగువకు 14,19,108 క్యూసెక్కుల వరద నీరు పోతోంది. వరద పూర్తిగా తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనడానికి రెండు మూడు రోజులు పడుతుంది. గోదావరి తగ్గుముఖం పడుతుండడంతో తక్షణమే ముంపు నివారణ చర్యలు చేపట్టాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. జిల్లాలో జూలైలో మొత్తం 14,646.5 హెక్టార్లలో వరి పంట, కొంత చెరకు నీటిలో మునిగిపోయాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు.

ఇంకా వరద నీటిలోనే..

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని లోతట్టు గ్రామాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 39 అడుగులకు చేరుకుంది.

పోలవరం వద్ద తగ్గిన నీటిమట్టం

ఏలూరు జిల్లా పోలవరంలో గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 24.337 మీటర్లకు చేరుకుందని, 12,27,394 క్యూసెక్కుల వరదను 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశామని అధికారులు తెలిపారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 17 పంపులు 17 మోటార్లతో 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు డీఈఈ పెద్దిరాజు తెలిపారు.

పెరిగిన ఎండ.. పలుచోట్ల వర్షాలు

విశాఖపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మధ్య భారతంలో రుతుపవన ద్రోణి, తూర్పు, పడమరకు విస్తరించిన ఉపరితల ద్రోణి కొనసాగుతున్నాయి. పలుచోట్ల ఎండ తీవ్రత పెరిగింది. కాగా, వాతావరణ అనిశ్చితితో అక్కడక్కడా వర్షాలు కురిశాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

సెప్టెంబరు 1న నగరంలో సీపీఎస్ బాధితుల సభ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: పాత పెన్షన్ సాధనలో భాగంగా సెప్టెంబరు 1న నగరంలో సీపీఎస్ బాధితుల సభ నిర్వహించనున్నట్టు ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ-ఏపీజీఈఈ జేఏసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు వీరు సోమవారం అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) వల్ల ఉద్యోగులు ఎన్నో బాధలను అనుభవిస్తున్నారన్నారు. సీపీఎస్ ఉద్యోగుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు, మరణించిన, పదవీ విరమణ చెందిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాల పరిస్థితి తెలుసుకోవటానికి తాము 'సీపీఎస్ బాధిత ఉద్యోగుల ప్రత్యక్ష సందర్శన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులను కలిసి పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. సెప్టెంబరు 1న సీపీఎస్ విద్రోహ దినంగా భావించి ఎప్పటిలాగే బాధితులతో సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు తరలిరావాలని కోరారు.

సాయిరెడ్డిని అరెస్టు చేయాలి: కొట్టేటి

విద్యాధరపురం: వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని పోక్సో చట్టం కింద అరెస్టు చేయాలని పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యదర్శి కొట్టేటి హనుమంతరావు డిమాండ్ చేశారు. గురునానక్ కాలనీలో ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసి మహిళ, దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ శాంతికి తీవ్ర అన్యాయం చేసి తప్పించుకుని తిరుగుతున్న విజయసాయిరెడ్డిని పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్టు చేయాలన్నారు. లాగే అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైసీపీ అధినాయకత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యసభలో విజయసాయిరెడ్డి రాష్ట్రంలో జరిగిన 36 హత్యలు గురించి మాట్లాడినపుడు దానికి డిప్యూటీ స్పీకర్ రుజువులు అడిగితే చూపించలేకపోయారన్నారు. మైనార్టీ సెల్ అర్బన్ మాజీ అధ్యక్షుడు ఎండీ ఇర్ఫాన్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు డి రవికుమార్ పాల్గొన్నారు.

జగన్ ఢిల్లీ ధర్నా ఒక బూటకం: దేరంగుల

కృష్ణలంక: ఢిల్లీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ధర్నా చేయడం ఒక బూటకమని బీజేపీ నేత దేరంగుల ఉదయ్ కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఆయన ఢిల్లీలో ధర్నా చేసి సాధించేదేమీ లేదని కేవలం పార్టీ మనుగడ కోసం, ప్రభుత్వాలపై నిందలు వేసి ఒక బూటకం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. జగన్ ధర్నాతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఇది జగన్ తెలుసుకోవాలన్నారు. ఐదేళ్లలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణను జగన్ కోరాలన్నారు. గత ప్రభుత్వంలో చేసిన దాడులు, దారుణాలపై ఢిల్లీలో చేసిన ధర్నాలో జగన్ చెప్పలేదని, ఐదేళ్లలో సీఎంగా జగన్, ప్రజలు, మీడియాపై చేసిన దాడి లోకమంతా చూసిందని దేరంగుల మండిపడ్డారు. అనేక ఆర్థిక నేరారోపణ కేసుల్లో నిందితుడిగా ఉన్న జగన్ జైలుకెళ్లకుండా ఏ శక్తీ ఆపలేదన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ఉండేందుకు ఢిల్లీలో ధర్నాడ్రామా ఆడారని దేరంగుల విమర్శించారు.

వైసీపీ నేతల పరస్పర ఫిర్యాదులు

గన్నవరం: మండలంలోని తెంపల్లి గ్రామ వైసీపీకి చెందిన ఇరువర్గాలు ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. ఎస్సై పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం తెంపల్లి గ్రామం సర్పంచ్ కొలుసు శిరీష ఆమె భర్త కొలుసు కిరణ్‌కుమార్‌ను అదేగ్రామానికి చెందిన వైసీపీ కన్వీనర్ కొలుసు చిదంబర్‌కుమార్ అలియాస్ చిట్టిబాబు, ఆయన భార్య, అదే గ్రామ సచివాలయ సెక్రటరీ కలిసి కొట్టినట్టు సర్పంచ్ ఫిర్యాదు చేశారు. అలాగే చిదంబర్ కుమార్, హర్షవర్థినిని సర్పంచ్ శిరీష ఆమె భర్త కిరణ్‌కుమార్ కలిసి కొట్టారని ఫిర్యాదు చేశారు. ఇద్దరి ఫిర్యాదులను స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



ఓఆర్ఎస్ వినియోగంపై అవగాహన వాక్‌థాన్‌లో పాల్గొన్న డాక్టర్లు

ఓఆర్ఎస్ వినియోగంపై వాక్‌థాన్

విజయవాడ స్పోర్ట్సు: అతిసారానికి గురైనవారు ఓఆర్ఎస్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ జేఎస్వీ భువనేశ్వరి పేర్కొన్నారు. ఐజీఎంసీ స్టేడియంలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ అవగాహన వాక్‌థాన్ సోమవారం నిర్వహించారు. స్టేడియంలో నడుస్తున్న వాకర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంచుతూ, వాటి అవసరాన్ని వివరించారు. డయేరియా నుంచి మానవ ప్రాణాన్ని కాపాడే దివ్య ఔషధం ఓఆర్ఎస్ అని భువనేశ్వరి వివరించారు. అఖిలభారత పిల్లల వైద్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరుచూరి అనిల్‌కుమార్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి సంధ్య, కార్యదర్శి డాక్టర్ వుటుకూరి శ్రీదేవి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఉయ్యూరు సాంబిరెడ్డి పాల్గొన్నారు.



ద్వారకా తిరుమల దేవస్థానం నుంచి అమ్మవారికి సారె తీసుకువచ్చిన ఏఈవోలు, అర్చకులు, అమ్మవారికి సారె సమర్పించిన భక్త బృందాలు

దుర్గమ్మకు ద్వారకా తిరుమల సారె

వన్‌టౌన్, జూలై 29: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు ఆషాఢమాసం సందర్భంగా సారె సమర్పణలలో భాగంగా ద్వారకా తిరుమల దేవస్థానం నుంచి ముఖ్య అర్చకుడు భాను, ఏఈవో దుర్గారావు, ఇతర అర్చకులు, సిబ్బంది సోమవారం సారె సమర్పించారు ఈ బృందానికి దుర్గగుడి ఈవో రామారావు సాదర స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. సారె సమర్పించి పూజలు చేసిన అనంతరం వారికి ప్రసాదం, దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో రామారావుకు ద్వారకా తిరుమలేశుడి చిత్రపటంతో సత్కరించారు.

ఇంజనీరింగ్ విభాగం సారె సమర్పణ

దుర్గగుడి ఇంజనీరింగ్ విభాగం నుంచి ఈఈ రమాదేవి సారథ్యంలో సిబ్బంది, అధికారులు అమ్మవారికి సారె సమర్పించారు సంప్రదాయం మేరకు తొలుత జమ్మిదొడ్డిలో పూజలు చేశారు. ఈ పూజలో ఈవో రామారావు పాల్గొన్నారు. ఆయన్ను అధికారులు సిబ్బంది సత్కరించారు. స్థానాచార్యుడు శివప్రసాద శర్మ, డిప్యూటీ ఈవో లీలాకుమార్, డీఈలు కోటేశ్వరరావు, రవీంద్రనాథ్ ఠాగూర్, ఏఈలు బొప్పన అశోక్ కుమార్, సీహెచ్ సునీల్ మస్తానయ్య, మాదాల విజయకృష్ణ, ఏఈవోలు పీ చంద్రశేఖర్, సుధారాణి, ఎస్ రమేష్ జంగం శ్రీనివాస్, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.


తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి కార్తీక్‌కు అమ్మవారి చిత్రపటం ఇస్తున్న అధికారులు


విరాళమిచ్చిన సాయి వీణకు అమ్మవారి చిత్రపటం

900 మంది భక్తుల సారె సమర్పణ

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 23 బృందాలకు చెందిన 900 మంది భక్తులు సారె సమర్పించారు. జిల్లాలోని గండుబోయపాలెంకు చెందిన దుర్గ శివసాయి సేవా బృందానికి చెందిన 150 మంది, భ్రమరాంబికా సేవా సమితికి చెందిన 90 మంది, శివ లలితా మండలి బృందం 70 మంది, బాపట్ల నుంచి పీ ఝాన్సీ లక్ష్మి బృందం 70 మంది ఇలా మొత్తం 900 మంది సారె సమర్పించి దుర్గమ్మ అర్చనలో పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కార్తీక్

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పీ కార్తిక్ సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఏఈవో రమేష్‌బాబు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందచేశారు.

స్వర్ణతాపడానికి రూ.5లక్షల విరాళం

దుర్గగుడిలో ఆలయ గోపుర స్వర్ణతాపడానికి భక్తులు విరాళాలు సమర్పిస్తున్నారు. గుంటూరుకు చెందిన ఎన్ సాయివీణ, కుటుంబ సభ్యులు సోమవారం ఆలయానికి విచ్చేసి ఈఈ కోటేశ్వరరావు ద్వారా దేవస్థానానికి రూ.5లక్షల విరాళాన్ని స్వర్ణతాపడం నిమిత్తం సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం శేషవస్త్రం, ఆశీస్సులు, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందచేశారు.

ఎమ్మెల్యే సుజనాతో విభేదాల్లేవు

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న



వన్‌టౌన్, జూలై 29: ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరితో తనకు ఎలాంటి విభేదాలు లేవని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. వన్‌టౌన్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుజనా చౌదరి గతంలో తనను టీడీపీ నగరాధ్యక్షుడిగా చేశాడని గుర్తు చేశారు. నాడు కేశినేని నాని వ్యతిరేకించినా సుజనా చౌదరి తనను ప్రోత్సహించారన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు సుజనాచౌదరి ఇన్‌చార్జిగా ఉన్నప్పటి నుంచి తనకు ఆయనతో అనుబంధం ఉందన్నారు. ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసే ముందు కూడా తన అభిప్రాయాన్ని తీసుకున్నట్టు వెంకన్న తెలిపారు. తనకు ఆయనకు విభేదాలున్నాయని ఎవరో కావాలని ప్రచారం చేస్తున్నారన్నారు. ఎలాంటి ప్రచారం లేకుండా 10 మందికి సాయం చేసే వ్యక్తిత్వం సుజనాచౌదరిదని అన్నారు. భవానీపురానికి చెందిన ఓ పేద విద్యార్థినికి అమెరికాలో చదువు నిమిత్తం ఆర్థిక సహాయం చేయించడానికి సుజనాచౌదరి వద్దకు తీసుకువెళ్లానని, తాము అడిగిన సాయం కంటే మరో రెండు రకాలుగా సాయం చేస్తానని సుజనా చౌదరి హామీ ఇచ్చారన్నారు. జీవితంలో తాను ఆయనతో గొడవ పడనన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమక్షంలో ఆయన సుజనాచౌదరికి ఫోన్ చేసి వినిపించారు. ఇద్దరూ తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని, ఎవరో కావాలని చేస్తున్నారని, కూటమి నేతలంతా ఐక్యంగా ఉన్నామని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరం కృషి చేస్తున్నామన్నారు. కామాదేవరాజ్, వీవీ చినసుబ్బయ్య, విజయలక్ష్మి, పత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

రైల్వేస్టేషన్: స్థానిక రైల్వేస్టేషన్ దక్షిణ యార్డ్ నడక దోవ ప్రాంతంలో గుర్తు తెలియని సుమారు 40 ఏళ్లున్న వ్యక్తి స్పృహ తప్పి పడి ఉన్నట్టు సమాచారం రావడంతో రైల్వే పోలీసులు సంఘటన ప్రదేశానికి వెళ్లి చూశారు. అప్పటికే మృతి చెందడంతో పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పైథాన్ ప్రోగ్రామింగ్‌పై విద్యార్థులకు వివరిస్తున్న ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి వనిత

పైథాన్ ప్రోగ్రామింగ్ విశిష్టతపై వర్క్‌షాప్

ఉంగుటూరు, జూలై 29: పైథాన్ ప్రోగ్రామింగ్‌లో నైపుణ్యాలు మెరుగుపరచుకున్న విద్యార్థులకు ప్రముఖ కంపెనీలు, పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని, వెబ్ డెవలపర్లు, డేటా విశ్లేషకులు, డేటా సైంటిస్టులుగా ఆయారంగాల్లో స్థిరపడవచ్చునని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ప్రతినిధి కె.వనిత అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ ఫైనలియర్ విద్యార్థులకు డేటా విశ్లేషణలో పైథాన్ ప్రోగ్రామింగ్ విశిష్టత-ఉపయోగాలపై 6 రోజులపాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను సోమవారం కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన వనిత పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రయోజనాలపై విద్యార్థులకు వివరించారు. వెబ్‌సైట్‌లు, సాఫ్ట్‌వేర్ల అభివృద్ధి, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేథస్సు), మెషిన్‌లెర్నింగ్, డేటా విశ్లేషణ, డేటా విజువలైజేషన్ వంటి విభిన్నమైన పనులకోసం పైథాన్ ప్రోగ్రామింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం పైథాన్ కోర్సుకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని, కోర్సులో పట్టుసాధించిన విద్యార్థులు వివిధరంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. విద్యార్థులందరూ సరికొత్త ఆలోచనలతో వినూత్న ప్రాజెక్టులకు రూపకల్పన చేసి ఎంచుకున్న రంగాల్లో మరింత మెరుగ్గా రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ఈసీఈ విభాగాధిపతి బి.నాంచారయ్య, కళాశాల డీన్ అకడమిక్స్ సీహెచ్ శాంతిరాణి, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులను ప్రోత్సహించారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం మాట్లాడుతూ ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. వర్క్‌షాప్ కోఆర్డినేటర్ ఎంవీ శ్రీకాంత్ పర్యవేక్షించారు.

నగరాన్ని సుందరీకరించండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



బందరు రోడ్డులో గ్రీనరీని పెంచడంపై సూచనలిస్తున్న ధ్యానచంద్ర, అర్జీలను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్

వన్‌టౌన్, జూలై 29: నగరాన్ని సుందరీకరించి అందంగా తీర్చిదిద్దాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. సోమవారం ఆయన నగరంలోని బందరు రోడ్డు, మున్సిపల్ ప్రధాన కార్యాలయం, ప్రకాశం బ్యారేజీ, చనుమోలు వెంకట్రావు బ్రిడ్జి ప్రాంతాలను పరిశీలించారు. బందరురోడ్డులో ఇతర ప్రదేశాలల్లో కాలినడకన వెళుతూ, వెంట ఉన్న అధికారులకు సూచనలు చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదని, పనిలో లోపం ఉండకూడదన్నారు. నగరాన్ని మరింత అందంగా ఉంచేందుకు మొక్కలు నాటి సుందరీకరించాలన్నారు. కనకదుర్గ ఫ్లై ఓవర్‌లో వాల్ పెయింట్లను వేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వీఎంసీ కార్యాలయం వద్ద ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు మరుగుదొడ్లను ఏర్పాటు చేసేందుకు అంచనాలను సిద్ధం చేయాలన్నారు. నగరంలోని డివైడర్లలో మొక్కలను బాగా పెంచి అందంగా తీర్చిదిద్దాలని ఉద్యానవనశాఖ ఉపసంచాలకుడు రామ్మోహన్‌కు ఆదేశాలిచ్చారు. జనరల్ విభాగం అదనపు కమిషనర్ డాక్టర్ ఏ మహేష్, సీఈ ఎం ప్రభాకరరావు,హెల్త్ ఆఫీసర్ ఏ రత్నావళి, జోనల్ కమిషనర్ (వన్) రమ్యకీర్తన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, ఈఈ (1) ఏఎస్ఎన్ ప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ చీరన్ రాయ్, ఈఈ (2) శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి

చిట్టినగర్: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరగా పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. ఇంజనీరింగ్ విభాగం-4, ప్రజారోగ్య విభాగం-3, పట్టణ ప్రణాళిక విభాగం-5 యూసీడీ విభాగం-2, ఉద్యానశాఖ-1, రెవెన్యూ విభాగం-1, ప్రాజెక్ట్-1 మొత్తం 17 అర్జీలు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరగా పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ (జనరల్) డాక్టర్ ఏ మహేష్, (ప్రాజెక్ట్) కే సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ.సృజన, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీసోమశేఖర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ బీ.సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

పతకాలతో భారత కీర్తి రెపరెపలాడాలి

● 'ఐ ఛీర్ 4 భారత్' సెల్ఫీ స్టాండ్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



విజయవాడ లీగల్, జూలై 29: ప్రస్తుతం పారిస్‌లో జరుగుతున్న 33 వ ఒలింపిక్ క్రీడల్లో భారత కీర్తి పతాక రెపరెపలాడేలా భారతీయ క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని కోరుకొంటున్నట్టు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనాతో కలిసి 'ఐ ఛీర్ 4 భారత్' సెల్ఫీ స్టాండ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు, భారతీయ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపడంలో భాగంగా సెల్ఫీ స్టాండ్‌ను ఆవిష్కరించినట్టు చెప్పారు. పారిస్ ఒలిపిక్స్‌లో షూటింగ్ క్రీడాకారిణి మనుబాకర్ భారత్‌కు తొలి పతకం సాధించారని, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మిగిలినవారు పతకాలు కైవసం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ పాల్గొన్నారు.


సత్తా చాటిన విజయవాడ సిప్ అబాకస్ విద్యార్థులు

సిప్ అబాకస్ రాష్ట్రస్థాయి పోటీల్లో పలువురి సత్తా

భవానీపురం, జూలై 29: సిప్ (సోషబుల్ ఇంటలెక్చువల్ ప్రొగెసివ్) అకాడమీ ఆధ్వర్యంలో కంకిపాడులోని ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సిప్ అబాకస్ పోటీల్లో భవానీపురం, వన్‌టౌన్ కు చెందిన సిప్ అబాకస్ విద్యార్థులు 200 మంది పోటీపడగా, వివిధ కేటగిరుల్లో 168 మంది విజేతలుగా నిలిచారు. 5 నుంచి 11 నిమిషాల వ్యవధిలో 80 నుంచి 160 క్యాల్యుకేషన్స్ సులభంగా సాల్వ్ చేసి విజేతలుగా నిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా వెయి మంది బరిలో దిగగా తమ బ్రాంచుల్లోని విద్యార్థులు ఏపీలో రెండోసారి అత్యధికంగా మొదటి స్థానంలో నిలిచారని సిప్ అబాకస్ అకాడమీ హెడ్ మధుసూదనరావు తెలిపారు. వీరంతా నవంబర్ 10న కోల్‌కతాలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విజేతలను సౌత్ రీజనల్ హెడ్ ప్రవీణ్ అభినందించారు.


విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతారామయ్య మేడా తదితరులు

జింక్విన్ పోటీల్లో సిద్దార్థ విద్యార్థులకు పతకాలు

మొగల్రాజపురం, జూలై 29: అఖిల భారత స్థాయిలో హైదరాబాద్‌లో నిర్వహించిన జిమ్నాస్టిక్స్ పోటీల్లో వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బంగారు, సిల్వర్, రజత పతకాలు సాధించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ సీతారామయ్య మేడా చెప్పారు. పాఠశాలలో సోమవారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ 14 రాష్ట్రాలు పోటీ పడిన ఈ పోటీల్లో వి.మౌనిక (3డి), కె.సరయు (7బి) పాల్గొన్నారన్నారు. మౌనిక బ్యాలెన్సింగ్ బీమ్‌లో బంగారు పతకం, టేబుల్ వాల్ట్‌లో సిల్వర్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో సిల్వర్ పతకం, కె. శ్రీ సరయు బ్యాలెన్సింగ్ బీమ్, ఫ్లోర్ ఎక్సర్‌సైజులో రజత పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను, కోచ్ రామ్మోహన్‌రావును అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ కే రోజ్‌మేరీ, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తదితరులు

సమీక్షలో పీబీ సిద్దార్థ విద్యార్థుల ప్రతిభ

ఆంధ్రా లయోలా కళాశాల నిర్వహించిన సమీక్ష-2024 పోటీల్లో సమీక్ష-2024లో కంప్యూటర్ సైన్సు సైన్సు విద్యార్థులు తమ ప్రతిభతో బహుమతులు గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ సోమవారం చెప్పారు. సమీక్షా రాష్ట్ర స్థాయి సమ్మేళనంలో ఎంసీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఏఎన్ శివకుమార్, ఐ.శివాజీ, ఎన్ రూపేష్‌కు టెక్నికల్ క్విజ్‌లో ప్రథమ బహుమతి, ఎంఎస్సీ డేటా సైన్సు ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎం.శ్రీయ, బ్లైండ్ టెక్ విభాగంలో ప్రథమ బహుమతి, కె. గాయత్రికి కోడింగ్ డీబగ్ విభాగంలో ద్వితీయ బహుమతి, ఎస్.పవిత్ర, వి.దేవిశ్రీ బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. డీన్ రాజేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, కంప్యూటర్ సైన్సు విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్ డేటా సైన్సు విభాగాధిపతి డాక్టర్ కె. ఉదయశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెట్ లవర్స్ వీక్ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న రాజేశ్వరి, డాక్టర్ రవి

గవర్నర్‌పేట, జూలై 29: కో-కరిక్యులర్‌లో భాగంగా నలంద విద్యానికేతన్ ప్రైమరీ విభాగంలో సోమవారం పెట్ లవర్స్ వీక్ జరిగింది. కేజీ విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఇళ్లల్లో పెంచుతున్న వివిధ రకాల పక్షులు, జంతువులను స్కూల్ ప్రాంగణంలో ప్రదర్శించారు. కొండచిలువ, అరేబియన్ పిల్లి, హస్కి, రంగు రంగుల చేపలు, అందమైన చిలుకలు ప్రదర్శనలో ఆకర్షణీయంగా నిలిచాయి. ముఖ్య అతిథిగా హాజరైన కేర్‌వెల్ హాస్పిటల్ వెటర్నరీ డాక్టర్ రవి వివిధ కేటగిరిల్లో అందమైన ఈ హెల్దీ పెట్స్‌కి బహుమతి ప్రకటించారు. కేజీ ఇన్‌చార్జి రాజేశ్వరి మాట్లాడుతూ జంతువుల పట్ల, పక్షుల పట్ల దయ కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ మాదల పద్మజ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా చిన్నారులు తమ పెట్ గురించి, వాటితో తమ అనుబంధం గురించి వివరించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలి: ఏఐఎస్ఎఫ్

కృష్ణలంక, జూలై 29: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అందచేసేలా ఎన్డీఏ కూటమి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ కలెక్టర్‌కు విన్నవించారు. ఈ మేరకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ప్రజా పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చి చదువుకుంటున్నారని కావున వారికి ఉచిత విద్యతో పాటు కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించాలని విద్యార్థుల పక్షాన ఏఐఎస్ఎఫ్ కోరుతోందన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఏఐఎస్ఎఫ్ నగరాధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీష్, సుధీర్, సురేష్ ఉన్నారు.

మానవ అక్రమరవాణాకు అడ్డుకట్ట

● 8 మంది బాలురను రక్షించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు

రైల్వేస్టేషన్, జూలై 29: అక్రమంగా రవాణా అవుతున్న ఎనిమిది మంది బాలురను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) పోలీసులు రక్షించారు. బచ్‌పన్ బచావో ఆందోళన్‌లో భాగంగా ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఈనెల 27న బొకారో- ధన్‌బాద్- అలప్పుజ రైలులో తుని-రాజమండ్రి స్టేషన్ల మధ్య తనిఖీలు నిర్వహించారు. జనరల్, స్లీపర్ కోచ్‌లో ఎనిమిది మంది అనుమానాస్పదంగా తిరుగుతుండడాన్ని గుర్తించారు. వారి వద్ద సరైన సమాచారం రాలేదు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ, చెన్నై, తిరుపూర్, కేరళకు బాల కార్మికులుగా పనిచేయడానికి అక్రమ రవాణా అవుతున్నట్టు గుర్తించారు. పిల్లలను రాజమండ్రి రైల్వేస్టేషన్‌కు తరలించి వారికి ఆహారం, వైద్య సదుపాయాలను అందించారు. అనంతరం రాజమండ్రిలోని బాలల రక్షణ సంక్షేమ కమిటీకి అప్పగించారు. డీఆర్ఎం నరేంద్ర పాటిల్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషర్ వల్లేశ్వర బి తోకల, తనిఖీలు నిర్వహించిన ఆర్‌పీఎఫ్ పోలీసులను అభినందించారు.

ఉన్నత మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తోనే వ్యాపారాభివృద్ధి

● ప్రముఖ లీడర్‌షిప్ శిక్షకుడు మురళీ సుందరం

ఆటోనగర్, జూలై 29: విజయవంతమైన బిజినెస్ పర్సన్‌కు ఉండాల్సింది మేనేజ్‌మెంటు స్కిల్స్ అని ప్రముఖ బీఎన్ఐ ఇండియా లీడర్‌షిప్ శిక్షకుడు మురళీ సుందరం పేర్కొన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో జేఆర్డీ టాటా 120వ జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మేనేజ్‌మెంట్ స్కిల్స్‌కు సంబంధించిన 9 అంశాలను, 5 నైపుణ్యాలను వివరించారు. విజయవంతమైన వ్యాపారులందరూ అత్యుత్తమ నైపుణ్యాలతోనే విజయాలను సొంతం చేసుకొన్నారన్నారు.

అంతరిక్ష పరిశోధనలో దేశం పాత్ర అద్వితీయం: డాక్టర్ గోపీకృష్ణ



వన్‌టౌన్, జూలై 29: అంతరిక్ష పరిశోధనలో భారతదేశ పాత్ర అద్వితీయమని షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ వీ గోపీకృష్ణ అన్నారు. కేబీఎన్ కాలేజీ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో కాలేజీలో సోమవారం భారత అంతరిక్ష ప్రయాణం అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతరిక్ష పరిశోధన రంగంలో ప్రపంచంలో తనకంటూ భారతదేశం ఒక ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. పరిశోధనా రంగంలో దూసుకు వెళ్లడంతో దేశంలో శాస్త్రీయ పురోగతికి, ఆర్థిక, సామాజిక ప్రగతికి అండగా నిలిచిందన్నారు. 1969లో ఇస్రో స్థాపనతో అంతరిక్ష యాత్రకు పునాది పడిందని, 1975లో మొదటిసారిగా ఆర్యభట్టను పంపించారన్నారు. టెలికమ్యూనికేషన్, బ్రాడ్ కాస్టింగ్, పర్యావరణం, వైద్యారోగ్యం వంటి పలు అంశాల్లో అంతరిక్ష పరిశోధనలు ఎంతో ఉపకరిస్తున్నాయన్నారు. మానవ సహిత అంతరిక్ష యాత్ర, చంద్రయాన్-3 వంటి వాటి గురించి ఆయన ప్రసంగించారు. అనేక అద్భుత లక్ష్యాలను సాధించేందుకు భారత అంతరిక్ష రంగం సిద్ధంగా ఉందన్నారు. ఉపాధి అవకాశాలను గురించి వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ, విభాగాధిపతి ఆర్ ఉదయకుమార్, అధ్యాపకులు ఏ హెచ్‌డీ ప్రకాష్, పీ మౌనిక, బి శ్రుతి పాల్గొన్నారు.


ఎంపికైన వెయిట్‌లిఫ్టర్లతో ముఖ్య అతిథులు

రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్‌కు 18 మంది ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, జూలై 29: అనకాపల్లి జిల్లాలో త్వరలో జరిగే రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు జిల్లా నుంచి 9మంది, కృష్ణాజిల్లా నుంచి 8 మంది వెయిట్‌లిఫ్టర్లు అర్హత సాధించారు. ఈ 2 జిల్లాల వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఐజీఎంసీ స్టేడియం వెయిట్‌లిఫ్టింగ్ హాల్లో ఆదివారం హోరాహోరీగా జరిగిన ఎంపిక పోటీల్లో 40 మంది లిఫ్టర్లు పోటీ పడ్డారు. ఎంపికైన లిఫ్టర్లను ఇంటిలిజెన్స్ సీఐ సురేష్, ఆలయ స్కిల్స్ ఎండీ జి.అవినాష్, కేడీడబ్ల్యుఎల్ఏ వైస్ చైర్మన్ డాక్టర్ రామచంద్ అభినందించారు. జిల్లా కార్యదర్శులు నరేంద్ర, రవి పర్యవేక్షించారు.

ఎంపికైన వెయిట్‌లిఫ్టర్లు.. ఎన్టీఆర్ జిల్లా: జె. నిషిత గోస్పల్, ఎస్‌కే అహ్మద్ బాషా, ఎం.నాగరాజ్, వీబీ బాలాజీ, ఎస్. వీరేష్ (61 కిలోలు), ఎం వేణుగోపాల్ (67 కిలోలు), ఆర్ కుమార్ నాగార్జున (81 కిలోలు), బి రవి చంద్ర కుమార్ (73 కిలోలు), జి రాజశేఖర్ (+109 కిలోలు).

కృష్ణాజిల్లా: మహిళా లిఫ్టర్లు: ఓ గాయత్రి (59 కిలోలు), బి.ఝాన్సీ (71), ఎన్ నాగ అను (48 కిలోలు), పురుషులు : ఎం కుమార్ రాజా (61 కిలోలు), బి.లక్ష్మణ్‌బాబు (94 కిలోలు), ఎన్ నాగసాయి సంతోష్ (61 కిలోలు), డి మోక్షజ్ఞ (73 కిలోలు)

వివిధ ప్రాంతాలకు విమాన సర్వీసులు ప్రారంభించండి

» కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు బెజవాడ ఎంపీ చిన్ని విజ్ఞప్తి



న్యూఢిల్లీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు కనెక్టివిటీ ఉండే విధంగా విమాన సర్వీసులు ప్రారంభించాలని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం పార్లమెంటులో కేంద్రమంత్రిని ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. తన విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారని కేశినేని చిన్ని తెలిపారు.

రాజాంకు రైల్వే లైను వేయండి: కలిశెట్టి

న్యూఢిల్లీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): విజయనగరం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని రాజాం పట్టణానికి రైల్వేలైన్‌ను వేయాలని కలిశెట్టి అప్పలనాయుడు కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో తొలిసారిగా సోమవారం ప్రసంగించిన ఆయన తన నియోజకవర్గ పరిధిలో ఉన్న రైల్వే సమస్యలను కూడా సత్వరమే పరిష్కరించాలని కోరారు. విలేకరులకు రైల్వే పాసులివ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, దేశరాజధాని ఢిల్లీలో వరద ముంపునకు గురై మరణించిన సివిల్స్ విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కేజ్రీవాల్‌కు లేఖ రాశారు.

బందరులో పట్టాభి కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి

» పార్లమెంటులో జనసేన లోక్‌సభాపక్ష నేత బాలశౌరి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో పట్టాభి సీతారామయ్య కన్వెన్షన్ సెంటర్, మ్యూజియం పనులను త్వరగా ప్రారంభించాలని జనసేన లోక్ సభాపక్ష నేత బాలశౌరి కోరారు. సోమవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ తెలుగువారి గొప్పతనాన్ని చాటి చెప్పేలా భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆంధ్రాబ్యాంక్‌ను ప్రారంభించారని తెలిపారు. అలాగే కిసాన్ సమ్మాన్ క్రెడిట్ రుణాలను రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచాలని, కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

చిత్తూరు వీరప్పన్ పెద్దిరెడ్డి

» అక్రమాస్తులను జప్తు చేయండి: బుద్దా వెంకన్న

విజయవాడ (వన్‌టౌన్), జూలై 29: చిత్తూరు జిల్లా వీరప్పన్‌గా పేరొందిన మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాస్తులను జప్తు చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు. విజయవాడలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి కలసి భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. వారి దోపిడీకి అడ్డు వస్తున్నారనే చంద్రబాబును ఓడించేందుకు కుప్పం నియోజకవర్గంలో రూ.వందల కోట్లు ఖర్చు పెట్టారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డికి చంద్రగిరి, భూమన కరుణాకరరెడ్డికి తిరుపతి, రోజాకు నగరి వదిలి మిగిలిన ప్రాంతాలు మొత్తం పెద్దిరెడ్డి దోచుకున్నాడు. టీడీఆర్ బాండ్లలో భూమన కరుణాకరరెడ్డి అవినీతికి పాల్పడ్డారు' అని వెంకన్న ఆరోపించారు.

వారం సమయం ఇవ్వండి

» సమావేశంలో టెక్నికల్ టీమ్‌కు రాజధాని కాంట్రాక్టర్ల విజ్ఞప్తి

విజయవాడ, జూలై 29(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పనులపై సమగ్ర సమాచారం ఇవ్వటానికి వారం సమయం ఇవ్వాలని కాంట్రాక్టర్లు, టెక్నికల్ కమిటీని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన టెక్నికల్ కమిటీ సోమవారం సీఆర్‌డీఏ కార్యాలయంలో అమరావతి రాజధాని పనుల కాంట్రాక్టర్లతో సమావేశమైంది. చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తయ్యాయి? ఎంత వరకు బిల్లులు చెల్లించారు? చేసిన పనులకు సంబంధించి ఇంకా ఎంతమేర బిల్లులు చెల్లించాలి? వంటి వివరాలను సమగ్రంగా అందించాల్సిందిగా టెక్నికల్ కమిటీ కోరింది. అలాగే, కాంట్రాక్టర్ల సమస్యలు ఏంటి? గతంలో ఎలాంటి సమస్యలు చవిచూశారన్న విషయాలను కమిటీ అడిగి తెలుసుకుంది. రానున్న రోజుల్లో ఈ పనులు కొనసాగించే క్రమంలో పూర్తి చేయటానికి సిద్ధంగా ఉన్నారా? లేదా? పనుల నుంచి తప్పుకోవాలనుకుంటున్నారా? తెలియజేయాలని కమిటీ కాంట్రాక్టర్లకు సూచించింది.

కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ పేరిట మోసం

» స్వదేశానికి 8 మంది.. ఏజెంట్‌పై శ్రీకాకుళం ఎస్పీకి ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం, జూలై 29: కరీంనగర్‌కు చెందిన గంగాధర్ హరీష్.. శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపాన యాతపేటలో 2022లో జీబీఎన్ ఇంటర్నేషనల్ అనే కార్యాలయాన్ని ప్రారంభించాడు. ఎంబీబీఎస్ చదువుకోవాలనుకున్న 8 మంది విద్యార్థులకు కజకిస్థాన్‌లోని ఓ మెడికల్ యూనివర్శిటీలో మెడిసిన్ సీట్లు ఇప్పిస్తానని నమ్మించాడు. మొత్తం ఆరేళ్లకు ఫీజు, హాస్టల్, భోజన సౌకర్యాల నిమిత్తం ఒక్కొక్కరి వద్ద రూ.28 లక్షల నుంచి రూ.48 లక్షల చొప్పున మొత్తం రూ.2కోట్లకుపైగా వసూలు చేశాడు. ఆ 8 మందిని కజకిస్థాన్‌లోని కళాశాలలో చేర్పించి.. ఒక ఏడాదికి ఫీజులు, వసతి, భోజనానికి నగదు చెల్లించాడు రెండో ఏడాది నుంచి ఫీజులు చెల్లించలేదు. దీంతో విద్యార్థులను హాస్టల్ నుంచి వెళ్లగొట్టారు. కళాశాలకు కూడా రానివ్వలేదు. విద్యార్థులు గంగాధర్‌ను నిలదీయగా.. బెదిరింపులతోపాటు దాడులకు పాల్పడ్డాడు. దీంతో వారంతా విషయాన్ని తల్లిదండ్రులకు వివరించారు. కజకిస్థాన్ పోలీసులతో పాటు ఇండియన్ ఎంబసీకి ఫిర్యాదు చేశారు. తర్వాత అక్కడి నుంచి ఆ ఎనిమిది మంది జిల్లాకు వచ్చేశారు. గంగాధర్ మోసంపై విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరగా ఎస్పీ వారికి భరోసా ఇచ్చారు.

ఇతర దేశాలపై ఆధిపత్య ధోరణి వద్దు

» చైనాకు క్వాడ్ సదస్సు గట్టి సందేశం

టోక్యో, జూలై 29: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛ, అవకాశాల పట్ల దృఢమైన తన నిబద్ధతను క్వాడ్ సదస్సు పునరుద్ఘాటించింది. ఈ ప్రాంతంలోని ఏ దేశమూ ఇతర దేశాలపై ఆధిపత్యం ప్రదర్శించకూడదని, ప్రతి దేశానికీ అన్ని రకాల నిర్బంధాల నుంచి విముక్తి లభించేలా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసింది. ఈ మేరకు చైనాకు సోమవారం క్వాడ్ సదస్సు స్పష్టమైన, గట్టి సందేశాన్ని ఇచ్చింది. క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రులు ఎస్.జైశంకర్(భారత్), ఆంటోనీ బ్లింకెన్(అమెరికా), యోకో కమికవా(జపాన్), పెన్నీ వోంగ్(ఆస్ట్రేలియా) జపాన్ రాజధాని టోక్యోలో సమావేశమయ్యారు. దేశాల ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్ని, స్వేచ్ఛా సూత్రాలను, మానవ హక్కులను, ప్రజాస్వామిక విలువలను గౌరవించే అంతర్జాతీయ స్వేచ్ఛా నిబంధనలను సదస్సు సమర్థించింది. చైనా పేరును నేరుగా ప్రస్తావించకుండానే.. తూర్పు, దక్షిణ చైనా సముద్రాల్లోని పరిస్థితి పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బలప్రయోగం, నిర్బంధం ద్వారా యథాతథస్థితిని మార్చే ఏకపక్ష చర్యల పట్ల క్వాడ్ తన వ్యతిరేకతను బలంగా పునరుద్ఘాటించింది. సమావేశం అనంతరం ఈ వివరాలను నలుగురు విదేశాంగమంత్రులు సంయుక్త ప్రకటనలో తెలియజేశారు.

అధ్యక్ష ఎన్నికల్లో గూగుల్ జోక్యం: ఎలాన్ మస్క్

న్యూఢిల్లీ, జూలై 29: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై గూగుల్ 'సెర్చ్ బ్యాన్'ను విధించిందని తద్వారా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తలదూరుస్తోందని ఆరోపించారు. అదేగనక నిజమైతే సుందర్ పిచాయ్ సీఈవోగా వ్యవహరిస్తున్న గూగుల్‌కు మున్ముందు కష్టాలు తప్పవని సోమవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ అని టైప్ చేయగా.. గూగుల్‌లో "ప్రెసిడెంట్ డొనాల్డ్ డక్", "ప్రెసిడెంట్ డొనాల్డ్ రిగన్" అని రావడాన్ని ఆయన స్క్రీన్ షాట్స్ తీసి షేర్ చేశారు. అయితే మస్క్ పోస్టుకు మిశ్రమ స్పందన వస్తోంది. కొందరు సమర్థిస్తుండగా, "మీరు కూడా 'ఎక్స్'లో చాలా అకౌంట్లపై ఆంక్షలు విధించలేదా" అని కొందరు విమర్శిస్తున్నారు.

శాకాహారంతో శరీరానికి యవ్వనం

న్యూఢిల్లీ, జూలై 29: మాంసాహారం తినేవారితో పోలిస్తే శుద్ధ శాకాహారం తీసుకొనేవారిలో వయసు పెరిగినా శరీరం యవ్వనంగా ఉంటుందని అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ అధ్యయనంలో తేలింది. శాస్త్రవేత్తలు 21 మంది కవల జంటల(42మంది)పై అధ్యయనం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. అధ్యయనంలో భాగంగా వారు కవలల్లో 21 మంది బృందానికి మాంసాహారం ఇచ్చారు. మిగతా 21మందికి శాకాహారం ఇచ్చారు. ఇలా 8వారాల పాటు ఆహారాన్ని ఇచ్చి పరిశీలించారు. మాంసాహారం తిన్నవారితో పోలిస్తే శాకాహారం తిన్నవారిలో గుండె, కాలేయం, జీర్ణక్రియ వ్యవస్థల పనితీరు మెరుగ్గా ఉన్నట్లు, వారు సగటున 2 కిలోల బరువు తగ్గినట్లు గుర్తించారు.

ఆరోగ్య శాఖలో అక్రమ నియామకాలు

» నోటిఫికేషన్ ఇవ్వకుండానే పోస్టింగ్‌లు
» పెద్దిరెడ్డి చెప్పారని.. అవినాశ్ ఆదేశించారని..
» నిబంధనలు లేని నియామకాలు చేసిన కలెక్టర్లు
» మదనపల్లెలో 170.. పులివెందులలో 80 మందికి
» ఆరోగ్యశ్రీలోనూ వందకి పైగా ఉద్యోగాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"ఆరోగ్యశాఖలో ఒక్క పోస్టు కూడా ఖాళీ ఉండకూడదు. జీరో వెయికెన్సీ పాలసీ కింద అన్ని పోస్టులు భర్తీ చేసేస్తాం. దాదాపు 54 వేల పోస్టుల భర్తీ చేశాం" ఇదీ గత వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాట. కానీ, వాస్తవం చూస్తే 36 వేల పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. అవి కూడా అక్రమ పద్ధతిలో చేపట్టిన నియామకాలు కావడంతో ఆరోగ్యశాఖ అనారోగ్యానికి గురైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాస్తవాలు పరిశీలిస్తే నియామకాల్లో ఎన్ని అక్రమాలు జరిగాయో వెలుగు చూస్తున్నాయి.

ఆరోగ్య శాఖకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం 54 వేల పోస్టుల భర్తీ చేసినట్టు ప్రచారం చేసుకుంది. కానీ, 2019 నుంచి ఇప్పటి వరకు జరిగిన నియామకాలను చూస్తే కేవలం 36 వేల పోస్టులు మాత్రమే భర్తీ చేసినట్లు తెలుస్తోంది. దీనిలో డాక్టర్లు మినహా మిగిలిన పోస్టులన్నీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 54 వేల పోస్టులు ఎలా భర్తీ చేశారని పరిశీలిస్తే ఈ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మరోవైపు భర్తీ చేసిన 36 వేల పోస్టులు కూడా ఎక్కడా నిబంధనలు పాటించలేదు. కొన్ని పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. మరికొన్ని పోస్టులను మెరిట్ ఆధారంగా భర్తీ చేయలేదు. చాలా జిల్లాల్లో అసలు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదు. అంతా అడ్డగోలుగా చేపట్టారు. ముఖ్యంగా డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ(డీఎస్‌సీ) ద్వారా చేపట్టిన నియామకాల్లో ఎక్కడా నిబంధనలు పాటించలేదు. రాజకీయ నేతలు చెప్పిన వారికి నియామకపత్రాలు అప్పగించేశారు. చిత్తూరు, కడప జిల్లాల్లో ఇలాంటి అక్రమ నియామకాలు ఎక్కువగా జరిగాయి. చిత్తూరు జిల్లా మదనపల్లె మెడికల్ కాలేజీలో నియామకాలు మొత్తం అడ్డగోలుగా జరిగినవేనని తేలింది. ఆ కాలేజీలో పారామెడికల్, క్లాస్-4 పోస్టులు కలిసి 170 పోస్టుల భర్తీకి ఆరోగ్యశాఖ అనుమతి ఇచ్చింది. బోధనాసుపత్రి ప్రిన్సిపాల్ నోటిఫికేషన్ ఇచ్చారు. 170 పోస్టులకు దాదాపు 600 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల ఆధారంగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో మెరిట్ లిస్ట్‌ను సిద్ధం చేశారు. ఆ తర్వాత కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి, నియామకాలు మీరేం చేయాల్సిన అవసరం లేదని, ఆ లిస్ట్‌ను తమకు పంపించాలని కలెక్టర్ కార్యాలయం సిబ్బంది ఆదేశించారు. దీంతో నోటిఫికేషన్, వచ్చిన దరఖాస్తులు, మెరిట్ లిస్ట్ మొత్తం ప్రిన్సిపాల్ పంపించారు. ఇక అక్కడ నుంచి మిగిలిన పని మొత్తం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ కార్యాలయ సిబ్బంది చేశారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులు స్ర్కూటినీ పూర్తి అయిన తర్వాత మెరిట్ లిస్ట్ సిద్ధం చేసి, అభ్యంతరాల కోసం మళ్లీ మెరిట్ లిస్ట్‌ను ఆన్‌లైన్‌లో పెట్టాలి. ఎవరైనా అభ్యంతరాలు చేస్తే, దానిని మార్పులు చేర్పులు చూసి ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేయాలి. ఆ తర్వాత అభ్యర్థులను పిలిచి ఇంటర్వ్యూలు చేసి నియామకపత్రాలు అందించాలి. మదనపల్లె మెడికల్ కాలేజీలో జరిగిన నియామకాల్లో ఇవేవీ పాటించలేదు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎవరి పేరు చెబితే వారికి నియామక పత్రాలు ఇచ్చేశారు. కలెక్టర్ కూడా ఆయన చెప్పిన వారినే నియమించారు. ఈ పత్రాలు తీసుకుని ప్రిన్సిపాల్ కార్యాలయానికి వచ్చిన అభ్యర్థులు తమను జాయిన్ చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. ప్రిన్సిపాల్ డీఎంఈ అనుమతి లేనిదే తాము జాయిన్ చేసుకోమని స్పష్టంగా చెప్పి డీఎంఈకి లేఖ రాశారు. ప్రస్తుతం ఆ ఫైల్ డీఎంఈ కార్యాలయంలో ఉంది.

కడపలో కూడా..

కడప జిల్లాలోని పులివెందుల మెడికల్ కాలేజీలో జరిగిన నియామకాల్లో కూడా ఇదే విధమైన పద్ధతి పాటించారు. ఎంపీ అవినాశ్ రెడ్డి చెప్పిందే వేదంగా భావించిన అప్పటి కలెక్టర్ నిబంధనలు పాటించకుండానే భారీగా నియామకాలు చేపట్టారు. నోటిఫికేషన్ లేకుండానే దాదాపు 80 మందికి నియామకపత్రాలు అందజేశారు. ఆర్డీవో కార్యాలయం ద్వారా చిన్న నోటిఫికేషన్ ఇచ్చేసి, అంతా వారు ఎంపిక చేసిన అభ్యర్థులతో దరఖాస్తు పెట్టించి వారికే పోస్టింగ్‌లు ఇచ్చారు. ఎక్కడా మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయలేదు.

ఆరోగ్యశ్రీలో వందకు పైనే

గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిరుద్యోగుల పునరావాస కేంద్రంగా మార్చుకుంది. అప్పటి సీఎం కార్యాలయంలో ఏ అధికారికైనా తమ వారికి ఉద్యోగాలు కావాలంటే వెంటనే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ గుర్తుకువచ్చేది. అక్కడ అధికారులు నోటిఫికేషన్ లేకుండానే ఎంతో మందిని విధుల్లోకి తీసుకున్నారు. సీఎం కార్యాలయంలో ఏ అధికారి సిఫారసు చేసినా వెంటనే ఆ ఉద్యోగిని తీసుకుని లక్షల్లో జీతాలు చెల్లించారు. ఇప్పటికీ చెల్లిస్తున్నారు. దాదాపు వంద మందికిపైగా నోటిఫికేషన్ లేకుండా మెరిట్ పాటించకుండా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన నియామకాలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టి పెట్టాలని సిబ్బంది కోరుతున్నారు. వీటిపై సమీక్షిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు.

సీఆర్‌డీఏలో 188 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

» డెప్యుటేషన్ పద్ధతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆహ్వానం
» ఇంజనీరింగ్, రెవెన్యూ శాఖల ఉద్యోగులకే ఎక్కువ

విజయవాడ, జూలై 29(ఆంధ్రజ్యోతి): డెప్యూటేషన్‌పై తమ సంస్థలో పనిచేయటానికి ప్రభుత్వ ఉద్యోగులకు సీఆర్‌డీఏ బంపర్ ఆఫర్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారెవరైనా ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. సీఆర్‌డీఏలోని వివిధ విభాగాల్లో పనిచేయడానికి మొత్తం 188 పోస్టులకు డెప్యుటేషన్లను ఆహ్వానించింది. ఆయా శాఖల నుంచి అనుమతి పత్రాలు తీసుకుని నేరుగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. అమరావతి రాజధాని ప్రాంతంపై టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించటంతో పాటు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలతో మిళితమైన సీఆర్‌డీఏ ప్రాంత పరిధిలో ప్లానింగ్, ఇంజనీరింగ్ వంటి కార్యకలాపాలను, ఇతర అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారీ సంఖ్యలో అధికారులు, ఉద్యోగులను తీసుకోవాలని నిర్ణయించింది. ఆయా రంగాల్లో అనుభవజ్ఞులు కావాలి కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల డెప్యుటేషన్‌కు అవకాశం కల్పించింది. సీనియర్ ప్లానర్-అర్బన్ డిజైన్-2, గ్రూప్ డైరెక్టర్-ఇంజనీర్ ఇన్ చీఫ్-1, డైరెక్టర్-చీఫ్ ఇంజనీర్-1, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-సాలిడ్ వేస్ట్-2, డీఈఈ-2, ఏఈ-4, ఈఈ-2, డీఈఈ-వాటర్ సప్లై-2, ఏఈఈ-వాటర్ సప్లై-4, ఈఈ-ఎలక్ట్రికల్-1, డీఈఈ-ఎలక్ట్రికల్-1, ఏఈఈ-ఎలక్ట్రికల్-3, డైరెక్టర్-ట్రాన్స్‌పోర్టేషన్-1, ఈఈ-ట్రాన్స్‌పోర్టేషన్-1, డీఈఈ-ట్రాన్స్‌పోర్టేషన్-1, డీఈఈ-స్ట్రక్చరల్-1, ఈఈ-రోడ్లు-1, డీఈఈ-రోడ్లు-1, ఏఈఈ-రోడ్లు-4, డీఈఈ-స్ట్రక్చరల్-2, ఏఈఈ స్ట్రక్చరల్-5, ఈఈ-బిల్డింగ్స్-2, డీఈఈ-బిల్డింగ్స్-3, ఏఈఈ-బిల్డింగ్స్-4, మేనేజర్-ఆఫీసు-1, మేనేజర్-మీటింగ్స్-1, మేనేజర్-ఆఫీస్ మేనేజ్‌మెంట్-1, డిప్యూటీ డైరెక్టర్-స్ట్రాటజీ-1, డిప్యూటీ డైరెక్టర్-ప్లానింగ్-1, డిప్యూటీ డైరెక్టర్-ఫైనాన్షియల్-1, అడిషనల్ డైరెక్టర్-ప్రొక్యూర్‌మెంట్, సీనియర్ మేనేజర్-ప్రొక్యూర్‌మెంట్-2, మేనేజర్-ప్రొక్యూర్‌మెంట్-4, అసిస్టెంట్ మేనేజర్-ప్రొక్యూర్‌మెంట్-2, డీఈఈ-క్వాలిటీ-2, ఏఈఈ-క్వాలిటీ-1, అసిస్టెంట్ మేనేజర్-సర్వీసు-1, మేనేజర్-ఎస్టేట్స్-1, మేనేజర్-ల్యాండ్ యూజ్-1, తహసీల్దార్-ల్యాండ్ అక్విజిషన్-2, తహసీల్దార్-ల్యాండ్ ప్రొటెక్షన్-8, డిప్యూటీ తహసీల్దార్-ల్యాండ్ ప్రొటెక్షన్-8, సర్వేయర్స్-9, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు-9, అడిషనల్ డైరెక్టర్-ల్యాండ్‌స్కేపింగ్-1, ఏడీ-హార్టికల్చర్-1, హార్టికల్చర్ ఆఫీసర్-2, జాయింట్ డైరెక్టర్-హ్యూమన్ రిసోర్సెస్-1, విజిలెన్స్ ఆఫీసర్-1, అసిస్టెంట్ విలేజ్ ఆఫీసర్స్-1, జాయింట్ డైరెక్టర్-కమ్యూనికేషన్స్-1, గ్రూప్ డైరెక్టర్-ఫైనాన్స్-1, డిప్యూటీ డైరెక్టర్-రెవెన్యూ-1, రెవెన్యూ ఆఫీసర్-2, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు-8, డైరెక్టర్ ల్యాండ్స్-1, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు-20, తహసీల్దార్ ల్యాండ్స్-18, డిప్యూటీ తహసీల్దార్-ల్యాండ్స్-15, సీనియర్ అసిస్టెంట్లు-1 పోస్టులు భర్తీ చేయడానికి నోటిఫికేషన్ వివరాలను సీఆర్‌డీఏ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆసక్తి గలవారు కెరీర్స్ మెనూలోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు.

రాష్ట్రాలకు అదనంగా 64 వేల కోట్లు

» అధిక మొత్తం ఏపీకి లభించే చాన్స్

న్యూఢిల్లీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ముఖ్యమైన వనరుల బదిలీ కింద గత ఏడాదితో పోలిస్తే ఈ సారి రూ.64,258.44 కోట్ల మేరకు అదనంగా కేటాయించారు. ఈ మొత్తంలో అధిక భాగం ఏపీకి దక్కే అవకాశాలున్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. 2022-23లో సవరించిన అంచనాల ప్రకారం ముఖ్యమైన వనరుల బదిలీ కింద రూ.1,60,987.37 కోట్లు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తాన్ని రూ64 వేల కోట్లు పెంచి రూ.2,24,644.81 కోట్లు ఇస్తున్నట్టు చూపించారు. అయితే, ఈ మొత్తంలో రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం కింద రూ.20 వేల కోట్లు పేర్కొన్నారు. దీనిలో ఏపీకి రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు దక్కుతాయని, బిహార్‌కు రూ.5 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల వరకు దక్కుతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. 2023-24లో సవరించిన అంచనాల ప్రకారం ఈ మొత్తం రూ.13 వేల కోట్లు కాగా ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ.20 వేల కోట్ల వరకు పెంచారు. కాగా, విదేశీ సహాయం కింద లభించే గ్రాంట్లను రూ.5 వేల కోట్ల నుంచి రు.8 వేల కోట్లకు, విదేశీ సహాయంతో చేపట్టే ప్రాజెక్టులకు లభించే రుణాలను రూ.29,500 కోట్ల నుంచి రూ.33,900 కోట్లకు, మూలధనం, పెట్టుబడి వ్యయం కింద రాష్ట్రాలకు రుణ రూపంలో ప్రత్యేక సహాయం మొత్తాన్ని రూ.1,05,551 కోట్లనుంచి రూ.1,50,000 కోట్లకు పెంచారు. ఈ పెంచిన మొత్తంలో ఏపీకి అధిక సహాయం లభిస్తుందని ఆర్థిక మంత్రిత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఏపీకి విభజన చట్టంలోని ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, తగిన ప్రోత్సాహకాలతో పాటు రాయలసీమ, ఉత్తర కోస్తా ప్రాంతాల్లోని 7 జిల్లాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని భావిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్ సభలో తెలిపారు.

స్వచ్ఛభారత్ కోసం రూ.205 కోట్లు

ఏపీకి స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ్) కింద రూ.205 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది. సోమవారం రాజ్యసభలో వైసీపీ అభ్యర్థి ఆర్. కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి సోమన్న లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021-22కు రూ.437.64 కోట్లు కేటాయించగా, 2022-23కు రూ.676.79 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

టార్గెట్లు పెట్టి మరీ తప్పులు!

» కప్పిపుచ్చుకునేందుకు ఉపాధిలో పూడికతీత పనులు
» లేబర్ బడ్జెట్ ఎంపవర్ కమిటీ సమీక్ష
» వ్యవసాయ, అనుబంధ పనులపై దృష్టి సారించాలని సూచన
» లబ్ధిదారులకు జీవనోపాధి పెరిగే పనులు చేపట్టాలని కేంద్రం లేఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకంలో సిబ్బందితో టార్గెట్లు పెట్టి మరీ తప్పులు చేయించారు. కూలీలకు పనులు లేకుండానే మస్టర్లు వేయాలంటూ హుకుం జారీచేసి కోట్ల పనిదినాలు పూర్తి చేయించినట్లు లెక్కలు రాసుకున్నారు. తప్పులు కప్పిపుచ్చుకునేందుకు సోషల్ ఆడిట్ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. పనులు చేయకుండానే మస్టర్లు వేయడం, తాము కూలీలతో పనులు చేయించామని చెప్పుకునేందుకు పూడికతీత పనులు చేపట్టారు. ఇలా వైసీపీ సర్కార్‌లో పథకం సిబ్బంది చేసిన తప్పులు కారణంగా రాష్ట్రంలో పథకం లక్ష్యం దెబ్బతిందని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శికి లేఖ రాసింది. దీంతో ఇప్పుడు.. తప్పుదారి పట్టిన ఉపాధి సిబ్బంది తో సక్రమంగా పనులు చేపట్టి, కేంద్రం చేతిలో పలచన అయిన మన ప్రతిష్ఠను తిరిగి కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాష్ట్రంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల్లో కేవలం పూడికతీత పనులే 69.50 శాతం చేపట్టడంపై కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. ప్రత్యేకంగా 2.16 లక్షల పనులు చెరువులు, చెక్‌డ్యాంలు, కాలువల వద్ద పూడికతీత తదితర పనులు చేపట్టారని, రూ.676 కోట్ల పనులకు సంబంధించి వ్యూహాత్మకమైన చర్యలు తీసుకోలేదని ఆక్షేపించింది. ఈ పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఉపాధి చట్టాన్ని అనుసరించలేదని, దీంతోపాటు ఎక్కువ పనిదినాలు, ఎక్కువ వ్యయం చేశారని పేర్కొంది. ఈ పథకంలో పేదలకు సంబంధించి వ్యక్తిగత ఆస్తుల పెంపొందించేందుకు అవకాశం ఉన్నా... కేవలం 1.72 లక్షల వ్యక్తిగత పనులు రూ.93.66 కోట్లు ఖర్చు చేసి మొత్తం వ్యయంలో 9.6శాతం మాత్రమే ఖర్చు చేయగలిగారు. పేదలకు సంబంధించిన జీవనోపాధి అవకాశాల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ తరహా పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సలహా ఇస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శికి లేఖ రాసింది. ఉపాధి చట్టం షెడ్యూల్ 1.. పేరా 4లోని సబ్‌పేరా 2 ప్రకారం వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు సంబంధించి ఆయా జిల్లాల్లో 60శాతం పనులు చేపట్టాల్సిన బాధ్యత జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ తీసుకోవాలని సూచించారు. తద్వారా భూమి, తాగునీరు, చెట్లు అభివృద్ధి చేయాలన్నారు. అయితే కేవలం 41.65 శాతం వ్యయం మాత్రమే వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి పనులు చేపట్టారని తెలిపింది. నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు అవసరమైన పనులను చేపట్టడంలో విఫలమయ్యారని, ఎక్కువ ఖర్చు చేసిన 30 పనుల్లో భూసంరక్షణకు సంబంధించిన పనులు పకడ్బందీగా చేపట్టలేదని పేర్కొంది. పూడికతీత పనులకు సంబంధించి భారీగా చేసిన వ్యయానికి సంబంధించి రాష్ట్ర స్థాయిలో సమీక్ష నిర్వహించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సత్వరమే ఉపాధి హామీ పథకం మార్గదర్శకాలు అనుసరించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గ్రామీణాభివృద్ధిశాఖకు సూచించారు.

మెటీరియల్ నిధుల కోసం తప్పులు

ఉపాధి పథకంలో సాధారణంగా మన రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఎక్కువగానే మస్టర్లు నమోదవుతాయి. ఆ తర్వాత ఒక్కో ప్రాంతంలో వ్యవసాయ పనులు ముమ్మరమైతే ఈ పనులకు హాజరయ్యే వారి సంఖ్య తక్కువగా ఉంటుంది. అయితే వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత పనులకు సంబంధం లేకుండానే మస్టర్లు కొట్టేయడం ప్రారంభించారు. గ్రామాల్లో పనులు కూలీల ద్వారా చేయిస్తే దానికి అనుగుణంగా మెటీరియల్ పనులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులిస్తుంది. అందుకోసం రాష్ట్ర స్థాయి అధికారులు టార్గెట్లు పెట్టి సిబ్బంది చేత మస్టర్లు కొట్టేయించడంతో క్షేత్రస్థాయిలో అవినీతి తారస్థాయికి చేరకుంది. మెటీరియల్ నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలతో పనులు విరివిగా చేయించి అందుకు అనుగుణంగా మెటీరియల్ నిధులు సాధించుకుని అభివృద్ధి పనులు చేపడతాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అద్భుతంగా సద్వినియోగం చేసుకుంది. అయితే వైసీపీ సర్కార్ మాత్రం దొడ్డి దారిని ఎంచుకుంది. కూలీలు పనులకొచ్చినా, రాకపోయినా వారికి మస్టర్లు వేసి పనులు చేసినట్లు రికార్డులు సృష్టించారు. సిబ్బంది చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ విభాగం, అంబుడ్స్‌మెన్ వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. దీంతోపాటు ఈ పనులను కప్పిపుచ్చుకునేందుకు ఉపాధి సిబ్బంది ఆర్నెల్ల తర్వాత కనపడని పూడికతీత పనులకు ప్రాధాన్యం ఇచ్చి పనులు చేపట్టారు. పనులు చేసిన ఏడాది తర్వాత సోషల్ ఆడిట్ తనిఖీ నిర్వహిస్తుండటంతో ఈ పనుల్లో తప్పులు జరిగినా వదిలేయాల్సి వస్తోంది. దీంతో రూ.వందల కోట్లు అవినీతి జరిగినా కనపడకుండా మభ్యపెడుతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లుపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంతో తప్పులు యథేచ్ఛగా జరిగిపోయాయని, అందుకే కేంద్రం దృష్టిలో పడ్డామని ఉపాధి సిబ్బంది పేర్కొంటున్నారు.

సోషల్ ఆడిట్ తనిఖీలో ఇబ్బందులే..

'మీకెందుకు మేమున్నాం, మస్టర్లు కొట్టేయండి మీకిబ్బంది లేకుండా చూసుకుంటామ'న్న ఉపాధి పథకం జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు సోషల్ ఆడిట్ తనిఖీల్లో ఇప్పటి దాకా సిబ్బందిని రక్షించారు. కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు మంత్రిగా పవన్ కల్యాణ్ రావడం, అవినీతికి వ్యతిరేకంగా ఆయన స్పందించడంతో సోషల్ ఆడిట్ అధికారులు కూడా స్వరం మార్చారు. ఇటీవల ప్రారంభమైన సోషల్ ఆడిట్ తనిఖీల్లో భారీగా అవినీతి వెల్లడిలోకి వస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో మొత్తం రూ.11 కోట్ల పనులకు గాను రూ.2.50 కోట్లు అవినీతి జరిగిందని సోషల్ ఆడిట్ సిబ్బంది తేల్చింది. పవన్‌ఈ పథకంపై దృష్టి సారించి అవినీతిని నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆస్పత్రి నుంచి బయటకు వచ్చేసిన రోగులు, వారి బంధువులు

మెడికవర్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

విశాఖపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకోజీపాలెంలో గల మెడికవర్ ఆస్పత్రిలో సోమవారం రాత్రి 11.30 గంటలు సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. సెల్లార్‌లో గల యూపీఎస్ బ్యాటరీలు పేలడంతో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా పొగ వెలువడి సెల్లార్‌తో పాటు ఆస్పత్రి మొదటి, రెండు అంతస్తులు వరకూ కమ్మేసింది. దీంతో రోగులు, వారి బంధువులు ఆందోళన చెందారు. కొందరు సెల్‌ఫోన్ టార్చి సహాయంతో బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఆస్పత్రికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా పలువురు రోగులు బంధువులు ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ప్రమాదం జరిగితే రోగులను బయటకు తరలించకుండా ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు.

టిడ్కో ఇళ్లను నాశనం చేసిన వైసీపీ: నారాయణ

తుళ్లూరు, జూలై 29: వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తిగా నాశనం చేసిందని మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో టిడ్కో ఇళ్లను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్‌తో కలసి మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా దొండపాడులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ, '2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం మేం రూపొందించిన సమగ్ర పథకాన్ని పూర్తిగా నాశనం చేసింది. వచ్చే మూడు నెలల్లో టిడ్కో ఇళ్లకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం సీఆర్డీఏలో ఒక్క పైసా కూడా లేదు. రాజధాని రైతులకు త్వరలోనే కౌలు డబ్బులు విడుదల చేస్తాం. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను బ్యాంకులు ఇబ్బంది పెట్టకుండా గడువు పెంచాలని కోరతాం. రైతుల ప్లాట్లకు లోన్ ఇచ్చే విధంగా బ్యాంకర్స్‌తో మాట్లాడతాం' అని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాలకు పాకిన డ్రగ్స్ మహమ్మారి: సవిత

పెనుకొండ టౌన్, జూలై 29: 'వైసీపీ ఐదేళ్ల పాలనలో గంజాయిని అంగళ్లలో దొరికే వస్తువుగా మార్చేసింది. యువత మత్తుకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంది. దీనికి జగన్మోహన్‌రెడ్డే కారణం' అని మంత్రి సవిత ఆరోపించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మార్కెట్ యార్డ్‌లో 2,000 మంది విద్యార్థులతో పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మంత్రి గంజాయి, మాదక ద్రవ్యాలపై విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.

జగన్ గోబెల్స్‌రెడ్డి: వర్ల

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ ఈ రాష్ట్రం పొలిటికల్ గోబెల్స్ రెడ్డి అని టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య అన్నారు. సోమవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'కోర్టుకు విచారణకు రాకుండా ఆయన ఇంకా ఎంతకాలం తప్పించుకొని తిరుగుతారు? ఇప్పుడు ముఖ్యమంత్రి పదవీ లేదు... ప్రతిపక్ష నేత హోదా లేదు. ఆయనకు పెద్దగా పనులు కూడా లేవు. ఈ నెల 31న ఆయన కేసుల విచారణ ఉంది. దానికైనా ఆయన రాకపోతే న్యాయస్థానం తగిన ఉత్తర్వులు ఇవ్వాలి' అని విజ్ఞప్తి చేశారు.

ఏళ్ల తరబడి అవే పోస్టుల్లో...

» ప్రధాన కార్యాలయాలను వదలని అధికారులు
» వ్యవసాయ, అనుబంధ శాఖల్లో తిష్ట

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏళ్ల తరబడి ఒకే పోస్టులో పని చేస్తూ, గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కీలక అధికారులను ఇంకా కొనసాగించడంపై ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వ్యవసాయ, అనుబంధ శాఖల్లో తిష్ట వేసిన కొందరు అధికారులు గత ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలతో అంటకాగారు. బదిలీలు, పోస్టింగ్‌లు, నిధుల వినియోగంలో భారీగా అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొన్నవారు ఉన్నారు. ఇలాంటి అధికారుల తీరుపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తున్నాయి. వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్కెటింగ్, మత్స్య, పశుసంవర్థక శాఖ రాష్ట్ర ప్రధాన, జిల్లా కార్యాలయాల్లో అనేకమంది అక్కడక్కడే సీట్లు మారుతూ, ఏళ్ల తరబడి కార్యాలయాలను వీడటం లేదు. పలు శాఖల్లో ఐదేళ్ల పైబడి ఉన్నారు. మరికొందరు రాష్ట్ర విభజనకు ముందు నుంచి ఇప్పటికీ ప్రధాన కార్యాలయాల్లోనే కొనసాగుతున్నారు. రాష్ట్ర, జిల్లా అధికారులను ప్రసన్నం చేసుకుని పలువురు ఆయా కార్యాలయాల్లోనే పోస్టింగ్‌లు పొందుతున్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే అధికారులు జిల్లాలు మారుతున్నా, ప్రధాన కార్యాలయాల్లో పని చేసే వారు మాత్రం అక్కడే తిష్ట వేశారు. పైగా ప్రధాన కార్యాలయాల్లో పని తక్కువగా ఉండే పోస్టుల్లో కూర్చుని మొత్తం వ్యవస్థలను నడిపిస్తున్నారు. సమాన కేడర్ లేదా ఎగువ పోస్టులకు ఇన్‌చార్జిలుగా కొనసాగుతూ కాలక్షేపం చేస్తున్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల్లో విజిలెన్స్, ఇంజనీరింగ్, ఇతర విభాగాల్లో పలువురు దీర్ఘకాలంగా కొనసాగుతున్నారు. సహకారశాఖలో ఆడిట్, ఇతర విభాగాలు, మత్స్య, పశుసంవర్థక శాఖలో నేరుగా పౌర సేవలు అందించని విభాగాల్లో అనేక మంది సుదీర్ఘకాలంగా ఉంటున్నారు. ఉద్యోగుల సాధారణ బదిలీలు జరిగినప్పుడూ కొందరు ప్రధాన కార్యాలయాల నుంచి క్షేత్రస్థాయికి వెళ్లడం లేదు. పదోన్నతి లభించినా పలువురు ప్రధాన కార్యాలయాల్లోనే పోస్టింగ్‌లు చూసుకుంటున్నారు. గత్యంతరం లేనప్పుడు పదోన్నతిపై ఇతర జోన్‌కు వెళ్తున్నారు. జిల్లా, రాష్ట్ర ప్రధాన కార్యాలయాల్లో కీలక పోస్టుల్లో పని చేసే అధికారులు క్షేత్రస్థాయిలో తమకు ఉపయోగపడే వారిని సిఫారసు చేసి నియమించుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 30 జూలై 2024

ఆర్ఐఎంసీలో ప్రవేశానికి టీజీపీఎస్సీ నోటిఫికేషన్

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో ఎనిమిదోతరగతి(2025 జూలై టర్మ్) ప్రవేశాలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) వెబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. స్థానిక బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2025 జూలై 1 నాటికి ఏడోతరగతి ఉత్తీర్ణులు/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు పదకొండున్నరేళ్ల నుంచి పదమూడేళ్ల మధ్య ఉండాలి.

రాత పరీక్ష

మొత్తం మార్కులు 400. ఇంగ్లీష్ నుంచి 125 మార్కులకు, మేథమెటిక్స్ నుంచి 200 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ నుంచి 75 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు సమాధానాలను హిందీ లేదా ఆంగ్ల మాధ్యమంలో రాయవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి వైవా వోస్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలు పరీక్షిస్తారు. ఇందులో కూడా అర్హత సాధించినవారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం

విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించగానే ఆర్ఐఎంసీ దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతుంది. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి టీజీపీఎస్సీ చిరునామాకు పంపించాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.555
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** మున్సిపల్ కార్పొరేషన్/గ్రామ పంచాయతీ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్; నివాసం, కులం ధ్రువీకరణ పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; విద్యార్థి ఫొటోలు 2
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, నాంపల్లి, హైదరాబాద్ - 500001
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబరు 1
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** rimc.gov.in, tspsc.gov.in



అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ



హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు.

● డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూ మీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తి చేసినవారు అర్హులు.

● డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

● పీజీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ (మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

● సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ ఛైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

● ఎర్లీ ఛైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

క్లాట్ ప్రిపరేషన్

ఏయే పుస్తకాలు చదవాలి?

చక్కటి వాక్చాతుర్యం, సవాళ్లను స్వీకరించే గుణం ఉన్నవారు న్యాయవాద వృత్తిలో బాగా రాణిస్తారు. ప్రస్తుత ప్రపంచీకరణ, పోటీతత్వంతో 'న్యాయవాద వృత్తి' సంప్రదాయ స్థాయి నుంచి కార్పొరేట్ స్థాయికి రూపాంతరం చెందింది. సామాజికంగా, పారిశ్రామికంగా చోటు చేసుకుంటున్న మార్పుల ఫలితంగా పేటెంట్ హక్కుల పర్యవేక్షణ సంస్థలు, కాపీరైట్ సంస్థలు, పబ్లిషింగ్ సంస్థలు, ఎన్‌జీఓలు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా 'లా' గ్రాడ్యుయేట్లను నియమించుకుంటున్నాయి. నేడు ప్రతీ కంపెనీలో 'లా' విభాగం సర్వసాధారణమైంది. ఈ క్రమంలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలు 'లా' లో విభిన్న కోర్సులను నిర్వహిస్తున్నాయి. వీటిల్లో ప్రవేశానికి వీలు కల్పించే క్లాట్(కామన్ లా అడ్మిషన్ టెస్ట్) ఒకటి. తాజాగా క్లాట్-2025 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో క్లాట్ పరీక్ష విధానం, ప్రిపరేషన్ స్ట్రాటజీ, చదవాల్సిన పుస్తకాలు తదితర తెలుసుకుందాం.

జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో సీట్లను క్లాట్ స్కోరు ద్వారా భర్తీచేస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లోని తెలంగాణలో నల్సార్(హైదరాబాద్), ఆంధ్రప్రదేశ్‌లో(విశాఖపట్నం) దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయవిశ్వవిద్యాలయం కూడా ఉన్నాయి. క్లాట్-2025ని డిసెంబరు 1న నిర్వహిస్తున్నారు. దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబరు 15. నోటిఫికేషన్ పూర్తి సమాచారాన్ని www.consortiumofnlus.ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

పరీక్ష విధానం-సన్నద్ధత

అండర్‌గ్రాడ్యుయేషన్

ఈ విభాగం కోసం నిర్వహించే పరీక్ష 120 మార్కులకు ఉంటుంది. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. మొత్తం మార్కులు 120. నెగిటివ్ మార్కింగ్ ఉంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే 0.25 మార్కు కోత విధిస్తారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్, జీకే అండ్ కరెంట్ అఫైర్స్ లీగల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.

ఇంగ్లీష్

తక్కువ సమయంలో ఎక్కువ స్కోర్ చేసే అవకాశం ఉన్న విభాగం ఇది. గ్రామర్, ఇంగ్లీష్ భాషపై ప్రాథమిక అవగాహన ఉంటే ఈ విభాగంలో చక్కని స్కోర్ చేయవచ్చు. కాంప్రెహెన్షన్‌లో మంచి మార్కులకు వొకాబులరీపై పట్టు సాధించాలి. జనరల్ ఇంగ్లీష్‌లో కేవలం వ్యాకరణమే కాకుండా పదాల వాడుక, సాధన మీద పట్టు ఉండాలి. తద్వారా ప్రశ్నలకు సులువుగా జవాబులను గుర్తించే సామర్థ్యం లభిస్తుంది. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, సెంటెన్స్ కరెక్షన్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలి. ముఖ్యంగా నిత్య జీవితంలో ఇంగ్లీష్ భాష వినియోగం, సంబంధిత అంశాలాధారంగా ప్రశ్నలు ఇస్తారు. ఈ క్రమంలో గ్రామర్, వొకాబులరీ, కాంప్రెహెన్షన్, యూజ్ ఆఫ్ వర్డ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

చదవాల్సిన పుస్తకాలు: వర్డ్ పవర్ మేడ్ నార్మన్ లూయిస్; ఆబ్జెక్టివ్ జనరల్ ఇంగ్లీష్-ఆర్.ఎస్.అగర్వాల్; హైస్కూల్ గ్రామర్ రెన్ అండ్ మార్టిన్.

జీకే అండ్ కరెంట్ అఫైర్స్

కరెంట్ ఈవెంట్స్‌పై అభ్యర్థుల అవగాహనను పరీక్షించేలా ఇందులో ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా న్యాయ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, మార్పులు, కొత్త చట్టాలు, కేసులు తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. అంతేకాకుండా భారత దేశ చరిత్ర, రాజ్యాంగానికి సంబంధించిన ప్రశ్నలూ ఎదురవుతాయి. అందువల్ల జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టిపెట్టాలి. రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అవగాహన పెంచుకోవాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్య సంఘటనలు, సదస్సుల గురించి తెలుసుకోవాలి.

చదవాల్సిన పుస్తకాలు: మనోరమ ఇయర్ బుక్, ఇండియా ఇయర్ బుక్, సీఎస్ఆర్ ఇయర్ బుక్ సీఎస్ఆర్ జీకే, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలతోపాటు దిన పత్రికలు రోజూ చదవడం అలవాటు చేసుకోవాలి.

లీగల్ రీజనింగ్

అభ్యర్థుల్లో న్యాయపరమైన దృక్పథాన్ని; ఒక అంశం, వివాదం పట్ల సహేతుక ఆలోచన, నిర్ణయం వెలిబుచ్చే నైపుణ్యాలను పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. ఒక వివాదాన్ని పరిష్కరించే క్రమంలో అందరికీ ఆమోదయోగ్య పరిష్కారం కనుగొనే నైపుణ్యం పొందాలి. చట్టాలు, న్యాయ వ్యవస్థకు సంబంధించి ఇటీవలి పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవడం ద్వారా మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు.

చదవాల్సిన పుస్తకాలు: యూనివర్సల్ ఎల్ఎల్‌బీ ఎంట్రెన్స్ గైడ్, లీగల్ ఆప్టిట్యూడ్- ఎ.పి.భరద్వాజ్. లీగల్ ఆప్టిట్యూడ్-ఆర్‌కే గుప్తా.

లాజికల్ రీజనింగ్

అభ్యర్థుల తార్కిక శక్తిని పరీక్షించే విభాగం ఇది. ఇందులో ప్యాసేజ్ ఆధారితంగా, అసెర్షన్ అండ్ రీజనింగ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. ఈ మేరకు సిలాజిజమ్, కోడింగ్, డీ కోడింగ్, డైరెక్షన్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నల కోసం కంపేరిటివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి.

చదవాల్సిన పుస్తకాలు: వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ రీజనింగ్-ఆర్ఎస్ అగర్వాల్, అనలిటికల్ రీజనింగ్-ఎం.కె. పాండే.

క్వాంటిటేటివ్ టెక్నిక్స్

ఈ విభాగంలో మంచి మార్కులు సాధించాలంటే వీలైనంత ఎక్కువగా మోడల్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ఇదే క్రమంలో షార్ట్‌కట్ మెథడ్స్ నేర్చుకోవాలి. తద్వారా సమాధానాన్ని వేగంగా, కచ్చితత్వంతో గుర్తించవచ్చు.

చదవాల్సిన పుస్తకాలు: క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-ఆర్.ఎస్.అగర్వాల్; ఫాస్ట్ ట్రాక్ ఆబ్జెక్టివ్ అర్థమెటిక్-అర్హింత్.



పోస్ట్ గ్రాడ్యుయేషన్

ఈ పరీక్ష 120 మార్కులకు ఉంటుంది. మొత్తం మార్కులు 120. నెగిటివ్ మార్కింగ్ ఉంది. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి 0.25 మార్కు కోత విధిస్తారు. వీటికి రెండు గంటల్లో సమాధానాలను గుర్తించాలి. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్‌ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టోర్ట్స్ ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ విభాగంలో మంచి స్కోరు సాధించడానికి కింద పేర్కొన్న రెఫరెన్స్ బుక్స్ ఉపయోగపడతాయి.

1. **కాన్‌స్టిట్యూషనల్ లా:** ఇన్‌ట్రడక్షన్ టు ద కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా - డిడి బసు; కాన్‌స్టిట్యూషనల్ లా ఆఫ్ ఇండియా- డాక్టర్ జె.ఎన్.పాండే
2. **జ్యూరిస్‌ప్రుడెన్స్:** స్టడీస్ ఇన్ జ్యూరిస్‌ప్రుడెన్స్ అండ్ లీగల్ థియరీ- ఎన్.వి.పరాన్జపే; జ్యూరిస్‌ప్రుడెన్స్(లీగల్ థియరీ)- డాక్టర్ ఎస్.ఆర్.మైనేని; జ్యూరిస్‌ప్రుడెన్స్(కొశ్చన్స్ అండ్ ఆన్సర్స్)- డాక్టర్ రేగ సూర్యారావు
3. **లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా:** లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లాస్ - ఎస్.ఎన్.మిశ్రా; ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ లేబర్ లాస్- ఎస్.సి. శ్రీవాత్సవ
4. **లా ఆఫ్ కాంట్రాక్ట్:** ద ఇండియన్ కాంట్రాక్ట్ యాక్ట్, 1872 - యూనివర్సల్ లా పబ్లిషింగ్; కాంట్రాక్ట్-1, కాంట్రాక్ట్-2- ఆర్.కె.బంగియా
5. **టోర్ట్స్: లా ఆఫ్ టోర్ట్స్:** ఆర్.కె.బంగియా
6. **అడ్మినిస్ట్రేటివ్ లా:** సింపుల్ లా పబ్లికేషన్స్- క్రిషన్ కేశవ్; లెక్చర్స్ ఆన్ అడ్మినిస్ట్రేటివ్ లా- డాక్టర్ రేగా సూర్యారావు
7. **ఎన్విరాన్‌మెంట్ లా:** ఎన్విరాన్‌మెంటల్ లాస్ బేర్ యాక్ట్ విత్ అమెండమెంట్స్ బై గవర్నమెంట్ ఆఫ్ ఇండియా; ఎన్విరాన్‌మెంటల్ లా - డాక్టర్ నిష్ఠా జైశ్వాల్, డాక్టర్ పీ.ఎస్.జైశ్వాల్
8. **ఫ్యామిలీ లా:** మోడర్న్ హిందూ లా- డాక్టర్ పరాస్ దివాన్
9. **కంపెనీ లా:** కార్పొరేట్ లాస్- రీనా ఛద్దా; కార్పొరేట్ లాస్ - ట్యాక్స్‌మన్
10. **క్రిమినల్ లా:** క్రిమినల్ ప్రొసీజర్- ఆర్.వి.కేల్కర్; ద కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ - ఎస్.ఎన్.మిశ్రా
11. **ప్రాపర్టీ లా:** ద ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ - డాక్టర్ ఆర్.కె.సిన్హా; టెక్స్ట్ బుక్ ఆన్ ద ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ - డాక్టర్ అవతార్ సింగ్, డాక్టర్ హర్‌ప్రీత్ కౌర్.
12. **పబ్లిక్ ఇంటర్నేషనల్ లా:** పబ్లిక్ ఇంటర్నేషనల్ లాస్ - డాక్టర్ ఎస్.ఆర్.మైనేని
13. **ట్యాక్స్ లా:** డైరెక్ట్ ట్యాక్సెస్ రెడీ రికోనర్ - వినోద్ కె. సింఘానియా
14. **ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్:** లా రిలేటింగ్ టు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్- వి.కె.అహూజ

లిటిల్స్

నిజాయితీకి పరీక్ష



ఒక ఊరిలో రాజారావు అనే పెద్ద వ్యాపారి ఉండేవాడు. అతని వద్ద ధనయ్య అనే నౌకరు పని చేస్తూ ఉండేవాడు అతనికి ఎంత జీతం ఇచ్చి, మంచిగా చూసుకున్నా, ఇంకా అసంతృప్తిగా ఉంటూ, ఎప్పుడు ఇనప్పెట్టె తాళాలు దొరుకుతాయా అందులో డబ్బు అంతా తీసుకుని పారిపోదామా అని వేచి చూసేవాడు యజమాని ఇంట్లో చిన్న చిన్న దొంగతనాలు కూడా చేసేవాడు. రాజారావు భార్య ధనయ్యను గమనించి అతని గురించి భర్తకు చెప్పే సమయం కోసం చూస్తోంది. ఈలోగా ఒక రోజు ధనయ్య రాజారావుతో 'అయ్యా నేనిక్కడ పని మానేసి, వెళ్లిపోతాను. నేనెంత నమ్మకంగా పని చేసినా, మీరు నన్ను నమ్మడం లేదు అన్నాడు ఆ మాటలకు రాజారావు 'అదేమిటి ధనయ్యా? నీకు ఈ ఇంట్లో కావలసినంత నమ్మకం, స్వేచ్ఛ ఉన్నాయి, నా ఇనప్పెట్టె తాళాలు కూడా నేను దాచి పెట్టలేదు. అదిగో ఆ గోడకే తగిలించి ఉన్నాయి. ఇంకా నిన్ను నమ్మక పోవడం ఏమిటి? అన్నాడు. అది విన్న ధనయ్య వెంటనే ఏం లాభం అండి? ఆ తాళం చెవితో పెట్టె తెరుచుకోవడం లేదు అని నోరుజారి, వెంటనే నాలిక కరుచుకున్నాడు. అపుడు రాజారావు' నీ బుద్ధి గురించి నా భార్య చెబుతున్నా నేను ఇన్ని రోజులు నమ్మలేదు నీకు నీ జీతం ఇస్తున్నాను. ఏమైనా కావాలంటే నన్ను అడగాలి కానీ పెట్టె తాళాలతో నీకేం పనయ్యా? నీ గురించి ఇప్పటికైనా బయట పడింది. నీకు రావలసిన డబ్బు తీసుకుని వెంటనే వెళ్లిపో, నిన్ను పనిలో నుంచి తీసేస్తున్నాను' అన్నాడు రాజారావు దురాశ వలన మంచి ఉద్యోగం పోయిందే అని తరువాత విచారించాడు ధనయ్య.

10 తేడాలను గుర్తించండి?



సరైన నీడ ఏది?





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 370

	5		2	4	
3					
2					
					5
					6
	3	4		1	

సుడోకు - 369 సమాధానం

5	3	1	2	6	4
4	6	2	5	3	1
6	5	3	4	1	2
2	1	4	6	5	3
1	4	5	3	2	6
3	2	6	1	4	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.